# అశ్వినీ దేవతలు



మాస్టర్ పార్వతీకుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# అశ్వినీ దేవతలు

*వివరణము :*

**మాస్టర్ పార్వతీకుమార్**

**ధనిష్ఠ**

ప్రథమ ముద్రణ : 2019 శ్రీ వికారి – గురుపూర్ణిమ

ప్రతులు : 1,000

వెల : **రూ. 100-00**

© ధనిష్ఠ 2019

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం – 530 002

ఫోన్ : 0891-2701531, 2509154,

website : www.dhanistha.org.

info@dhanistha.org

ISBN : 978-81-89467-97-5

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

విశాఖపట్నం-530 016.

ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

"**ధనిష్ఠ**" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"**ధనిష్ఠ**" మాస్టర్ పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"**ధనిష్ఠ**" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : **మాస్టర్ పార్వతీకుమార్**

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 30 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞానబోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో "**డాక్టర్ ఆఫ్ లెటర్స్**" పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత

అలరారినప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవసేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచు చున్నారు. మాస్టర్ పార్వతీకుమార్ గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తననుతాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాలరనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్ గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. *"పరహితము పరమధర్మ"* మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించు చున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ ఫౌండేషన్**

# ముందుమాట

వేదమందలి అశ్వినీదేవతలను గూర్చిన సూక్తములను వేదవ్యాస మహర్షి మానవజాతిపైగల అపారమైన కరుణతో మహాభారతమున అశ్వినీదేవతల స్తోత్రములుగా క్లుప్తముగా ఆదిపర్వమున నిక్షిప్తము చేసిరి. ఈ స్తోత్రములందు నిగూఢముగా అనేకములగు సాధనా రహస్యములను అమర్చెను. శ్లోకములు పండ్రెండే (12). కాని అందలి భావము అతి విస్తారము.

వేదాంగములందు నిష్ణాతులైన సద్గురువులు, పరమ గురువులు అయిన మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్యవారు యిందలి రహస్యములను టీక, తాత్పర్యములతో సహా జిజ్ఞాసువుల కందించిరి.

2018 మే నెలలో మాస్టరుగారు అందించిన టీక, తాత్పర్యముల ఆధారముగా జిజ్ఞాసువుల కొరకై బెంగుళూరు తపోవనమున ఒక సప్తాహము నిర్వహించుట సంభవించినది. అందు వివరింపబడిన విషయములకు పులకించిన ఆధ్యాత్మిక సోదరులు శ్రీ కొడిగేపల్లి ప్రభాకర్ గారు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రవచనములను లేఖనము గావించిరి.

ఈ ప్రవచనములను చదువరుల కొరకై కొంత సంస్కరించి, ప్రచురించుటకు ధనిష్ఠ శ్రద్ధ చూపినది. ప్రచురణా వ్యయము తాము సమర్పింతుమని భాగ్యనగరము సోదరబృందము ప్రకటించిరి.

ఈ యజ్ఞార్థమగు కార్యమున సోదరులు శ్రీ నవనీతంగారు, ధనంజయ విశేష కృషి సలిపి, శ్రీ వికారి గురుపూర్ణిమ సందర్భము నకు ముద్రణమును సంసిద్ధము చేసిరి.

ఈ యజ్ఞ సంకల్పము, దాని నిర్వహణము, దాని సమర్పణమున సహకరించిన వారందరికిని సద్గురువు ఆశీఃఫలములు పరిపూర్ణముగ లభించుగాక యని ప్రార్థన. అట్లే జిజ్ఞాసువులగు చదువరు లందరికి కూడ వలసిన ప్రచోదనము లభించుగాక!

శ్రీ వికారి, జ్యేష్ఠ బహుళ త్రయోదశి
తేది : 29-6-2019
విశాఖపట్నం

**- పార్వతీకుమార్**

# అశ్వినీ దేవతల స్తోత్రము

శ్లో|| ప్రపూర్వగౌ పూర్వజౌ చిత్రభానూ
గిరావాశంసామి తపసా హ్యనంతౌ ।
దివ్యౌ సుపర్ణౌ విరజౌ విమానౌ
అధిక్షిపన్తౌ భువనాని విశ్వా || 1

శ్లో|| హిరణ్మయౌ శకునీ సాంపరాయౌ
నాసత్యదస్రౌ సునసౌ వైజయంతౌ ।
శుక్రం వయంతౌ తరసా సువేమ్నా
వధి వ్యయంతా వసితం వివస్వతః || 2

శ్లో|| గ్రస్తాం సుపర్ణస్య బలేన వర్తికాం
అముంచతా మశ్వినౌ సౌభగాయ ।
తావత్సువృత్తౌ అనమంత మాయయా
వసత్తమాగా అరుణా ఉదా వహన్ || 3

శ్లో|| షష్టిశ్చగావః త్రిశతశ్చ ధేనవః
ఏకం వత్సం సువతీతం దుహంతి ।
నానాగోష్ఠా విహితా ఏకదోహనాః
తా వశ్వినౌ దుహతో ఘర్మ ముక్థ్యమ్ || 4

శ్లో॥ ఏకాం నాభిం సప్త శతా అరాఃశ్రితాః
ప్రధిష్వన్యా వింశతి రర్పితా అరాః ।
అనేమి చక్రం పరివర్తతే ఽజరం
మాయాశ్వినౌ సమనక్తి చర్షణీ ॥ 5

శ్లో॥ ఏకం చక్రం వర్తతే ద్వాదశారం
షణ్ణాభి ఏకాక్ష మృతస్యధారమ్ ।
యస్మిన్ దేవా అధి విశ్వేవిషక్తాస్తా
వశ్వినౌ ముంచతో మా విషీదతమ్ ॥ 6

శ్లో॥ అశ్వినా విందు మమృతమ్ వృత్తభూయో
తిరోధత్తా మశ్వినౌ దా సపత్నీ ।
హిత్వాగిరి మశ్వినౌ గా ముదాచరంతౌ
త ద్వృష్టి మహ్నా ప్రస్థితౌ బలస్య ॥ 7

శ్లో॥ యువాం దిశో జన యధో దశాగ్రే
సమానం మూర్ధ్నిరథయానం వియంతి ।
తాసాం యాత మృషయోఽనుప్రయాంతి
దేవా మనుష్యాః క్షితి మాచరంతి ॥ 8

శ్లో॥ యువాం వర్ణాన్ వికురుధో విశ్వరూపాన్
తేఽధిక్షిపంతే భువనాని విశ్వా ।

తే భానవో ఽప్యనుసృతాశ్చరంతి
దేవా మనుష్యాః క్షితి మాచరంతి ॥ 9

శ్లో॥ తౌ నాసత్యా వశ్వినౌ మహేమ
స్ర జం చయా బిబృధః పుష్కరస్య ।
తౌ నాసత్యా వమృతా వృథా వృతే
దేవాస్తత్ప్రపదేన సూతే ॥ 10

శ్లో॥ ముఖేన గర్భం లభేతాం యువానౌ
గతా సురే తత్ ప్రపదేన సూతే ।
సద్యోజాతో మాతర మత్తి గర్భః
తా వశ్వినౌ ముంచధో జీవసేగాః ॥ 11

శ్లో॥ స్తోతుం న శక్నోమి గుణైర్భవంతౌ
చక్షుర్విహీనః పధి సంప్రమోహః ।
దుర్గేఽహమస్మిన్ పతితోఽస్మికూపే
యువాం శరణ్యౌ శరణం ప్రపద్యే ॥ 12

# అశ్వినీ దేవతల స్తోత్ర వివరణము

**మంత్రము - 1 :**

**ప్రపూర్వగౌ పూర్వజౌ చిత్రభానూ**
**గిరావాశంసామి తపసా హ్యనంతౌ ।**
**దివ్యౌ సుపర్ణౌ విరజౌ విమానౌ**
**అధిక్షిపన్తౌ భువనాని విశ్వా ॥**

**టీక :**

ప్రపూర్వగౌ = అందరికంటె పూర్వులైనవారిని; పూర్వజౌ = అందరికన్న ముందుపుట్టిన ఇద్దరను; చిత్రభానూ = రంగుల, వెలుగుల రూపములైన వారిని; అనంతౌ = అంతము లేనివారిని; దివ్యౌ = స్వయంప్రకాశము కలవారిని; సుపర్ణౌ = చక్కని రెక్కలు కలవారిని; విరజౌ = రజస్సులు అంటనివారిని; విమానౌ = విశేషములైన కొలతరూపములైన వారిని; విశ్వా= సమస్తమయిన; భువనాని = లోకములను; అధిక్షిపంతౌ = అధిష్ఠించి కదలించు చున్న వారిని; తపసా = తపస్సుచేత; గిరా, వా = మరియు వాక్కులచేత; ఆశంసామి = చక్కగా ప్రశంసింతును.

**తాత్పర్యము :**

జంట పక్షుల రూపమున నున్న దివ్యమూర్తులైన అశ్వినీ దేవతలను నా తపోమయములైన వాక్కులతో శ్రద్ధగా ప్రశంసించెదను. వారు అందరికన్న మొదటివారు, మొదలు పుట్టినవారు. రంగుల, కిరణముల రూపమున ప్రత్యక్షమగువారు. ధూళి అంటని అనంత మూర్తులై ఈ సమస్త లోకముల యందు అధిష్ఠించి లోకములను కదలించుచు ప్రయాణము చేయుచున్న విమానములవలె నున్నారు.

**వివరణము :**

పరమ పవిత్రమైన అశ్వినీ దేవతల స్తోత్రము మహాభారత మందు ఆది పర్వములో నిక్షిప్తం చేయబడివుంది. ఋగ్వేదమందలి అత్యంత పవిత్రమైన, ఉత్తమమైన ఋక్కులు అశ్వినీ దేవతల గూర్చి ఉంటాయి. మానవజాతియందు అపారమైన కరుణ కలిగిన శ్రీ వేదవ్యాస మహర్షి, ఆ ఋగ్వేద ఋక్కుల నుంచి ఆ భావాన్నంతా ద్వాదశ శ్లోకాల్లో, మహాభారతంలో నిక్షిప్తం చేశారు. ఈ అశ్వినీ దేవతల స్తోత్రాలు అత్యద్భుతమైన, మహిమాన్వితమైన, శక్తివంతమైన స్తోత్రాలు. వీటిని అనునిత్యం పఠించిన వారికి సర్వతోముఖాభివృద్ధి కలుగుతుంది. ముందుగా దీనియొక్క ప్రయోజనం ఏమిటంటే, ఎక్కడో బావిలో, మూలధారంలో పడినటువంటి జీవప్రజ్ఞ, క్రమంగా ఊర్ధ్వగతి చెంది, ఆజ్ఞాకేంద్రం చేరుకోగలగడం. అటువంటి శక్తివంతమైన స్తోత్రాలు యివి. ఆరోహణ క్రమంలో భక్తి, జ్ఞానము, యోగ వైరాగ్యములన్నీ మనకు లభించే ఒక సౌలభ్యం కూడా ఈ స్తోత్రాలలో ఉన్నది. ఈ మొదటి శ్లోకములోనే, "*గిరావాశంసామి తపసాహ్యనమ్*" అని ఉన్నది. అర్థం, "చక్కని వాక్యాలతో మిమ్మల్ని స్తుతిస్తాను, మిమ్మల్ని గూర్చి తపస్సు చేస్తాను" అని ముందుగా ఒక ప్రమాణం/ దీక్ష వహించాలి. వారిని గూర్చి స్పష్టమైన ఉచ్చారణతో ప్రశంస చేస్తామని ప్రార్థిస్తున్నాము. ఇది ప్రారంభంలోనే ఉంటుంది.

ఈ అశ్వినీ దేవతలు సృష్టికి మూలం. సృష్టికి అతీతమైన తత్త్వం దిగి వచ్చేటప్పుడు రెండుగా దిగి వస్తుంది, ఒకటిగా దిగిరాదు. అంటే ప్రకృతి, పురుషుడు ఒక మారుగా దిగుతారు.

ప్రకృతి ముందా? పురుషుడు ముందా? అనే ప్రశ్న నిరర్ధకం. కాలము ప్రకృతి, ప్రాణము ప్రజ్ఞ, రెండూ ఒకేసారి దిగివస్తాయి. ఒకటి రెండుగా ఏర్పడడమనేది జరిగితేనే ఈ సృష్టి జరుగుతుంది. కుడి ఎడమగా ప్రజ్ఞ, ప్రకృతి, Spirit – Matter, Time & Spaceగా ఏర్పడుతుంది. రెండుగా కలసి ఉన్నప్పుడు పూర్ణము. అదే శూన్యము కూడ. రెండుగా దిగివచ్చినప్పుడు, ప్రకృతి – పురుషులౌతారు. మన అదృష్టమా అన్నట్టు, ఈరోజు రవి సాయన మిథున రాశి ప్రవేశం చేశాడు. సాయన మిథున రాశి అంటే, ఒకటి రెండైన తత్త్వమే కదా! ఒకటి రెండైనటువంటి స్థితి. చైత్రము, వైశాఖము వసంత ఋతువులో ఉంటాయి. అవి రెండూ ఒకటిగా ఉన్న స్థితి. అది రెండుగా ఏర్పడుతుంది. మిథున రాశి రెండు అనేదే కదా. ప్రకృతి–పురుషుడు, ప్రాణము–ప్రజ్ఞ. కానీ, ఉన్నది ఒకటే కదా? అదే రెండుగా దిగివస్తుంది కదా? ఒకటి రెండుగా ఉండే భావన కలగాలంటే, రెండిటినీ సమతుల్యంగా ఏర్పాటు చేసుకుంటేనే కలుగుతుంది. మనము త్రాసు చూస్తామనుకోండి, ఒక పక్క బరువు, ఒక పక్క పదార్థము వేస్తాము. అది ఎక్కువ తక్కువ అయితే మనము సూచికను చూస్తాము కదా? రెండూ సరిసమానంగా ఉంటే, పైన సూచిక ముల్లును మధ్యలో చూస్తాము. మన దృష్టి సమానంగా ఉన్నప్పుడు అది ఊర్ధ్వముఖంగా వెళుతుంది. అందుకనే జీవితంలో అన్నీ సమానంగా ఏర్పాటు చేసుకోవాలి. ఏది అతిగా ఉన్నా సరిపోదు. అతినిద్రపోయినా, నిద్రపోకపోయినా ఉపయోగము లేదు. అతిగా పనిచేసినా, పనిచేయకపోయినా ఉపయోగముండదు కదా? ఎక్కువ తిన్నా, తక్కువ తిన్నా ఉపయోగము లేదుకదా? ఎక్కువ మాట్లాడినా

ఉపయోగము లేదు, తక్కువ మాట్లాడినా ఉపయోగము లేదు. *"అతి సర్వత్ర వర్జయేత్"*. ఇలా సూక్తులలో ఇచ్చారు. ఏదీ అతిగానూ ఉండకూడదు, మితంగానూ ఉండకూడదు. అన్నీ సరిసమానంగా ఉండాలి. రెండిటినీ సరిసమానం చేయగలిగితే అది ఏకత్వాన్ని దర్శింపచేస్తుంది. అలాకానప్పుడు, రెండుగా ఉండి, 'అదా? ఇదా?', 'కావలా? వద్దా?' లాగా ఉంటుంది. అందుచేత, **ఏకత్వములో భిన్నత్వము, భిన్నత్వములో ఏకత్వము దర్శింపచేసుకోవాలి.** ఒకటి రెండుగా దిగివచ్చిన వారిని సృష్టిలో అశ్వినీ దేవతలుగా దర్శించుకోవచ్చు.

మనలో కుడి ఎడమలు ఉంటాయి. కుడి మెదడుగాను, ఎడమ మెదడుగాను ఉంటాయి. ఆ రెండిటి మధ్యలో ఒక దారి, సహస్రారానికి దారితీస్తుంది. కుడికన్ను, ఎడమకన్ను ఉంటాయి. ఈ రెండింటికీ మూలంగా మూడవకన్ను ఉంటుంది. ఈ రెండు దృష్టులూ సమానం అయినప్పుడు, ఈ మూడవకన్ను జ్ఞాన నేత్రంగా అవుతుంది. అలాగే కుడి పుటము ఎడమ పుటము అని మన నాసికలు కూడా రెండుంటాయి. కుడి చెవి–ఎడమ చెవి, అలాగే పైదవడ–క్రింది దవడ, ఏదైనా ఇలా జంటలు జంటలుగా కనిపించేవి అశ్వినీ దేవతలగానే భావించాలి. రెండు కన్నులూ సమానంగా చూడగలగాలి, మెల్లకన్ను వుంటే కుదరదుకదా? కంటికి జబ్బు చేస్తే, ఒకటి రెండుగా కనిపిస్తుంది. సరైన దృష్టి పోయిందని అర్థం కదా? ఆలానే మెదడులో కూడా, రెండు మెదడులూ కలిసి పనిచేసినాయనుకోండి, భిన్నత్వంలో ఏకత్వంలా గోచరిస్తుంది. రెండు చెవులలో ఒకటి పితృ దేవతలు, రెండవది

దేవతలు అని చెప్పుకుంటాము కదా? రెండు భిన్నమైన ప్రజ్ఞలు ఉంటాయి, రెండూ కలిపితే పూర్ణమైన ప్రజ్ఞగా గోచరిస్తుంది. ఆ పూర్ణమైన ప్రజ్ఞ రెండు మెదడులుగాను, రెండు కన్నులుగాను, రెండు నాసికాపుటాలుగాను, రెండు పెదవులుగాను, రెండు దవడలుగాను, వినడంగాను, చెప్పడంగాను ఉంటుంది. విన కుండా చెప్పేవాడు వృద్ధి చెందడుకదా? విని, విన్నవి చెప్పేవాడు బుద్ధిమంతుడుకదా? విన్నది చెప్పుటకు, చెప్పింది వినుటకు రెండూ సరిసమానంగా ఉండాలి. చెప్పింది బాగా వినగలిగినవాడే మరొకరికి చెప్పగలడు. వినటం రానివాడికి చెప్పటం రాదుకదా? వినటము బృహస్పతి, చెప్పటము సరస్వతి. సరస్వతి అంటే వాక్కు, బృహస్పతి అంటే వినికిడి. పైనుండి విని చెప్పడం అనేది ఋషులు చేస్తుంటారు. వారు పైనుండి వింటారు, అన్నీ బట్టీపట్టుకుని వచ్చి చెప్పడము కాదు, వినిచెప్పడము ముఖ్యం. వారు ఊర్ధ్వలోకంలో వింటారు, ఈలోకంలో చెబుతారు. అదే సరస్వతి మాత్రమే ఉన్నది అనుకుంటే, ఆ చెప్పడం సమతూకంగా వుండదు. అందరూ వినగలగాలి, చెప్పగలగాలి. విని చెప్పలేకపోయారనుకోండి, అదికూడా పరిపూర్ణత కాదు. చాలామంది వినగలరుకానీ చెప్పలేరు. అలానే చాలామంది మాట్లాడగలరుకానీ వినలేరు. అందుచేత అశ్విని ప్రజ్ఞ ప్రతిచోట ద్వంద్వంగా పనిచేస్తూ వుంటుంది. మనలో ఉచ్ఛ్వాస నిశ్వాసములు కూడా అశ్వినీ దేవతలే. మనలో రెండు ఊపిరితిత్తులు ఉంటాయి. రెండు చేతులు ఉంటాయి. ఈ రెండు చేతులూ సరిసమానంగా పనిచెయ్యాలి. ఒక చెయ్యి బలంగానూ, రెండవ చెయ్యి బలహీనంగానూ ఉండకూడదు. అలానే రెండు కాళ్ళూను. అలానే అన్నీ రెండు రెండుగా గోచరిస్తుంటాయి.

ఒకే చూపు రెండు కన్నులనుండి గోచరిస్తుందికదా? ఒకే వాక్కు పైదవడ, క్రింది దవడల ఆధారంగానే వెలువడుతుందికదా? ఏమి చెప్పాలన్నా రెండు దవడలూ పనిచెయ్యాలికదా? రెండుగా వుండి ఒకటి రెండుగా అనుభూతినిస్తూ వుంటాయి అని తెలియచేసే స్తోత్రం ఇది. ఇలా చాలా విలువైన విషయాలు తెలుపుతాయి ఈ స్తోత్రాలు. మనం ఈ స్తోత్రాలను క్లుప్తంగా వివరించుకుందాము.

కాలము – దేశము, ఉత్తరాయణము – దక్షిణాయనము, పౌర్ణిమ–అమావాస్య, రాత్రి–పగలు, హాని–వృద్ధి, పెరుగుట–తరుగుట, జననము–మరణము ఇలా ద్వంద్వంగా గోచరించేదేదైనా అశ్వినీ దేవతలే. పూర్ణమైన అవగాహన ఆ రెండిటినుండే ఏర్పడుతుంది. ఒక భాగాన్ని చూసి పరిపూర్ణమైనదని అనుకొనుటకు వీలులేదు. రెండవభాగాన్ని కూడా చూడాలికదా? అష్టమి తిథి రోజు కనపడని చంద్రుడు కూడా అక్కడ పూర్ణంగా ఉన్నాడు కదా? సగమే కనిపిస్తుంది, సగం కనిపించదు. కానీ, సగమే ఉన్నాడా చంద్రుడు? లేడుగా? పూర్తిగానే ఉన్నాడు. పూర్తిగావున్నాకానీ సగమే కనిపిస్తుంటాడు. కృష్ణాష్టమికి కనిపించిన భాగం, శుక్లాష్టమికి కనిపించదు. రెండూ అష్టమి చంద్రులే అయినా ఒక భాగం ఒక రోజు, మరొక భాగం మరొక రోజు కనిపిస్తుంది. రెండు భాగాలూ కలిపి చూడడం పౌర్ణమి, రెండు భాగాలూ చూడలేకపోవడం అమావాస్య. చంద్రుడు ఎప్పుడూ పూర్ణుడే. భూమి మీద ఉన్నవారికే చంద్రుని హాని వృద్ధులు. భూమి మీద మాత్రమే తిథులు ఉంటాయి, అంతరిక్షంలో ఉండవు. భూమి తిరుగుతూవుంటుంది, చంద్రుడు భూమిచుట్టూ తిరుగుతూవుంటాడు కాబట్టే తిథులు

ఏర్పడతాయి. భూమిని వదిలేస్తామనుకుంటే సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు లేవు. భూమి అంటే శరీరము. శరీరము అంటే కేవలం భౌతిక శరీరమే కాదు, సూక్ష్మశరీరం కూడా. ఏ శరీర స్పృహ లేనివారికి పగలు, రాత్రులు లేవు. అందుకని, రెండూగాలేని స్థితికి వెడితే ఉన్నత స్థితి అవుతుంది. రెండూలేని స్థితి పూర్ణస్థితి. ఎందుకంటే అసలు పూర్ణమునుండే ఒకటి రెండుగా దిగివస్తుంది. అందుచేత పూర్ణమైన స్థితిని అవగాహన చేసుకుంటే, ఒకటిగా ప్రధానంగా ఉంటుంది. ఇది పూర్ణమే. శూన్యంగానూ ఉంటుంది. సృష్టి ప్రారంభంలో ఏమీ లేనట్టుగా ఉన్న స్థితిలోనుండే అన్నీ ఉన్నట్టుగా వుండే సృష్టి క్రమంగా ఏర్పడి గోచరిస్తుంది. కనిపిస్తున్నదంతా కొన్నాళ్ళకు మూలంలోనే లీనమైపోతుంది. ప్రతిరోజూ మనము ఉదయం నిద్ర లేవగానే మనకు పరిసరాలన్నీ ఉంటాయి కానీ రాత్రి నిద్రలో ఉండవు.

ఏదీలేనిదానిలో, అన్నీ ఉన్నట్టు ఏర్పడడానికి మొత్తం మొదట ఏర్పడినటువంటి రెండు ప్రజ్ఞలుగా దిగివచ్చిన జంట ప్రజ్ఞలను అశ్వినీ దేవతలు అంటారు. వారు సృష్టికి ఆవల ఉండే స్థితిలోనుండి ఈవల ఉండే స్థితిలోనికి రెండుగా వస్తారు. వారినే వశిష్ఠ–అగస్త్యులుగాను, మైత్రా–వరుణులుగాను ఇలా రకరకాలుగా చెబుతారు. వీరినే "నాసత్యదస్రులు" అంటారు. అంటే 'ఉండీ లేనట్టుగా ఉండటం, లేనట్లుగా వుండడం' అనే స్థితికి అధ్యక్షత వహించేవారు అని అర్థం. దీన్ని మహాభారతంలో ఇలా చెప్పారు.

ధౌమ్యుడు అనే మహర్షి ధర్మరాజుకు గురుతుల్యుడు,

కురురాజులకు గురువు. పాండవులు అరణ్యావాసానికి వెళ్ళే సమయములో ధౌమ్యమహర్షి కూడా ధర్మరాజు వెంటే వెడతాడు. ఎందుకంటే, ధర్మము ధర్మరాజు పక్షాన ఉందికాబట్టి. ఈ మహర్షి సర్వశాస్త్ర పారంగతుడు, మహాజ్ఞాని మరియు మహాయోగి. ఆయనకి తెలియనివంటూ ఏమీ లేవు. అలాంటి గురువుగారు చాలా కఠినమైన క్రమశిక్షణ ఇచ్చేటటువంటివారిగా చెబుతారు. అంటే శనిగ్రహంలాగా ప్రవర్తిస్తారు. ఎందుకంటే అలాంటి కఠిన క్రమశిక్షణ ఇచ్చేది శనిగ్రహమే. వారిదగ్గరికి ఉపమన్యుడు అనే శిష్యుడు చేరాడు. ప్రతిగురువూ తన శిష్యుడు ఉద్ధరింపబడాలని ప్రయత్నిస్తాడు. ఇందుకు గురువులు చిత్రవిచిత్రమైన రీతులలో శిష్యులను ఉద్ధరించడం జరుగుతుంది. శిష్యుల జ్ఞానస్థితులను బట్టి వారు శిక్షణ ఇస్తారు. గ్రామానికి వెళ్ళి, అక్కడి గ్రామస్తుల ఆవులను, దూడలను అడవికి తీసుకెళ్ళి, మేపుకొనివచ్చి, గ్రామస్తులకు తిరిగిచ్చే బాధ్యతను ధౌమ్య మహర్షి ఆ శిష్యునికి అప్పగించడం జరిగింది. అలానే సాయంత్రం ఆశ్రమానికి రావాలనే కార్యక్రమం కూడా అతనికి ఇవ్వడం జరిగింది.

ఉపమన్యుడు అదేరీతిగా ఒకరోజు శ్రద్ధగా ఆవులను అడవికి తోలుకునివెళ్ళి, వాటిని మేపి, ఎవరి గోవులను వారికి అప్పజెప్పి, తిరిగి ఆశ్రమానికి వచ్చాడు. అప్పుడు గురువు ఆ శిష్యునితో “నీవు ఈరోజు భోజనము ఏమి చేశావు నాయనా?” అని అడిగాడు. అందుకు ఆ శిష్యుడు “ఆవులున్నవి కదా, వాటి పాలను త్రాగాను” అని చెప్పాడు. అప్పుడు గురువు “ఆవులు నీవి కాదుకదా, మరి వాటి పాలను ఎలా త్రాగావు? తప్పుకదా? నీవు గోరక్షణ అలా

చేస్తే నేను నిన్ను విసర్జిస్తాను" అని, అలా చేయకూడదని చెప్పాడు. మరునాడు ఆవులను మేపుకుని తిరిగివచ్చి, అప్పచెప్పి ఆశ్రమానికి వచ్చినప్పుడు గురువు మళ్ళీ "ఈవేళ ఏమి భోజనము చేశావు?" అని అడిగాడు. "పాల నురగను మాత్రమే తీసుకున్నాను" అని బదులిచ్చాడు శిష్యుడు. అందుకు గురువుగారు "పాలులేక నురగ రాదుకదా? అలాకూడా చేయకూడదు. నీ వస్తువుకానిది నీవు తీసుకోకూడదు, స్వీకరించకూడదు. అలా చేస్తే నీ శిష్యరికం నేను స్వీకరించను" అని అన్నాడు. మరునాడు ఉపమన్యుడు యథావిధిగా ఆవులను మేపుటకు అడవికి వెళ్ళి, ఆకలివేసి, అక్కడ ఆకులు కోసుకొని భుజించే ప్రయత్నంలో జిల్లేడు ఆకును త్రెంపడం జరిగింది. అప్పుడు ఆ జిల్లేడు ఆకు పాలు కళ్ళలోపడి అతని కళ్ళు పోయాయి. అయినా అతను జాగ్రత్తగా, కష్టమే అయినా గోవులను తీసుకొని గ్రామంచేరి ఆశ్రమానికి వస్తుంటే దారిలో అతను ఒక బావిలో పడిపోవడం జరిగింది.

శిష్యుడు ఆశ్రమానికి తిరిగి రానప్పుడు "ఉపమన్యుడు ఏమైనాడు?" అని గురువుగారు అతనికోసం అత్యంత ఆతురతతో వెతక్కుంటూ వెళ్ళాడు. అప్పుడు బావిలో పడిన శిష్యుణ్ణి చూసి "ఏమి బావిలో పడ్డావు?" అంటే, అప్పుడు ఆ శిష్యుడు జరిగినదంతా గురువుగారికి వివరించాడు. గురువుగారు అతనిని బావిలోనుంచి తీయుటకు ఏ ఏర్పాటూ చేయడు. కానీ పరిష్కారానికై శిష్యుని ఉద్ధరించుటకు ధౌమ్యమహర్షి అతనికి అశ్వినీ దేవతల స్తోత్రం ఇవ్వడం జరిగింది. "ఈ స్తోత్రం బాగా చదువుకో, అప్పుడు నీకు నీవే బయటపడగలవు" అని గురువుగారు ఉపదేశించి

వెళ్ళిపోయారు. బావిని కూపస్తం అని అంటారు. అంటే, కూపస్త మండూకంలా లోపల పడిపోయిన వారికి బయటికి రావడానికి చేయూతనందించే స్తోత్రం ఇది. ఈ స్తోత్రం భక్తి శ్రద్ధలతో ఆరాధన చేయగానే, ఆ శిష్యునికి అశ్వినీ దేవతలు రెండు కిరణములు లాగా వచ్చి, దర్శనమిచ్చి అతనిని ఉద్ధరింపచేశాయి. అప్పుడు ఆ శిష్యుడు బావి నుంచి బయటకు వచ్చాడు. అతను బయటకురాగానే "ఇతను ఆకలి కోసం కదా నిన్న ఆకులు తిన్నాడు" అని అశ్వినీ దేవతలు అతనికి కళ్ళు ఇచ్చి, అటుపైన రెండు ఉత్తరేణి పుల్లలను ఇచ్చి "ఇవి తిను, నీకు బాగుంటుంది, ఆకలి తీరుతుంది'' అని తెలిపారు. కానీ అప్పటికే మూడుసార్లు గురువుగారి అభిశంసనానికి గురి అవటంచేత అతను "తినడానికి మా గురువుగారి అనుమతి కావాలి" అని తెలిపాడు. ఆ రెండు పుల్లలను తన గురువుగారి వద్దకు తీసుకొని వెళ్ళి తినడానికి అనుమతి కోరగా, ధౌమ్యమహర్షి వాటిని తినమంటారు. ఇది ఈ కథకు మూలం.

ఈ కథలోని విశేషం ఏమిటంటే, ఇలా మూలాధారంలో (పదార్థంలో) ఇరుక్కుపోయి, ఈ ప్రపంచంలో ఇరుక్కుపోయిన జీవుడు, ఆ మూలాధారం నుంచి (హోమంలో వేసిన ఉత్తరేణి పుల్లలు వెలుగును ఊర్ధ్వముఖంగా తీసుకుపోయినట్టు) ఊర్ధ్వముఖంగా ఉద్ధరింపబడి, జ్ఞానసముపార్జన చేసుకొని బహుప్రజ్ఞావంతుడైనాడు. ఈ కథ ఒక ఉపాఖ్యానంగా ధౌమ్యమహర్షి మహాభారతంలో ప్రస్తావిస్తూ ఈ స్తోత్రాన్ని మనకు పరిచయం చేయడం విశేషం. ఈ స్తోత్రం నిత్యం పఠించడం వలన మనకూ ఇలాంటి ఉద్ధరణ జరగగలదు. మనలో ఉన్న జంట ప్రజ్ఞలు కలుపుకుంటూ వాటి

మధ్యస్తంగా ఉన్న సుషుమ్న నాడిని దర్శించుకుంటూ తరించడం అనేది ఈ తపస్సు. కుడి–ఎడమ కన్నులుగాను, రెండు చెవులగాను, రెండు నాసాపుటములుగాను, ఊర్ధ్వము–అధస్సు గా ఉన్నటువంటి పైదవడ–క్రింది దవడలుగాను, అటుపైన కంఠమునందు గ్రాహణములు, ఊపిరితిత్తులు, భుజములు, చేతులు, ఇలా రెండు రెండుగా ఆ రెండిటికీ మధ్యస్థంగా ఉన్నదానిని దర్శించుకోవటం జరుగుతుంది. ఇలా అవగాహన చేసుకుంటూ, ఈ స్తోత్రాన్ని చక్కగా పఠించుకుంటూ, ఈ అవగాహన మేరకు క్రిందినుండి పైవరకు ఒక దండెంలా ఉన్న సుషుమ్న నాడిని దర్శించుకుంటూ తపస్సు చేయాలి. ఇలా మొట్టమొదటి శ్లోకంలో చెప్పబడుతుంది. *"గిరావాశంసామి తపసా హ్యనమ్"* వాక్యాలతో మిమ్మల్ని స్తుతిస్తాను, మిమ్మల్ని గూర్చి తపస్సు చేస్తాను అని మనకు ప్రతినిత్యం శిక్షణగా ఇచ్చారు. ఈ శ్లోకాన్ని, ఆర్తితో అనుగ్రహం కోసం చదువుకోవాలి. అది మనకు మనయందున్న సుషుమ్ననాడి దర్శనం ఇవ్వగలదు. ఇలాంటి కథలు మహాభారతంలో పెక్కులు కలవు. అశ్వినీ దేవతలు చ్యవనమహర్షికి కూడా ఆవిధంగా దర్శనమిచ్చి అతనిని నవయౌవనుడిగా చేశారు. అశ్వినీ దేవతలు చేయలేనిది ఏదీలేదు. వారు సర్వసృష్టికీ అధిష్ఠాన దేవతలు. అందుచేత బాగా స్తోత్రం స్ఫూర్తితో, అర్థసహితంగా పఠించడం అనేది ముఖ్యం. ఆ మధ్యస్థమైన ప్రజ్ఞను శిరస్సునుండి మూలాధారం వరకు తేజోవంతమైన కాంతికిరణంలాగా భావిస్తూ మనస్సును అందు లయం చేయడమనేదే తపస్సు.

మనకు మాస్టర్ C.V.V గారు కూడా యోగంలో "మీ

వెన్నెముకలో ఉన్న సుషుమ్నానాడి లోని సప్తచక్రములనూ దర్శించుకుంటూ యోగము చెయ్యండి" అని ఉపదేశించారు. అదే మన నివాసస్థానమని కూడా తెలిపారు. మాస్టరుగారు చెప్పినా ఎవరు చెప్పినా యోగం గురించి ఇదే చెబుతారు. అది ఒంటిస్తంభం మేడలా మనలో ఉంటుంది. దానిలో మనం మనస్సును లయం చేసుకోవడమంటే అందులోనికి ప్రవేశించి, అందులో మనమున్నట్టు భావించాలి. అది ఒక వెలుగు స్తంభంలా ఉంటుంది. శివారాధనా రహస్యంకూడా అదే. అది మూలాధారంలో పదార్థంగానూ, స్వాధిష్ఠానంలో వెలుగుగానూ, మణిపూరకంలో స్థితిగానూ, శక్తిగానూ, హృదయంలో బుద్ధితోకూడినట్లు, కంఠంలో ఆకాశంలో ఉన్నట్లు భావించాలి. దాని పైభాగం ఆజ్ఞాకేంద్రం చేరినచో జ్ఞానము సహస్రారం చేరి వ్యాప్తిచెందుతుంది. దానిని మూలాధారం నుండి సహస్రారం వరకు ఆరోహణాక్రమంలోగానీ, అవరోహణాక్రమంలోగానీ భావన చేసుకోవాలి. ఈ విధంగా తపస్సు చేసుకుంటూ, స్తోత్రం చేసుకుంటూ, "నేను అందులో ఉంటాను" అని ముందుగా మాట ఇవ్వాలి.

మొదటి పాదంలో "ప్రపూర్వగౌ" అంటే అన్నిటికన్నా ముందు అని అర్థం. "ప్రపూర్వము" అంటే పూర్వానికి పూర్వము, ఏమీలేనటువంటి స్థితి, అంటే సృష్టికి ఆది. ఈ స్థితిని వాఙ్మయంలో గంధర్వతరంగాలు అని అంటారు. తరంగాలు తరంగాలుగా ఉంటే ఒక తరంగంలోనుండి ఒక గ్రుడ్డు ఏర్పడుతుంది. అందుండి ఒక ప్రపంచం ఏర్పడుతుంది. అలా ఎన్ని అండాలయినా గంధర్వ లోకంలో ఏర్పడవచ్చు. అందుకనే మనకు ఎన్ని బ్రహ్మాండాలు

ఉన్నాయో తెలియని స్థితి. ఈ సృష్టి గంధర్వతరంగాల నుండి పుట్టుకుని వచ్చింది. మనము మాఘమాస ప్రజ్ఞను చూసినా, పైన రెండు 'electrical lines' వస్తాయి. అక్కడనుండి, అన్నీ పుట్టుకువస్తుంటాయి. ఏమీలేనిది ఎలా ఉందో, ప్రయత్నిస్తే అందులో ప్రవేశించి మనము కూడా లేకుండే స్థితిని చేరగలము. దీనినే "సమాధి స్థితి" అంటారు.

సమాధి స్థితియందు ఎప్పుడూ ఉండే ప్రజ్ఞే అశ్వినీ దేవతల ప్రజ్ఞ. ఈ సమాధి స్థితి రావడం అంటే సహస్రార చక్రానికి చేరుకోవడమే. దానిని భావన చేయాలంటే "ఏమీ లేనపుడు ఎలా ఉంది?" అని ఆలోచించాలి. నీవు నిద్రపోతున్నప్పుడు ఎలా ఉంది? గాఢ నిద్రలో ఉన్నపుడు నీకేమీ తెలియదు. కానీ నీవు వున్నావుగా? ఉన్నావు కాబట్టే మేలుకుంటున్నావు. నీవే లేకపోతే మేలుకోవడమనేదే లేదు. అందుకనే సృష్టికి ముందుకూడా ఒక మెలకువ ఉన్నది. దానిని మనవాళ్ళు సృష్టికి అతీతమైన తత్త్వంగా చెప్పారు. ఆ తత్త్వమే దిగివచ్చినప్పుడు రెండుగా దిగివస్తుంది. అందుకనే దిగివచ్చేటప్పుడు అది పరమప్రకృతి, పరమపురుషుడు. వీటిలో ఎవరు ముందు అని చెప్పుటకు వీలు లేదు. మనకు AC/DC కరెంట్ వుంటుంది కదా? వీటిలో ఒకటి లేకపోతే రెండవది లేదు. ఈ రెండూ అవ్యక్తంగానే ఉంటాయి. అవ్యక్తం నుండి వ్యక్తమైనప్పుడు అది వెలుగుగా కనిపిస్తుంది. అందుకని, సృష్టి మొదలవ్వకముందు కూడా మీరు ఉన్నారు. వారిరువురు పూర్వమునకు పూర్వము. ఆదికి ఆది. అందువలన ప్రపూర్వగౌ అని సంబోధిస్తూ స్తోత్రం ప్రారంభం అవుతుంది. దీనిని గూర్చిన

విచారం జిజ్ఞాసువునకు చాలా ప్రధానం. ఇలా దిగివచ్చేటప్పుడు కూడా అన్నిటినీ అధిష్ఠించి వుండే తత్త్వమే అశ్వినీ దేవతల తత్త్వము.

"ప్రపూర్వగౌ" అంటే అత్యంత ప్రాచీనులు. అంటే సృష్టి ఆదికి ముందునుంచీ ఉన్నటువంటి; "పూర్వజౌ" అంటే అందరికన్నా ముందు పుట్టినవారు. వీరు పుట్టుటచేతనే మిగతావి వచ్చాయి. "ఏకత్వానికి" పేరులేదు. దానిని "తత్" అంటారు. అది దిగివచ్చేటప్పుడు "ప్రపూర్వగౌ" అంటారు. అంటే సృష్టి ఉన్నా లేకపోయినా ఉన్నటువంటిది. మనము కూడా మేలుకొని ఉంటే, సృష్టి ఉంది. మేలుకొని లేకపోతే మన సృష్టి మనకు లేదు. కానీ, సమాధి స్థితికి చేరిన ప్రజ్ఞకి తాను ఉన్నట్టుగా తెలిసి ఏమీ లేనట్టుగానూ ఉంటుంది. కాసేపు ఉన్నట్టు, కాసేపు లేనట్టు ఉంటుంది. ఎరుక ఏర్పడినప్పుడు ఉన్నట్టు, ఎరుక లేనప్పుడు లేనట్టు ఉంటుంది. ఉండుట, ఎరుక కలిగి ఉండుట, ఎరుకతోలేక ఉండుట ఉన్నవి. దీనిగురించి విచారణ అవసరం. దానినే "తత్త్వ విచారము" అంటారు.

**ఆచారం ఎక్కువ పెట్టుకోక, తగుమాత్రం పెట్టుకొని, విచారణ ఎక్కువగా పెట్టుకోవాలి.** ఆచారాలు దేశ, కాల, ఋతువులనుబట్టి మారుతూ వుంటాయి. సమశీతోష్ణ స్థితిలో ఉండేవారికి ఒక ఆచారము. ఉత్తరధ్రువం, దక్షిణధ్రువంలో ఉండేవారికి వేరే ఆచారాలు ఉంటాయి. భూమిపై అక్షాంశాలను బట్టి శీతోష్ణ స్థితులు ఉంటాయి. దానిప్రకారమే వస్త్రధారణ వంటివి ఉంటాయి. ఉత్తరదేశంలో ఉన్న హిమాలయాలలో చొక్కా వేసుకోకపోతే కుదరదు. చలికి అన్నీ వేసుకోవాలికదా? ఆచారం మన దేశ, కాల,

ఋతు వర్తనను బట్టి మనలో ఉండిపోతుంది. కాబట్టి ఆచారాలు తక్కువచేసి, విచారణ ఎక్కువ చేయాలి.

"చిత్రభాను", *"జీవోదేవస్సనాతనః"* అని అంటారు. అంటే మనం కూడా సనాతనులమే అని. ఏమీ లేనప్పుడు ఉన్నాము. అన్నీ ఉన్నప్పుడూ ఉన్నాము. "ఇది లేకపోతే ఉండమా? ఏమీ లేకపోయినా ఉండగలం" అనేదే విచారణ. ఉదయం కాఫీ లేకపోతేనో, ఆహారం లేకపోతేనో ఉండలేముకదా? కానీ **జీవుడికి నిజంగా ఉండని స్థితి అంటూ లేదు.** వాడు నిరంతరం ఉంటాడు. అందుకనే, ఉండీ లేకుండా ఉండాలనే ప్రయత్నాలు ఋషులు చేశారు. అందరూ చాప మీద పడుకోగలిగిన వారే అయినా, అలవాటు చేశాం కాబట్టి మంచం లేకుండా నిద్ర పట్టదు. మనము రకరకాలైన ఆధారాలను ఏర్పాటు చేసుకున్నాము. ఇవి ఏవి లేకపోయినా జీవుడు ఉండేవాడే. మనుషులు ఎంత నిరాధారంగా, ఎంత స్వావలంబనముగా ఉంటారో అంత గొప్పవారుగా ఉంటారు. వేడినీరు లేకపోతే స్నానము చేయలేరు. అప్పుడు బొత్తిగా మనమీద మనం నిలబడలేనివారిగా కనిపిస్తాము.

"చిత్రభానూ" ప్రాణ–ప్రజ్ఞల సమాన స్థితియే ఆత్మ. ఇవి కలిస్తేనే ఆత్మదర్శనం అవుతుంది. ఒకటి రెండుగా దిగివచ్చి ఆడుకుంటూ వుంటుంది. రెండు అంటే జంట కాబట్టి రెండు రెక్కలుగా, పక్షులుగా చెబుతారు. అందుకనే "సుపర్ణౌ" అంటారు. వారిద్దరి దర్శనం రకకాల చిత్రమైన రంగుల దర్శనంగా ఉంటుంది. ఉత్తరధ్రువం మరియు దక్షిణధ్రువం దగ్గర ఇలా రంగులు నాట్యం చేస్తున్నట్టు వెలుగు కనిపిస్తుంది. సూర్యుడు

రాకముందే ఈ కాంతులు వస్తాయి. ఆ కాంతుల దర్శనం మనం చేసుకుంటూ ఉండాలి. అలాగే సూర్యాస్తమయం తరువాతకూడ ఈ కాంతులు ఉంటాయి. ఉదయం కాంతులను "అదితి"గాను, సూర్యాస్తమయం తరువాతి కాంతులను "సావిత్రి"గాను చెప్పారు మన పెద్దలు. పేర్లు ఏవైనా ఆ కాంతులు చిత్రవిచిత్రంగా ఉంటాయి. సూర్యోదయం తరువాత సూర్యాస్తమయం ముందు ఆ చిత్రకాంతుల నృత్యం ఉండదు. చీకటిలో వెలుగు ఎలా ఉంటుందో చూడాలంటే సూర్యోదయం ముందుగానే నిద్రలేవాలి. లేవనివారికి ఇవి కనిపించవు. అందుకనే మాస్టర్ E.K. గారు "సూర్యునికన్నా ముందే నిద్రలేచి సూర్యుని ఆహ్వానించే బుద్ధి లేనివారు నన్ను అనుసరించకండి, అనుసరించలేరు" అని చెప్పేవారు.

ఉదయం ఏడుగంటలకు లేచి సంధ్యవార్చే చాలామంది దానికి ప్రాయశ్చిత్తం చేసుకొనేవాళ్ళు. ఎందుకంటే సంధ్య వారికోసం ఆగదు కదా? అలానే రాత్రి 7.30కి సంధ్యవార్చేవారికి సంధ్యే లేదుగా? ఉదాహరణకు, ఒక పెద్దాయన వచ్చినప్పుడు, ఆయన రాకముందే లేదా వెళ్ళినతరువాత నమస్కారాలెందుకు? అందుకని చిత్రభాను దర్శనం మనకు ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది. మరువు మహర్షి సూర్యోదయానికి ముందు ఉండే కాంతులను ఇంకోలా చెబుతారు. "నీవు నిద్రలోంచి మేలుకొన్నప్పుడు, పూర్తిగా మెలకువలో లేకుండా, మనము ఉండీ లేనట్టుగా ఉంటాము. అదే నీలో సూర్యుడు ఉదయించటం అంటే". ప్రతివాడూ వాని ప్రజ్ఞ మెలకువ వచ్చేలోపల ఏమీలేనటువంటి స్థితిలో నుండి ఉన్నట్టు వుండే స్థితి లోనికి వస్తూ వుంటారు. అప్పుడు

దానిని "Diamond Consciousness" అంటారు మరువు మహర్షి. దానినే "వజ్రచైతన్యము" అని అన్నారు. లేనట్టు వున్న స్థితి నుండి వున్నట్లున్న స్థితిలోనికి వచ్చేలోపు కలిగే అనుభూతి చిత్రభాను దర్శనం.

"చిత్రభాను" అంటే వజ్రచైతన్యము. అదేమిటంటే, ఇంకా నీవు పూర్తిగా మెలకువలోనికి రాలేదు, ఇంకా పరిసరాలలో ఎక్కడ ఉన్నామో గుర్తుకు రాలేని పరిస్థితి. ఉన్నాము కానీ ఎక్కడ ఉన్నామో తెలియదు. మనం గాఢనిద్రలోంచి లేస్తే "ఓహో మనం ఇక్కడ ఉన్నాము" అని తెలుస్తుంది. కానీ అమెరికా నుండి వచ్చి బెంగళూరులో పడుకున్నామనుకోండి, లేకపోతే విశాఖపట్టణం నుండి వచ్చి బెంగళూరులో లేచామనుకోండి "ఓహో బెంగళూరులో ఉన్నాము" అని అనుకుంటాముకదా? ఎందుకంటే నిద్రలో అన్నీ వెళ్ళిపోతాయి, మెలకువలో మళ్ళీ గుర్తుకువస్తాయి. ప్రపంచం బాగా గుర్తువచ్చేలోపల మనకు ఎరుక వస్తుంది. ఎరుక వచ్చి, ఇంకా ప్రపంచం లేదు మనకు అనే స్థితిని లేచీలేవంగానే, పూర్తిగా ప్రజ్ఞ ప్రపంచంలోకి ఇంకా దిగిపోయే సమయంలో చూస్తాము మనము. అందుకనే ఉదయం నాలుగు గంటలకు లేచినప్పుడు, ఇంకా ప్రపంచంలోనికి రాకముందు ప్రజ్ఞ సూర్యోదయం ముందు వెలుగులా ఉంటుంది. దానిని దర్శించవలెనంటే పద్ధతులు రెండు: మనకు ప్రాంతీయంగా (లోకల్ టైం) సూర్యోదయానికి ముందు ఆ కాంతుల దర్శనం చేసుకొనే అవకాశం వుంటుంది లేదా నీవు నిద్ర లేచీలేవంగానే పూర్తిగా ప్రపంచ ప్రజ్ఞలోకి జారిపోకముందు దర్శనం చేసుకోవచ్చు. అది కష్టమే అయినా ప్రయత్నం

చేయవచ్చు. అలాచేస్తే చాలా చిత్రమైనటువంటి కాంతులు దర్శనమిస్తాయి. కాబట్టే "చిత్రభాను" అని నామకరణం చేశారు. "భాను" అంటే సూర్యుడు. "చిత్రభాను" అంటే సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయానికి తరువాత కనిపించే కాంతులు. ఆ విశేషమైనటువంటి కాంతి చాలా ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

*"ప్రపూర్వగౌ పూర్వజౌ చిత్రభాను"* లో ఉన్న మూడు లక్షణాలు అశ్వినీ దేవతల లక్షణాలు. 'మిమ్ము గూర్చి తపస్సు చేస్తా'నని ఇంకొక వాక్యం ఉంది. "అనంతౌ" అంటే అంతము లేని వారు. అంటే అశ్వినీ దేవతలు సృష్టి ఉన్నప్పుడు, లేనప్పుడూ కూడా ఉన్నారు. విష్ణు సహస్రనామంలో *"అనంతరూపో అనంతశ్రీ"* అని ఉంటుంది. అలాగే అనంతలక్ష్మి అని పేర్లు కూడా పెట్టుకుంటాము. మనకు సంపద మీద ఉన్న బుద్ధి విద్య మీద ఉండదు. ఎందుకంటే అనంతవిద్య అన్న పేరు పెట్టుకోము. అనంత సంపదకు బదులు అనంతవిద్య ఉంటే సమస్యలే లేవుకదా? "అనంతౌ దివ్యౌ" అంటే, "అనంతౌ" కు స్వయంప్రకాశము కలది అని నిజమైన అర్థము. వెలిగించితే వెలిగేది కాదు, తానే వెలుగుగా ఉన్నదానిని స్వయంప్రకాశమని అంటారు. జీవులందరూ స్వయంప్రకాశులే. వారియందు సహజంగా వెలుగు ఉన్నది. అది అన్నిరకములైన భావనలతో కప్పబడి ఉండడంచేత కుండలోని దీపమువలే ఉంటుంది. దీపము మీద కుండను బోర్లించితే వెలుగు కనబడదు. అదే దీపము మీద గాజు chimney పెట్టామనుకోండి, వెలుగు ప్రసరించి, దీపముయొక్క కాంతి కనిపిస్తుంది. అదే ప్రకాశము.

ఎందుచేత? కుండలో పదార్థ సాంద్రత ఎక్కువ, గాజు chimney లో పదార్థ సాంద్రత తక్కువ కాబట్టి. అందుకనే మన శరీరసాంద్రత ఎంత తగ్గుతూ ఉంటే, ఎంత సూక్ష్మంగా మన శరీరధాతువులు పలుచన అవుతూ ఉంటే, అంత కాంతి బయటకి ప్రకాశిస్తూ ఉంటుంది. కానీ, బాగా మట్టి చేరిపోయి, శరీరం మందంగా అయిపోతే, కాంతి ఉన్నా కప్పబడి, లేనట్టుగానే ఉంటుంది. బాగా తమస్సు ఉన్నవారికి కాంతి ఎక్కడ ఉన్నది? వాడి కాంతి వాడికి తెలియదు.

ఆభరణాలకు ఎంతబాగా సానపెడితే అంతబాగా మెరుగు వస్తుంది. అలానే సప్తధాతువుల సాంద్రత తగ్గించుకోవడం తెలిస్తే క్రమంగా మనలోని కాంతి పెరుగుతూ వస్తుంది. సాధనలో చేయవలసినది అదే. కాంతివంతమైన శుక్రధాతువుయందు ఓజస్సు ఏర్పడుతుంది. అందుండి తేజస్సు, అందుండి భ్రాజస్సు ఏర్పడుతుంది. వెలుగులోకి వెళ్ళగలిగీ ఎంతసేపూ మనం మట్టి వెంట పడతాము. స్థూలమైన విషయములందు ఆసక్తి ఎక్కువ, సూక్ష్మమైన విషయములందు ఆసక్తి తక్కువ. ప్రపంచం గురించే ఆసక్తిగానీ, ప్రపంచానికి మూలము, ఆధారము అయినదాని పైన భావన ఉండదు. నీవు దేనినిగూర్చి విచారము చేస్తే నీవు అదే అవుతావు. *"యద్భావం తద్భవతి"* అని అందుకే అన్నారు.

"దివ్యౌ" అంటే స్వయంప్రకాశకులు. సూర్యుడు స్వయంప్రకాశకుడు. చంద్రుడు, భూమి కూడా కాంతివంతమైనవే అయినా, సూర్యుడంత కాంతి ఉండదు. కాంతి లేనిదంటూ ఏదీ లేదు. కాంతియొక్క స్థితిగతులు వేరువేరుగా ఉంటాయి అంతే.

పదార్థం యొక్క స్థూలత్వాన్ని బట్టి కాంతి తగ్గిపోతూవుంటుంది. "దివ్యౌ సుపర్ణౌ" కుడి–ఎడమలుగా ఉంటారు. ఒకదానికన్నా ఇంకొకటి బలంగా, ఎడమ వాటం–కుడి వాటం అని ఉండవు. కుడి–ఎడమలు, ప్రకృతి–పురుషుడు, ప్రజ్ఞ–పదార్థము ఇలా ఏదైనా సరిసమానంగానే ఉంటాయి. సమధర్మం, సమవృద్ధి, సమబుద్ధి, సమదర్శనం. ఇలా అన్ని విషయాలలోనూ సమతుల్యంగా సమస్థితి లేనప్పుడు అనుభూతి ఉండదు. రజస్సు తమస్సు రెండూ సమతూకంలో ఉంటేనే నీవు సత్వములో ఉండగలవు. అన్నిటిలోనూ సమతూకం ఉండాలి. Overaction పనికి రాదు, underaction పనికి రాదు. hyperactivity ఉండకూడదు, అలానే hypoactivity కూడా ఉండకూడదు.

నిద్రైనా, విశ్రాంతైనా, పనియైనా, ఆహారమైనా సమతూకంలో ఉండాలి. చక్కని సెలయేరు పారుతున్నట్టుగా ఉండాలి. ఎక్కువగా కానీ, ఎండిపోయిన సెలయేరుగా కానీ ఉండకూడదు. *"ఎప్పుడు ఎడతెగక పారు ఏరును ద్విజుడును"* అని పద్యం ఉన్నదికదా? అలాగే ప్రాణములయొక్క ప్రసారము కూడా సమతూకంగా ఉండాలి. రెండూ కూడా ఏర్పడాలనే ఆ సమతూకాన్నే "సుపర్ణుడు" అంటారు.

అన్నిలోకాల్లోనూ సమతూకంగా ఉన్నవాడే యోగి. యోగి అయినవాడు ఇహలోకములను నిరాకరించడు, పరలోకమును ఆశించడు. అవసరాన్నిబట్టి ఎక్కడ వుండాలో అక్కడ సమతూకంలో వుంటాడు. సమతూకంలో ఉన్నవాణ్ణి సృష్టి బంధించలేదు. గరుత్మంతుడు మొదలగు మహాత్ములందరూ సమతూకంగానే

ఉంటారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు పరిపూర్ణమైన సమతూకానికి ఉదాహరణలు. సమతూకంగా ఉన్నవారి గురించి విభూతి యోగంలో చెప్పారు. రుద్రులలో శంకరుడు మూలం. ఎందుకంటే ఏకాదశ రుద్రులలో ఆయనకు ముందు ఐదుగురు, వెనక ఐదుగురు ఉంటారు. ఇక్కడ అంకెలలో 'ఐదు సమతూకం వున్నది. అలాగే, గాయత్రీ వర్ణాలలో "నీలము" సమతూకం. అక్షరాలలో 'ఉ' సమతూకం. 'ఆ' అనే పరతత్త్వము, 'మ' అనే ప్రకృతితత్త్వము, ఈ రెండిటినీ అనుసంధానము చేయునది 'ఉ'. అది పరమునకు పదార్థమునకు సమమైనది. అక్షరాలలో 'అ', 'ఆ', 'ఇ', 'ఈ', 'ఉ'లో సమతూకం. ఐదులో మూడు సమతూకము. మూడులో రెండు మధ్యమం.

పంచపాండవులలో అర్జునుడు మూడవవాడు, పాండవ మధ్యముడు కాబట్టి అతను సమతూకం. విరాటపర్వములో భీముడు తానే పాండవ మధ్యముడనని బకాసుర వధకు వెళతాడు. ఎందుకంటే కుంతీపుత్రులలో భీముడు మధ్యముడు. తల్లితండ్రులలో పెద్దవాడు తండ్రికి, చిన్నవాడు తల్లికి చాలా ప్రియమైనవారుగా ఉంటారు. మాద్రీదేవి కుంతీదేవికి తనపిల్లలను అప్పజెప్పి తాను సతీసహగమనములో భర్తతోపాటూ పోతుంది. సతీసహగమనంలో వెళ్ళిపోవలసిన కుంతీదేవి కూడా కేవలం పిల్లలకోసం త్యాగం చేస్తుంది. తన పుత్రులకన్నా ఎక్కువగా సవతిపుత్రులైన మాద్రీపుత్రులను చూసుకుంటుంది. అలానే ధర్మరాజుకూడా మాద్రీపుత్రులను తన తమ్ముళ్ళలాగా చూసు

కుంటాడు. కుడి ఎడమలు కాకుండా మధ్యస్థంగా వెళ్ళేవాడిని "సుపర్ణుడు" అంటారు.

"విరజౌ" అంటే రజస్సుకు అతీతమైన తత్త్వం. తమస్సు కన్నా రజస్సు గొప్పది, రజస్సుకన్నా సత్వం గొప్పది. అసలు ఏమీ చేయకుండా ఉండడం కన్నా ఏదైనా చేయడం గొప్పది. ఏదో ఒకటి చేయడంకన్నా సరిగా చేయడం గొప్పది. అసలు చేయనివాడికన్నా ఏదో ఒకటి చేసేవాడు గొప్ప. సరిగా చేసేవాడు ఇంకా గొప్ప. సరిగా చేసేవాళ్ళలో సమతూకంగా చేసేవాడు మరీగొప్పవాడు, ప్రశస్తమైనటువంటివాడు. "విరజౌ" అంటే, వీరికి రజస్సులేదు, తమస్సు వీరికి అంటనే అంటదు. "విరజౌ" అంటే వీరు ఎల్లప్పుడూ అత్యంత ప్రశాంతంగా ఉంటారు. సూర్యోదయానికి ముందు కాంతి చాలా ప్రశాంతంగా ఉంటుంది కానీ సూర్యోదయం తరువాత ఆ కాంతి ప్రకోపంగా ఉంటుంది. పొరపాటున తెల్లవారుజామున ఆకాశంవైపు చూశాము అంటే ఆ ప్రశాంతత చూసి, 'రోజూ ఇలా చేస్తే బాగుంటుందికదా' అని అనిపిస్తుంది. అది జీవలక్షణం. లేవకపోవడం అనేది దేహలక్షణం.

విరజౌ అనే స్థితిని బాగా అవగాహన చేసుకోవాలి. విరజౌ అంటే రజస్సు కన్నా ముందున్నది, రజస్సు అంటనిది, తమస్సు అసలు అంటనిది. అంటే "always poised" అని అర్థం. It is being peaceful and poised at all times. వీళ్ళు ప్రశాంతంగా లేని సమయం లేదు. అలాంటి స్థితే విరజౌ అంటే. విరజా అని గంగకు కూడా ఒక పేరు. గంగలో స్నానంవల్ల సత్వం పెరుగుతుంది. అది ఆ నది లక్షణం. అదే లక్షణం గోదావరిలో

కూడా ఉంది అంటారు. అసలు విరజా నది అంటేనే గంగ అని చెబుతారు. ఈ విరజా అనే స్థితిని చూడాలి. వేగమా, నిదానమా అని చూసుకోవాలి. ఉదయం సూర్యోదయం ముందే నిద్రలేవడం అనేది సత్వము. సూర్యోదయానికి బాగా ముందు నిద్రలేవడం రజస్సు. అప్రమత్తంగా లేక నిద్ర ఆలస్యంగా లేస్తే అది తమస్సు. ఒకే కాలానికి లేచినా అప్రమత్తత అవసరం. లేదా సమానత్వం చెడుతుంది కదా? ఉదాహరణకు పరుగెత్తే రైలుని హడావిడిగా ఎక్కిన విధంగా ఉంటుంది. మరీ ముందుగా స్టేషన్‌కు వచ్చినా చిరాకే. సరిగా, సమతూకంగా నడవడమనేది విరజౌ. విరజౌ అంటే విశిష్టమైన కొలతలు కలవాడు. ఒక ప్రక్క సరి సంఖ్యలు, మరొకప్రక్క బేసి సంఖ్యలు ఉంటేనే అది సమతూకం. ప్రకృతి సరి, పురుషుడు బేసి. సంఖ్యాశాస్త్రంలో మనిషి పుట్టిన తేదీని బట్టి వారి వారి తత్వం చెప్పబడుతుంది.

"విమానౌ" అంటే విశిష్టమైన కొలతలు గలిగి ఆకాశ గమనం చేయగలిగినవి అని అర్థము. విమానాలు నేలపైన తిరగవుకదా? ఆకాశంలో తిరుగుతాయి. మనలో విశిష్టమైన కొలతలు ఉంటాయి. మనిషియొక్క అవయవ శాస్త్రము మన అవయవ కొలతలను బట్టి మనిషియొక్క గుణగణాలను తెలుపుతుంది. నుదురు, శిరోజాలు, వక్షస్థలము, వేళ్ళు, చేతులు, గోళ్ళు, కళ్ళు అని అమ్మవారిని లలితాసహస్రనామంలో నానావిధాలుగా వర్ణిస్తుంటాము. అలానే ఇలాంటి విశిష్టమైన అవయవ కొలతలు ఏర్పాటు చేయడానికి అశ్వినీ దేవతలు ఉన్నారు. వీరు *"అధిక్షిపంతౌ భువనాని విశ్వా"* అంటే బ్రహ్మాండం సమస్తమూ

అధిష్ఠించి ఉంటారు. సృష్టి కాలంతోపాటు కదులుతూ ఉంటున్నా వీరు కదలరు. కదిలే వారియందు కదలనివాడే గొప్పవాడు. వాడే కదిలించే వాడు. రంగులరాట్నం త్రిప్పేవాడు వాడు కదలడు కానీ రాట్నాన్ని త్రిప్పుతాడు. అలానే "చక్రవర్తి" లేదా "చక్రధారి" అంటే చక్రాన్ని త్రిప్పేవాడు కాని తాను తిరగడు. అశ్వినీ దేవతలు సృష్టి చక్రాన్ని అధిష్ఠించి వుంటారు. నీలో నీవుంటే అన్నీ నీ చుట్టూరా తిరుగుతాయి. నీవు అన్నీ చూస్తూవుంటావు. ప్రాణస్పందన, ప్రజ్ఞ చేసేపనులను చూస్తూ ఉంటావు. ప్రాణము, ప్రజ్ఞ ఈ రెండూ కదలిక కలవే. ప్రాణము ప్రవాహమే, చైతన్యమూ ప్రవాహమే. పనులలో కొట్టుకుపోయేవారు చాలమందే వుంటారు. కొట్టుకొనిపోకుండా పనిని నిర్వహించేవాడు, తిరగకుండా తనలో తిరుగుతున్నదానిని గమనిస్తున్నవాడు గొప్పవాడుగా ఉంటాడు. ప్రయాణం చేసేటప్పుడు కూర్చునేవున్నా ప్రయాణమెలా చేస్తావు? కారులో, రైలులో, విమానంలో నీవు ప్రయాణం చేస్తున్నా, ఈ అన్నిచోట్లా కూర్చునే వుంటావు. నీవు తిరగవు కదా. అలా నీలో నీవు కూర్చుని వుంటే ప్రయాణం చేస్తున్నట్లు ఉండదు, ప్రకృతి నీతో చేయిస్తుంది. నీవు చూస్తూ వుంటావు.

శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఇదే చెప్పారు. "నేనేమీ చేయడం లేదు, ప్రకృతి ఇలా చేస్తుంది. లోకంలో నేను మీకెవరికీ పనులు పెట్టలేదు, మీరే మీ రజస్సుకొద్దీ పనులు పెట్టుకున్నారు" అని అద్భుతమైన విషయాన్ని చెప్పారు. నీవు చేయకపోయినా ప్రకృతి తన పని చేయించుకుంటుంది. నీద్వారా కాకపోతే ఇంకొకరిద్వారా చేయించుకుంటుంది. ప్రకృతే అందరినీ పనిలో పెట్టుకుంటుంది.

నీలోని ప్రకృతే నిన్ను పనిలో పెట్టుకుంటుంది. ఇక్కడ ప్రకృతి అంటే నీలోని చైతన్యము. నీ చైతన్యము ఇచ్ఛ, జ్ఞాన క్రియలుగా పనిచేస్తుంది. దానిని అధిష్ఠించి నీవు కూర్చున్నచో అపుడు నీవు చేయనివాడిగా ఉన్నా, అన్నీ చేస్తున్నట్టుగా ప్రపంచం నిన్ను చూస్తూ ఉంటుంది.

మాస్టర్ C.V.V. గారు ఎక్కడో కుంభకోణంలో కూర్చుని ఏమీ చేయనట్లున్నా భూగోళమంతా వ్యాప్తిచెందారు కదా! గోళమంతా విమానంలో తిరిగేవాడు ఈ పని చేయగలడా? లేదు. రమణ మహర్షి అరుణాచలంలో కూర్చున్నా ప్రపంచమంతా ప్రాకారు. సాయి ప్రశాంతి నిలయంలో కూర్చుని సర్వదా వ్యాప్తి చెందారు. అలానే రామకృష్ణ పరమహంస బేళూరు మఠంలో కూర్చుని విశ్వమంతా వ్యాప్తిచెందారు. నేనూ ఏమి చేయకపోయినా అన్నీ జరిగిపోతున్నాయి కదా? కూర్చుని ఉండి అన్నిపనులూ జరిపించగలిగినవారు, కూర్చోవడం అంటే తెలిసినవారు. ఋషు లందరూ అంతే, కూర్చుని ఏమీ చేయరు కానీ హిమాలయాల్లో కూర్చుని అన్నీ జరిపిస్తారు. చాలా మంది Radicals "ఏమిచేస్తారు ఈ ఋషులంతా ఊరికే హిమాలయాలలో కూర్చుని?" అని ప్రశ్నిస్తారు. కానీ వారికి తెలియనిది ఏమిటంటే, హిమాలయాల్లో ఏదో గుహలలో కూర్చుని, ప్రపంచంలో ఎన్నో కార్యాలు చేసేవారు ఋషులు, తపస్వులు. వాళ్ళకు తెలుసు కూర్చోవడంతో ఏమి అవుతుందని. చేస్తేనే పనులు అవుతాయి అన్నవారు second gradeకు చెందుతారు.

Management courseలలో ఇలా చెబుతుంటారు–

"Who is the best MD?" అంటే ఆయన కేవలం వచ్చి తన ఛాంబర్లో పుస్తకం చదువుకుంటూ కూర్చునేవాడు అని. కానీ MD వచ్చారు, కూర్చున్నారు అంటే, అందరూ పనిచేస్తారు. MD వచ్చాడంటే ఆఫీసులో ఏదో మూలలో ఉన్న Departmentsలో ఉన్నవారు కూడా సక్రమంగా పనిచేస్తారు. రాలేదంటే ఇంకొక రకంగా ఉంటుంది. నీలోనే నీవు MDలా ఉండవచ్చు. అలా నీవు కూర్చుంటే నీవు తిరుగుతున్నట్టు కనిపించినా నీవు తిరగవు. భూమి చాలా వేగంగా తిరుగుతూనే వున్నా మనకు తిరుగుతున్నట్టు కనిపించదు. మనకు ఒకవేళ తిరుగుతున్నట్టు తెలిస్తే పడిపోతాము. అలా ఈ సృష్టిని అంతా తిప్పుతూ, తిరగక తిరుగుతూ, దాన్ని అధిష్ఠించే తత్వంగా ఉన్నారు ఈ అశ్వినీ దేవతలు. పరతత్వమే దిగివచ్చి రెండుగా, కవలలుగా, ప్రవర్తనను జరుపుతున్నారు అని చెప్పడమే ఈ శ్లోకానికి అర్థం.

దేవుడికి, జీవుడికీ ఆపాదించుకోవచ్చు మనలోని తత్వాన్ని. ఇలా చేస్తే మనోవికాసం, భావవికాసం కలుగుతుంది అని ఉపోద్ఘాతము. ఈ శ్లోకంలోని అన్ని పదాలకు అర్థం విపులంగా చెప్పడం జరిగింది. కావున, ఈ శ్లోకానికి అర్థం ఇక తెలియదు అనడానికి వీలు లేదు. సంస్కృతంలో ప్రతిపదమూ విశిష్టమైన భావముతో కూడి ఉంటుంది, అది సంస్కరించిన భాష. అక్షరములలో అర్థము ఉంటుంది, అక్షరం అంటే క్షరము కానిది అని అర్థము. అక్షరము అంటే కేంద్రమునుండి పరిధికి కొనిరాబడినది అనికూడా అర్థం ఉన్నది. మనం ఉండబట్టి కదా వాక్కు వస్తుంది. ప్రజ్ఞ మన నఖశిఖపర్యంతం వ్యాప్తిచెంది ఉంటుంది. దానినే అక్షరము అంటారు.

**మంత్రము - 2 :**

**హిరణ్మయౌ శకునీ సాంపరాయౌ**
**నాసత్యదస్రౌ సునసౌ వైజయంతౌ ।**
**శుక్రం వయంతౌ తరసా సువేమ్నా**
**వధి వ్యయంతా వసితం వివస్వతః ॥**

**టీక :**

హిరణ్మయౌ = బంగారు వెలుగు కలవారు; శకునీ = జంట పిట్టలు; సాంపరాయౌ = చక్కని పరలోకయానములు కలవారు; సునసౌ = అందమైన ముక్కులుగల పిట్టలు; వైజయంతౌ = విజయవంతములైన మహిమలు కలవారు; తరసా = వేగముతో; సువేమ్నా = మంచి మగ్గపు కఱ్ఱతో; వివస్వతః = సూర్యునకు; శుక్రం = తెల్లనిది; అసితం = నల్లనిది; అధివ్యయంతౌ = నేతపని చేయువారు; నాసత్యదస్రౌ = నాసత్యుడు, దస్రుడు అనుపేర్లు కలవారు.

**తాత్పర్యము :**

నాసత్యుడు, దస్రుడు అనబడు అశ్వినీ దేవతలు బంగారు రంగుగల పిట్టల జంటగా ఎగురుచుందురు. ముక్కులు అందముగా నుండును. వీరు విజయమును సూచించు శకునములు. తమ రెక్కలే మగ్గమునందలి పడుగు పేకలుగా కదలించుచు, సూర్యుని వలన కలుగునట్టి వెలుగు నీడలను, తెల్లని నల్లని నూలు పోగుల తోడి వస్త్రములవలె నేతపని చేయుచున్నారు.

**వివరణము :**

రెండవ మంత్రంలో *"హిరణ్మయౌ శకునీ సాంపరాయౌ"* మొదట ఉంటుంది. "హిరణ్మయౌ" అనేది హృదయము నందు గోచరిస్తుంది. అది మధ్యస్తమైనటువంటి కాంతి. దాని పైన మూడు కేంద్రాలు, దాని అధస్సుగా మూడు కేంద్రాలు ఉంటాయి. ఈ హిరణ్మయ కాంతి యొక్క దర్శనం ఎరుపు బంగారము, పసుపు బంగారము, ఈ రెండు కాంతులకు మధ్యస్తంగా తేజరిల్లుతూ ఉంటుంది. ఇది చాలా శుభప్రదమైన దర్శనం. హిరణ్మయ కాంతిని మనం ఉదయము సూర్యోదయానికి ముందు చూడగలము. ధ్యానం చేసేటప్పుడు మరీ ఎత్తులో కూర్చోక, మరీ తగ్గులో కూర్చోక, సునాయాసంగా లేవడానికి వీలుండేలా కూర్చోవాలని చెబుతారు. ఈ విషయం భగవద్గీత, ఆరవ అధ్యాయంలో చెప్పబడినది. ఒక ప్రశాంతమైన అనుభూతిని ఇచ్చే దర్శనం ఈ హిరణ్మయ దర్శనం. ఆ కాంతి మనల్ని ఇంకా ఊర్ధ్వలోకంలోకి ఉద్ధరించేలా ఉంటుంది. ఉదయం సూర్యోదయానికి ముందుగా ఆ ఎరుపు బంగారు, పసుపు బంగారుతో కూడిన హిరణ్మయ కాంతి యొక్క దర్శనం అశ్వినీ దేవతల తత్త్వమని చెబుతారు. ఇదే జంట తత్త్వము. అంటే ఈ తత్త్వము మొత్తం సృష్టికంతా ఆధారమై జంటగా దిగివస్తుంది. అందుచేత దీనిని హిరణ్మయౌ అన్నారు.

"శకునీ" అంటే జంట పిట్టలు అని అర్థము. మహాభారతంలో శకుని అంటే మనకు ఆగ్రహంగా ఉంటుంది. ఎందుకంటే శకునిలో "ద్విస్వభావం" ఉన్నది. శకుని ద్విస్వభావి. అంటే అతని ఆలోచన ఎప్పుడూ ఇదా–అదా? అదా–ఇదా? లా ఉంటుంది. అతనియందు

జ్ఞానము రెండు రకాలుగా పనిచేస్తుంటుంది. దైవము ఉన్నాడా లేడా? నాస్తికత్వము–ఆస్తికత్వము ఇలా రెండు రకాలుగా, అశ్వినీ దేవతల జంట తత్త్వము ఆయనయందు ఉన్నది కాబట్టి, శకుని అనే బిరుదు వచ్చింది. జంట పిట్టలు అంటే రెండుగా కనిపించే జంట పక్షులు కాదు. ఇవి ఒకదానిలోపల ఇంకొకటి అంతర్గతంగా ఉండేటటువంటివి. అంతర్గత జ్ఞానం ఉన్నప్పుడు పిట్ట లోపల పిట్ట ఉన్నట్లు తెలుస్తుంది. అంటే జీవాత్మలో పరమాత్మ, పరమాత్మలో జీవాత్మ. జీవాత్మకు స్వభావము వాహనం. స్వభావానికి శరీరము వాహనము. ఇలా ఒకటి ధరించేది, ఇంకొకటి ధరింపబడేదిగా ఉంటుంది.

ప్రతివారికీ వాహనాలు ఉంటాయి. ఈశ్వరునికి నందీశ్వరుడు వాహనము, వారిద్దరు ఒక జంట. నందీశ్వరునికి అపచారం చేస్తే ఈశ్వరునికి చేసినట్టుగా పురాణాలలో తెలిపారు. అలాగే గరుత్మంతుడు–విష్ణుమూర్తి. ఇలా ఇవన్నీ ఆదిజంటలు. దేవుళ్ళకు ఏదో ఒకటి వాహనంగా ఉంటాయి. అలానే మైత్రా–వరుణులూ అంతే. ఇక్కడ మిత్రుడు ధరింపబడేవాడు, వరుణుడు ధరించేవాడుగా ఉంటారు. తరువాత, ధరించేవాడు కూడా ధరింపబడేవాడు అవుతాడు. పరమాత్మకు జీవుడు వాహనంగా అనుభూతి చెందటమనేది మన స్వభావం ద్వారా జరుగుతుంది. మన స్వభావము మన శరీర వాహనము. ఇందులో స్థితి మార్పు జరిగినప్పుడు, పైలోకం ధరింపబడేదిగాను, క్రిందిలోకం ధరించేదిగాను వుంటాయి. ఒక పాత్రలో నీటిని వుంచి, ఆ నీటిని ఇంకొక పాత్రలో ఘనీభవింపచేసిన మంచుగడ్డతో వుంచినచో,

ఆ పైపాత్రలోని నీటినే క్రింది నీరు ధరిస్తుందికదా. నీరును నీరు ధరించడం ఎలా సాధ్యమైనదంటే, నీరు ఘనీభవింపడంచేత స్థితి మార్పు చెందింది. అలానే పరమాత్మయే జీవాత్మగా, అందరి హృదయాలలోనూ ఉన్నాడని చెబుతారు. ఈ పరమాత్మకు జీవుడు పాత్ర. జీవునికి మన స్వభావమే పాత్ర. మనము పురుషోత్తమ ప్రాప్తియోగం చూస్తే, అక్షరపురుషుడు క్షరపురుషుడిని ధరించి ఉంటాడని అక్కడ చెబుతారు. అక్షరపురుషుడు పురుషోత్తమునికి పాత్రధారి. ఈశ్వరునికి జీవుడు పాత్రధారి, జీవునికి క్షరపురుషుడు, స్వభావము, పాత్రలు. ఇలా మనము, పరమాత్మ క్షర–అక్షరములుగా ఉన్నాము. మనము ఈశ్వరుడు ఆధారంగా ఉన్నాము. జీవుడి ఆధారంగా అతని స్వభావము, క్షరపురుషుడు పుట్టుకొనివస్తారు. ఇలా ముగ్గురూ ఒకరి లోపల ఒకరు ఉండి ముగ్గురూ ఒకరిగా కనిపిస్తున్నారు. అందుకనే *"జీవాత్మ పరమాత్మాచ"* అని అంటుంటారు. జీవాత్మ, పరమాత్మ ఒక జంట. అలాగే జీవాత్మని అక్షరపురుషుడు అంటారు. దానినుండి వచ్చిన స్వభావాన్ని క్షరపురుషుడు అంటారు. క్షరపురుషుడు అనుభవంచేత మారుతూ వుంటాడు.

ఉదాహరణకు మనము మధ్యాహ్నం ఎక్కువగా భోజనం చేసినప్పుడు శరీరము బరువౌతుంది. వెంటనే అది అనుభవంగా మారి, మనము మరునాడు మధ్యాహ్నం మళ్ళీ ఎక్కువగా భోజనం చేయము. అంటే నిన్నటికి–నేటికి మనం మారాము. మారుతున్నవాడు, నశించేవాడు క్షరపురుషుడు. మనకి జీవితంలో ఏర్పాటు చేసుకున్న స్థితిగతులన్నీ క్షరమైపోతాయి. మనకు ఈ

ప్రపంచము, అస్తిత్వము ఈ జన్మతోనే సరి– ఇదే ప్రపంచానికి సంబంధించిన క్షరపురుషుని తత్త్వము. కానీ జీవుడు ప్రపంచానికి అతీతంగా ఉంటాడు. అతడు దేహాన్ని త్యాగం చేసి మరల శరీరంలోకి ప్రవేశించినప్పుడు, అతనిని తన పాత స్వభావమునుబట్టి గుర్తిస్తారు. ఇలా క్షరుడు–అక్షరుడు జంటగా ఉంటారు. అలాగే అక్షరుడు–పురుషోత్తముడు కూడా జంటగా ఉంటారు. ఈ జంటలు నిలువు (vertical) జంటలుగా, సమాంతర (horizontal) జంటలుగా, అలానే ఒకదానిపై మరొకటిగా కూడా ఉంటాయి. ఉత్తరధ్రువము–దక్షిణధ్రువము ఉన్నాయి, వీటిలో ఉత్తర ధ్రువము లేకపోతే భూమి ఏర్పడదు. దక్షిణధ్రువము లేకపోతే భూమిని ధరించడం వుండదు. తల లేక మొండెము లేదు. తలకాయ, మొండెమును ధరించడానికి వెన్నెముక మూలము. ఉత్తరధ్రువం అంటే సహస్రారము, దక్షిణధ్రువం అంటే మూలాధారము. ఒకటి ధరింపబడేది, మరొకటి ధరించేది.

మనము గుఱ్ఱమును అధిరోహించినప్పుడు గుఱ్ఱము మనల్ని ధరించేది, మనము గుఱ్ఱముచే ధరింపబడే వారము. ఈ ధరించే–ధరింపబడే తత్త్వమే మైత్రా–వరుణుల తత్త్వము కూడా. ధరించేది ప్రకృతి, ధరింపబడేది పురుషుడు. అందుకనే అమ్మవారిని కూడా 'వారుణి' అని పిలుస్తారు. వరుణ శబ్దము స్త్రీ శబ్దము. ఈ ధరించేది, ధరింపబడేది ఒకటే కానీ రెండుగా గోచరిస్తాయి. పరమాత్మే జీవాత్మ అయినా కానీ రెండుగా కనిపిస్తుంది. సముద్రము, అల విడిగా గుర్తిస్తుంటాము కానీ నిజానికి అలకూడా సముద్రమే. అలానే బంగారము, ఉంగరము ఒకటే అయినా

రెండుగా చూస్తాము. అందుకనే "ఉంగరంలో బంగారం ఎంత ఉంది?" అని అంటూ ఉంటాము. ఉంగరము ధరించేటటువంటి రూపము, ధరింపబడేది బంగారము. అలానే మైత్రా–వరుణులు, అగస్త్య–వశిష్ఠులు, భార్యా–భర్తలు, ఉమా–మహేశ్వరులు, వాణీ–హిరణ్యగర్భులు, లక్ష్మీ–నారాయణులు, సీతా–రాములు, శచీ–పురందరులు, మాతా–పితృలు, ఇలా అన్నీ జంటలు ఒకటి రెండుగా దర్శనమిస్తాయి. ఇవే అశ్వినీ దేవతలు. వీటిలో ఒకరు లేక రెండవది లేదు. ఇలా పూజాప్రారంభంలో తలుచుకునే జంటలన్నీ అశ్వినీ దేవతా తత్త్వములు. వీటిలోని సూక్ష్మము అశ్వినీ తత్త్వము.

గణపతి పూజలో కూడా, గణపతి బ్రహ్మచారే అయినా వారిని *"సిద్ధి–బుద్ధి సహిత వినాయకాయ నమః"* అని అంటాము. హనుమంతుడిని కూడా *"సువర్చలాసమేత హనుమాన్"* అని పిలుస్తుంటాము. ఎందుకంటే "సువర్చస్సు" అతనిని ధరించి వుంటుంది. అలానే కుమారస్వామి, దేవసేనాని తత్త్వాన్ని ధరించి వుంటాడు. రెండుగా గుర్తింప చేసేందుకు బ్రహ్మచారులకు కూడా వారి విశిష్ట తత్త్వాన్ని ఋషులు జోడించారు. ఈ ఉపాఖ్యానం "ఒక దాని లోపల ఇంకొకటి ఉంటుంది" అనే సత్యమును చెబుతుంది. కనిపించడానికి రెండుగా ఉన్నా కానీ రెండూ ఒకటే. సీతా–రాములు ఒక్కటే. సీత హృదయంలో ఎప్పుడూ రాముడు ఉంటాడు, రాముని హృదయంలో ఎప్పుడూ సీత ఉంటుంది. వారికి ఎడబాటు లేదు. రావణుడు సీతాదేవిని లంకకు తీసుకొని వెళితే అతనికి సీత భయపడదు. ఎందుకంటే తనయందు శ్రీరాముడు వున్నాడు. తను లేక రాముడు ఎలా ఉన్నాడో అని బాధపడుతూ

ఉంటుంది కానీ రాముడియందు సీత ఎప్పుడూ ఉందికదా. భర్త బయటకు వెళ్ళినప్పుడు తప్పక హృదయంలో తన భార్యను లేదా భార్య పుట్టింటికి వెళ్ళినప్పుడు హృదయంలో తన భర్తను ధరించి వుండాలి. అప్పుడే పరిపూర్ణత వస్తుంది. లేకపోతే అది అపరిపూర్ణతే అవుతుంది. పుట్టింటికి వెళ్ళిన భార్య భర్తను గురించే ఆలోచన పెట్టుకుంటుంది. అనుమానపడకుండా భర్త ఎలా ఉన్నాడో? ఏమి తింటున్నాడో? అని తలచేదే భార్య. భార్యంటే భర్తను భరించేది, భర్తంటే భార్యను భరించేవాడు. ఈ ఇద్దరూ కలిసి కుటుంబాన్ని భరిస్తుంటారు. "శకునీ" అంటే మనం ఇలా అర్థం చేసుకోవాలి.

పరమాత్మవల్ల జీవాత్మ, జీవాత్మవల్ల జీవుని స్వభావము ఒక పురుషుడుగా తయారవుతుంది. మనము క్షరపురుషుడిగా వైవిధ్యంగా ఉంటాము. అక్షరపురుషుడు ఒకే విధంగా ఉంటాడు. అక్షరపురుషుని మనస్సు స్వయంప్రకాశం అయినటువంటిది. జీవాత్మ అంటే దర్శనాత్మకమైన ప్రకాశము. గుండె కూడా రెండు శబ్దాలతో ఉంటుంది. అదే "సోహం". ఈ సోహం శబ్దంలో 'స' అనే శబ్దము పురుషుడు, 'హం' అనే శబ్దము స్త్రీ. అందుకనే పురుష సూక్తములో *"సహస్రశీర్షా పురుషః"* అని మనము చెప్పుకుంటాము. అలానే శ్రీ సూక్తములో *"హిరణ్యవర్ణాం హరిణీం"* అని మొదలు పెడతాము. ఋషుల జ్ఞానము అలా వుంటుంది. మనం సరిగా అర్థం చేసుకోకపోవడం మన దురదృష్టం. అందుచేత సో–హం అనేవి జంట శబ్దాలు. ఒకరియందు మరొకరు అధిక్షేపింపబడి ఒకటిగానే వ్యాప్తిచెంది వుంటారు. కళ్యాణంలో వధూవరులతో అగ్ని చుట్టూ ప్రదక్షిణ చేయించేటప్పుడు కళ్యాణ మంత్రాలలో

వధూవరులు "ఏడు లోకాలలోనూ ఒకటిగా ఉంటామని, ఇప్పటి నుండి ఒకటే రెండుగా (2 ఇన్ 1లా) వుంటామని" ప్రమాణం చేయిస్తారు. భార్య, భర్త దూరంగావున్నా అవగాహనతో ఉండాలి. సంస్కారవంతుడైన భర్తకు, సంస్కారవతియైన భార్యకు ఈ స్థితిగతులు తెలుస్తుంటాయి. నలదమయంతుల కథ, సీతారాముల కథ ఇలానే ఉంటాయి. అందుచేత "శకునీ" అంటే ఒకటే రెండై జంటగా ఎంతో రమ్యంగా, వైభవోపేతంగా అన్ని చోట్లా ఆనందంగా ఒకటిగా ఉండడం.

"సాంపరాయౌ" అంటే అన్ని లోకాలు ఒకటి రెండుగా, రెండు మూడుగా అయ్యి మైత్రావరుణుల తత్త్వంగా దిగివచ్చాయని అర్థము. పర నుండి పశ్యంతి వచ్చిందనుకుంటే, పర మిత్రుడు, పశ్యంతి అంటే వరుణుడు. పశ్యంతి నుండి మధ్యమ వచ్చిందనుకుంటే, మధ్యమ వరుణుడు అవుతాడు. మధ్యమ నుండి వైఖరి వస్తే మధ్యమ మిత్రుడు, వైఖరి వరుణుడు అవుతాడు. ఉదాహరణకు పైన కప్పు, క్రింద నేల ఉన్నాయి. అదే మనము కప్పు పైకి వెళితే కప్పే నేల అవుతుంది కదా. అలానే ఉత్తరధ్రువం దేనికి ఉత్తరం? దక్షిణధ్రువానికే. అలానే దక్షిణధ్రువం కూడా ఉత్తరధ్రువానికే. ఉత్తరధ్రువం సప్తర్షి మండలానికి ఉత్తరంలో కూడా ఉంటుంది. ప్రజాపతి ఈశ్వరుని నుండి పుట్టినవాడు. మన సూర్యునికి ఇంకొక సూర్యుడిగా వశిష్ఠుడు వుంటాడు. అలానే తండ్రికి కుమారుడయ్యాడు, వాడికి ఇంకొకడు పుట్టినప్పుడు కొడుకు కూడా తండ్రి అవుతాడు. ఈ తండ్రులు కానీ, తల్లులందరూ కానీ సంతానం అయిన తరువాతే తల్లితండ్రులు అయ్యారు. అదే

సంతానమునకు మునుపు వీరే సంతానం కానీ వీరు తల్లితండ్రులు కాదు. కుమారుడు పుట్టినప్పుడు, ఏకకాలంలో కుమారుడు తండ్రవుతాడు. కానీ ఇద్దరూ ఒకరే కదా? నేను మా నాన్నగారికి కొడుకుని, నా కుమారునికి తండ్రిని. కానీ నేను ఒకడినే. ఒకడినే రెండుగా ఉన్నానుగా. అలా పైలోకాలకు క్రిందిలోకాలు సంతానము, క్రిందిలోకాలకు పైలోకాలు పితృ స్థానంలో ఉంటాయి. మన ఉదరం పైన ఉరస్సు, దాని పైన శిరస్సు, దాని పైన సహస్రారం ఉంటాయి.

ఇలా ఒకటి ధరింపబడేది అంటే మిత్రస్థానము, ఒకటి ధరించేది అంటే వరుణస్థానము అని మనం గుర్తుపెట్టుకోవాలి. అలాగే మైత్రావరుణులు ఈ ఏడు లోకాలలోకి జంటలుగా అల్లుకుంటూ వస్తూ వుంటారు. వారు 'సాంపరాయౌ' అంటే అంతా వ్యాప్తి చెందినవారు, పరంగా ఉంటారు. మనకు, వారికి దివ్యతత్త్వంలో తేడా ఉంటుంది. మనము శరీరంలో ఇరుక్కుపోతాము, చదువుకుని వృత్తి–ఉద్యోగాల్లోనూ, వివాహం చేసుకుని కుటుంబంలోనూ ఇరుక్కుపోతూ ఉంటాము. ఇవన్నీ మనం ఎంత పెంచుకుంటూపోతే అంత ఇరుక్కుపోతూ ఉంటాము. ఎక్కడో భూమి కొన్నామంటే, మీరే అక్కడికి వెళ్ళాలి కానీ భూమి మీ వద్దకు రాదు. అంటే ఆ భూమికి మీరు ఇరుక్కుపోయినట్టే కదా. ఎక్కడవున్నా, ఇరుక్కుపోని స్వభావం నీకు వుంటే, అన్ని ఏర్పాట్లూ చేసుకుని కూడా దేనియందూ ఇరుక్కుపోనివాడిగా ఉంటావు. అలాంటివాడే స్వామిత్వము కలవాడు. మనం దేనిలోనైనా ఇరుక్కునిపోవడంలో specialistలం. మనకు

శరీరములో స్వామిత్వము లేదు, ఇంద్రియాలపై స్వామిత్వము లేదు, మనస్సులోనూ స్వామిత్వము లేదు, ఇలా దేనియందూ స్వామిత్వము లేక పరాధీనులై ఉన్నాము.

ఈ అశ్వినీ దేవతలు సమ్యక్పరాయణులు అంటే వీరు అంతా సృష్టి చేసి, ఒకదానికి ఒకటి అనుసంధానం చేసి కూడా దేనియందూ బంధింపబడరు. అందుకనే వారు అన్ని లోకాలలోనూ విహరించగలరు. వారికి చిక్కుకుపోవడం అనేది ఉండదు. అశ్వినీ దేవతల అనుగ్రహం ఉంటే మనం కూడా అలా తయారవగలం. ఈ ప్రార్థన అన్నిటినుండీ విముక్తినిస్తుంది. ఈ స్తోత్రాన్ని బాగా అవగాహన చేసుకోవాలి. 'సాంపరాయౌ' అంటే ఎన్ని ఏర్పాట్లు చేసినా, వీటన్నిటికీ పరముగా యానం చేసేవారు అని అర్థము. అన్నిటిలోనూ విహరిస్తూ ఉంటారు, జంటలుగా ఉంటారు. అవతారాలు కూడా జంటలుగా దిగివస్తారు. అగ్ని-వాయు జంట, అగ్ని రాముడుగా వస్తే, వాయువు హనుమంతునిగా వస్తాడు. అగ్ని కృష్ణుడిగా వస్తే భీమార్జునులు వాయువుగా వస్తారు. నలుడు-నీలుడు కూడా ఒక జంట. నలుడంటే అగ్ని, నీలుడంటే వాయువు. అనిల్ అని నామకరణం చేసుకుంటాము కాని అనల్ అని పెట్టుకోముకదా. ఎందుకంటే అనిల్ అంటే వాయువు, అనల్ అంటే అగ్ని కాబట్టి. ఈ నలుడు-నీలుడే కదా రామసేతువు నిర్మాణం చేసింది. అగ్ని-వాయువు ఎప్పుడూ తోడుగా ఉంటాయి. ప్రతిదానికీ ఒక జంట ఉంటుంది. రాశులలో మేషరాశికి జంట తులారాశి, వృషభానికి జంట వృశ్చికము, మిథునానికి ధనుస్సు, జ్యేష్ఠ మాసానికి జంట మార్గశిరము, కర్కాటకరాశి లేక

ఆషాఢమాసానికి జంట మకరరాశి లేదా పుష్యమాసము. ఇలా ఆరు జంటల రాశులు పన్నెండుగా గోచరిస్తాయి. ఈ జంటలలో ఒకటి పురుషతత్త్వము, మరొకటి స్త్రీతత్త్వము. కుంభరాశి పురుషతత్త్వము, దానికి అభిముఖంగా ఉండు సింహరాశి స్త్రీతత్త్వము. మేషరాశి పురుషతత్త్వము అయితే తులారాశి స్త్రీతత్త్వము. వృశ్చికము పురుష తత్త్వమైతే వృషభము స్త్రీతత్త్వము. మిథునము స్త్రీతత్త్వమైతే ధనుస్సు పురుషతత్త్వము. అలానే కర్కాటకము స్త్రీ అయితే మకరము పురుషుడు, కన్య స్త్రీ అయితే మీనము పురుషుడు. అలా ఒకదానిని ఒకటి ధరించేట్టుగా పన్నెండు రాశులూ ఆరు జంటరాశులుగా ఉన్నాయి. భారతంలోని 'ఉదంకోపాఖ్యానము'లో ఈ సన్నివేశాలు బాగా చెప్పబడ్డాయి. ఇవి ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే, మీరు జంటలు గుర్తుంచుకుంటారనే నమ్మకంతో. సూర్య-చంద్రులు ఒక జంట. అలానే కన్నులలో కుడికన్ను సూర్యుడు, ఎడమకన్ను చంద్రుడు.

అశ్వినీ దేవతలకు నాసత్య దస్రౌ అనే పేరు ఎలా వచ్చిందంటే, వీళ్ళలో ఒకాయన నాసత్యుడు, ఇంకొకాయన దస్రుడు కాబట్టి. నాసత్యుడు అంటే నా + అసత్య (not untrue) అంటే కనబడే సత్యమూ కాదు, అసత్యమూ కాదు. పరమాత్మ సత్యమే కానీ కనబడదు. అందులోకి వెళ్ళాలి మనం. కనబడాలంటే రెండూ ఉండాలి. కనబడనిది కనబడేదానిలో కూర్చుంటుంది. ఉదాహరణకు, ఒక హాలులో ఒక చోటు ఉంది అనుకుందాం. ఆ చోటు నిజంగా ఆ హాలులో ఉందా? నిజంగా లేదు. ఎందుకంటే, హాలు ఉండడం లేనప్పుడుకూడా ఈ చోటు ఉంది కదా? భూమి

లేనప్పుడు కూడా ఈ చోటు ఉంది. కానీ ఈ చోటును ఎవరూ గుర్తించరు, రూపాన్ని మాత్రమే గుర్తిస్తారు. ఈ చోటును ధరించినది హాలు, ఈ చోటుకు చుట్టూ ఆవరణం కట్టిస్తారు. ఆ ఆవరణం కట్టినప్పుడే బయట చోటు, లోపలి చోటు అని రెండుగా తయారవుతుంది. అలా ముందు ఒకటిగా ఉన్న చోటు ఇప్పుడు రెండయినట్లు కనిపిస్తుంది కానీ నిజానికి రెండు చోట్లు లేవు. ఒకే భూమిని రాష్ట్రాలుగ, దేశాలుగా విభజించుకున్నాము. తేడా ఏమీ లేదు. "Welcome to Andhra Pradesh" అనే బోర్డు తీసేస్తే భూమి మాత్రమే ఉంటుందికదా? సరిహద్దుల్ల వల్ల ఇది ఆంధ్ర, ఇది కర్ణాటక అంటాము కానీ, ఆ సరిహద్దులో ఉన్న మొక్కలు ఉన్నది ఒకే భూమిలో కదా? సరిహద్దులు భూమికిగానీ, గాలికిగానీ ఉండవు. అలానే చోటుకు కూడా ఉండవు.

ఇలాంటి విభజన సృష్టి చేయడాన్ని "దస్రుడు" అంటారు. సృష్టి అలా ఇన్ని లోకాలుగా విభజించబడినది. అశ్వినీ దేవతలలో "దస్రుడు" అనే తత్త్వము విభాగానికని తెలుస్తుంది. కాల విభాగాలు, దేశ విభాగాలు చేస్తూ ఉంటుంది. అసలు కాలము, దేశము విభజించలేని తత్త్వము. ఇవి విభజించబడకుండా ఉంటాయి కాని మన దృష్టికి విభజించినట్టు ఉంటుంది. హిందూ మహాసముద్రము, పసిఫిక్ మహాసముద్రము, అట్లాంటిక్ మహాసముద్రము అని పిలుస్తూ ఉంటాము. కానీ ఈ విభజన ఎలా తెలుస్తుంది? అంతా ఒక సముద్రమే. నీటిలో తేడా లేదు. ఒకే సముద్రాన్ని విభజింపబడడం వల్ల అలా కనిపిస్తుంది. ఒకటే సముద్రం అయినా మనం *"చతుస్సాగర పర్యంతం"* అని చెప్పుకుంటాము.

అందుచేత అసలు ఉన్నది కనబడదు. అతడు నాసత్యుడు. దానిని చూడడం అనేది ఉండదు, తెలుసుకోవడం మాత్రమే ఉంటుంది. You can never see the truth; you can only realize it. నీకు తెలియవచ్చేదే సత్యము కానీ కనిపించేదే సత్యము కాదు. కనపడదు కాబట్టి లేదు అంటారు, కానీ లోపల అంతరాత్మకు కనపడకపోయినా ఉన్నదని తెలుస్తుంది. సత్యమే అయినా కనబడక ఉన్నదానినే నాసత్యము అంటారు. “It is not untrue.” దీనిని double negative అంటారు. ఉదాహరణకు “నాగపాము” లో ‘గ’ అంటే గమనం, ‘అగ’ అంటే గమనము లేనిది, “న + అగ” అంటే గమనములేకుండా లేనిది. అంటే కదలకుండా కదిలేది అని అర్థము. ఎవరిని నాగులంటారంటే, కదలనట్టుండి కదిలే వారిని అలా అంటారు. వారు కదలడం వేరు, వారి శరీరం కదలడం వేరు. తాను ఆత్మననుకునే వారు కదలరు. వారికి తిరగడం తిరగకపోవడం అనేది ఉండదు. వీరు తిరుగువానిలో తిరగనివారిగా ఉంటారు. కానీ తాను శరీరమనుకునే వారు కదులుతూ ఉంటారు.

అంగుళీమాలుని కథలో, అంగుళీమాలుడు బుద్ధుని దగ్గరికి వస్తున్నా వారి మధ్య దూరం తరగదు. అప్పుడు అంగుళీమాలుడు బుద్ధునితో “కదలకు” అంటాడు. బుద్ధుడు తన శరీరం కదులుతున్నా తాను కడలడం లేదు. కానీ అంగుళీమాలుడు శరీరంలో ఉంటాడు కాబట్టి బాగా కదిలిపోతూ ఉంటాడు. కదలవద్దు అని చెప్పినా బుద్ధుడు తన వద్దకు వస్తుంటే అతనిలో ఎక్కువగా ప్రకంపనలు వస్తూ ఉంటాయి. అప్పుడు అంగుళీమాలుడు “వస్తే చంపేస్తాను,

ఎందుకు వస్తున్నావు? కదలవద్దు అంటే ఎందులకు కదులుతావు?" అని అంటాడు. దానికి గౌతమబుద్ధుడు "నేను కదలడంలేదు, నీవే కదులుతున్నావు" అంటాడు. అప్పుడు అంగుళీమాలుడు "నేను కదలడం లేదు, నీవే కదులుతూ నేను కదులుతున్నట్టు ఎందుకు అంటున్నావు?" అని ప్రశ్నిస్తాడు. మామూలుగ చూడటానికి బుద్ధుడు కదులుతున్నట్టే ఉంటుంది కానీ చైతన్యపరంగా కదలడం లేదు. అంగుళీమాలుడు భౌతికంగా కదలకపోయినా చైతన్యపరంగా కదులుతూనే ఉన్నాడు. అప్పుడు బుద్ధుని కన్నులలోనికి చూస్తే అంగుళీమాలునికి నిశ్చలత్వం కలిగింది. కొంతమంది నిశ్చలంగా చూస్తారు. కొంతమంది కళ్ళు ఎప్పుడూ కదులుతూ ఉంటాయి. నీలోని నిశ్చలత్వమును బట్టి కన్నులు కదులుట, కదలకపోవుట ఉంటుంది. నిశ్చలత్వము తక్కువగా ఉంటే చూపు కదులుతుంది. గౌతమబుద్ధుడు కన్నార్పకుండా అలానే చూస్తూ ఉంటాడు, అతని జీవచైతన్యంలో కదలిక లేదు. కానీ అంగుళీమాలుడు కూర్చునే ఉన్నాడు కానీ జీవచైతన్యం కదులుతూ ఉంది. ఇందులో ఎవరు కదిలేవారు? ఎవరు కదలనివారు? స్థూల దృష్టికి బుద్ధుడు కదులుతున్నాడు, కానీ నిజంగా అతను కదలడంలేదు. ఈ కదలకుండా కదులుతున్నట్టుగా ఉండేదే నాసత్యము అంటే. ఇలా గౌతమబుద్ధుడు–అంగుళీమాలుడు కదలనిదానికి, కదిలేదానికి ఉదాహరణలు.

దేవుడు లేడా? అంటే ఉన్నాడు. అలా అని చూపించడానికి లేదు, ఉన్నాడని ఋజువు చేయడానికి లేదు. దీనికి ఋజువులు, సాక్ష్యాలు లేవు. ఎవరికివారే తెలుసుకోవాలి. కాబట్టి దేవుడు

లేడనుకొనే వాడికి లేడు, ఉన్నాడనుకునే వాడికి ఉన్నాడు. ఈ లేడనే వాడుకూడా ఉన్నాడు. కాబట్టి ఉండీ, లేనట్టుగా ఉండే వాడు నాసత్యుడు. దానిని ధరించి ఉన్నప్పుడు పరిమితమైన తత్త్వము అపరిమితముగా అవుతుంది. ఇదే హాలులో మనము పరిమితమైన తత్త్వముగా ఉన్నాము కానీ చోటు అపరిమితమే. పరిమితమైన హాలు ఉంది అని అనుకుంటే కొంతమంది ఇందులో పట్టరు. అదే హాలు లేదనుకుంటే ఎంతమందైనా పడతారు. ఇక్కడ పట్టకపోవటం ఏమిటంటే మనం అలా ఏర్పాటు చేసుకున్నాం కాబట్టి. ఇవన్నీ చాలా లోతైన విషయాలు.

జీవాత్మ వ్యాప్తిచెందగలడు. కానీ ఈ శరీరంలో ఉండడం వలన దానికి పరిమితమై ఉంటాడు. శరీరంలో ఉండి వ్యాప్తిచెందే వారు ఉంటారు. హనుమంతుడు అలాంటి వారే. అంతగా పెరుగుతాడు, ఇంతగా కూడా అవుతాడు. మహాత్ములందరూ అంతే, సహజంగా అపరిమితులు అయినా పరిమితులుగా కనిపిస్తూ ఉంటారు. ఎందుకంటే ఒక పరిమితమైన శరీరంలో ఉండడంచేత. మనము ఈ శరీరములో ఉన్నాము అనుకోనక్కరలేదు, ఈ శరీరాన్ని ధరించి ఉన్నాము అని కూడా అనుకోవచ్చు. అలా అనుకునే వారు శరీరానికి అవతల కూడా ఉంటారు. వారు అపరిమితులు. *"త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః"* అంటారు. అందుకనే మన శరీరానికి మనం పరిమితమై ఉండనక్కరలేదు. వికాసం బాగా కలిగితే శరీరంలో ఉంటూ నీ శరీరానికి మించి నీవు ఉంటావు. శరీరానికి మించి ఉండేవారు, అపరిమితమైన ప్రజ్ఞలోకి పెరిగే శక్తి కలవారు. అందుకని ఈ నాసత్యుడు అపరిమితుడు, దస్రుడు పరిమితమును

కలిగిస్తూ ఉంటాడు. ఒక గిన్నెలో కావేరీ నది నీటిని చూపించి "కావేరీ నది నీరు" అంటాము. కానీ అది గిన్నెలోని నీరు మాత్రమే. కావేరీ నీరు అంతా ఇదే కాదు కదా? కావేరి ఈ గిన్నెకు పరిమితమై ఉంది. అలానే పరతత్త్వము ఈ సృష్టికి పరిమితమై ఉంది, దానికి అతీతంగానూ ఉంది. ఏవిధంగా అయితే అపరిమితమైన కావేరీ నీరు ఇంట్లో, కొళాయిలో, పాత్రలలో అలా వ్యాప్తిచెంది, పరిమితమైన గిన్నెలో కనిపిస్తుంది. అందులో యిమిడిపోయినట్టుగా కనిపిస్తుంది కానీ అందులో ఇమిడిపోలేదు. ఇమిడిపోయేట్టుగా పరిమితులను ఏర్పాటు చేసేదే "వరుణ తత్త్వము". అలానే అపరిమితమైన తత్త్వాన్ని "మిత్ర తత్త్వము" అంటారు. వాళ్ళే నాసత్యులు, దస్రులు.

"సునసౌ" మనకు నస అంటే తెలుసు. నస అంటే నాశికాగ్రము, ముక్కు అని అర్థము. 'సునసౌ' అంటే మంచి ముక్కులు, అంటే అందమైన ముక్కులు కలవు అని. అందమైన ముక్కు కలిగి ఉండడం కూడా ఒక శుభలక్షణమే. సునసౌ అంటే రెండు నాశికాపుటముల ద్వారా సమాన ఉచ్ఛ్వాస–నిశ్వాసములు చేయువారు అని అర్థము. వాటియందు ఉచ్ఛ్వాస–నిశ్వాసములుగా, జంటగా, అశ్వినీ దేవతలు ఉంటారు. అందుకనే మనకు "ఒక పుటము మూసి, రెండవదానితో గాలిని పీల్చి, దానియందే వదిలి రెండూ సమానంగా పనిచేసేలా" నేర్పుతుంటారు. ఎందుకంటే ఉచ్ఛ్వాస–నిశ్వాసములు నాసాపుటములలో సరిసమానంగా ఉంటే నీలో ప్రజ్ఞకు సరితూకం ఉంటుంది. ఇదే ప్రాణాయామంలో ప్రాథమిక సాధన. దీనివల్ల ప్రజ్ఞకు, ప్రాణానికి సమతూకం ఏర్పడుతుంది. అందుకనే యోగవిద్యలో ప్రవేశించినవారికి

ముందుగా ఈ ప్రాణాయామ సాధన చేసుకోమని చెబుతారు. మీరు గుర్తిస్తే రెండు నాసాపుటములు సమానంగా ఉండవు, హెచ్చుతగ్గులు వుంటాయి. అది సునసౌ అవ్వదు. ఈ రెండు నాసాపుటములలో సమానంగా ఉచ్ఛ్వాస–నిశ్వాసములు చేయించే వారే ఈ అశ్వినీ దేవతలు. ప్రాణాయామం ద్వారా మనకు ముక్కు, గొంతు మరియు శ్వాసకోశమునకు సంబంధించిన ఋగ్మతలు చేరవు. యోగవిద్యకు ప్రధానమైన అవయవములు ఈ శ్వాస అవయవములు – నాసాగ్రములు, శ్వాసనాళము ఊపిరితిత్తులు – ఇవే యోగసాధనములు. వాయువు దేహములో సరిసమానముగా నిర్వర్తింపబడి యోగము చెందుతుంది. ఈ సమానవాయు స్థితిలో ఉన్నప్పుడు ఋగ్మతలు ఏర్పడవు. ప్రాణము సమానస్థితిలో ఉండగా ప్రజ్ఞ సమానస్థితిలో ఉంటుంది. ప్రాణము వల్ల ప్రజ్ఞ, ప్రజ్ఞ వల్ల ప్రాణము సరిసమానంగా ఉంటుంది.

ఇంటి ఆవిడకు కంగారు వస్తే, ఇంటి ఆయనకు కూడా కంగారు వస్తుంది కదా. అందుకే శ్వాసలో ఉచ్ఛ్వాస–నిశ్వాసములు సమానంగా ఉండడమనేది చాల ప్రాధానము. "*నమస్తే వాయు; త్వమేవం ప్రత్యక్షం బ్రహ్మాసి*" అంటే బ్రహ్మము తెలియటానికి వాయువు ప్రధానమైనది అని అర్థము. అలాంటి వాయువును తనలో చక్కగా నిర్వర్తించే వారు మనలో అశ్వినీ దేవతలే. విరాట్పురుషుని స్తోత్రములో, "విరాట్పురుషుని నాసాగ్రము నుండి ఈ అశ్వినీ దేవతలు వచ్చారు" అని చెప్పడం జరిగిందని మనం గుర్తించాలి. శ్వాస ప్రక్రియ బాగుండాలి, ఎందుకంటే వాయువుకు తోడుగా నిరంతరం అగ్ని ఉంటుంది. వాయువును బాగా

నిర్వర్తింపగలిగితే అగ్ని సమతుల్యంగా నిర్వర్తింపబడుతుంది. ఉచ్ఛ్వాస–నిశ్వాసములు, ప్రాణము–ప్రజ్ఞలు లాగ వాయువు–అగ్ని కూడా జంటలు. ఈ జంటలు సరిగా ఉంటే, దేహంలోని ఇతర జంటలు సరిగా పనిచేస్తాయి. ఇదే "సునసౌ" కు పెద్ద అవగాహన.

"వైజయంతౌ" అంటే విజయములు పరంపరగా కలిగించేవి అని అర్థము. మొత్తం వీరిద్దరే కాన, సృష్టి అంతా ప్రజ్ఞ, పదార్థము సమతుల్యంగా ఉంటే అంతా విజయమే. మనం జయ–విజయులను చూస్తే విజయుడు బయట కనిపిస్తాడు, జయుడు లోపల ఉంటాడు. జంటలో ఒకడు "Inner light", మరొకడు "Outer light"గా ఉంటారు. కానీ ఇద్దరూ పక్కపక్కనే ఉంటారు. అలానే 'వైజయంతౌ' అంటే లోపల, బయట సరిసమానంగా ఉండేవారు అని కూడా అర్థము. కుడి ఎడమలు సరిసమానంగా ఉండేవాడికే విజయ పరంపరలు వస్తాయి. ఈ వైజయంతౌ విజయమునకు సంకేతముగా, "వైజయంతి" మాలను ధరించి ఉంటారు. అందుకే శ్రీ రాముడు ఆ మాలను తీసి వాలితో పోరాటానికి ముందు సుగ్రీవుని మెడలో వేస్తాడు. అందుకే సుగ్రీవుడు వాలిపై గెలిచాడు. విజయ పరంపరను కలిగించేవాడు యోగితో సమానము.

ఉదాహరణకు తెనాలి రామకృష్ణుడు గొప్ప యోగి. అందుకనే ఆయన ఎక్కడికి వెళ్ళినా ఆయనకు విజయపరంపర ఉంటుంది. దేవి ప్రత్యక్షమై "పదార్థ వైభవమా (సంపద)? లేక పరమాత్మ వైభవమా (జ్ఞాన సంపద)?" అని అడిగితే తెలివితో రెండూ కావాలని తీసుకుంటాడు. ఆ రెండూ పుచ్చుకున్నాడు కాబట్టే

తెనాలి రామకృష్ణుడు "వైజయంతౌ" కు మంచి ఉదాహరణ. అలానే నారద మహర్షి కూడా ఈ రెండూ ఉన్నవాడు. యోగ పరంపరలో ఉన్నవారందరూ ఈ రెండిటియందు కూడా సమాన దృష్టితో ఉంటారు. సనక సనందనాదులు, సప్తర్షులు, పరమశివుడు వీరందరూ యోగీశ్వరులే, వారి ఆరాధన అందుకే చేయాలి. మన ఆరాధనలు జ్ఞానము కోసము చేసేవి కావు. అదే వుంటే ఈపాటికి మనలో కూడా సునసత్వం ఉండేది. మన జీవితంలో ఎప్పుడూ సమతూకం ఉండాలి.

*"శుక్రం, వసితం, వయంతౌ"*లలో శుక్రం అంటే తెలుపు, వసితం అంటే నలుపు, వయంతం అంటే నేత పని. అంటే తెలుపు, నలుపు నేత చేసి ఈ సృష్టిలో రాత్రి–పగలుగా, ఉత్తరాయణం–దక్షిణాయనంగా చేసి నిర్వర్తిస్తుంటారు ఈ అశ్వినీ దేవతలు.

"వివస్వతౌ" అంటే నేత పనివారు అని అర్థము. ఆదిత్య లోకంలోనున్న "Cosmic Sun"నుండి నలుపును తెలుపును దారాలుగా అల్లుకుంటూ వస్తారు ఈ అశ్వినీ దేవతలు. మనం సూర్యకాంతి అంటే "తెలుపు" అనుకుంటాం కానీ కాదు. బాగా విచారించి చూస్తే అది నలుపు–తెలుపుల కాంతి. సూర్యకాంతిలో ఏడు రంగులు ఉంటాయని అంటాము. దీనినే "ఇంద్ర ధనుస్సు" అని, "VIBGYOR" అని అంటాము. వీటిలో Indigo అంటే నలుపునీలము, అంటే కృష్ణుడి నలుపు. విద్రుమ అంటే ఎరుపు, హేమ అంటే పసుపు కాంతి. ఇదే రాత్రింబవళ్ళు, దివారాత్రాలు. సూర్యుడు అభిముఖంగా ఉంటే పగలు, మరోపక్కగా ఉంటే రాత్రి. మనము చీకటిలోనే ఉండటం మొదలుపెడితే కాసేపటికి వెలుగు

గోచరించి అన్నీ కనిపిస్తుంటాయి. అంటే అసలు కనిపించని చీకటే లేదు. చీకటికూడా కాంతియే అయినప్పటికీ, తెల్లని కాంతిని చూసి దానిని చూచేటప్పటికి అది అలా అనిపిస్తుంది. దర్శనాలు అన్నీ ఈ నల్లని కాంతిలోనే ఉంటాయి. Violet colour కూడా ఆ నలుపుకి సంబంధించినదే. నీలము కూడా అంతే. ఈ Violet, Indigo, Blue (నీలము), Green (పచ్చ), Yellow (పసుపు), Orange మరియు Red (ఎరుపు) రంగులే మనకి ఒక శ్రేణిగా దర్శనమిస్తాయి. ఈ శ్రేణిలో అన్నిటికన్నా లోతైన రంగు నలుపు. ఈ నలుపు రంగును శనిగ్రహానికి ఆపాదిస్తారు. శనిగ్రహం యిచ్చే అనుగ్రహం ఇంకొకరు యివ్వరు. మనకు తెలియనటువంటి లోతులలో శనైశ్చరుని అనుగ్రహం ఉంటుంది.

ఇలా మనకు సృష్టిలో కనపడీ–కనపడక, కదిలీ–కదలక, నలుపు–తెలుపు, పూర్ణిమ–అమావాస్య, ఉత్తరాయణము–దక్షిణాయనము, పుట్టుక–మరణము ఇవన్నీ ఒకటి వ్యక్తము, మరొకటి అవ్యక్తముగా ఉంటాయి. మనము రాత్రి అంటే శూన్యం అనుకుంటాము కానీ తెలుసుకుంటే రాత్రిలోనే అన్నీ ఉంటాయి. అందుచేత, యోగులు రాత్రిపూట మేలుకొని ఉంటారు. వారు రాత్రిపూట వేరే లోకాలలో మేలుకుని విహరిస్తూ తెలుపు–నలుపుల నేత నేస్తుంటారు. "వయంతౌ" అంటే నేత నేయుట, "వివస్వతౌ" అంటే నేసేవాడు, "తరసా సువేమ్నా" అంటే, మంచి పగ్గముతో తీరిక లేకుండా వేగముగా అధిష్ఠించి అల్లిక చేయడం అని అర్థము. ఈ విధంగా నేత జరుగుతూ ఉంటుంది.

నిజానికి సృష్టి అంతా వెలుగునీడల నేతపని. అలాంటి నేతపనిని మంచి మగ్గముపైన (సువేమ్నా) నిత్యమూ నేస్తూ ఆ అల్లికను అధిష్ఠించి వుండేవారు అశ్వినులు. రాత్రి–పగలు, కృష్ణ–శుక్ల పక్షములు, ఉత్తర–దక్షిణాయనములు, సృష్టి నిర్మాణము–లయములు, హాని–వృద్ధులు యిలా అన్నిటిని అనులోమ విలోమ మార్గాలలో నడిపించే అశ్వినులను, విజయవంతులగు అశ్వినులను, కాంతివంతులగు అశ్వినులను ఈ శ్లోకము స్తుతి చేయుచున్నది.

**మంత్రము - 3 :**

**గ్రస్తాం సుపర్ణస్య బలేన వర్తికాం**
**అముంచతా మశ్వినౌ సౌభగాయ ।**
**తావత్సువృత్తౌ అనమంత మాయయా**
**వసత్తమాగా అరుణా ఉదా వహన్ ॥**

**టీక :**

సుపర్ణస్య = సుపర్ణునియొక్క; బలేన = బలముచేత; గ్రస్తాం = మ్రింగబడిన; వర్తికాం = వత్తిని; అశ్వినౌ = ఈ అశ్వినీ దేవతలు; సౌభగాయ = సౌభాగ్యము కొరకు; అముంచతాం = విడిచిపెట్టుదురు (వెలువరింతురు) గాక!; తావత్ = ఆ మొత్తమును; సువృత్తౌ = చక్కని ప్రవర్తనము కల్గినవారు; వసత్తమాగాః = చక్కని నివాసములను పొందుచున్నవారై; అరుణాః = ఎర్రనివారై; ఉత్+ఆనహన్ = పై కెగురుచున్నవారై; మాయయా = ఆనందముతో; అనమంత = దిగువకు వంగి చరించిరి.

**తాత్పర్యము :**

సుపర్ణుని సామర్థ్యమున ఈ జీవుల ప్రవర్తన మంతయు దీపపు వత్తి కాలిపోయినట్లు నిద్రలోనికి లీనమగుచున్నది. అట్టి జీవుల ప్రవర్తనను మరల లోక సౌభాగ్యమునకై వ్యక్తము చేయువారుగా అశ్వినీ దేవతలు ప్రవర్తించుచు ఆనందముతో సద్వృత్తము గలవారై దర్శన మిచ్చుచున్నారు. జీవులకు చక్కని వసతులు కల్పించుట కొరకై ఎర్రని కిరణముల మూర్తులై పై కెగురుచు, మరల దిగువకు వంగుచు పరుగెత్తుచున్నారు.

**వివరణము :**

ఈ మంత్రము మన జీవన సారాన్నంతా వివరించే మంత్రము, అత్యద్భుతమైన మంత్రము. *"గ్రస్తాం సుపర్ణస్య బలేన వర్తికాం".* "బలేన వర్తికాం". వర్తికులు అంటే మన వృత్తులు లేదా వర్తనములు లేదా ప్రవర్తనములు అని అర్థం. అనేకానేక జన్మ పరంపరలలో ఒకే లోకంలో తిరుగుతూ ఉంటాం. ఏరోజు మనము నిద్రలేచినా భావమయలోకంలోకి ప్రవేశించి, తిరుగుతూ సాయంత్రానికి మన వర్తనములు అన్నీ అయిపోతాయి. ఎంత సేపని వర్తిస్తాము? రాత్రి అయితే బలంగా నిద్ర వస్తుంది, ఎంత హడావిడి పడినా అప్పుడు సేద తీరుతాము. *"సుపర్ణస్య బలేన గ్రస్తాం"* అంటే, వర్తికలు రాత్రికి మ్రింగివేయబడతాయి.

సుపర్ణుడు మ్రింగితేనే మనం నిద్రపోతాము. సుపర్ణుడే మనలోని స్పందన. మనలో మనోవృత్తు లన్నిటిచేతా మనం వర్తింపచేస్తుంటాం.మనం"లక్షవత్తుల"వ్రతంచేసుకుంటున్నప్పుడు వత్తులను తయారుచేసి, ఆ వత్తులన్నిటినీ తగలబెడతాము. లక్ష వత్తులుగా తిరుగుతూ వుంటుంది ఈ మనస్సు. ఈ వత్తులే మన వర్తనాలకు సంకేతాలు. యోగం అంటే *"చిత్తవృత్తి నిరోధకః"* అంటారు. ఈ వృత్తులు మనలో ఉన్నప్పుడు చాలా విశేషాలు మనలో ప్రవేశించి చాలా అనుభూతులను ఇస్తుంటాయి. సుఖ, దుఃఖ, తటస్త అనుభూతులు చాలా ఉంటాయి. అలా రకరకాల అనుభూతులు లక్ష వత్తులుగా తగలబడిపోవాలనే ఉద్దేశ్యంతో స్త్రీలకు (బహిష్టు దాటిపోయిన తరువాత) ఈ లక్షవత్తుల వ్రతాన్ని సూచిస్తారు. పురుషులకు షష్ఠిపూర్తి ఎలా ఉంటుందో, స్త్రీలకు ఈ

లక్షవత్తుల నోము ఉంటుంది. అలా లక్షవత్తులను తగలబెడతారు రాత్రిలో. వర్తి లేదా వత్తి అంటే వృత్తాకారంలో ఉండేది.

మనం నిద్రలేచిన దగ్గరనుండి ఆలోచనలే, లేవకముందు ఏ ఆలోచనా లేదు కదా. మనలో నిద్రలేవక ముందు స్పందనాత్మక చైతన్యమే ఉంటుంది. అదే ఎరుకవచ్చిన తరువాత అన్నీ విపరీతమైన అనుభూతులే ఉంటాయి. ఎవరి క్రీడలు వారికి వున్నా, ఎంతవరకూ ఆడతారు? రాత్రి నిద్ర సమయంలో ఈ వర్తనములన్నీ స్పందనలో ఇమిడిపోతాయి. వర్తనాలు అన్నీ మ్రింగివేయబడతాయి, దేనిచేత? స్పందనముచేత. సుపర్ణుడు అంటే స్పందనాత్మక చైతన్యము. నిద్ర సుఖమును ఎరుగదు, చోటును ఎరుగదు. అందుకనే నిద్ర వస్తే, మన వృత్తులన్నీ మ్రింగబడి మనం కూర్చునైనా నిద్రపోతాము. అందుకే విమానాల్లోనూ, రైళ్ళలోనూ, బస్సులలోనూ మనం కూర్చునే నిద్ర పోతాము. నిద్రించే వారికి వాడు ఎలా ఉన్నాడో, ఏ స్థితిలో ఉన్నాడో కూడా తెలియదు. నిద్ర వాడి వర్తికాలన్నింటినీ మ్రింగివేస్తుంది. అందుకే *'వర్తికాం బలేన గ్రస్తాం'* అనేది ప్రధానమైన విషయం. అంటే నిద్ర వర్తికాలను బలవంతంగా మ్రింగేస్తుంది. నిద్ర అనేది నీ వశంలో లేనిది, సుపర్ణుడి వశంలోనిది. ఆయన వదిలితేనే నీవు ఆవుదూడలా బయట ఆడుతూ వుంటావు. నిద్ర రాకపోవడం అనేది నీ దురదృష్టం. సుపర్ణుడు నీ వర్తనములు అన్నీ లోపలికి లాగేస్తాడు. నిద్ర అనేది లేకపోతే నీవు ఈ వర్తనముల నుండి బయటపడలేవు. నిద్రపోయినప్పుడు నీ స్థితి సమాధి స్థితిలా ఆనందానుభూతిని ఇస్తుంది. నిద్ర నుండి లేస్తూనే "fresh like a flower" లా ఉంటాం మనం. అదే మధ్యాహ్నానికి బాగా వాడిపోతాం. మళ్ళీ

నిద్రలోకి వెళ్ళి freshగా తయారవుతాము. ఎవరికైనా ఏ ఆటలైనా నిద్ర వచ్చే వరకే ఉంటాయి.

అమ్మవారు మనతో "మీకందరికీ నిద్రనిచ్చి సుఖానుభూతిని ఇస్తున్నది నేనే, లేకపోతే నీవు చనిపోతావు. ఎవరికి ఎప్పుడు నిద్ర రావాలో, మెలకువ కలగాలో అన్నీ నా చేతులలో ఉన్నాయి" అని చెబుతుంది. నిద్రనుండి బయటకు వచ్చి, మనం ఉన్నామనే ప్రజ్ఞ అందులోనుండి అందులోకి వెళ్ళే ప్రజ్ఞ. ఈ విషయాలన్నీ తెలిసినవారే యోగులు, ఋషులు. కోటానుకోట్ల జీవరాశులకు నిద్ర మరణమే. సుపర్ణుడు అంటే మనలో ఉన్న స్పందనే. గరుత్మంతుడు మనలో ఉన్న స్పందనే అని గుర్తించాలి. గరుత్మంతుడు తన రెండు రెక్కలతో అలా ఆకాశంలోకి వెళ్ళి ఆకాశంలో ఆ రెక్కలను ఆడించకుండా ఉండగలడు. అలా ఈ స్పందన మనలోని ప్రాణ-అపానములను లోనికి తీసుకొని వెళ్ళి సమాన ప్రాణముగా మారి, ఉదానంలోచేరి, అందులోనుండి ఊర్ధ్వముఖంగా వ్యానములోకి వెళ్ళి, అక్కడ రెక్కలు ఆడని స్థితిలో ఉంచి, సహస్రారమందు ఉత్తమోత్తమమైన సమాధి స్థితిలో ఉంచుతాడు. ఇది యోగము. ప్రతిరోజూ మన వృత్తులలోనుంచి మనల్ని తప్పించేదే నిద్ర. అందుకనే మనకు నిద్ర చాలా అవసరం. మనం నిద్రకు చాలా తపిస్తాము. నీకు నిద్ర ఎప్పుడు వస్తుందో, మళ్ళీ దాని నుండి ఎప్పుడు బయటకు వస్తావో తెలియదు. ఈ రెండూ సామాన్య మానవుని చేతులలో లేవు. అందుచేత చాలా బలవత్తరంగా సుపర్ణుడు లేపిన ప్రజ్ఞ మీకు వృత్తులనుండి మరల ముక్తిని ఇస్తుంది.

అందుకనే ఈ చిత్తవృత్తులను నిరోధించడానికి మన శ్వాసను

ఆధారంగా చేసుకోవాలి. మనం మాటిమాటికీ అనుకుంటాం కానీ ఈ ప్రయత్నము చేయము. మరపు అనేది చాలా సామాన్యం. పనికిరాని విషయాలను పట్టుకొనక, పనికి వచ్చే విషయాలను పట్టుకోవాలి మనం. అందుకనే *'గ్రస్తాం సుపర్ణస్య బలేన వర్తికాం'* అన్నారు. 'వర్తికాం' అంటే వర్తికలు అని అర్థం. లక్షవత్తుల నోములో వత్తులు కాలిపోయినట్టు నీ వర్తనములు కూడా నిద్రలోకి వెళ్ళి కాలిపోతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు మన భావాలకు లెక్క లేదు. అనేకానేక విధములుగా మనం వర్తిస్తుంటాం. దివ్యమైన భావాలు కావచ్చు, అసురీకరమైన భావాలు కావచ్చు, అవన్నీ మనకు వస్తాయి. కానీ నిద్రలో అందరూ సమానమే. ఎంతటివారైనా నిద్రలో సహజ స్థితిలో వుంటారు. ఉదాహరణకు, రావణుడు నిద్రలో ఉంటే హనుమంతుడు చూచాడట. రావణుడు అంతవరకూ స్త్రీలతో క్రీడించి నిద్రపోయాడు. కానీ హనుమంతునికి రావణుడిలో తేజస్సు కనపడింది. నిద్రలో అందరూ ఒకటే కదా?

మనం "నావాణి" చదివినప్పుడు ఒకటి కనిపిస్తుంది. మొదట గురువుగారు చెప్పినది "నిద్రపోతున్నటువంటివాణ్ణి తట్టి లేపకండి, ఎందుకంటే వాడు తెలియక అదృష్టవశాత్తు సమాధి స్థితిలో ఉన్నాడు". తెలిసి సమాధి స్థితిలో ఉండడమనేది యోగం. కానీ నిద్రలోకి వెళ్ళిన తరువాత వాడు ఎవడైనా, రావణుడైనా, హనుమంతుడైనా ఎవరైనా సరే వారిని గరుత్మంతుడు మ్రింగినట్టే. మనకు తెలియని లోకాలకు తీసుకువెళ్ళి, విహరింపచేసి, బలాన్ని చేకూర్చి, బయటకు వచ్చేటప్పుడు అశ్వినులుగా వెలుగులోనికి తెస్తారు. లోపలికి సుపర్ణుడిగాను, బయటకి అశ్వినులగాను

పనిచేస్తారు. మన కథ కూడా అదే. లేచినప్పటినుండి పనులు అని, జ్ఞాన అజ్ఞానములతో కూడి వుంటాము. ఇది జీవుల ప్రవర్తన. వీటన్నింటికీ ఎప్పుడూ నిద్రయే అంతము. ఇది అవగాహన అయితే చాలా ఆనందంగా ఉంటుంది.

నిద్రలో మనకేమి ఉన్నాయి? నిద్రలో భార్య, భర్త, భర్తకు భార్య, భార్యకు భర్త ఇలా ఉండరు. లేస్తేనే ఏదన్నా ఉంటుంది. ఇదే రహస్యం. ఏమీ లేనిది ఉన్నట్టుగా స్పష్టంగా గోచరిస్తుంది. ఉన్నది ఒకటే అయినా అన్నిరకాలుగా తయారవుతుంది. అందుకనే మనము ఉదయం లేవగానే రకరకాలైన వృత్తులలో ప్రవేశిస్తుంటాము. కానీ నిద్రలో ఇవన్నీ ఏమీ లేవని గుర్తు ఉండదు. భార్యను చూడగానే, భార్య అనిపిస్తుందే తప్ప ఈ రూపములో దేవుడున్నాడు అని అనిపించదు కదా? అలానే భర్త, కుమారులు, మిత్రులు కూడా అనిపించరు. అలా అనిపించకపోతే ఆనందం లేదు. అనిపిస్తేనే కదా ఆనందం. కొడుకో, కూతురో అనిపిస్తేనే కదా మనం వారి మీద చాలా "Invest" చేస్తాం. అలా ఒక పాతిక సంవత్సరాలకు లెక్క కడితే గుండె పేలిపోయేంత అవుతుంది. కాబట్టే ఇంకొకరికి అలా invest చేయము కదా. కలలో గోచరించు సత్యములను మనం నిజములనుకున్నా, మెలకువ రాగానే అవేవీ ఉండవు, అప్పుడు మనకు "కలే కదా" అని అనిపిస్తుంది. మంచి కల వస్తే సంతోషం, భయంకరమైన కల వస్తే బాధ వేస్తుంది. అలానే జీవితాన్ని కూడా కల అనుకోవాలి. ఈ జీవితం లోతైన కల. ఇందులో నుంచి మెలకువ వచ్చిన వారికి ఇది కూడా కలే అని అనిపిస్తుంది. ఇలా రెండు రకాల కలలు ఉంటాయి. 'కలయో

*నిజమో వైష్ణవమాయో'* అని అంటుంటారు. మనం కొన్నిసార్లు కలలో ఉండి కూడా కల కంటుంటాం.

అందుకనే శ్రీకృష్ణుడు ఉద్ధవుణ్ణి "ఉద్ధవా! కల కనుచుంటివా? ఈ కనిపించేదంతా కల, నిజము కాదు" అని తెలుపుతాడు. అదెంతో అద్భుతమైన ఘట్టం. కలలో నుండి మెలకువ వచ్చిన తరువాత కూడా అతనికి కృష్ణుడు కనిపిస్తాడు. యాదవులందరూ పోయిన తరువాత ఉద్ధవుడు మాత్రమే మిగులుతాడు. వేణుగానం వినిపిస్తే వెతుక్కుంటూ వెళ్ళి, కూర్చుని కృష్ణునితో "మన వాళ్ళందరూ వెళ్ళిపోయారా?" అని అడుగుతాడు. కానీ కృష్ణుడు "ఇది కలే, నీవు కలలోనే వెతుక్కుంటూ వచ్చావు, నా దర్శనం కూడా ఒక కలే. 'నేను మేలుకునే ఉన్నాను'– అని నీవనుకుంటున్నావే తప్ప, నీవు కలలోనే ఉన్నావు" అని అంటాడు. దానికి ఉద్ధవుడు "కలో నిజమో నేను ఇప్పుడు తర్కము చేయలేను, నాకు మీ వేణుగానాన్ని వినిపించండి. నేనేమో నిజమనుకుంటున్నాను, మీరేమో కల అంటున్నారు. నాకు ఇదే సత్యమనిపిస్తోంది. నేను నీతో వచ్చేస్తాను" అని అంటాడు. కానీ కృష్ణుడు "నీవలా రాలేవు" అంటాడు. "అలా అయితే నీ వేణుగానం వినిపించు" అని ఉద్ధవుడంటాడు. వేణుగానం ప్రారంభమైతే ఉద్ధవుడు మైమరచిపోతాడు. అప్పుడు శ్రీ కృష్ణుడు లోపలికి వెళ్ళిపోతాడు అంటే దృశ్య శరీరం వదిలేయటం జరుగుతుంది. ఉద్ధవుడు కూడా వేణుగానం వింటూ వెళ్ళిపోతాడు. ఈ ఉద్ధవునికి మళ్ళీ కృష్ణుని దర్శనం అవుతుంది కానీ, ఆ కృష్ణుడు ముందు కృష్ణుడు కాదు. అంతకు ముందు కృష్ణుడు 126 సంవత్సరాల దేహముతో ఉన్నవాడైతే, ఇప్పుడు ఈ కృష్ణుడు 5 సంవత్సరముల

బాలుడిగా దర్శనం ఇస్తాడు. అప్పుడు కృష్ణుడు "ఆ దర్శనం నీకు గుర్తున్నదా?" అని అడుగుతాడు. దాన్నే "బాలదర్శనం" అంటారు. శ్రీ కృష్ణుని దర్శనాలు 5 సంవత్సరముల బాలుడిగా, 11 మరియు 16 సంవత్సరముల బాలుడిగా మూడు స్థితులలో ఉంటాయి. "ఈ దర్శనం నీకు శాశ్వతం, అంతకుముందు జరిగినది కల, ఇదే నిజము" అని ఉద్ధవునికి తెలుపుతాడు.

ఏది కల మనకు? కలలో కలనా? నిజమే కలనా? నిద్రించడమే నిద్రా? అలా నిద్రించడమే, అంటే భగవంతునితో కూడినదే యోగవిద్య. యోగములో భాగంగా భక్తి, జ్ఞానము ఉంటాయి. ఆ జ్ఞానం వల్ల వైరాగ్యం వస్తుంది. ఆ మూడూ పరిపూర్ణమైతేనే యోగం పూర్తి అవుతుంది. భక్తి వలన కలగవలసినదే జ్ఞానవిద్య. జ్ఞానము వలన కలగవలసినదే సత్యాసత్య వివేకము. వివేకము, జ్ఞానము కలగనంతవరకూ మోహం ఉంటుంది, వర్తనాలు ఉంటాయి. ఒక నటుడు ఎంత అద్భుతంగా వేషధారణ చేసి నాటకంలో నటిస్తున్నా, తాను అది కాదు అని తెలిసే వుంటుంది. అతనికి నాటకంలో ఒక భాగమే ఉన్నది. నాటకంలోని భార్య పాత్రను తన భార్యయే అని భావించడు, అంతా నటనే. అలా భావించడం, నటించడం యథార్థం కాదు. నాటక రంగాన్ని ఈ సౌలభ్యం కోసమే ఏర్పాటు చేశారు. ఎందుకంటే, జీవితం కూడా ఒక నాటకరంగమే అని తెలియడానికి.

శ్రీరంగం అంటే ఆ కావేరీ ఒడ్డున ఉన్నది కాదు, సృష్టి రంగమే శ్రీరంగం. ఎవరు నిర్మించారు? అంటే, శ్రీ అంటే అమ్మవారు, అమ్మవారే నిర్మించారు. ఆ అమ్మవారే మనల్ని

ఇందులో ప్రవేశపెట్టారు, అలా మనం వర్తిస్తూ ఇరుక్కుపోతూ ఉంటాము. నాటకంలో అద్భుతంగా శ్రీ రాముని పాత్రను పోషించేవాడు, సీను తరువాత బయటకు వచ్చి సిగరెట్టు కాలుస్తూ వుంటాడు. అదే స్వభావము. ఇన్ని జన్మలలో నీవు ఎన్ని వేషధారణలు చేసినప్పుడు, వీటిలో నీవు నిజంగా ఏది? వేషణం, భాషణం, నర్తనం ఇలా జీవితంలో మనకు రోజూ జరుగుతూ ఉంటాయి. మనకు జరిగేదంతా ఒక కలలా లేదూ? దీని నుంచి మెలకువ రావాలంటేనే సుపర్ణుడు కావాలి. మనకుగా మనము బయటపడలేము, కాబట్టే సుపర్ణుడు "బలేన వర్తికాం" అంటే బలవంతంగా బయటకు లాగుతాడు. అప్పుడు నీ వర్తనములు తీసివేయబడతాయి. నాటకం తరువాత ఆహార్యం తీసివేయాలి కదా. వేషాలతో బయటకు వెళ్ళి తిరిగితే బాగుండదు కదా. అలా సుపర్ణుడు రాత్రి ఈ వర్తనాలను వదిలిస్తాడు. నిద్రలేవగానే మళ్ళీ అన్ని వేషధారణలూ ఉంటాయి. ఏ పరిస్థితికి సందర్భోచితంగా ఆ వేషధారణ, పాత్రపోషణ ఉంటాయి. ఇవే వర్తనములు. ఈ వర్తనములే వత్తులుగా లక్ష వత్తుల నోములో అగ్నిలో వేస్తాము. అందుకనే, సత్యహరిశ్చంద్రుడి నాటకంలోని కాటికాపరి పద్యాల ముఖ్య ఉద్దేశ్యం కూడా నీలోని వర్తనాలు కాలిపోవడమే. అలానే భగవద్గీత కూడా.

ప్రతి రాత్రి ఈ ప్రపంచము యిక లేదని పడుకొనే వాడికి అదే అలవాటు అవుతుంది. వాడు కూడ వాడికి లేడు కానీ ఉంటాడు. To realise one be an actor is a blessing because we are truly acting daily. నిజంగా సత్యశోధనం ఉండేవాడు

నటుడు అయ్యాడనుకుంటే వాడికి సత్యం సులభంగా తెలుస్తుంది. ప్రతినిత్యం రాత్రి ఇవన్నీ కలుపుకొని వచ్చి మనం మనల్ని సుపర్ణునికి సమర్పణ చేస్తే, సత్యగోచరం అయ్యి, మనం కడిగిన ముత్యంలా నిద్రలోనికి వెళ్ళి అలానే బయటకి వస్తాం. అలాంటి భావన రాత్రిపూట పడుకునేటప్పుడు ఉండాలి. ఏ భావాలతో అయితే మనం నిద్రలోకి వెళతామో, అవే భావాలతో మనం నిద్ర లేస్తాం. రాత్రి ఇవన్నీ వదిలి జీవుడుగా స్పందనాత్మకమైన, స్వయంప్రకాశమైన ప్రజ్ఞగా గుర్తించి మన స్పందనంలో మనం ప్రవేశించాలి. ఉదయం బయటికి వచ్చినప్పుడు అతడిగానే దిగివస్తాము. ఈ భావనలతోనే మనకు నిద్ర, మెలకువలు ఉండాలి. అలానే మరణించేటప్పుడు ఏ భావన అయితే ఉంటుందో, అదే భావనతోనే మరో జన్మ వస్తుంది. అందుకనే చిట్టచివరి భావన దైవాన్ని గురించి చేస్తే మరో జన్మలో అదే భావనతో వచ్చి దైవమందు భక్తి ఉంటుంది. ఇప్పుడు ఎలా జన్మించావు అనే దానికన్నా ముందు ఎలా దేహం వదిలావు అనేది ముఖ్యం. తలుపులను ఏ విధంగా మూస్తే అదే విధంగా తెరవడం జరుగుతుంది కదా. అలానే సుపర్ణుడు ఈ వర్తికలను మ్రింగేస్తాడు. అతను బలంగా లోపలికి తీసుకునివెళ్ళే స్పందనమే బయటకు తీసుకువచ్చే స్పందనం. అందుకే ఉచ్ఛ్వాస నిశ్వాసములుగా అశ్వినీ దేవతలు ఉన్నారని చెప్పారు.

"అముంచతా" అంటే బయటకి విడువబడిన, "సౌభగాయ" అంటే చక్కని అనుభూతులు అని. అంటే అలా అశ్వినులు చక్కని అనుభూతులను ఇవ్వడానికి మనల్ని ప్రపంచంలోకి ప్రవేశింపచేస్తారు. అనుభూతులను అనుభవించ

డానికి ప్రపంచంలో ప్రవేశిస్తాం అనే విద్య మనకు లేకపోవడం వల్ల పొందవలసినవి పొందలేకుండా అసంపూర్ణంగా వెళ్ళిపోతున్నాం. అందుకే మనం తిరిగి వచ్చేది సౌభాగ్యం కొరకు. అశ్వినులు మనల్ని ఉదయం మన భావనలోనికి తెస్తారు. మళ్ళీ మనం traffic jamలో ఇరుక్కున్నట్టు ఇరుక్కోనివ్వకుండా విడిపిస్తారు. అంటే మన భావపరంపరలలో మనం ఇరుక్కోకుండా, సతమతమవ్వకుండా అనుభూతిని, ఆనందాన్ని, వికాసాన్ని మనకు ఇచ్చి ఆ అనుభూతులతో బయటకు వదులుతారు. మనం అన్ని సౌకర్యాలను చేసుకుంటాం కానీ అనుభవించం. కుటుంబంలో ఎవరితోనూ మాట్లాడడానికి సమయం లేదు, అందుకని కుక్కలను, మొక్కలను పెంచుకుంటుంటాం. కుక్క కూడా ఇంటి యజమాని పరిస్థితిని గ్రహిస్తుంది. అన్నీ ఏర్పరుచుకొని అనుభూతిని చెందకుంటే అది జీవితం అవ్వదు.

వేటికీ సమయం లేనివాళ్ళు రసానుభూతిని పొందటానికే ఉదయం మేలుకోవాలి. రసానుభూతులు కలగాలని మనల్ని అశ్వినీ దేవతలు బయటకి వదులుతారు. ఈ వదిలేదే, అశ్వినీ దేవతలు ఎర్రని కాంతితో వచ్చి తూర్పున తెల్లవారగా జీవుడికి ప్రచోదనంతో మెలకువ తెస్తారు. తమస్సు ఉంటే ఆలస్యంగా లేస్తారు, లేకుంటే ముందుగా లేస్తారు. *"తెలతెలవారెను లేవండమ్మా"* అని సాగే పాట కూడా సినిమాలో ఉంది కదా. తెలతెలవారితేనే మనకు మెలకువ వస్తుంది. ఎందుకంటే ప్రాంతీయ తూర్పున కార్యక్రమం అప్పుడే మొదలౌతుంది కాబట్టి. సూర్యోదయానికి ముందు వచ్చే ఎరుపు-పసుపు కాంతులే అశ్వినీ దేవతలు. ఈరోజు సాయంత్రం

వరకు వర్తించేందుకు గతానుభూతులన్నీ అనుభూతులే కదా. అన్ని సంస్కారములలో అనుభూతులే ఉంటాయి. ఆనందం, శ్రవణం, ఆహారం, వర్తనం, భాషణం, ప్రార్థన, వీటన్నిటియందూ అనుభూతి పొంది పగలు గడుపుతూ రసానుభూతి పొందడమనేదే జీవితం.

కన్నులు, చెవులు, ముక్కు, నోరు అన్ని ఇంద్రియములలో అనుభూతి ముఖ్యం. అందుకే ఈ అనుభూతులను పొందడానికే అశ్వినులు మనల్ని ఉదయం విడిచి వెళ్తారు. 'గ్రస్తాం' అంటే లోపలికి, 'అముంచతా' అంటే బయటకి, 'సౌభగాయ' అంటే ఉదయం కాంతులతో వచ్చి మనం వర్తిస్తాం. సాయంత్రానికి మళ్ళీ ఎర్రగా మారి 'గ్రస్తాం' అని సుపర్ణుడి లోనికి వెళ్తాము. అయితే ఆయనే సాయంత్రం సుపర్ణుడు, ఉదయం అశ్వినులు. నీవు కూడా వాళ్ళ లాగే ఉదయం బయటకు వచ్చి, కార్యక్రమాలు వరుసగా ముగించి, సాయంత్రానికి తిరుగు ప్రయాణం చేయాలి. అర్ధరాత్రివరకు కార్యక్రమాలలో మునిగిపోకూడదు. సూర్యోదయానికి ముందుగా నిద్రలేవటం, సూర్యాస్తమయానికి ముందుగా కార్యక్రమాలు పరిసమాప్తి చేసుకోవటం ఆర్యుల పద్ధతి. అలా జీవితం ఏర్పాటు చేసుకోవాలని ఈ మంత్రం సూచిస్తూ వుంది. కాలక్రమాన్ని అనుసరిస్తూ కార్యక్రమాలు ఉండాలి. తెలిసినవారి జీవితం అలా ఉంటుంది. ఉదయం ప్రార్థనతో ప్రారంభించి, సాయంత్రం ప్రార్థనతో కార్యక్రమాలు పూర్తిచేసుకొనేవారు శిష్టులు. సూర్యుడు ఉదయం బ్రహ్మ తత్త్వము, మధ్యాహ్నం విష్ణు తత్త్వము, సాయంత్రం రుద్ర తత్త్వము. ఈ సత్య, వైకుంఠ, కైలాస మూడులోకాల పరతత్త్వమే మనకు నిద్ర. తెలిసినవారికి నిద్రకు

బదులు తురీయ స్థితి వుంటుంది. ఉదయానికి మళ్ళీ ఈ మూడు లోకాలు మన సృష్టి, స్థితి, లయం లాగా మనకు ప్రతి రోజూ జరుగుతుంది. గమనిస్తే ఇది అంతా సులభంగా గోచరిస్తుంది, అలా ఈ వృత్తంలో నీవు తిరుగుతూ ఉంటావు.

ఈ వృత్తి అన్నిలోకాలలోనూ ఉంటుంది. మూలమైన దానిలో తప్ప అన్నిటిలోనూ వృత్తులు ఉన్నాయి. అందుకనే అన్ని వృత్తులనూ సువృత్తులుగా చేసుకోవాలి. "*సువృత్తౌ అనమంత మాయయా*" అంటే చక్కని నివాసమును పొందుతున్నవాడు అనంతమైన ఆనందాన్ని పొందవచ్చు. ప్రతి భావమునందు మనము వసించి ఉంటాము. నివాసం అంటే ఇల్లే కాదు, నీ స్థితి కూడా. జీవునికి అతని భావమే అతని నివాసము. అంతకు ముందున్న నివాసము స్పందన. జీవుడు తన స్వస్థానమునందు ఉన్నాడు అంటే తన హృదయమునందు ఉన్నాడని అర్థము. హృదయస్థమైనవాడు స్వస్థానమునందు ఉన్నట్టు. ఉదయం నుండి సాయంకాలము వరకు భావములు ఆనందంగా, సామరస్యంగా (harmonius), అంటే భావ సామరస్యంతో జీవించాలి. సామరస్యం అంటే అందులోనుండి నీకు సమమైన భావము, రసము కూడ కలగాలి. ఉదయం సూర్యోదయం నుండి సాయంత్రం సూర్యాస్తమయం వరకు అశ్వినులు సామరస్యంగా భావనలు కలిగించి రాత్రికి సుపర్ణులుగా వెళ్తారు. అలా వాళ్ళు బయటికి వస్తే మనం బయటకి వచ్చి, వారు లోపలికి వెళ్తే లోపలికి వెళ్తాం.

అందుచేత ఉదయం మనం ఏ విధంగా నిద్ర నుంచి మేలుకొంటామో, ఆనందమయ వర్తనములలో పలువిధాలుగా

వర్తించి, సామరస్యంగా సాయంత్రం మళ్ళీ నిద్రలోకి వెళ్ళాలి. చాలా సామరస్యంగా ఉండేవారు ఉదయం చాలా తేజోవంతంగా ఉంటారు, వెలిగిపోతూ ఉంటారు. మాస్టర్ E.K. గారిని ఉదయాన్నే చూడడం ఒక అనుభూతిగా ఉండేది. ఉదయం కనబడగానే అద్భుతంగా ఉండేవారు. He has demonstrated how to live joyfully. పుణ్యపురుషులు ఆనందమయంగా ఇలా బ్రతకాలని చూపించడానికే వస్తారు. ఉదయమే ఏడుపు ముఖంతో ఉండేవారికి మాస్టరు గారు వెంటనే “Nux Vomica” అనే హోమియోపతి ఔషధాన్ని వేయించేవారు. ఉదయం మొహం చిట్లించి ఉండకూడదు. ఉదయమే ఉత్సాహంగా బయటికి రావడమనేది ఆరోగ్యవంతుల లక్షణం.

మీరు పాండురంగ మాహాత్మ్యం అనే సినిమా చూసి వుంటారు. పుండరీకుని తల్లిదండ్రులు ఉదయాన్నే లేచి కృష్ణుని పూజలు చేస్తూ ఉంటే కొడుకు, కోడలు “ప్రొద్దునే ఈ కలకలం ఏంటి? నిద్ర పాడుచేస్తూ ఏమిటి ఈ కార్యక్రమం?” అని విమర్శిస్తారు. అందుకు వారు “మీకు చిరాకుగా వుంటే మేము వెళ్ళిపోతాము” అని తల్లిదండ్రులు వెళ్ళిపోతారు. వారిని out house నుండి కూడా పంపించేస్తారు. అచట నుండి వారు అడవులకి వెళ్తారు. ఎందుకంటే, వారికి హృదయం స్వచ్ఛ భావాలతో, భక్తిభావాలతో ఉండటం అలవాటు. తమస్సు ఎక్కువగా ఉంటే ఉదయాన ఈ చిరాకులన్నీ ఉంటాయి. జీవితంలో అనుభూతిని పొందాలంటే ఈ అశ్వినులుగా ఉదయించాలి. ఎరుపు–బంగారు కాంతి అంటే సంకల్ప బలం, పసుపు–బంగారు కాంతి అంటే జ్ఞాన

బలం. ఉదయం సత్య సంకల్పం, జ్ఞానము కలవాడు తన క్రియా నిర్వహణలో సమర్థత కలిగిన వారుగా ఉంటారు. అందుకని ఇచ్ఛా జ్ఞానములు సరిగా అవతరిస్తే, క్రియ బాగా ఉంటుంది. అందుకనే రుద్రుడు, విష్ణువు తనతో ఉంటే బ్రహ్మకు సృష్టి చేయడం కష్టం కాదు. బ్రహ్మ సృష్టి అంతా ఆ వెనకాల నడిపించే వారిదే. సంకల్ప బలంగా రుద్రుడు, జ్ఞాన బలంగా విష్ణువు, క్రియా శక్తిగా బ్రహ్మ వర్తిస్తుంటారు.

మనకు ఎరుపు కాంతి, పసుపు కాంతి ఉదయం ఆకాశం నుండి దిగుతున్నాయి కదా, అందుకే ఉదయం లేవటంతోనే ఏమి చేయాలి? ఎలా చేయాలి? అనే స్థితిలో మనకు రెండూ తెలుస్తాయి. అందుకే సంకల్పశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తికి మూలం. ఉదయం ఆకాశకాంతిని "అదితి" అని, సాయంత్రం ఆకాశకాంతిని "సావిత్రి" అని అంటారు. ఉదయించేటప్పుడు అశ్వినులు అని, అస్తమించేటప్పుడు సుపర్ణులు అని ఈ మంత్రంలో తెలిపారు. ఎందుకు సుపర్ణులు అంటారు అంటే, రాత్రి నిద్రలో స్పందించేది స్పందనే కదా. ఈ వర్తనములను తీసివేసి, చక్కగా నిద్రలోకి తీసుకొని వెళ్తారు. తల్లి ఎలా అయితే తన పిల్లలకు సపర్యలు చేసి పడుకోపెడుతుందో, అలా సుపర్ణుడు మన వర్తనాలను తీసివేసి నిద్రపుచ్చుతాడు. కాబట్టి, సుపర్ణులు ఏమి చేస్తారు? అశ్వినులు ఏమి చేస్తారు? అనేది అర్థమయింది కదా! అస్తమయంలో ప్రారంభించి ఉదయానికి తీసుకొని వస్తారు. భాగవతం ప్రథమ స్కంధంలో కృష్ణ నిర్యాణము, దశమ స్కంధంలో జననము ఉంటుంది. ఏది మొదలు అంటే ముందు రోజు సాయంత్రం ఈవేళ ఉదయంలా ఉంటుంది.

సినిమాలలో కూడా "శుభం" అని తెరపడుతుంది కదా. అంటే మొదలు కూడా శుభంగా జరగాలని అర్థం. అశుభంగా ముగిస్తే తరువాత రోజు కూడా అశుభంగానే మొదలవుతుంది. అందుకని మన వాఙ్మయం ఎప్పుడూ "death to birth" విచిత్రంగా ఉంటుంది. అందరూ చావుతో మొదలుపెడతారు. భగవద్గీతలో కూడా *"వాసాంసి జీర్ణాని యథా విహాయ"* అని ఉంటుంది. అంటే ఎలా వెళ్తావో అలానే వస్తావు అని. రాత్రి ఎలా close చేస్తే, మరలా ఉదయం అలా open అవుతుంది.

ఉదాహరణకు, నీవు రాత్రి పడుకున్నపుడు పుస్తకం మూయకుండా పడుకుంటే ఉదయం అది అలానే ఉంటుంది. రాత్రి ముగించిన చోటనే మళ్ళీ ఉదయం మొదలు పెట్టాలి. ఆరంభం అనేది ఎప్పుడూ అంతం నుంచే ఉంటుంది. అంతంలోనే ఆరంభం ఉంటుంది. అదే మీనరాశికి చిహ్నం. మీనరాశి అంతం కాదు, ఆరంభమే. అందుకనే, *"గ్రస్తాం సుపర్ణస్య బలేన వర్తికాం"* అని చెప్పడం జరిగింది. *"అముంచతా మస్వినౌ సౌభగాయ తావత్సు వృత్తౌ అనమంత మాయయా":* ఆనందంగా సాయంత్రం వరకూ సువృత్తులలో తిరుగుతూ ఉండి. "వాసత్త మాగ" అంటే వృత్తులలో ఉండడం వల్ల చక్కని ఆనందం కలుగుతూ ఉంటుంది. చక్కని స్థితిని పొందుతాం. భావమే ఇల్లు. సాయంత్రంలోగా వారు మూడులోకాలనూ తిరిగి వస్తారు. అందుకనే సాయంత్రం నిద్ర పోకూడదు. సాయంత్రం ప్రదోష సమయంలో శివపూజ అందుకనే పెట్టారు. ఒకాయన తెరుస్తాడు, రెండవ ఆయన పెంచుతాడు, మూడవ ఆయన మూసేస్తాడు– సృష్టి, స్థితి, లయ

కారకులు. ఇలా తిరుగుతూ మనకు ఆనందం ఇస్తూ ఉంటారు. మనకు ఉదాహరణగా ఉంటారు. Demonstrating how to live, how beautifully to live. అలా విహరిస్తూ ఉంటారు. కొంతమందికి జీవితమంతా విహారంగా ఉంటుంది. ఆకాశ గమనం చేయడం కూడా విహరించడమే కదా? సాయంత్రానికి రెండు పిట్టలూ గూటికి చేరుతాయి. అంటే దేవుడు–జీవుడు, పరమాత్మ–ఆత్మ. ఈశ్వరుడు అక్షరపురుషుడు, మనము క్షరపురుషుడు. క్షరపురుషుణ్ణి పట్టుకొనే కదా మనం ఆనందాన్ని పొందుతాము. క్షరాక్షరులు ఉదయం నుండి సాయంత్రం వరకు సువృత్తులలో తిరిగి జీవన అనుభూతులను పొందుతారు. సాయంత్రం క్షరుణ్ణి వదిలి అక్షరుడు పురుషోత్తముడితో పెట్టుకుంటే స్పందనాత్మకమైన చైతన్యంతో అనుసంధానం చెందుతాడు. అతను ఎప్పుడూ వారితోనేగా ఉన్నాడు. అన్నతోనూ, తమ్ముడితోనూ ఉన్నట్టు. తన కొడుకుతోనూ, తండ్రితోనూ ఉన్నట్టుగా మూడు తరాలు తన తండ్రితోనూ, కొడుకుతోనూ ఉన్నట్టుగా స్వభావంతోనూ, దైవంతోనూ అనుబంధం కలిగి పనిచేసుకోవచ్చు. సుపర్ణుడు దైవంతో అనుబంధాన్ని యిస్తాడు. అశ్వినులు స్వభావంతో అనుబంధాన్ని యిచ్చి ఆనందాన్ని యిస్తారు. అశ్వినీ దేవతల స్తోత్రములో మూడవ మంత్రము ఇలా ఆవిష్కరింపబడుతుంది.

ఈ మంత్రములో అశ్వినులు పురోగమనమునకు, సుపర్ణులు తిరోగమనమునకు ప్రతీకలు. ఆత్మ సాధకులు తమలోని సుపర్ణుని (అంటే హృదయ స్పందనమును) ఆశ్రయించాలి. శ్వాసయందు మనస్సు నిలిపి స్పందనము చేరాలి. స్పందనమునుండి సూక్ష్మ

స్పందనము చేరాలి. సూక్ష్మ స్పందనము మన ప్రజ్ఞకు ఊర్ధ్వగతి కలిగించి మనయందలి ఆజ్ఞా కేంద్రమునకు ప్రజ్ఞను చేరుస్తుంది. అప్పుటే ఆత్మదర్శనం జరుగుతుంది. అటుపైన ధ్యానం ద్వారా సహస్రారం చేరితే సమాధి స్థితి లభిస్తుంది. సుపర్ణుడు అలా మనలను పరమాత్మలో విలీనం చేయగల అద్భుతమగు ప్రజ్ఞ. భారతంలోని 'గరుడోపాఖ్యానం'లో ఈ వివరం చాలా ఉన్నది. జీవాత్మ–పరమాత్మల అనుసంధానం గావించగల దివ్యప్రజ్ఞగా సుపర్ణుని భావించాలి.

**మంత్రము - 4 :**

**షష్టిశ్చగావః త్రిశతశ్చ ధేనవః**
**ఏకం వత్సం సువతీతం దుహంతి ।**
**నానాగోష్ఠా విహితా ఏకదోహనాః**
**తా వశ్వినౌ దుహతో ఘర్మ ముక్థ్యమ్ ॥**

**టీక :**

షష్టిః = అరువది; గావః+చ = గోవులును; త్రిశతః = మూడువందలు; ధేనవః+చ = ధేనువులును; ఏకం వత్సం = ఒక దూడను; సువతే = ప్రసవించుచున్నవి; తం = దానిని (దానికి); దుహంతి = పాలిచ్చుచున్నవి; నానా గోష్ఠాః = అనేక గొడ్లపాకలు కలవి; విహితాః = తీర్చిదిద్దబడినవి; ఏకదోహనాః = ఒకే పొదుగు కలిగి యున్నవి; తౌ+అశ్వినౌ = ఆ యిద్దరు అశ్వినులును; ఘర్మం = సూర్యరశ్మిని; ఉక్థ్యం = ఆహారముగా; దుహతః = పిండుచున్నారు.

**తాత్పర్యము :**

మూడు వందల అరువది గోవులు, ఒకే దూడను ప్రసవించి పాలిచ్చుచున్నవి. అశ్వినీదేవతలు ఆ గోవులను అనేక గోష్ఠముల యందు గుంపులుగా తీర్చి ఒకే పొదుగు నేర్పరచి ఎండ వేడిమిని ఆహారముగా పిండుచున్నారు.

**వివరణము :**

ఒక శ్లోకం కన్నా మరొక శ్లోకం లోతైన అవగాహన కలిగి ఉన్నట్టుగా, అలా మనం ముందుకు సాగుతున్నట్టుగా గోచరిస్తుంది. ఈ మంత్రము చాలా గంభీరమైన సత్యముతో ఆవిష్కరింపబడి ఉన్నది. దానిని వీలైనంత సులువుగా అర్థం అయ్యేట్టుగా ప్రయత్నిద్దాం. "షష్టిశ్చ గావః" అంటే అరవై గోవులు అని అర్థం. 'గావః' అంటే గోవులు. "త్రిశతశ్చ ధేనవః" అంటే మూడువందల ధేనువులు. ఇక్కడ ఆవులని ఒకచోట, ధేనువులని మరొకచోట అన్నారు. ఈ రెండు పదాలూ గోవులయొక్క రెండు విశిష్ట లక్షణాలను వివరిస్తాయి. దీనిని అర్థం చేసుకుందాం. "వత్సం" అంటే దూడ అని, "దుహంతి" అంటే దానికోసం పితుకుతారట అని అర్థం. అంటే ఒక దూడకోసం ఈ మూడువందల అరవై ఆవులనూ పితకటం. ఎలా పితుకుతారు? "నానా గోష్ఠా" అంటే 360 గోవులనూ రోజూ ఒక చోట పితుకుతారట. ఒక్కొక్క రోజు ఒక్కొక్క చోట, ఒక్కొక్క వారము, పక్షం, నెల ఒక చోట పితుకుట. "విహితా ఏక దోహనాః" అంటే 360 ఆవులకు ఒకటే పొదుగు ఉందట. అది ఎలా? ఇది ఎంతో సంకేతార్థంతో చెప్పబడింది. ఇది నిరుక్త శాస్త్రము. జ్యోతిష శాస్త్రం బాగా అర్థం చేసుకుంటేనేగానీ దీనిని అర్థం చేసుకోవడం వీలు పడదు. మనం మంత్రానికి ఒకరోజు చొప్పున చెప్పుకుపోవచ్చు, అది కూడా స్థూలంగా చెప్పుకుంటే. ఇలా ఒక్కొక్క మంత్రానికి ఇంత అర్థం అయితే మరి పన్నెండు మంత్రాలకు ఎంత సమయం కావాలి? పైగా సంక్షిప్తంగా చెప్పుకోవాలి. దీనినే seed form అంటారు. మనలో ఆ విత్తనం

నానబెట్టుకుంటే అది మెల్లగా ఒక మహావృక్షం లాగా వృద్ధి చెందుతుంది. విత్తనంలో మనకు ఏమీ కనిపించదు, కానీ దానిలో ఎంతో ఉంటుంది. పది మఱ్ఱి విత్తనాలో, రావి విత్తనాలో మనం జేబులో వేసుకొని తిరగవచ్చు. కానీ అలా వృక్షాలను వేసుకోలేము కదా! అందుకనే బీజప్రాయంగా, సూక్ష్మీకరించుకొని అర్థం చేసుకోవాలి. అంటే ఈరోజుల్లో పెద్ద పుస్తకాన్ని కూడా ఒక చిన్న memory card లో ఇచ్చినట్టు.

ఒక విత్తనం వేస్తే ఒక వృక్షమై దానిలో ఎన్నో వివరాలు ఉంటాయి. మొదలు, కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పూవులు, కాయలు ఇలా చాలా ఉంటాయి. మనం అలా వివరాలలో ఉన్న ఆ భావాన్ని ధరించి, మనలో దాన్ని పెంపొందించుకోవటం అనేది జరిగినప్పుడే నిజమైన వికాసం కలుగుతుంది. జ్ఞానమంటే మనం ready made గా ఏర్పాటుచేసుకునేది కాదు. ఉదాహరణకు, మనం ఒక పిల్లను తెచ్చి పెంచుకోవడం వేరు, మనలో పుట్టి పెరుగుతున్న శిశువుని పెంచుకోవడం వేరు. తాముగా జ్ఞానబోధ ఏర్పాటు చేసుకోవడం వేరు, తమలో జ్ఞానం పెంపొందించుకొని వికాసం చెందడం వేరు. అందుచేత వేరు వేరు ఋషులు ఒకే సత్యాన్ని అనేక రకాలుగా, ఒక్కొక్క ఋషికి ఒక్కొక్క విధంగా కనిపించినట్టుగా చెప్పారు. ఇవే అశ్వినీ సూక్తాలు మరోచోట మరో రకంగా వస్తాయని చెబుతారు. అంటే ప్రధానమైన సూక్తం అదే ఉన్నా వివరములు అనేక రకాలుగా ఉంటాయి. నలుగురూ నాలుగు రకాలుగా రాస్తారు కదా! అలాగే మనలోని విత్తనం పండి, విచ్చుకునేట్టుగా ఋషులు రాస్తారు. దానియందు శ్రద్ధ,

భక్తి ఉండాలి. ఆరాధన దృష్టి వుండి ధరించాలి. ధరిస్తే, ఆ విత్తనం మనలో మొలకెత్తడం మొదలు పెడితే అందులోని విశేషాలు, విషయాలు మనకు చాలా అవగతమౌతాయి. ముందు 60 గోవులు, తరువాత 300 ధేనువులు, ఒకటే దూడ, దానికోసం పాలుపితకడం, అది కూడా 360 ఆవులకూ ఒకటే పొదుగు ద్వారా పితకడమట! ఆ పొదుగునుండి, ఒక్కొక్కసారి ఒక్కొక్క గోష్ఠంలో పిండుతూ ఈ దూడను పోషిస్తూ ఉన్నారు. ఈ కార్యక్రమం అశ్వినీ దేవతలు చేస్తున్నారు. ఇది అర్థం కావాలంటే దానిని గూర్చి మనం బాగా అవగాహన చేసుకోవాలి. క్లుప్తంగా చెప్పాలంటే గోవులంటే, ధేనువులంటే తెలియాలి. మొత్తం సృష్టి అంతాకూడా భగవంతుని ఒక శ్వాస, ఒక నిశ్వాస నుండి సృష్టి వస్తుంది, ఒక ఉచ్ఛ్వాసతో మళ్ళీ తిరిగి లయమవుతుంది. One breath అంటారు. భగవంతుని ఒక శ్వాస ఈ సృష్టి పుట్టడం, పెరగడం, లయమవడం అంటే వృద్ధి, తిరోధానం, ప్రళయంలోకి వెళ్ళడం.

దాని వివరం కావాలంటే మనకు Madam Blavatsky గారి 'The Secret Doctrine' లో The fiery breath of God అని దొరుకుతుంది. సృష్టికి నిశ్వాస, లయానికి ఉచ్ఛ్వాస. మనము నిశ్వాస ద్వారా వెళ్ళిపోతాం, మళ్ళీ ఉచ్ఛ్వాస ద్వారా వస్తాం. కానీ భగవంతుని శ్వాస దీనికి విరుద్ధంగా ఉంటుంది. ఆయన నిశ్వాస ద్వారా అందరూ వస్తారు, జీవులూ, ఏడు లోకాలూ వస్తాయి. The law of alternation, అది ప్రతిదానిలోనూ కనిపిస్తూ ఉంటుంది. ఇంతపెద్ద భూమికి పురోగమనము, తిరోగమనము ఉంది. సూర్యమండలానికీ ఉంది. ఆ శ్వాసలోని

పరిధిలో వారి వారి శ్వాసలు ఉన్నాయి. అలాగే చీమ నుండి ఏనుగు వరకు వాటి పరిధిలో శ్వాసలు ఉంటాయి. పక్షులకు, జంతువులకు, వాటిని బట్టి సృష్టి, వృద్ధి, నశించడం ఉంటుంది. అందుకనే *"పంచకృత్య పరాయణా"* అని అమ్మవారిని పొగడుతూ ఉంటాము. పుట్టటం, పెరగటం, వృద్ధి, తిరోగమనం, అదృశ్యం. ఈ పంచకృత్యాలు ప్రకృతిలో నిర్వర్తింపబడతాయి. సృష్టి అంతటికీ– చిన్న జీవినుండి విరాట్పురుషుని వరకు ఈ క్రియ జరుగుతుంది. ఇది వృత్తాకారంగా జరుగుతూ ఉంటుంది. ఈ పరివర్తనలను జరిపించేవారు అశ్వినీ దేవతలు. అన్నీ జన్మించి, వృద్ధి చెంది, తరువాత అదృశ్యం అయిపోతాయి. మనకు ఒక సంవత్సరం అనేది కూడా ఒక వృత్తమే కదా. కన్ను మూయడం– తెరవడం నుంచి సృష్టి లయము, జననము వరకు సృష్టి చక్రాన్ని నిర్వర్తించేవారు అశ్వినీ దేవతలు.

సంవత్సరాన్ని పరిశీలిస్తే ఒక ఉత్తరాయణం, ఒక దక్షిణాయనం ఇలా జరుగుతూ ఉంటాయి కదా. ఉత్తరాయణం అంటే ఇక్కడున్న జలములన్నీ గ్రీష్మ ఋతువులో ఊర్ధ్వముఖంగా వెళ్ళడం, దక్షిణాయనంలో వర్ష ఋతువులో మళ్ళీ మంచి నీరుగా దిగిరావడం జరుగుతుంది. ఇది మనకు తెలిసిన విషయమే. ఉప్పునీరును తీసుకొని మంచినీరును ఇచ్చేవే ధేనువులు. ఇక్కడే నీరు త్రాగి, పాలుగా మార్చి యిచ్చేవి గోవులు. ఆవులు, గోవులు ఉప్పునీరును త్రాగవుగా. ఉప్పునీరును త్రాగి మంచినీరుగా ఇచ్చేవి ధేనువులు. నీరుకన్నా పాలు ఎక్కువ పోషక పదార్థం కదా. ఇలా మనకు ఉన్నదానిని పోషించి, బలమైన దానిని ఇచ్చే ప్రజ్ఞ ఒకటి

ఉంది. భూమి మీద 70 శాతం ఉప్పునీరే ఉంది, 30 శాతము మాత్రమే భూమి. అందులో కొంత నీరు కూడా ఉంది. ఆవిరి ఉప్పు నీటిని పైకి తీసుకొని వెళ్ళి మంచినీరుగా వర్షించి, నదులు, తటాకములు నిండి మనకు సహకరిస్తాయి. వీటినే సంస్కృతంలో "గౌ" అంటారు. *'గచ్ఛతి ఇతి గౌ'* అని మాస్టర్ E.K. గారు మనకు తెలిపారు. అంటే కదులుతూ ఉంటుంది అని. అందుకనే ఆవును గోష్ఠములో కట్టివేయకు అంటారు. అలా మేపుకుంటూ రావాలి. అనాదినుండి కూడా ఆవును అలా ఉదయం తీసుకుని వెళ్ళి మళ్ళీ సాయంత్రం ఇంటికి తీసుకొని వస్తారు. ఇదే పద్ధతి. అలా తిరుగుతూ, మేస్తూ, పాలు ఇచ్చేవి. నీరు త్రాగుతూ పచ్చిక మేస్తూ ఉంటాయి.

వేదమును విన్నా కూడా మంచిదే. మన గృహాలలో వినడం జరిగితే, ఈ వేద పఠనం మన పరిసరాలన్నిటినీ పరిశుభ్రం చేస్తుంది. పరివర్తనం కలుగుతుంది. అలా ఆవులు కూడా పరివర్తనం కలిగిస్తాయి. ధేనువులు మరొక రకంగా పరివర్తన కలిగిస్తాయి. ధేనువులు అంటే మార్పు తీసుకొని వచ్చే సూర్య కిరణాలు. అవి సముద్రములోని నీటిని గ్రహించి ఆకాశంలోకి తీసుకెళ్ళి, ఆ నీరు నిర్మలంగా చేయబడి తిరిగి వర్షంగా పడినప్పుడు మనకు స్వచ్ఛమైన నీరు వస్తుంది. ఆ కిరణాలను కూడా గోవులు, ధేనువులు అంటారు. *'గచ్ఛతి ఇతి గౌ'* – అంటే తిరుగుతూ ఉండేవన్నీ కూడా గోవులే. అలానే గ్రహాలన్నీ కూడా ఎప్పుడూ తిరుగుతూ ఉంటాయి. కాబట్టి ఇవి కూడా గోవులే. అవి తిరుగుతూ కిరణముల ద్వారా పరివర్తనం చెందిస్తుంటాయి. రాహుకేతువులు

మొదలగు వారందరూ అదే పనిలో ఉంటారు. అవి పని యజ్ఞార్థం చేస్తుంటాయి, తిరుగుతూ తమ కిరణముల ద్వారా మన ప్రజ్ఞకు పరివర్తనం కలిగిస్తూ ఉంటాయి. గ్రహాలలో కూడా కిరణాలు ఉంటాయి కాబట్టి, వాటిని కూడా గోవులు అని అంటారు. వాటి సంచారమే గోచారము. “గోచారములో శని వచ్చాడు” అంటారు. అంటే శని గోచారములో నేర్చుకోవలసినవన్నీ మనకు నేర్పుతాడు. గోచారములో బృహస్పతి వస్తే అనుభవించేవి ఉంటాయి, శుక్రుడు వస్తే అనుభవించే అనుభూతులూ ఉంటాయి. నేర్చుకుంటే ఒకరకమైన, నేర్చుకోకపోతే ఇంకొక రకమైన అనుభూతులు ఉంటాయి. గ్రహాలు గోవులే, కిరణాలూ గోవులే, మనం చూచే ఆవులూ గోవులే. అలాగే అదే రీతిగా తిరుగుతూ ఉంది కాన, మన భూమి కూడా ఒక గోవే.

ఫలవృక్షములలో రసం ప్రవహించేవన్నీ గోవులే. గ్రహాలు, అవి తిరుగుతూ మనకు కావల్సిన ఋతువులను ఏర్పరచి పరివర్తనం అందిస్తుంటాయి. ఈ ఋతువుల కారణంగానే మనకు పంటలు, ఆహారం, సదుపాయాలు కలుగుతున్నాయి. అలా మనలో స్రవించేవి అన్నీ గోవులే. మంచినీరుగా తీసుకొని వచ్చే ధేనువులూ గోవులే, మనలో ఉన్న గ్రంథులూ గోవులే. మనకు రుచికరమైన ఆహారం కనిపించినంతనే నోటిలో లాలాజలము ఊరుతుంది కదా. అలా స్రవించేవి గోవులు. అలాగే కొన్ని రమ్యమైన దృశ్యములను చూచినపుడు కళ్ళు స్రవిస్తాయి, అవి కూడా గోవులే. మంచి వాసన వస్తే ముక్కులే స్రవిస్తాయి కదా, అవి కూడా గోవులే. మనకు బాహ్యంగా ఉన్న ఐదు ఇంద్రియములూ గోవులే. ఇలా

స్రవించేవన్నీ గోవులే. అంతరంగంలో సప్త కేంద్రాలలోనూ గోవులే ఉన్నాయి. ఇవన్నీ 'దత్తాత్రేయ' పుస్తకములో ఇవ్వడం జరిగింది. ఆ పుస్తకములో ఆవు అంటే ఏమిటో సవివరముగా ఇవ్వడం జరిగింది. మనకు ఆవు అంటే కనిపించి పాలిచ్చేదే కాదు. సృష్టి దృష్టిలో స్రవించి ఆనందాన్నిచ్చేవన్నీ గోవులే. స్రవించనివి ఆనందించలేవు. ఫలాలలో జామపండు గట్టిగా ఉంటే ఆనందించం కదా. అలాంటి అనుభూతులు చాలానే ఉంటాయి. రుచిని అందించి, మనల్ని స్రవింపచేసేవే గోవులు. మనకి పాలలో ఏముండాలో కలిపి ఇస్తారు. శాస్త్రోక్తంగా చూస్తే తెలుస్తుంది. రకరకాల పాలు దొరుకుతున్నాయి. మనం పాలనుకొని త్రాగేవి పాలు కాదు. రస స్వరూపముగా వెలికివచ్చి ఆనందింపచేసేవి అన్నీ గోవులే. అందుకే ఈ సూర్యకిరణములు గోవులు, గ్రహములు గోవులు, మనలోని సప్తగ్రంథులు గోవులు, మనకు ఇంద్రియజ్ఞానమునిచ్చే అన్ని ఇంద్రియములు కూడా గోవులే.

నీవు మంచి సంగీతం వింటూ ఉంటే రససిద్ధి కలుగుతుంది. అలానే భక్తిరస ఘట్టమును చూసినప్పుడు తన్మయత్వం చెందుతావు. ముఖ్యంగా ఈ రసానుభూతులను యిచ్చేవన్నీ గోవులు అని చెప్పబడుతుంది. ఈ రసానుభూతి వల్లనే మనలో మార్పురావడం జరుగుతుంది. రసానుభూతి కలిగే కొద్దీ మనలో ముందుకన్నా మంచి పరివర్తన కలుగుతుంది. మంచి ప్రవచనం, ఆరాధన, భజన చేసినా, సంగీతం విన్నా, మంచి కార్యక్రమాన్ని టీవీలో చూసినా మనలో రసవికాసం వస్తుంది. ఆ వికాసాన్ని కలిగించేది గోవు. గోవును 'గౌ' అంటారు. అదే గౌ ఆంగ్లంలో "Cow" గా

అయ్యింది. గోవులో 'గ', 'అ' ఉన్నాయి. అలానే మనం *"గం గణపతయే నమః"* అన్నప్పుడు, 'గ' అంటే గమనము, 'గం' అంటే జూపిటర్ అంటే బృహస్పతి. 'అ', 'ఉ' కలిపితే గుణసంధి వల్ల 'ఓ' వస్తుంది. ఈ 'ఓ' శబ్దము సూర్యునికి సంబంధించినది. అంటే 'గౌ' శబ్దములో బృహస్పతి, సూర్యుడు ఇద్దరూ ఉన్నారు. అంటే ఒకటి గురువు, మరొకటి జీవచైతన్యము. ఒకటి సహస్రార ప్రజ్ఞ, మరొకటి ఆజ్ఞా ప్రజ్ఞ. ఆవును గూర్చి తెలుసుకుంటే ఎలా ఈ వివరాలన్నీ వచ్చాయో గమనించండి. మనం ఆవును గూర్చి వ్యాసం రాస్తే సహజంగానే ఈ విషయాలన్నీ రాయాలి. సహస్రార ప్రజ్ఞ, ఆజ్ఞా ప్రజ్ఞల భావము మనకు ఈ గోవులో కనిపిస్తుంది. దీనిని పెద్దలు దర్శించారు. ఎందుకని? అది స్రవిస్తే ఎలాంటి అనుభూతి వస్తుందో దానియొక్క దర్శనము, దానియొక్క ప్రదక్షిణము అలా సంక్రమిస్తాయి.

ఈ మధ్య అందరికీ ఒక సందేశం పంపించడం జరిగింది. మంచి మూపురం ఉన్న ఎద్దు చుట్టూ ప్రదక్షిణం చేస్తే మీయొక్క aura పెరుగుతుందని వారం క్రిందటే తెలియచేయడం జరిగింది. అది శాస్త్రీయంగానూ నిరూపించబడింది. మనవద్ద aura కొలిచే పరికరాలు ఉన్నాయి కదా? మనపై ప్రభావం ఎంత మేరకు ఉంటుందని తెలియడానికి. మూపురం ఉన్న ఒక ఎద్దు, ఒక ఆవు చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేస్తే అంత ఎక్కువ aura మనకు సంక్రమిస్తుందని నిర్ధారించడం జరిగింది. Aura ఎంత పెరిగిందని ఎవరు చెప్పగలరు అంటే ఋషితుల్యులే చెప్పగలరు.

తిరిగి మన కథకు వస్తే, ఇక్కడ ఈ గోవులు, ధేనువులు

360 ఉన్నాయి అన్నారు. అందు 60 గోవులు, 300 ధేనువులని తెలుపబడ్డాయి. 60 గోవులు వర్ష ఋతువుకు సంబంధించిన 60 రోజుల కిరణములు. అవి వర్షింపచేస్తాయి. మిగతా 300 ధేనువులు అనేకానేక సంపదల నిచ్చు కిరణములు. ఆరు ఋతువులలో వర్ష ఋతువు గోవులుగాను, మిగిలిన ఐదు ఋతువులు ధేనువులుగాను కీర్తించారు. 60 రోజుల వర్షం 300 రోజులలో భూమిపై అనేకానేక సంపదలు ఏర్పరుస్తుంది. అవియే గోవులు, ధేనువులు. వర్షము ఒక రకమగు సంపద. వర్షపు నీరు ఆధారముగా అనేకములగు సంపదలు. ఒక దూడ కోసం అంటే భూమికోసం ఈ 60 గోవులు, 300 ధేనువులు సహకారం అందిస్తున్నాయి. ఇన్ని గోవులు, ధేనువులకు ఒకే పొదుగు. అది సూర్యుడు. అలా సూర్యుడనే పొదుగు నుండి 300 + 60 డిగ్రీల ద్వారా అనంతమగు సంపద భూమి అనే దూడకోసం అశ్వినులు పిండుతున్నారు.

వృత్తములోని డిగ్రీలు కూడా 360 అని చెప్పుకుంటాం. డిగ్రీ అంటే కోణము అని అర్థము. సూర్యుని చుట్టూ 360 కోణాలు గోచరిస్తాయి. నిజానికి బిందువు అంటే వృత్తమే కదా. మనం ఒక బిందువు పెడితే అది వృత్తాకారంగా, గుండ్రంగా ఉంటుంది కదా. గుండ్రంగా ఉంటే 360 కోణాలు ఉన్నట్టే. 360 డిగ్రీలు ఉంటే 360 సాధ్యులు ఉన్నట్టే. అంటే 360 potential manifestations అవతరించితే వాటినే సిద్ధులు అంటారు, దేవతలంటారు. *"యత్ర పూర్వే సాధ్యాస్సంతిదేవాః"* అంటాము కదా. దానిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. సాధ్యులు అంటే అవతరించక ఉన్న శక్తివంతమైన ప్రజ్ఞలు. వాటిని అవతరింప చేసుకుంటే

నీవు మహాశక్తివంతుడవు అవుతావు. నీవు కూడా బిందువే, నీవు కేంద్రంగా 360 డిగ్రీలు ఉన్నాయి. నీకన్నా పెద్ద కేంద్రం చుట్టూ నీవు తిరుగుతూ ఉంటావు. మొత్తం సౌరమండలానికి కేంద్రమైన ఆ సూర్యుడు సవితృని చుట్టూ తిరుగుతూ ఉంటాడు. సవితృమూర్తి ఆదిత్యుని చుట్టూ తిరుగుతూ ఉంటాడు. అందుకని మనకు మొట్ట మొదట Cosmic Sun, దాని చుట్టూ 360 డిగ్రీలు, అలా ఏ కేంద్రానికైనా 360 కోణాలు ఉంటాయి.

ఒక కేంద్రానికి అదృశ్యంగా శక్తులు ఉంటాయి. మనం నుదుటిపై బొట్టు పెట్టుకుంటే దానిచుట్టూ కూడా 360 కోణాలు అదృశ్యంగానే ఉంటాయి. అవతరింపచేసుకోవడానికి సాధన ఉంటుంది. అలా అవతరింపచేయగలిగిన వారే ఋషులు. వారు యజ్ఞం చేసి ఈ సాధ్యులను అవతరింపచేస్తారు. అప్పుడు angles, angels అవుతాయి. Angles are none other than angels. Geometry చదువుకున్నవారు రకరకాల కోణాలలో రకరకాల ప్రజ్ఞల అవతరణాలు ఉన్నట్టు గుర్తిస్తారు. అలా రేఖాశాస్త్రంలో ఒక్కో కోణానికి ఒక్కో రకమైన అవతారిక ఉంటుంది. అందుచేతనే angles are angels, అంటే సాధ్యులు, సిద్ధులు. ఒక బిందువునుండి ఏర్పడిన 360 ప్రజ్ఞలు మరొక బిందువును గుర్తింపచేస్తాయి, ఒక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తాయి. అలా ఆదిత్యుని నుండి సవితృమూర్తి ఏర్పడతాడు. సవితృమూర్తి నుండి సూర్యమూర్తి కేంద్రం ఏర్పడుతుంది. అదే ఆధారంగా సూర్యమండలం, దాని పర్యవసానంగానే భూమి ఏర్పడుతుంది. ఎక్కడైనా 360 కోణాలే, అనగా 360 గోవులు అన్ని లోకాలలోనూ

ఉన్నాయని తెలిసింది. వాటి కిరణాలు మనకు అందించి మళ్ళీ పట్టుకుపోతూ ఉంటాయి. ఈ కథ మనకు సృష్టిలోని కథ. ఇలా ఒక కేంద్రం నుండి మరో కేంద్రం పుట్టుకునివచ్చి అన్ని కేంద్రాలూ పుట్టుకు వస్తాయి. అలా మనమందరమూ ఆ విరాట్పురుషుని నుండే పుట్టుకు వచ్చాము. మనలో నుండి వచ్చే వాళ్ళు మనవాళ్ళు. మానవ గర్భంలో నుండి మానవులే వస్తారు.

*"యత్రపూర్వేసాధ్యాస్సంతిదేవాః, యజ్ఞేన యజ్ఞమయజంత దేవాః, తానిధర్మాణి ప్రథమాన్యాసన్"* అని మంత్రం ఉంది. దానిని బాగా అర్థం చేసుకోవాలి. మొత్తం సృష్టి అంతా పురుష సూక్తం లోనే ఉంది. యజ్ఞంలో నుండి యజ్ఞం పుట్టుకుని వస్తుంది. అలానే ఏర్పాటు చేశారు ఋషులు. ఆదిత్యునిలో నుండి వచ్చే సవితృమూర్తికి ఆ మూలంలోని కిరణాలే గోవులు. అక్కడనుండి సూర్యమూర్తికి, అక్కడ నుండి మనకు అలా నాలుగు రీతులలో గోవులు, ధేనువులు మనలను స్పృశిస్తూ ఉన్నాయి. ఆదిత్యుడు–సవితృడు–సూర్యుడు–మనం. ఈ ప్రజ్ఞలనే కుమార ప్రజ్ఞలు అంటారు. ఇలా నాలుగుగా ఉన్నవారిని సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాత ప్రజ్ఞ లంటారు. ఉదాహరణకు శ్రీరాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు నలుగురు, పంచపాండవులలో కవలలైన నకుల–సహదేవులను ఒకటిగా చూసినప్పుడు, వారు కూడా నలుగురే. అదే నాలుగు వేదాలు, నాలుగు యుగాలు, అలా నాలుగు నాలుగుగా వస్తూ ఉంటాయి. అందుకనే అన్నిటినీ పట్టుకొచ్చి అన్నిటినీ పట్టుకు పోతారు. ఇప్పుడు ఒక కేంద్రం ఏర్పాటు చేస్తే, ఆ కేంద్రం నుండి 360 గోవులు అంటే కోణాలు, కిరణాలు ఏర్పడి ఆ గోవును

పిండుతాయి. ఆ కేంద్రాన్ని పిండితే అందులోనుండి అలాంటివే మళ్ళీ దిగివస్తాయి. సవితృమూర్తిలో ఉన్న 360 ప్రజ్ఞలను పిండితే అందులోనుండి సూర్యమూర్తి వస్తాడు. సూర్యమూర్తిలో ఉన్న 360 ప్రజ్ఞలను పిండితే అందులోనుండి మనం వస్తాము. కాబట్టి, ఒకటే పొదుగు. సూర్యుడివంటిదే సూర్యమండలం. 360 గోవులకూ ఒకటే పొదుగు– అదే సూర్యమూర్తి. ఆయనే ఆవు, ఆయన్నే పిండడం జరుగుతుంది. అది కూడా ఒక్కొక్క చోట పిండుతారట. ద్వాదశ ఆదిత్యులు పన్నెండు మాసాలు, పన్నెండు గోష్ఠములు. పన్నెండు గోష్ఠములను పిండితే, పన్నెండు మాసములలోనూ, ఒక్కొక్క మాసములో ఒక్కొక్క రకంగా ఆ పాల రుచులు, అంటే కిరణాలు ఉంటాయి.

పన్నెండు మాసాలు, పన్నెండు రకాలు అంటే పన్నెండు రాశుల యొక్క స్వభావములు తెలుసుకోవచ్చు. మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, సింహం ఎలా ఉంటాయి అని తెలుసుకోవచ్చు. అలా అశ్వినీ దేవతలు ఈ ఆవులను పన్నెండు రాశులలో తిప్పుతూ, పిండుతూ ఉంటారు. వారు మన కోసం, ఈ భూమి కోసం పిండుతూ ఉంటారు. సంవత్సరం పొడవునా అలా పిండుతూ ఉంటే ఈ భూమికి రకరకాలైన పోషక పదార్థాలు ఏర్పడుతూ ఉంటాయి. ఇవన్నీ భూమి మన కోసం ఇస్తుంది. ఎంత కాలం పిండుతారు అంటే కొంత కాలం తరువాత తిరోగమనం ఉంటుంది. ప్రతి పురోగమనానికి తిరోగమనము వుంటుంది, అంటే అలా పట్టుకొచ్చి ఇలా పట్టుకుపోతారు. ఇదే ఒక చిన్న వృత్తం నుండి అత్యంత బ్రహ్మాండమైన మొత్తం సృష్టి చక్రం వరకూ

వ్యాపించి వుంటుంది. ఒక రోజులో ఒక పగలు–ఒక రాత్రి ఒక చిన్న చక్రం. అశ్వినీ దేవతలు మనకు ఉదయం నుండి ఆనందకరమైన అనుభూతులను ఇస్తారు. తరువాత సుపర్ణులు వచ్చి మనల్ని ఎత్తుకుపోతారు. మళ్ళీ మరునాడు నిద్ర లేస్తే ఒక పగలు–ఒక రాత్రి వృత్తం ముగుస్తుంది. అలానే ఒక వారంలో మధ్యస్తం అంటే బుధవారం నుండి మార్పు వస్తుంది. అష్టమి అందరికీ తెలుసు. ఒక పక్షానికి అష్టమి పురోగమనం తెచ్చి మరొక పక్షంలో తిరోగమనం తెస్తుంది. ఒక రోజులో రాత్రి–పగలు, ఒక వారములో మధ్యస్తం నుండి, ఒక పక్షములో అష్టమి నుండి పురోగమనం మరియు తిరోగమనం ఉంటాయి.

ఒక జీవితంలో 86 సంవత్సరాలు తీసుకుంటే, 42 ఏళ్ళ వరకు పురోగమనం ఆ తరువాత తిరోగమనం ఉంటాయి. ఈ పురోగమన–తిరోగమనాలు చిన్న కాలచక్రం నుండి పెద్ద బ్రహ్మాండ కాలచక్రం వరకూ నిరంతరం జరుగుతూ ఉంటాయి. అది నిర్ధారించే వారే అశ్వినీ దేవతలు. వారే ఈ ఏర్పాటు చేసి, 360 కేంద్రాలలో గోవులను పిండటాన్ని నిర్వర్తిస్తారు. మనకు జ్యేష్ఠమాసం వస్తే గ్రీష్మ ఋతువు. వేడికి భూమి మీద నీరంతా ఆవిరవుతుంది. భూమికి బాగా ఎండ సోకి వర్షం పడ్డప్పుడు మంచి సువాసన వస్తుంది. అప్పుడు వేడి పుట్టుకుని వచ్చి పొలాలలో పొగలు కనిపిస్తుంటాయి. అప్పుడు భూమి ఎంతో ఆత్రంగా నీటిని తీసుకోవడం జరుగుతుంది. నీటిని తీసుకుని, ఆస్వాదించి తనను తాను ఎంతో సారవంతంగా చేసుకుంటుంది. అలాగే శరీరం కూడా ఎండకు మలినాలను తొలగించుకుని శుభ్రపడితే ధాతువులు సరిగా

పుట్టుకు వస్తాయి. అందుకనే శరీరాన్ని దాచకూడదు. దాచితే అది కుళ్ళిపోతుంది. అందుకే మనం పగలు బయట, రాత్రి లోపలా ఉంటే ఈ పురోగమనము–తిరోగమనము సవ్యంగా ఉంటుంది.

ఇలా చిన్న వృత్తాలలోనూ, పెద్ద వృత్తాలలోనూ ఉన్నవాటిని అన్నిటినీ నిర్వర్తించే వారు అశ్వినీ దేవతలే. వారు 60 గోవులను, 300 ధేనువులనూ ఒకే దూడకోసం పిండుతున్నారు. ఒక పొదుగునే అనేక గోష్ఠాలలో పిండుతారు. వారు సూర్యరశ్మిని ఆహారంగా మనకు పంచుతున్నారు. దీనిని eating the sunlight అని అంటారు. దానికే ఉదయం సూర్యోదయం ముందు పసుపు–ఎరుపు కిరణాలను మనం పొంది, గాలిద్వారా పీల్చుకుంటూ, హృదయమధ్యంలో ఏర్పాటుచేసుకుని బాగా ఉచ్ఛ్వాస–నిశ్వాసలు చేస్తే ఆకలి అవుతుంది. ఎప్పుడూ ఏమి తిందామా అని అనిపిస్తుంది. అందుకే సూర్యరశ్మి లేని ప్రశాంత వాతావరణంలో 24 నిముషాల పాటు గాలి పీలిస్తే ఇదే అవగతం అవుతుంది. ఎందుకంటే అది ప్రాణవాయువు. అలాగే రోజుకు 3–4 లీటర్ల చక్కని నీటిని తీసుకుంటే మంచిది. అన్నం తినేటప్పుడు మంచి నీరు త్రాగకు అని పెద్దలు అంటారు. నిజానికి అన్నిటికన్నా ఉత్తమోత్తమమైన ఆహారం సూర్యరశ్మే.

మీరందరూ “ఒక యోగి ఆత్మకథ” పుస్తకాన్ని బాగా చదివుంటారు. ఆ కథలో ఒక ఆమె పల్లెటూరిలో పుట్టి పెరుగుతూ భయంకరంగా తిండి తింటూ ఉంటుంది. కొన్నాళ్ళకు బాగా శరీరం వచ్చి పుష్టిగా తయారయ్యింది. ఆమె భీముడిలాగా పదిమందికి సరిపడ తిండిని తినేస్తూ ఉంటుంది. తల్లిదండ్రులు

ఆమెకు భయపడుతూనే పెళ్ళి చేశారు. అత్తవారింటిలో తాను వండి ఇంటివారికి ఒక వంతు, మూడు వంతులు తాను తినడం మొదలు పెట్టింది. అది చూసి అత్తమామలు ఈమెది రాక్షసగుణమేమోనని అనుకుంటారు. ఇంటిలో తిని, మళ్ళీ బజారుకు వెళ్ళి కూడా తిని వచ్చినప్పుడు, అందరూ ఆమెను అపహాస్యం చేశారు. అప్పుడు హృదయం నొచ్చుకుని ఆ రాత్రి దుఃఖపడి ఆమె "నన్ను ఎందుకిలా పుట్టించావు? తిండి మీద నాకెందుకింత వ్యామోహం యిచ్చావు? రేపటినుండి నేను ఆహారం స్వీకరించను. ఈ మాటలు పడడం కన్నా నిరాహారంతో చనిపోవడమైనా ఫర్వాలేదు" అని దేవునికి నమస్కరించింది. ఆమెను నిరాహార యోగిని అంటారు.

ఒక రోజున ఆమె సరస్సు నుండి కుండతో నీటిని తెచ్చే సమయంలో సూర్యుణ్ణి చూస్తే, ఆ సూర్యునిలో నుండి ఒక ఋషి దిగివచ్చాడు. ఆ ఋషి "నిన్న నీవలా ప్రార్థన చేసినందుకు దైవము నన్ను పంపించాడు తల్లీ! నీకొక మంత్రమును ఉపదేశిస్తాను. ఈ మంత్రమును జపిస్తే నీవు ఏమీ తిననక్కరలేదు, త్రాగనక్కరలేదు" అని చెప్పి ఉపదేశించాడు. ఆ మంత్ర ప్రభావంతో ఆమె సూర్యకాంతిని మాత్రమే భోజనం చేయటం ప్రారంభించింది. దానితోనే జీవించింది. ఈ విషయం ఇంటిలోని వారికి కూడా తెలిసింది. ఒక సంవత్సరం తరువాత, ఆమె కళ్ళలో నుండి సూర్యకాంతి రావడం మొదలయ్యింది. ఆవిడ ఉన్న చోటు వెలుగుతో నింపబడి ఉండేది. శరీరం పలుచబడి కాంతివంతంగా తయారయ్యింది. అలా అప్పటినుండి ఆమె యాభై సంవత్సరముల పాటు బ్రతికింది. ఈ కథ బెంగాలులో జరిగింది. ఆమెను

దర్శించడానికి పరమహంస యోగానంద ప్రత్యేకంగా వెళ్ళారు. ఇది అత్యంత అద్భుతమైన విషయము. పరమహంస ఆమెను చూసి తన పుస్తకంలో ఈ విషయాన్ని రాశారు.

సూర్యరశ్మే ఆహారము మనకు. అన్ని ఆహారాలలోనూ మనం సూర్యరశ్మినే తీసుకుంటున్నాం. సూర్యరశ్మినే ఆహారంగా తినడానికి ఈ భూమిమీద ఏర్పాటు చేసినవారే అశ్వినీ దేవతలు అని ఈ మంత్రముయొక్క విశిష్టత. ఏ బిందువైనా 360 కోణాలు, కిరణాలు ఉండి అదృశ్యంగా, సాధ్యులుగా పిండి, సిద్ధులుగా తీసుకొని వస్తారు. మనయందు అశ్వినులను దర్శించుకోవటానికి ఉచ్ఛ్వాస–నిశ్వాసములను గుర్తుంచుకోవాలి. వారే శ్వాసను పైకి, క్రిందకి నడుపుతారు. వారే మైత్రా–వరుణులు. దక్షిణం అగస్త్యుడైతే ఉత్తరం వశిష్ఠుడు. ఊర్ధ్వగమనం–అధోగమనమునకు ముఖ్యం కూడా మైత్రా వరుణులైన అశ్వినీ దేవతలే.

**మంత్రము - 5 :**

**ఏకాం నాభిం సప్త శతా అరాఃశ్రితాః**
**ప్రధిష్వన్యా వింశతి రర్పితా అరాః ।**
**అనేమి చక్రం పరివర్తతే ఽజరం**
**మాయాశ్వినౌ సమనక్తి చర్షణీ ॥**

**టీక :**

ఏకాం నాభిం = ఒకే కేంద్రమును; శ్రితాః = ఆశ్రయించినవై; సప్త శతాః = ఏడు వందలు; వింశతిః = ఇరువదియు; అరాః = అరలు (కోణములు); అర్పితాః = ఉంచబడినవి; ప్రధిషు = సందులయందు; అన్యాః = ఇతరములు (ఉంచబడి యున్నవి); అజరం = ప్రాతబడనిది; అనేమి = పరిధిలేనిది అగు; చక్రం = చక్రమును; చర్షణీ = సుడులు తిరుగు నట్టిదిగా; అశ్వినౌ = అశ్వినీ దేవతలు; మాయా = ఆనందము కొరకు; సమనక్తి = చక్కగా అమర్చుచున్నారు.

**తాత్పర్యము :**

ఒకే కన్నము చుట్టును 720 అరలు ఇముడ్చబడి యున్నవి. వాని సందులందు మిగిలిన విభాగము లమర్చబడి యున్నవి. అట్టి చక్రమును అశ్వినులు ఆనందమునకై అమర్చి త్రిప్పుచున్నారు. ఆ చక్రమునకు పరిధి లేదు. అది ప్రాతబడదు.

**వివరణము :**

వేద సూక్తములు కానీ, వేదవ్యాస స్తోత్రములు కానీ, శంకరాచార్య స్తోత్రములు కానీ నిత్యం పఠించడం వలన మనయందు చక్కని సిద్ధి ఏర్పడుతుంది. కంఠమునందు శబ్దమును బాగా స్పష్టముగా ఎలుగెత్తి ఉచ్చరించడం వలన మనయందు ప్రజ్ఞలు అన్నీ కూడా మనలోని ఆకాశాన్ని చేరుకుంటాయి. మనలోని విశుద్ధి చక్రము ఆకాశానికి, అనాహతచక్రము వాయువుకు, మణిపూరకచక్రము జలమునకు, స్వాధిష్ఠాన చక్రము అగ్నికి, మూలాధార చక్రము పదార్థమునకు ప్రతీకగా ఉంటాయి. ఈ పంచ చక్రములూ మనలోని పంచభూతములను నియమితం చేస్తూ ఉంటాయి. వీటి సమన్వయము బాగా ఉంటే మనయందు వాతావరణము అంటే స్వభావము బాగా ఉంటుంది. శరీరములో ఆకాశము, వాయువు, జలము, అగ్ని మరియు పృథ్వి అని ఉంటాయి. మనలోని పదార్థము భూమికి సంకేతము. అది మూలాధార ప్రజ్ఞ వలన సరిగా నిర్వర్తింపబడుతూ ఉంటుంది. అలానే మనము ఏది స్వాధిష్ఠానము అంటామో, అందులోని అగ్ని మన దేహమందు ఉష్ణతత్వాన్ని నిర్వర్తిస్తూ ఉంటుంది. దేహమందు చక్కని పచనము, అటుపైన సమతుల్యమైన వాతావరణమును ఏర్పరుచుతుంది. ఆకాశమునకు శబ్దము గుణము. మనము ఈ శబ్దములను చక్కగా ఉచ్చరిస్తే మనయందు శుద్ధి కలుగుతుంది. ఈ ఉపాయమును మనకు వేదములో ఒక అంగంగా కూడా ఇచ్చారు. ఎంత చక్కగా ఉచ్చరించాలంటే, కంఠమునందు శ్రద్ధగా, పరిపూర్ణంగా, ప్రభావితం చేసే విధంగా ఉచ్చరించాలి.

శబ్దము నుండి వెలుగు ఉద్భవిస్తుంది. శబ్దమే సమస్తమునూ పరిశుద్ధము చేయగలదు. మంచి శబ్దముతో వాతావరణము పరిశుద్ధి చేయబడుతుంది. ఇతర శబ్దములతో వాతావరణము, పరిసరము చీకటిమయం అవుతుంది. అందుచేత మన భాషణమునందు వీలైనంత వరకూ సత్యమును మధురంగా పలకాలి. *"సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్"*, "అసత్యమును పలుక వద్దు" ఇలాంటి నియమములను పెద్దలు మనకు ఇచ్చారు. ప్రతినిత్యం మనం కంఠాన్ని సక్రమంగా వినియోగించడం జరిగితే మన శరీరంలోని ప్రజ్ఞలన్నీ నిర్మలంగా ఉంటాయి. ఉప్పునీరు ఆకాశంలోకి వెళ్ళి మళ్ళీ మంచినీరుగా కురుస్తుంది కదా. అలానే మనలోని నిరుపయోగమైనటువంటి శక్తంతా కంఠ శబ్దాలు బాగా ఉంటే ఉపయోగంగా మారుతుంది. అందుకనే వాక్కు, దాని నియమావళిని మన పుస్తకాల్లో రాసుకున్నాం. కానీ ఆచరణలోనికి వచ్చేసరికి మరోరకంగా ఉంటూ ఉంది. మనం ఉచ్చారణ చేస్తూ ఉంటే మనలోని ప్రజ్ఞలన్నీ ఆకాశాన్ని చేరుతాయి. అందుకనే స్తోత్రం చేసేటప్పుడు చెప్పడం మాత్రమే కాకుండా, వింటూ కూడా ఉండాలి. జీవప్రజ్ఞ కంఠం దగ్గరే ఉంటుంది. కంఠం దగ్గర ఉండటం చేత ఆ ప్రజ్ఞ పైకి వెళుతుంది. లేకుంటే దిగువన ఉన్న వాయువుకు, జలమునకు వెళుతుంది. ఇది అవరోహణం. బాగా గాలి వీస్తే ఎలా ఉంటుంది? ఈదురు గాలి వీస్తే ఎలా ఉంటుంది? బాగా వేడిగా ఉన్నా బాగుండదు, ఎప్పుడూ వర్షం పడినా బాగుండదు. అందుకనే ఈ పంచభూతములూ సమన్వయమైనప్పుడు మనిషికి ఆహ్లాదకరమైన అనుభూతి ఉంటుంది. ఉదయం, సాయంకాలం ఆవిధంగా సమన్వయంతో ఉంటాయి. వాతావరణంలోలానే

మనలోని పంచభూతాల సమన్వయమును బట్టి మనలోని ప్రశాంతత ఉంటుంది. ఎప్పుడూ మనలో ఆవేశకావేశాలు ఉంటే ఏమి అనుభూతి ఉంటుంది?

తెరలుతున్న నీటివంటి భావములను ఆవేశములుగా చెప్పవచ్చు. భావము అగ్ని అయితే ఆవేశము నీరు. భక్తిలోకూడా ఆవేశము పనికిరాదు. నిర్మల భక్తులకు ఆవేశం ఉండదు. సినిమాలలో చూపించే భక్తి చాలా ఆవేశాత్మకంగా ఉంటుంది. మనం బాధపడే లాగా చూపిస్తారు. ప్రశాంతమైన వాతావరణంలో అన్నీ దిగిపోతాయి. ఉదయము సాయంత్రము బాహ్యంలో నీలో ఉన్న ప్రశాంతమైన వాతావరణం, నీరు. నిర్మలమైన నీరు, ఆవేశపూరితమైన నీరు వేరు. లేచీలేవగానే పదార్థమునందు ఆసక్తి ఉండేలా ఆలోచించేది జంతువే కదా? ఇలా వికారాలు ఉంటే వాతావరణం పాడైపోయి చీకటిమయం అవుతుంది. వాతావరణాన్ని పరిశుద్ధి చేయడానికి ఈ విశుద్ధి చక్రాన్ని వాడమని పెద్దలు చెప్పారు. విశుద్ధి సరిగా నిర్వర్తింపబడితే నీలోపల నిరంతరం శరదృతువులా ఉంటుంది. శరదృతువులో ఈ సమన్వయం ఉండి చలి గాలి, వేడి గాలి సమానంగా ఉంటాయి. అందుచేత శరదృతువుకు దాని సార్థకంగా పేరు పెట్టారు. దానికి సమాంతరంగా వసంత ఋతువు ఉంటుంది. ఈ రెండు ఋతువులలో వాతావరణము సమన్వయంగా ఉంటుంది. పంచభూతాలకు ఆకాశమే మూలము, అవి అక్కడినుండే సృష్టి. మనలో ఆకాశమును నిర్మలంగా ఉంచుకోవాలి. అందుకే ఈ విషయాన్ని స్తోత్రంలో ఇచ్చారు.

కేవలం భూగోళం మీదున్న వేదవాఙ్మయము నందే చక్కగా ఉచ్చారణ చేయబడ్డ సూక్తములు, స్తోత్రములు ఛందోబద్ధంగా ఉన్నాయి. వాటి అర్థాన్ని చక్కగా తెలుసుకొని ఉచ్చారణ నేర్చుకోవాలి. స్తోత్రము వింటూ, ఉచ్చారణ చేస్తూ ఉంటే మనలోని పంచభూతములూ సమన్వయము చెంది స్వస్థత కలుగుతుంది. ఇలా అని మనకు 'శిక్షావల్లి'లో చెప్పబడింది. *"శీక్షాం వ్యాఖ్యాస్యామః వర్ణ స్వరః మాత్రాబలమ్"* అని చెప్పబడింది. వర్ణములు అంటే అక్షరములు. అక్షరములను మ్రింగుతూ కాకుండా చక్కగా స్పష్టంగా పలకాలి. అన్ని అక్షరములనూ పలకగలగాలి. మాత్రాబలమ్ అంటే అక్షరాలను బలంగా కూడా పలకాలి. అక్షరములకు స్వరములు ఉంటాయి, ఈ స్వరములను చక్కగా పలకగలగాలి. *"స్వరమాత్రాబలమ్ సామ సంతానః"* దంపతులు ఒక్కొక్కరినీ రెండు సంవత్సరములలో కని, పుష్కర కాలంలో ఆరుగురిని కనగలిగితే దానిని సామసంతానం అంటారు (Uniform production). అలాగ మనవాక్కులో అక్షరాలను నొక్కిపట్టకుండా, దీర్ఘాలు తీయకుండా, వేగంగానో, నిదానంగానో పలకకుండా సమానంగా పలకాలి. అలాంటి ఉచ్చారణ ఎవరికి ఉంటుందో, వారియందు ప్రజ్ఞ చక్కగా, సమన్వయంగా వెలుగుతూ ఉంటుంది. శరదృతువులోని నదీప్రవాహంలాగా, నిర్మలంగా, అకల్మషంగా, స్వచ్ఛంగా వారి ప్రజ్ఞ ఉంటుంది. వేసవి కాలంలో వడివడిగా, శీతాకాలంలో చల్లగా, వర్షాకాలంలో బురదగా నదులు ఉంటాయి కానీ శరదృతువులో సమన్వయంగా, స్వచ్ఛంగా సెలయేరులా ఉంటుంది. అంటే నదీ స్నానానికి అనువుగా ఉంటుంది. అలా మన ఉచ్చారణకూడా శరదృతువులాగా

బాగా ఉండాలి. పరమగురువుల ఆశ్రమాలలో ముఖ్యశిక్షణ ఇలానే ఉంటుంది. రోజూ మూడుగంటల పాటు సూక్తములను, స్తోత్రములను ఉచ్చారణ చేయిస్తారు, సాధన చేయిస్తారు. కానీ మనకు అరగంట చేసేసరికే ఆయాసం వస్తుంది, నిద్రపోవటం జరుగుతుంది. మన శరీరమనే పరికరాన్ని, సంగీతపరికరాలైన వీణ, మద్దెల నాదాన్ని సరిచేసుకొన్నట్టు, పదనుగా ఉండేలా చూసుకోవాలి.

మన భారతీయ వాఙ్మయంలో శ్రీ వేదవ్యాస కృత సూక్తములను, శ్రీ ఆదిశంకరాచార్యవారి సూక్తములను, భాగవతములోని పద్యాలను, త్యాగరాజ సంకీర్తనలను అలా స్వరయుక్తంగా, భావయుక్తంగా, భక్తియుక్తంగా చెప్పాలి, చదువుకోవాలి. అర్థ మెరిగి, శబ్దమెరిగి, స్వరమెరిగి ఛందోబద్ధంగా స్తోత్రాలను చదవాలి. భావస్పర్శ కలిగినవారు వీటన్నిటినీ మనకు అలా అందించారు కాబట్టే శబ్దాలు ఛందోబద్ధంగా దిగివచ్చాయి. అందుచేత ప్రతినిత్యం మన శరీరాన్ని ఆరాధనలో సంగీత వాయిద్యముల నాదాన్ని సరిచేసుకున్నట్టు, సరిచూసుకుని ఉదయాన్నే మనం శబ్దాన్ని పలకాలి. ఓంకారముతో మొదలుపెట్టి ఎంతచేసుకోగలిగితే అంత మంచిది.

చాలా మందికి సూక్తములు, స్తోత్రములు నోటికి వస్తాయి. అవి సక్రమంగా వినియోగించుకోవాలి కానీ వినియోగించడం లేదు. దానికి కారణాలు ఒకటి బద్ధకం, రెండవది అశ్రద్ధ. సక్రమంగా వినియోగించుకుంటే ఎప్పటికప్పుడు పదనుగా ఉంటుంది వాయిద్యం యొక్క నాదం. అప్పుడే సంగీతము

శ్రావ్యముగా ఉంటుంది. మనకు నిశ్వాస ఆధారంగా ఉచ్చారణ ఉంటుంది. ఈ నిశ్వాసకు ఆధారం ఉచ్ఛ్వాస. ఈ ఉచ్ఛ్వాస–నిశ్వాసలు అశ్వినీ దేవతలే. ముందుగా చెప్పినట్టు వారు అలా దిగివస్తూ, పైకి వెళుతూ పనిచేస్తూ ఉంటారు. మనం బాగా పలకగలగాలంటే మనలోని నిశ్వాస బాగా, దీర్ఘంగా ఉండాలి. దానికి బలమైన ఉచ్ఛ్వాస కూడా దీర్ఘంగా ఉండాలి. దానికే *"విశ్వంవిష్ణుర్వషట్కారో భూతభవ్యభవత్ప్రభుః"* అనే దాన్ని మనం నిశ్వాస సరిగా లేక పలకం, నిలిపి పలుకుతాం. అలా స్తోత్రాలను ముక్కలు చేయకూడదు. అలా చేస్తే దాని ప్రభావం ఉండదు. 16 అక్షరములు అంటే షోడశాక్షరములను ఒకేసారి పలకాలి. దానిని ముక్కలు చేస్తే, సగం అన్నం తిన్నట్టు, ఆకలి తీరకుండా ఉన్నట్టు ఉంటుంది. అందుకని, 16 అక్షరముల మంత్రమును స్వరయుక్తంగా, ఒకేసారి, సరిగా, భక్తియుక్తంగా పలకాలి. మనం ఇలాంటి అపచారాలను శ్రీ లలితాసహస్రనామంలో కూడా చేస్తుంటాము. మధ్యలో లేని దీర్ఘాలను పెడతారు. దాని వల్ల అపశ్రుతి అయిపోయి దాని ప్రభావము మనమీద పడుతుంది. శ్రీ లలితాసహస్రనామంలో పాదాలు చాలా సుదీర్ఘంగా ఉంటాయి. ఆ పాదాన్నంతా ఒకేసారి పలకాలి. దానికోసం నీకు దీర్ఘమైన ఉచ్ఛ్వాస, దీర్ఘమైన నిశ్వాస ఉండాలి. దానివల్ల ప్రాణశక్తి కూడా పెరుగుతుంది. ప్రాణశక్తి పెరిగితే ప్రజ్ఞ వికాసం చెందుతుంది. అందుకని ఏ ఛందస్సులో అయితే స్తోత్రాలను ఇచ్చారో ఆ ఛందస్సులోనే పలకాలి. అన్నీ తగ్గించుకుంటూ ఒకసారికి నాలుగు అక్షరాలు మాత్రమే పలికే వారుగా తయారయ్యారు ఇప్పుడు.

*"ఆసీదిదమ్, తమోభూతం"* అనేవి రెండుముక్కలు చేస్తే దాని భావము, ప్రాణము విడిపోతాయి. ప్రాణమువల్ల ప్రజ్ఞ సన్నగిల్లుతుంది. *"సహస్రశీర్షాపురుషః సహస్రాక్షః సహస్రపాత్"* లో మనం ఎక్కడ ఆపాలో వారు మనకు ఇచ్చారు, దానిని మనం మధ్యలో ఆపకూడదు. రైలు ఏ స్టేషన్లో ఆగాలో ఆ స్టేషనులోనే ఆగాలి, అలా కాక అనవసరమైన స్టేషనులో ఆగితే ప్రయాణం ఎలా జరుగుతుంది? ఈ రోజు ఉదయం ఈ వ్యాఖ్యానం చెప్పాలని నాకు అనిపించి మీకు ఇది చెబుతున్నాను. అందుకే స్తోత్రములను శ్రద్ధతో, ఛందోబద్ధంగా, భక్తితో, భావ–రాగ–స్వరయుక్తంగా పలకాలి. ఎవరెవరి ఆసక్తిని బట్టి వారు స్తోత్రాలను చేసుకుంటూ ఉంటారు. రోజూ విష్ణుసహస్రనామం చదువుకునే వారు ఉంటారు, వారు చక్కగా స్వరయుక్తంగా చదువుకోవాలి. తొందరగా అయిపోవాలని చదువుకోకూడదు. హనుమాన్ చాలీసాను చక్కగా ఎలుగెత్తి పాడుకోవాలంటే చాలా సమయం పడుతుంది. అదే లోపల గొణుక్కుంటే త్వరగా ముగుస్తుంది, కానీ ఏమి ప్రయోజనం? నీకు శుద్ధి జరగదు. పరిసరశుద్ధి కూడా జరుగుతుంది కాబట్టి ఈ ఉచ్చారణకు మనకు ఒక తాళంచెవి లాగా సూక్తములు, స్తోత్రములను ఇచ్చారు ఋషులు. మనము ఇలా ఉపయోగించుకొని, ఉద్ధరించుకుంటామని ఇచ్చారు. కానీ అంతా అలా ఉండదుగా.

*"ఏకాం నాభిం సప్తశతా అరాః శ్రితాః"* అని ఈ శ్లోకం. 'ఏకాం నాభిం' అంటే ఒకే బిందువును ఆశ్రయించుకొని, 'సప్తశతా' అంటే ఏడు వందల, 'వింశతి' అంటే ఇరువది, 'అరాః' అంటే

కోణములు లేదా అరలు, 'అర్పితాః' అంటే ఉంచబడినవి అని అర్థం. 'అజరం' అంటే ముసలిది కానిది అని అర్థం. ఒకే కన్నం చుట్టూ 720 కోణములు అరలలో అమర్చబడి వాటి సంధులయందు వివిధ విభాగములు అమర్చబడినవి. అట్టి చక్రమును అశ్వినులు ఆనందము కొరకై త్రిప్పుతున్నారు. ఆ చక్రమునకు పరిధి లేదు. మరణము లేదు. ముసలితనము లేదు.

ముందు శ్లోకంలో మనం 300 ధేనువులు, 60 ఆవులు ఆ బిందువు చుట్టూ ఉన్న కోణములుగా చెప్పుకున్నాం. ఈ కోణముల వలన ఏ విధమైన విషయములు అందింపబడుతున్నాయో చెప్పుకున్నాం. అలా ఈ 360+360 ని 720 గా చెప్పుకోవాలి. ఎందువలనంటే 360 రోజుల వత్సము లేక వత్సరమందు అంటే సంవత్సరమునందు 360 ప్రాతః సంధ్యలు, 360 సాయం సంధ్యలు వున్నాయి. వాటి అనుభూతి విభన్నమైనది. రెండునూ ఆనందమీయటానికి ఏర్పరచినవే! ప్రాతః సంధ్యలు అశ్వినులుగా ప్రపంచమున ఆనందముతో ముంచెత్తుతాయి. సాయం సంధ్య సుపర్ణులుగా అంతరంగ ఆనందములో ముంచెత్తుతాయి. దేని వైభవం దానిదే. పగలు ప్రపంచానుభూతులు, రాత్రి దివ్యానుభూతులు. పగలు కనబడే విశ్వం, భూతముల అనుభూతి, రాత్రి కనపడని దివ్యమైనవి, అమృతమయమగు లోకముల అనుభూతులను సంవత్సర చక్రమున అనుభవించవచ్చును. ఇలాంటి అనుభూతి, ఆనందము సృష్టి వున్నంత కాలం పొందవచ్చును. అదే అశ్వినులు మనకు ప్రసాదిస్తున్న విశేషానుభూతి.

ముందు శ్లోకంలో చెప్పినట్టు 360 కోణములు బాగా అదృశ్యంగా ఉంటాయి. అవి బిందువునుండి కేంద్రీకృతమైనప్పుడు అవి సాధ్యస్థితి నుండి సిద్ధ స్థితికి వస్తాయి. వాటియొక్క ప్రభావము మనపైన ఏర్పడుతుంది. సిద్ధస్థితికి వచ్చినప్పుడు అవి దేవతలుగా పనిచేస్తాయి. అక్కడనుండి మనకు కావలసినవన్నీ ఆ పొదుగులోనుండి పాలు పిండినట్లుగా పిండి సమస్తమైన విషయాలను మనకు అందిస్తూ ఉంటారు అని మనం ముందు శ్లోకంలో చెప్పుకున్నాం. ఈ బిందువు చుట్టూ ఉన్న 360 కోణములను ఈ శ్లోకం సందర్భంలో మనం 360 దినములుగా చెప్పుకుందాం.

సాయన సంవత్సరంలో 360 రోజులు కానీ సంవత్సరంలో 365 రోజులు ఉన్నట్టు చెప్పుకుంటుంటాం. ఎందుకంటే, ఈ గోళము యొక్క సంచారంలో, వర్తనంలో కొన్ని సమయాల దూరం ఉండి. అందువల్ల ఈ ఐదు రోజులను శూన్యదినములు అని అంటారు. నిజానికి 360 రోజులే ఒక సంవత్సరం. ఎందుకంటే బిందువు చుట్టూ ఉన్నది 360 కోణములు మాత్రమే. అందుకనే సాయన సంవత్సరంలో, ఫాల్గుణ మాసంలో, చివరి 5 రోజులూ ఏమీ చేయకూడదు అని అంటారు. ఫాల్గుణ కృష్ణ పక్షములో ఏకాదశి నుండి అమావాస్య వరకూ శూన్యదినములు. అదే చాంద్రమానంలో ఉగాదికి ముందు 5 రోజులు అని చెబుతారు. ఈ సాయన సంప్రదాయములో సంవత్సరం మార్చి 21 నుండి ఆరంభం అవుతుంది. అంటే సోలార్ సంవత్సరం అంటారు కదా. అది మొదలయిన 360 రోజులకు మార్చి 15 వస్తుంది. మార్చి 16

నుండి 20 వరకు కల ఐదు రోజులూ చాలా గడ్డుదినములుగా, శూన్యదినములుగా చెబుతారు. తరువాత మళ్ళీ 20న కానీ 21న కానీ కొత్త సంవత్సరం మొదలవుతుంది. మన సంకల్పంలో మనం అనుకోని, మనకు అక్కరలేని కొన్ని విషయాలు కూడా వస్తుంటాయి. ఒక తోటలో పైరుతో పాటు కలుపుమొక్కలు కూడా వస్తుంటాయి కదా. కలుపు తోటలో భాగం కాదు కాబట్టి వాటిని తీసివేయాలి. సృష్టిలో అగ్నికార్యం జరుగుతూ ఉంటే మసికూడా వస్తుంది. అలానే మనం ఆహారం తీసుకుంటే మలమూత్రాదులు కూడా ఏర్పడతాయి.

అందుకనే Shakespear అనే ప్రసిద్ధ నవలాకారుడు తన నవల "Julius Ceaser"లో "beware the ides of March" అని చెప్తాడు. అంటే మార్చి 15 నుండి జాగ్రత్తగా ఉండు అని అర్థం. అందుకనే ఆ సమయంలో (మార్చి 16–మార్చి 21) ఏ కార్యక్రమాలూ పెట్టుకోకండి అని అంటారు. Shakespear రచించిన "Julius Ceaser" నాటకంలో చక్రవర్తి అయిన Julius Ceaser ఆ సమయంలో, అంటే మార్చి 15న తన మంత్రివర్గ సమావేశము పెట్టుకుంటాడు. అప్పుడు ఆయన భార్య వద్దని, అది శూన్యదినమని వారిస్తుంది. అప్పుడు ఆయన "నేను చక్రవర్తిని కదా, నాకు కూడా ఈ శూన్యదినములు వర్తిస్తాయా?" అని అంటాడు. ఎందుకంటే ఆయన చక్రవర్తి, మహా మేధావి కూడా. ఆయన మరువుమహర్షి శిష్యుడు అని కూడా చెప్పబడతాడు. కానీ కాలము ఎవరికైనా వర్తిస్తుంది, కాలాన్ని అతిక్రమించడం ఎవరి తరమూ కాదు. కావున ఆ రోజే ఆయన మీటింగ్ పెట్టుకోవడం,

హత్యకు గురికావటం జరిగింది. ఇవన్నీ Shakespear ఎందుకు తన నవలలో పొందుపరిచారంటే ఆయన జ్ఞాని, పరమగురువుల అనుయాయులలో ఒకడు కూడా. సందేహము లేదు. ఆయన Seventh Ray మాస్టర్ అయిన రాకోజి మహరాజ్ గారి శిష్యుడు. మనం కూడా మార్చి 15 నుండి ఐదు రోజులు శూన్యదినములుగా పాటిస్తూ ఉండాలి.

మన సంప్రదాయంలో మనం తిథులు, నక్షత్రాలు పెట్టు కున్నాం. మనకి 27 నక్షత్రాలతో నక్షత్రమండలం ఏర్పాటు చేయబడింది. మనకు అందులోని చివరి ఐదు నక్షత్రములూ మంచివి కాదు అని చెబుతారు. ఆ నక్షత్రాలలో కార్యక్రమాలేవీ పెట్టరు. వాటినే మనము "ధనిష్ఠా పంచకము" అని అంటుంటాం. అంటే ధనిష్ఠ, శతభిషము, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర మరియు రేవతి. ఫాల్గుణమాసంలో ఈ ఐదు నక్షత్రాలలో ఏ శుభకార్యము పెట్టుకొనరు. మాసమంటే 30 రోజులే. అది 30 రోజులు కూడా గడువదు. ఎందుకంటే చంద్రగతి అంత క్రమబద్ధంగా ఉండదు. కొన్ని మాసాలు 28 రోజులకే ముగుస్తాయి, కొన్ని మాసాలు 30 రోజులకు ముగుస్తాయి. అధికజ్యేష్ఠము అంటాముగా. కానీ ఋగ్వేదములో చెప్పబడినది ఐదు రోజులే శూన్యదినములు. చిట్టచివరి మాసం ఫాల్గుణము. సాయన సంవత్సరంలో తేదీలే ముఖ్యం. ఈ ఐదు రోజులలో సూర్యుడి చిట్టచివరి ఐదు కిరణములు, కోణములు, అరలు ఉంటాయని, ఆ సమయంలో పుట్టినవారు జీవితంలో అంతగా రాణించరని కూడా చెబుతారు జ్యోతిషంలో.

360 దినములే మన సంవత్సరంలో లెక్కించాలి. ఈ

360 కోణాలే ఉత్తర-దక్షిణాయనాలుగా మనకు కావలసిన అనుభూతులను ఇస్తున్నాయని ముందు శ్లోకంలో చెప్పుకున్నాం. ఈ శ్లోకంలో 360 ని 720 చేశారు. ఎందుకంటే ఒక దినములో ఒక అహస్సు, ఒక రాత్రి ఉన్నాయి. అంటే ఒక రోజులో రెండు సంధ్యలు వున్నాయి. మనకు ఒక సంధ్య అశ్వినులు తెస్తారు, మరొకటి సుపర్ణులు తెస్తారు అని ముందు శ్లోకాలలో చెప్పుకున్నాం. వాటి లక్షణం వేరుగా ఉంటుంది. మనం ఉదయం నుండి సాయంత్రం వరకు భావమయ లోకాల్లో విహరించి, ఆనందాన్ని అనుభవిస్తూ, సాయంత్రానికి చేరుకుంటాం. సాయంత్రం నుండి భావమయ లోకాలను విసర్జించి ఊర్ధ్వలోకాల్లోకి సుపర్ణులు తీసుకెళ్ళినప్పుడు వెళతాం. దాన్ని *"గ్రస్తాం సుపర్ణస్య బలేన వర్తికాం"* అని ముందు ఒక శ్లోకంలో చెప్పుకున్నాం.

మనం ఈ ముందు శ్లోకాలను మరచి ఈ శ్లోకాన్ని గురించి అవగాహన పొందలేము. ఎందుకంటే ఆ ముందు శ్లోకాల తరువాత భావమే ఈ శ్లోకంలో ఉంది. వృద్ధి కావాలంటే progressive గా ఉంటేనే ఉంటుంది. Continuity of consciousness అనేది సాధన. నేర్చుకున్న విషయాలు ఏవీ మరువకూడదు. నిన్నమొన్నటివి కాదు, ఎన్నో ఏళ్ళు సాధనలో నేర్చుకున్న విషయాలు కూడా గుర్తు ఉండాలి. నిన్నటి రోజున ఏమి తిన్నామో మరవవచ్చు కానీ నేర్చుకున్న విషయాలు మరువకూడదు. ఈ శ్లోకాలు ప్రజ్ఞకు సంబంధించినవి, ఆహారం కేవలం దేహానికి సంబంధించినది. ఈ దేహం ఎలా అయినా విసర్జించవలసిందే. భవిష్యత్తులో విసర్జించవలసిన దానిని గుర్తించక, ప్రజ్ఞకు సంబంధించిన

విషయాలను మరువరాదు. ప్రజ్ఞను గూర్చిన విషయాలు భూత-భవిష్యత్-వర్తమానములో కూడా ఉంటాయి. ఈ విశాల ప్రజ్ఞయే పురుషుడు. అందుకే *"భూతభవ్య భవత్ప్రభుః"* అని అన్నారు. అంటే నేను ఇదివరకు, ఇప్పుడు, ముందుకు కూడా ఉంటాను అని అర్థం. ఈ నేను ఎప్పుడూ ఉంటాను, ఈ నీవు ఎప్పుడూ ఉండవు. నీవు, అతడు అంటే second and third person కాక first person గా, నేనుగా ఉంటావు. కాబట్టి నేను ఇదివరకే ఉన్నానని, భూమి పుట్టకముందు నుండే ఉన్నాను అని శ్రీ కృష్ణుడు చెబుతాడు. సృష్టి పుట్టకముందు కూడా ఉండడం సత్యం. ఇవన్నీ మనం ఇలా తెలుసుకోలేదు. అందుకే శ్రీ కృష్ణుడు "నేను, నీవు ఇద్దరం ఇదివరకే ఉన్నాము, కానీ నాకు గుర్తుంది నీకు మరపుంది అంతే. నీకు, నాకు చాలా జన్మలు జరిగాయి. నేను ఇలానే ఉన్నాను కానీ నీవు మారావు. నీవు మరిచావు కానీ నాకు మరపు లేదు" అని అర్జునునితో చెబుతాడు భగవద్గీతలో.

మనం కూడా, శ్రీకృష్ణుని కాలం, శ్రీరాముని కాలం, కపిలుడు పుట్టినప్పుడు, భూమి పుట్టినప్పుడు కూడా ఉన్నాం. ఎలా ఉన్నాము అంటే, రకరకాల శరీరాలలో ఉన్నాం. ఏ రకమైన జీవిగా అయినా ఉండి ఉండవచ్చు. ఉన్నవాడు ఎప్పుడూ ఉంటాడు. వాడు ఏర్పరుచుకున్న శరీరాలు మారుతాయి అంతే. అందుకని ప్రజ్ఞకు మరపు రాకూడదు. సాధకునికి ప్రజ్ఞపరమైన విషయంలో మరపు రానేకూడదు. దేహపరమైన విషయంలో మరపు రావచ్చు. అందుకనే నిన్న, మొన్న, ఆమొన్న మనం తిన్నవి మరచినా ఏమీ కాదు. గుర్తుపెట్టుకో నవసరంలేనివి

గుర్తుపెట్టుకుంటే, గుర్తుపెట్టుకోవలసినవి మనకు గుర్తుండవు. అక్కరలేనివి పోగుచేసుకుంటే అవసరమైనవి అందవు. అందుకనే దేహసంబంధమైన వాటికంటే ప్రజ్ఞపరమైన వాటిని గుర్తుంచుకోవాలి. అలా చేసినవాడే సాధకుడు, బుద్ధిమంతుడు, విద్యావంతుడు. అలాంటివాడియందు గురువుకు కూడా చాలా దృష్టి ఉంటుంది.

తాను చెప్పినవి తిరిగి చెప్పగలిగితేనే గురువుకు ఇష్టం. అలాగే గురువులు చెప్పినవే మళ్ళీ చెబుతూ ఉంటారు. వారి శిష్యులకు మరపు రాకుండా ఉండేంతవరకూ అలా చెబుతారు, అలా వారు నిర్ణయం చేసుకుంటారు. గురువులకు ఓపిక ఎక్కువ కాబట్టి వారిని శనిగ్రహంతో పోలుస్తారు. వారికి జ్ఞానం ఎక్కువ కాబట్టి బృహస్పతి అని అంటారు. సంకల్పబలం ఎక్కువ కాబట్టి కుజుడు అతనిలో పనిచేస్తాడు. వీక్షణముంటుంది కాబట్టి వారిలో బుధుడు పనిచేస్తాడు. గురువుగారు ఎప్పుడూ సుఖంగా ఉంటాడు కాబట్టి శుక్రుడు పనిచేస్తాడు. ఏ విషయంలో పట్టు వుండాలో అందులో పట్టు వుంటుంది కాబట్టి రాహువు కూడా పనిచేస్తాడు. ఏ విషయంలో పట్టు అవసరం లేదో దానిని పట్టించుకోరు కాబట్టి కేతువు కూడా పనిచేస్తాడు. మరి సూర్యుడు? అంటే ఆయనేగా సూర్యుడు. మనమే సూర్యులం.

**మంత్రము - 6 :**

**ఏకం చక్రం వర్తతే ద్వాదశారం**
**షణ్ణాభి ఏకాక్ష మృతస్యధారమ్ ।**
**యస్మిన్ దేవా అధి విశ్వేవిషక్తాస్తా**
**వశ్వినౌ ముంచతో మా విషీదతమ్ ॥**

**టీక :**

ద్వాదశారం = పంద్రెండు అంచులు; ష్ + నాభి = ఆరు సుడులు; ఏకాక్షం = ఒక కన్నము; ఋతస్యధారం = ఋతము యొక్క అంచు గలది; ఏకం చక్రం = ఒక చక్రము; వర్తతే = వర్తించుచున్నది (వృత్తముగా తిరుగుచున్నది); యస్మిన్ = దేనియందు; దేవాః = దేవతలు (ప్రజ్ఞలైన వెలుగులు); విశ్వే = అందరును; అధి విషక్తాః = అధిష్ఠించి విశేషముగా ఆసక్తి చెంది యుండిరో; తౌ అశ్వినౌ = అట్టి అశ్విను లిద్దరును; విషీదతం = విషాదము చెందుచున్న; మా = నన్ను; ముంచతః = విముక్తుని చేయుదురుగాక !

**తాత్పర్యము :**

పంద్రెండంచులు గలిగి ఆరు సుడిగుండములతో, ఒకే ఇరుసు కన్నముతో ఒక చక్రము వృత్తాకారముగా తిరుగుచున్నది. ఋతము ఆ చక్రమునకు అంచుగా నున్నది. దానియందు సర్వదేవతలును ఆసక్తితో అంటుకొని వెలువడుచు, లీనమగుచు తిరుగుచున్నారు. అట్టి చక్రమును నిర్వహించుచున్న అశ్వినీ దేవతలు నా దుఃఖమును పోగొట్టి నన్ను విముక్తుని చేయుదురు గాక!

**వివరణము :**

పంద్రెండు అంచులు కలిగిన ఒక చక్రము, ఒకే ఇరుసు కన్నము కలిగి, ఆరు సుడులతో వృత్తాకారముగా తిరుగుచున్నది. ఋతమే దాని అంచు. అందరు దేవతలు ఆ అంచునుండి వెలువడుతు, లీనమవుతూ తిరుగుచున్నారు. యిట్టి చక్రమును నిర్వర్తిస్తున్న అశ్వినీదేవతలు నా దుఃఖమును పోగొట్టి నన్ను విముక్తిని చేయుదురు గాక!

ఇది ఒక గంభీరమగు పొడుపు కథ లాంటిది. సంవత్సర చక్రమే 12 అంచుల చక్రము. 12 మాసములు 12 అంచులు. అంతేకాదు, 12 మాస సంక్రమణములు అంచులుగా 12 మాసములు. అందు 12 పూర్ణిమలు, 12 అమావాస్యలు వుంటాయి.

ఈ చక్రమునకు యిరుసు సూర్యుడు. సూర్యుడు సూర్యమండల కేంద్రమే కాదు, కన్నుకూడ. సూర్యుడు ఇతర గ్రహములవలె పదార్థమయమైన గోళము కాదు. మన కన్నువలె అతి సూక్ష్మమగు వెలుగుదారముల అల్లిక వున్న చిల్లు. అందువలన చక్రము యిరుసు ఒక కన్నము. సవితృ మండలపు వెలుగులు వెలుగుదారుల కన్నము నుండి సూర్యమండలమునకు అందిస్తూ వుంటాడు. వెలుగుదారముల అల్లికగ ఏర్పడినాడు కనుక అతడిని వివస్వతుడని పిలుస్తారు. సవితృమూర్తి వెలుగు సూర్యునినుండి సూర్యమండల మంతటికి పంచబడుతూ వుంది. ద్వాదశ (12) ఆదిత్యుల కాంతి 12 మాసములలో పంచబడుతూ వుంటుంది. మాస సంక్రమణము రోజున ఒక్కొక్క ఆదిత్యుని కాంతి ప్రారంభమై మాసాంతానికి అంతమవుతుంది. 12 అంచులు మారుతున్న

కాంతి ప్రభావమును తెలియజేస్తాయి. ప్రతి మాస సూర్యకాంతికి దానిదైన ప్రత్యేక లక్షణాలు వుంటాయి. అవి తెలియాలంటే ద్వాదశరాశులను గూర్చిన అధ్యయనం చేయాలి.

ఈ ద్వాదశార చక్రమే మనలోని ద్వాదశ దళ పద్మమగు అనాహత పద్మము లేక అనాహత చక్రము. ద్వాదశాక్షరీ మంత్రంలో ఈ అనాహత పద్మమును ఆరాధించే విధానము తెలిస్తే ద్వాదశాత్మకుడైన వాసుదేవుని సాన్నిధ్యం లభిస్తుంది. ధ్రువునకు ఈ మంత్రాన్నే నారదమహర్షి ఉపదేశించాడు.

ఈ ద్వాదశార చక్రమును, దాని కన్నును ఆరాధిస్తూవుంటే ఒక దివ్యమగు విషయము గోచరిస్తూ వుంటుంది. కన్నుగా నున్న సూర్యునినుండి ప్రసారమయ్యే అమృతమగు వెలుగుధారను ఆధారంగా చేసుకొని, ఆరు సుడిగుండముల వలె ఆరు విశేషమగు ప్రజ్ఞలు అనుస్యూతముగా ఏర్పడి సూర్యమండలమును ప్రతిభావంతము చేస్తాయి. ఈ ఆరు సుడిగుండాలే 6 గ్రహములు. 12 రాశులు. 6 గ్రహముల విశేష శోభతో ఒక సూర్యమండలం వైభవోపేతమై గోచరిస్తుంది. ఇది ఒక అద్భుతదర్శనం. 6 గ్రహములంటే 1 గురుడు, 2 బుధుడు, 3 శుక్రుడు, 4 కుజుడు, 5 శని, 6 చంద్రుడు. సూర్యుడు గ్రహము కాదు, కేంద్రము. మనయందు కూడ అనాహతం మినహాయిస్తే 6 కేంద్రాలుంటాయి. అవి వరుసగా సహస్రారం, ఆజ్ఞ, విశుద్ధి, మణిపూరకము, స్వాధిష్ఠానము, మూలధారము. ఈ ఆరు కేంద్రముల నుండి సూర్యప్రజ్ఞ అంటే ఆత్మప్రజ్ఞ ఆరు విధాలుగా వ్యక్తమవుతూ ఉంటుంది.

ఈ ద్వాదశార చక్రము షణ్ణాభి సుడులనుండి అనేకానేక దేవతలు వ్యక్తమవుతూ, లీనమవుతూ వుంటారు. ఈ మొత్తాన్ని నిర్వర్తిస్తున్నది అశ్వినీదేవతలే! జీవుల ఆనందము కొరకు వారు యింతగా సృష్టి చక్రమును, సూర్యచక్రమును, భూచక్రమును త్రిప్పుచూ, దాని నధిష్ఠించి వున్నారు.

యిట్టి మహాత్ములు అశ్వినీదేవతలు నా దుఃఖమును, కష్టమును నివారించి నన్ను విముక్తుని చేయుదురుగాక! అని ప్రార్థన.

పై తెలిపిన ద్వాదశార సంవత్సర చక్రము, దాని నుండి ఏర్పడు ఆరు నాభులు, వాని నుండి దేవతలు వెలువడుచూ, అందులోనికి మరల లీనమవుతూ వుండుట అంతయు అప్రయత్నముగా అశ్వినుల నుండి జరుగుచున్నది. వారట్టి సత్యవంతులగుటచే అనాయాసముగా వారి నుండి సర్వము నిర్వర్తింపబడుచున్నది. అట్టి అప్రయత్న సత్యావతరణమే ఋతము. ధారగా వెలువడు సత్యమది.

ముందుగా చెప్పుకున్నట్టు మొత్తం 720 అరలు అంటే 360 ప్రాతఃసంధ్యలు, 360 సాయంసంధ్యలు ఉంటాయి. ఇంకో పది సంధ్యలు అంటే 5 రోజులు (శూన్యదినములు) ఎక్కువగా ఉన్నా అవి మనకు అక్కర్లేదు. ఈ 720 అరలను, సంధ్యలను చక్కగా నిర్వర్తింపజేస్తుంటారు ఈ అశ్వినీ దేవతలు. ప్రజ్ఞ అహస్సునందు వ్యక్తమై రాత్రియందు తిరోధానం చెందుతుంది. అన్నిటిలోకి వ్యాప్తిచెంది మళ్ళీ అన్నిటిలోంచి తిరోధానం చెందుతుంది. అందుకనే అవి 360 అయినప్పటికీ అందులో రెండు ప్రజ్ఞల

(పురోగమనము మరియు తిరోధానము) చొప్పున ఉన్నాయి. అందుకనే వీటిని 720 ప్రక్రియలు అని చెబుతారు. మనం కూడా ఎలా ముందుకు వెళతామో అలానే వెనక్కి వస్తాము కదా. ఏ దారిలో వెళితే ఆ దారిలోనే తిరిగి రావాలి, వేరే మార్గం లేదు. ఉదాహరణకు దేవాలయాలలోకి ఎలా వెళతామో అలానే తిరిగి బయటకు వస్తాము. అలాగే గాలి, ప్రాణము ముక్కులోనికి వెళ్ళి, మళ్ళీ ముక్కు ద్వారానే వెనక్కి వస్తుంది. ప్రజ్ఞ రాత్రి ఏవిధంగా అయితే లోపలకి వెళుతుందో ఉదయం అదేవిధంగా బయటకు వస్తుంది. అలానే ఈ సృష్టిచక్రములో కూడా పురోగమనము జరిగే దారిలోనే తిరోధానమూ జరుగుతుంది. In due and ancient order.

క్రమపద్ధతి గురించి క్రతువిద్యలో "నీవు ఏవిధంగా ప్రారంభించావో ఆవిధంగానే ముగించాలి" అని చెప్పారు. ఉదయం ప్రార్థనతో ప్రారంభించిన దినం రాత్రి నిద్రకు ముందు ప్రార్థనతోనే పూర్తి చేయాలి. ఉదయం ప్రార్థన తరువాత ఏమి చేస్తామో, రాత్రి నిద్రకు ముందు అదే చేయాలి. అప్పుడు ఆహారం కూడా అలానే తీసుకుంటాం. As you open so you close అని చెబుతారు. తలుపులు ఎలా మూస్తామో అలానే తీస్తాము. ఎన్ని తలుపులు తీస్తామో అన్నీ మూసే వెళ్ళాలిగా. As you proceed, so you return. ఒక రైలుబండి ఎక్కినప్పుడు ఎలా వెళుతుందో అలానే తిరిగి వస్తుంది. వెళ్ళేటప్పుడు ఏ స్టేషన్లో ఆగిందో తిరిగి వచ్చేటప్పుడు వాటిలోనే ఆగుతుంది. అందులో ఒక క్రతువు ఉంది. అలానే మన జీవితంలో కూడా ఈ క్రతువు ఉంది. అందుచేత ఆ

360 కోణాలు బిందువు చుట్టూ ఎలా పితకబడి మనకు చక్కగా ఆహారము పోషణము ఇవ్వడము జరుగుతున్నదో, ఆవిధంగా కలిపి 720గా గుర్తించబడింది. అందుకనే ఉదయమెంత ముఖ్యమో సాయంత్రం కూడా అంతే ముఖ్యం. శైవ సంప్రదాయంలో సాయంత్రమే చాలా ముఖ్యమైనదని చెబుతారు. ప్రపంచంలోకి రావడానికన్నా ప్రపంచం నుండి వెనక్కు వెళ్ళటానికి ఎంతో జ్ఞానం కావాలి.

పద్మవ్యూహం లోనికి ప్రవేశించడం కన్నా వెనకకి రావడం కూడా తెలియాలి. అది అభిమన్యుడి కథలాంటిదే. ప్రపంచంలోకి ప్రవేశించడం మాత్రమే తెలిస్తే చాలదు, మళ్ళీ దానిలోంచి నిర్గమించడం కూడా తెలియాలి. నిర్గమించడం తెలియాలి అంటే how do you close the day? అనేది చాలా ముఖ్యం. మనం అందరం opening the day సక్రమంగా చేస్తాం. కార్యక్రమాలన్నీ చేస్తాం, అక్కడనుండి ప్రపంచంలోకి పడతాం. సాయంకాలం అన్నిటినీ అడ్డగోలుగా మూసిపెడతాం. మనకథ కూడా అభిమన్యుని కథే. ఉదయం ప్రారంభించిన విధంగా సాయంత్రం ముగించడంలేదు. అందుకనే మరణం కూడ అడ్డగోలుగా ముగుస్తుంది. అడ్డగోలుగా ముగిసిన జీవితం సవ్యంగా ఎలా ప్రారంభింపబడుతుంది? కనుకనే మనిషి పుట్టుక, చావు కూడ సవ్యంగా జరగాలంటే ప్రాతః సంధ్య, సాయం సంధ్యలను చక్కగా, క్రమబద్ధంగా నిర్వర్తించుకోవాలి.

ఈ చక్రంతో అనుసంధానం చెందాలంటే మనం సాయంత్రం ప్రదోష కాలంతో ప్రారంభించాలి. సాయం సంధ్యలో

శివుడు, పార్వతితో నందీశ్వరునిపై తిరుగుతూ ఉంటాడు. వీరు మనమంతా ఏమి చేస్తున్నామో అని పరిశీలిస్తూ ఉంటారు అని పురాణాలు వివరిస్తూ వున్నాయి. ఆ సమయం చాలా చక్కగా ఉపయోగించుకోవాల్సిన సమయం. అదే కశ్యపమహర్షి దితికి చెప్పాడు. ఆవిడ ఆ సమయంలో విరుద్ధంగా "నాకు ఇప్పుడు సంతాన ప్రక్రియ కావాలి" అని కోరుతుంది. "ఇది సరియైన సమయం కాదు" అని వారిస్తాడు కశ్యపుడు. "అవన్నీ నాకు అనవసరం" అని పట్టుబడుతుంది దితి. అందుకే వారికి లోకకంటకులు పుడతారు. సృష్టికి విరుద్ధంగా నడవడం వల్లనే ఈ ఉపద్రవాలు. *"మనుష్యాః క్షితి మాచరంతి"* అని, తరువాతి శ్లోకములలో వస్తుంది. అంటే మనుషులు క్షీణించేవారుగా తయారవుతారు అని అర్థం.

ఒక సద్గురువు సాన్నిధ్యంలో నేర్వవలసినది ప్రథమంగా అదే. ఆయన మనకు ఉదయం సాయంత్రం ఆరు గంటలకు ప్రార్థన చేసుకోవలెను అని ఉపదేశిస్తారు. ఎందుకంటే ఇది సాయంసంధ్య, నీవు దినాన్ని సవ్యంగా ముగించాలి, పైలోకాల్లోకి ప్రవేశించాల్సిన సమయం ఆసన్నమైనది కాన ఇలా ముగించాలి అని. ప్రతి రాత్రి సుపర్ణులు నిన్ను తీసుకెళ్ళడానికి వస్తారు. అందుకు మనం తయారుగా ఉండాలి. ఆ విమానం ఎక్కితే సరాసరి పైలోకాల్లోకి మనల్ని తీసుకెళతారు. ఆజ్ఞా కేంద్రానికి వెళ్ళవచ్చు. కన్ను అంటే మనకు ఎడమ-కుడి కన్నులు గుర్తుకు వస్తాయి. ఈ రెండిటికీ మూలస్థానం మూడవ కన్ను. అదే జ్ఞాన నేత్రం. సూర్యమండలానికి రెండుకన్నులలో ఒకే కన్నుగా సూర్యుడు ఉంటాడు. ఆ కన్నుయొక్క కన్నములోనుండి అటువైపు నుండి వస్తాయి సూర్యకిరణములు.

సూర్యుణ్ణి మనం ఒక గ్రహంగా చూస్తాం. కానీ సూర్యుడు మనమేగా. సూర్యుడు ఒక ద్వారమే. అందులోనుండి అన్ని దైవీ గుణాలు వస్తాయి.

అందుకనే *"హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్"* అని చెప్పుకుంటాం. బంగారు కాంతితో వెలుగుతున్న డిప్ప కనిపించినట్టుగా ఉంటుంది అని దాని అర్థం. ఆ డిప్ప తీస్తే అటువైపు నుండి వచ్చేవి అన్నీ కనిపిస్తాయి. అవన్నీ సాయం సమయము నుండి 360 కోణాలుగా వస్తున్నాయి. అందుకనే హోమం చేసేటప్పుడు చివరి మంత్రంగా *"హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్"* పెట్టడం జరిగింది. ఈశావాశ్య ఉపనిషత్ లో రాయబడింది, "నేను సత్యము ధర్మము యందు ఆసక్తి కలవాడిని, నాకు ఆ మూతను తెరిచి చూపించు" అనే ప్రార్థన. అర్థం చేసుకునే ఆసక్తి ఉండాలి కానీ అదే ఆజ్ఞాచక్రములో ఉంది, ఆ బింబ దర్శనం. ఆ బింబం తీసేస్తే అనంతమైన బ్రహ్మాండం దర్శనమిస్తుంది. ఆ విశ్వంలోకి మనం ప్రయాణం చేయాలి. విశ్వరూపం అంటే గ్రహగోళాలు, గ్రహాలు, బ్రహ్మాండమూ చూడవచ్చు. అద్భుతంగా కనిపిస్తుంది. ఇది రాత్రి కథ.

సూర్యుడుగా నీవు ఆజ్ఞాచక్రంలో (అంటే నీ కన్నులో) ఉండగలవు. ఉన్న వెలుగులో ప్రవేశించటానికి ప్రయత్నం సాయం సంధ్య నుండి ప్రారంభించాలి. సూర్యమండలం నుండి సవితృ మండలంలోనికి, ఆదిత్య మండలంలోనికి ప్రయాణ మున్నది. వీరినే ఆదిత్య, సవిత, సూర్యః అంటారు. అది ఊర్ధ్వము నుండి మరల ఉదయం తిరిగి వచ్చే దారి. 360 కోణములనుండి దిగివచ్చే

అన్నిటితో ఈ సూర్యుణ్ణి తయారుచేస్తారు. నీ తండ్రిని చూసి నీవు ఏమి చేస్తావో, నిన్ను చూసి నీ కొడుకు కూడా అదే చేస్తాడు కదా. అలానే Cosmic Sun, Solar Sun and Planetary Sun ఈ ముగ్గురూ వస్తారు. బిందువు ఏర్పడితే మరో 360 కిరణాలు, కోణాలు వస్తాయి. అందుకే కన్ను అంటే సూర్యుడని అర్థం. మనలో సూర్యుని ప్రభావం వల్ల మన కన్నుల ఆరోగ్యం ఉంటుంది. కంటి ఆరోగ్యం పోయిందంటే వాడికి సూర్యుడి ప్రభావం సరిగా లేదని అర్థం.

ఈ శ్లోకాన్ని బాగా అవగాహన చేసుకోవాలంటే మనకు జ్యోతిష శాస్త్రంతో పరిచయం, అవగాహన ఉండాలి. ఈ జ్యోతిష శాస్త్రమును అనుసంధానం చేసుకోవాలి. "ఏకాం నాభిం" ఒకే కేంద్రము, "సప్తశత" ఏడు వందల, "వింశతి" 20 కోణములు, దీనిమీద అహోరాత్రాలూ అన్నీ జరుపబడుతూ ఉంటాయి. మనం కేంద్రంగా మనయందు అహస్సు దిగిరావడం, అవతరించడం, లేచి ఒక్కొక్క అరలోకి దిగి వస్తూ ఉంటాయి. అలా లేచీ లేవంగానే మనం శుద్ధప్రజ్ఞగా ఉంటాము. "శుద్ధస్ఫటిక సంకాశం" అని అంటారు కదా, అలా ఉంటాము. తరువాత క్రమంగా భావంలోకి వస్తాం, సంకల్పంగా జ్ఞానంలోకి దిగి, అందులోనుండి క్రియలోకి దిగుతాం. అక్కడ నుండి బుద్ధి ఆధారంగా మనస్సులోకి దిగి, మనస్సు ఆధారంగా ఇంద్రియాలలోకి, శరీరంలోకి దిగి అక్కడినుండి వెలుపలికి అంచెలంచలుగా దిగివస్తాము. అలా రావాలి, కానీ మనం అలా దిగిరాము. ఏవీ గుర్తుపెట్టుకోము కదా, బావిలో పడిపోయినట్టు ఉంటాం, ఉపమన్యువులాగా!

పూర్వకాలంలో దిగుడు బావులు ఉండేవి. వాటిలోకి దిగాలంటే మెట్టు మెట్టు దిగుతూ నీళ్ళ దగ్గరికి వెళ్ళాలి. కానీ బావిలో దూకేయకూడదు. ఉదయం లేచీలేవగానే అందులోకి పడిపోతాం. లేవంగానే నీవెవరితో అయితే దిగివచ్చావో, వారితోనే అనుసంధానం జరిగి తిరిగి పైకి రావాలి. నిద్రనుండి లేవగానే మనము ఈశ్వరుని నుండి మేల్కొంచాము అని భావించాలి. ఈశ్వర సంకల్పమే మనలను నడిపించాలని, తదనుగుణమగు జ్ఞానం కూడ ఈశ్వరుడే ప్రసాదించాలని, తగిన క్రియాశక్తిని గూడ ఒసగాలని ప్రార్థించి క్రమంగా శయ్య దిగాలి. బుద్ధియందు స్థిరపడి, క్రమంగా మనసును, యింద్రియములను, శరీరాన్ని అధిష్ఠించాలి. అపుడు ప్రపంచంలోనికి కదలాలి. గభాలున లేవటం, వడివడిగా కాలకృత్యాలు చేయటం, ఆదరాబాదరా తిని పరుగెట్టటం– బావిలో పడటం లాంటిదే. అలా జరుగకూడదు అని ఈ విద్య తెలుపుతోంది.

సంవత్సరంలో 360 ప్రాతః సంధ్యలు, 360 సాయం సంధ్యలు సద్వినియోగం చేసుకుంటూ కాలంతో అనుసంధానం గావించుకొని జీవించటం ఆర్య సంప్రదాయము. అలా జీవించే వారికి అశ్వినులు అందించే అమృతప్రాయమైన ఆనందం ఇహ పరములందు లభిస్తుంది.

*“అత్యతిష్ఠ ద్దశాంగుళం”* అని పురుషసూక్తం సూచిస్తుంది. అంటే పది అంశములుగా సృష్టి యందు పురుషుడు వున్నాడని అర్థము.

10. మనలో ఈశ్వరుడు.

9. మనము – ప్రత్యేకాత్మలు.

8. త్రిగుణములు – సత్త్వరజస్తమస్సులు.

7. బుద్ధి.

6. మనస్సు.

5 నుండి 1. పంచేంద్రియములు, పంచభూతములు, పంచ కర్మేంద్రియములు, పంచ ప్రాణములు– వీటితో తయారు చేయబడిన శరీరము.

మన సంఖ్య 10. అంతా ఒక శాల్తీగా కనబడుతుంది. ఈశ్వరుని నుండి ఉదయం మిగిలిన తొమ్మిదిగా మనలను గుర్తించాలి. మరల రాత్రి ఈశ్వరునిలోకే ప్రవేశించాలి. ఈ రహస్యము ఈ శ్లోకంలో తెలుపబడినది. గ్రహించాలి.

అందుకనే పూర్వకాలంలో సాయంత్రానికి అన్ని కార్యక్రమాలూ ముగించేవారు. ఆర్యుల సంప్రదాయం గురించి Annie Besant అనే మహాపండితురాలు 'Mission of the East' అనే పుస్తకంలో రాశారు. ఆర్యులు మధ్యాహ్నం రెండు గంటలకు కార్యక్రమాలన్నీ ముగించేవారు. అటునుంచి క్రమంగా తిరోధానం చేసేవారు. పడుకొని విశ్రాంతి తీసుకొని, మంచి సంప్రదాయమైన గృహాలకు కానీ, శుభకార్యాలు జరిగే గృహాలకు కానీ పరిచయం చేసుకొనేందుకు వెళ్ళేవారు. అక్కడ ప్రార్థన చేసుకొని సూర్యుడు అస్తమించే సమయానికి తిరుగు ప్రయాణం అయ్యేవాళ్లు. మళ్ళీ ప్రార్థన, క్లుప్తభోజనం చేసి నిద్రించేవారు. కొన్ని

సంప్రదాయాలలో సూర్యాస్తమయానికి ముందే ఆహారం కూడ తీసుకునేవారు. మళ్ళీ పడుకునే ముందు ఆహారం తీసుకోకుండా పాలో, మజ్జిగో తాగి పడుకునేవారు. మనం రాత్రి 10 గంటలకు బాగా భోజనం చేసి నిద్రిస్తే, రాత్రి నిద్రలో సుస్వప్నాలు రావు, violent గా ఉన్న దుస్వప్నాలు వస్తాయి. అందుకనే return journey గురించి రెండవ శ్లోకంలో ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. రాత్రిని దుర్వినియోగం చేయటం యోగానికి పరమ విరుద్ధం.

ఈ కార్యక్రమం రోజూ జరుగుతూ ఉండాలి. అందుకని పరమగురువు జ్వాలాకూలుడు తన బోధనలలో ఒక అద్భుతమైన వాక్యాన్ని రాశారు. "ఎలా పడితే అలా నిద్రపోకు, పశువైతేనే అలా చేస్తుంది, చక్కగా ఆజ్ఞా కేంద్రం చేరి భావన చేసుకుని పడుకోవాలి. దీనిని చక్కగా అభ్యాసం చేసుకోవాలి" అంటాడు. నీవెళ్ళాల్సింది అక్కడికే కాబట్టి అలా భావన చేసి పడుకోవాలి. ఉదయం అక్కడ నుండే రావాలి. ఇంటినుండి బయటకు వెళ్ళినవాడు ఇంటికే రావాలి కదా. దారిలో ఎక్కడో పడుకోలేరు కదా. ఉదాహరణకు, బెంగళూరులో ఉదయం వైట్ ఫీల్డ్‌కు వెళ్ళినవాడు తిరిగి రాకపోతే పోలీసులు వాడికోసం వెతుకుతారు కదా. అలానే సృష్టిలో కూడా పోలీసులు వెతుకుతారు, వారే మనల్ని వెతికి ఆజ్ఞా కేంద్రంలో పెడతారు. అది ప్రకృతి సహజం. వారు అలా ఎంతకాలమైనా నిర్వహిస్తారు. వచ్చి పడుకుంటే మనకు నిద్రపట్టనప్పుడు, నిద్రరాలేదని కలచివేసి, పక్కన బాగా నిద్రపోతున్న వాడి నిద్రను కూడా మనం పాడుచేస్తాం. అలా మన చిరాకును పక్కవాడికి కూడా మనం చేరుస్తాం. ఇవన్నీ మనం చేసేది ఆజ్ఞాచక్రం చేరకపోవడం

వల్లనే. హృదయం చేరి, క్రమంగా శ్వాస ద్వారా సుపర్ణుని చేరితే ఆయనే మనల్ని ఆజ్ఞా చక్రానికి చేరుస్తాడు. వీటన్నిటినీ మనం సాయంత్రమే సరిచేసుకోవాలి.

మన రోటీన్ ఎలా ఉంటుందంటే, ఎవ్వరూ సాయంత్రానికి ఇళ్ళు చేరరు. ఆహార స్వీకరణ చాలా విలంబనంగా రాత్రి 10 గంటల తరువాత చేసి, భయంకరమైన TV సీరియళ్ళు చూసి, ఒకరినొకరు నొచ్చుకుంటూ పడుకుంటాం. కొన్నాళ్ళు ఇలానే జరిగితే బుద్ధి నిన్ను వదిలేయటం జరుగుతుంది. నిద్ర పట్టకపోతే మళ్ళీ ఉదయం మెలకువ రాదు. ఉదయానికి లేవలేనివారు రాత్రి సమయానికి నిద్రపోనివారే ఉంటారు. ఆరు గంటల మంచి నిద్ర మనకు చాలు. మనకు ఉదయం సంధ్య, సాయం సంధ్య పోయి మనం రెండిటికీ చెడ్డ రేవడిలా తయారవుతాము, అయినాము. వాడి ముఖాన ఏమీ రాసిపెట్టలేదు. ఇదే వేద సంప్రదాయాలలో ఇచ్చారు. మనం దీనిని ఎంతవరకూ జీవితంలో పట్టుకు రాగలమో చూడాలి. అలా వచ్చేంత వరకూ యోగమందు మనకు ఆసక్తి తప్ప అభివృద్ధి లభ్యం అవ్వదు. ఇన్నీ తెలిసి నశించిపోతూ ఉంటాము. అలా జరగకూడదనే ఋషులయొక్క ఆకాంక్ష. “ఒకే చక్రం చుట్టూ 720 అరలు ఏర్పరచబడి ఉన్నవి, దాని కన్నము యిరుసుగా చక్రమును అశ్వినులు జీవుల ఆనందము కొరకు అమర్చి త్రిప్పుతూ ఉన్నారు, ఆ చక్రము అమరము, అజరము– అనగా శాశ్వతముగా నున్నది. ముసలితనము లేదు.

మంత్రము - 7 :

**అశ్వినా విందు మమృతమ్ వృత్తభూయో**
**తిరోధత్తా మశ్వినౌ దా సపత్నీ ।**
**హిత్వాగిరి మశ్వినౌ గా ముదాచరంతౌ**
**త ద్వృ ష్టి మహ్నా ప్రస్థితౌ బలస్య ॥**

**టీక :**

అశ్వినౌ = అశ్వినీ దేవతలు; ఇందుం = చంద్రుని; అమృతం = అమృతముగా; వృత్త భూయః = తమ ప్రవర్తనము నుండి మరల పుట్టించుచు; తిరోధత్తాం = మాయము చేయుచున్నారు; దా = విడదీయుచు; సపత్నీ = సమానమైన పాతనమును కలిగించుచున్నారు; గిరిం = ఉదయ పర్వతమును; హిత్వా = విడిచి; గాం = భూమిని (లేక కిరణమును); ఉత్+ఆచరంతౌ = పైకి చరించుచున్నవారై; తత్+బలస్య = ఆ బలమునకు; అహ్నా = అహస్సుచేత; వృష్టిం = వర్షమును; ప్రస్థితౌ = ప్రయాణము చేయుచున్నారు.

**తాత్పర్యము :**

అశ్విను లిద్దరును వృత్తాకారమైన గమనమును కల్పించి, చంద్రుని పుట్టించుచు మాయము చేయుచుండుటలో అమృతత్త్వమును సాధించు చున్నారు. భూమి చుట్టును కనిపించు గ్రహగోళముల మార్గమును రెండు సమభాగములుగా (సౌర, చాంద్ర విభాగములు) విడదీయుచున్నారు. దానివలన కిరణ స్వరూపులై గ్రహములు తూర్పున ఉదయించి మీదికి ఆరోహించుట, పడమట అస్తమించుట చేయగలుగు చున్నారు. ఇట్టి గమన సామర్థ్యమును, దానికి కావలసిన బలమును అశ్వినులు తమయందు కల్పించి ఈ భూమి జీవులపై కిరణములను వర్షమును ప్రసరింపజేసి పోషించుచున్నారు.

**వివరణము :**

అశ్వినీదేవతల స్తోత్రముగ వేదవ్యాస మహర్షి మనకందించిన యీ మంత్రములు విశేషముగ సూర్యమండల, భూమండల వైభవమును ఆవిష్కరిస్తూ వున్నవి. వృత్తాకార గమనమును సృష్టియందు ఏర్పరిచినవారు అశ్వినులు. 4వ మంత్రమున సంవత్సర చక్రమందుగల 300 ధేనువులు, 60 గోవులు, వెరసి 360 కోణములలో సూర్యుడను ఆవు పొదుగు నుండి భూమిపై నలుచెరగుల, దూడకు క్షీరమందించినట్లు తెలిపినారు. ఎట్లు సంవత్సరము ద్వారా భూమిని సమృద్ధము గావించుచున్నారో తెలిపినారు.

5వ మంత్రమున సంవత్సరమందలి 360 దినములలో గల ప్రాతః సంధ్యలు (360), సాయం సంధ్యలు (360) కలిపి 720 సంధ్యల వినియోగము గావించుచున్నారో తెలిపినారు. చిత్తవృత్తులయందు అశ్వినులుగ జీవులను సృష్టియందు పగటి కాలము ప్రవేశింపచేయుట, సుపర్ణులుగ రాత్రి కాలమందు చిత్తవృత్తుల నుండి జీవులను విముక్తులుగ చేయుట యందలి వారి నేర్పరితనమును వివరించినారు.

6వ మంత్రమున, సూర్యుని కన్నుగ నేర్పరిచి, సవితృ మండలము నుండి సూర్యమండలము లోనికి ఆరు(6) గ్రహ ప్రవృత్తులను 6 నాభులుగ, సుడిగుండములుగ ఒకే ప్రజ్ఞను ఆరు విధములుగ నేర్పరిచి వైవిధ్యమగు అనుభూతిని జీవులపై ప్రేమతో అందించుచు ఎట్లు ఆనందించుచున్నారో తెలుపబడినది. అట్లే సూర్యప్రజ్ఞకు ద్వాదశ (12) భావములు ఏర్పరిచి, 12 మాసములను

సంక్రమణములుగ మరింత వైభవమును, వైవిధ్యమును యిచ్చి జీవుల ఆనందమును ఎట్లు వృద్ధి చేయుచున్నారో తెలుపబడినది.

సూర్యమండల విశేషములు భూమిపై జీవులు అనుభవించుచున్నారే కాని, వాని వైభవము తెలియక, రసానుభూతిని పొందలేక, విషాదమున ఎట్లు పడియున్నారో ఉపమన్యువు నుదాహరణముగ మనకు తెలుపుట ఈ మంత్రముల యుద్దేశ్యము.

అట్లే 7వ మంత్రమున మరికొన్ని విశేషములను పరిచయము చేయుచున్నారు. భూమిచుట్టును జరుగుచున్న చంద్ర గమనము వలన ఏర్పడుచున్న వైభవము ఈ మంత్రమందు అందించు చున్నారు.

6 గ్రహముల వృత్తాకార గమనము అశ్వినుల వలననే. భూగమనము గూడ అశ్వినుల వలననే. రాహుకేతువుల ప్రభావము గూడ అశ్వినుల వలననే. ఇందు చంద్రుని గమనమొక ప్రత్యేక గమనము. చంద్రుడు గూడ యితర ప్రజ్ఞలవలె అమృతత్వ స్థితి గలవాడైననూ, అతడు మాసమందు హాని వృద్ధులు కలిగి యున్నాడు. మరణించినట్లు అదృశ్యమగును. పుట్టినట్లు గోచర మగును. అమావాస్య కదృశ్యమగుట, పాడ్యమి – విదియలలో దృశ్యుడగుట, పౌర్ణమికి పూర్తిగ పెరుగుట, మరల క్రమముగ క్షీణించుట యిత్యాదివి గోచరించును. మనస్సు ప్రధానముగ జీవించు మానవులు గూడ యిట్లే హాని వృద్ధులకు గురియగుట, జనన మరణము లనుభవించుట జరుగుచున్నది.

కాని, చంద్రగమనమందలి హాని వృద్ధుల వలన, భూమిపై వర్షములు పడుట, విత్తనములు మొలకెత్తుట, భూమిపై ప్రాణికోటి

అనేక వనరుల వలన సుఖించుట, సస్యములను, ఓషధులను, ఫలములను, కూరలను, దుంపలను పొందుట జరుగుచున్నది. అట్లే గర్భధారణము, జీవోత్పత్తి, వారి పెరుగుదల యిత్యాది కార్యములు జరుగుచున్నవి. తిథులు, నక్షత్రములు తమదైన వైవిధ్యానుభూతి నిచ్చుచున్నవి.

ప్రతి మాసము సోముని నుండి, ఇంద్రుని నుండి, శుక్రుని నుండి గూడ అమృతమును 15 తిథులలో శుక్ల పక్షమున సేకరించి, కృష్ణ పక్షమున భూమికి, భూమి జీవులకు సంతర్పణ చేయు యజ్ఞమును అతి వైభవముగ నిర్వర్తించుచున్న వాడు చంద్రుడు. కనుకనే పరమేశ్వరుని వాత్సల్యమును అనుభవించుచు అతని శిరస్సు నలంకరించి యున్నట్లుగ పురాణములు పొగడుచున్నవి.

ఇట్లు వైవిధ్యముగల సంచారము చంద్రునికి ఏర్పరిచినట్లు అశ్వినులను కీర్తించుట ఈ మంత్రముయొక్క ఉద్దేశ్యము.

చంద్రుని గమనములో మరో విశేషము– అతడు నిర్దిష్ట మార్గములో చరించడు. పీతవలె అడ్డదారులలో కొంత ప్రవేశిస్తూ, కొంత వేగముగను, కొంత నెమ్మదిగను సంచరిస్తూ వుంటాడు. చిన్న స్వతంత్రబుద్ధి ప్రదర్శిస్తాడు మనలా. ఇతర గ్రహములవలె వలయమునకు పూర్తిగా కట్టుబడడు. ఇతర గ్రహ ప్రజ్ఞలవలె స్థిరత్వము కలిగి యుండడు. కనుకనే శివ సాన్నిధ్యము ఎక్కువ అవసరమైనది. మనలో కూడ నిశ్చలత్వము, స్థిరత్వము లోపించినవారు 'శివ పంచాక్షరి' ని ఆశ్రయించటం అవసరము. శివుడు స్థాణువు. అతనికున్న స్థిరత్వము మరి ఏ యితర దేవతలకు, ఋషులకు కూడ లేదు.

మరియొక విషయము. మొత్తము సృష్టికి మూలముగా నున్న అశ్వినీ జంట ప్రజ్ఞలే సృష్టియందలి స్త్రీ – పురుష ప్రజ్ఞలు. అందు పురుష ప్రజ్ఞ సూర్యాత్మకముగను, స్త్రీ ప్రజ్ఞ చంద్రాత్మకము గను పనిచేయుచు నున్నవి. అందువలన చంద్రప్రజ్ఞ యందు వైవిధ్యము, చలనము, హాని వృద్ధులు, స్వతంత్రగమనము యిత్యాదివి ద్యోతకమగును. సూర్యప్రజ్ఞ ఆత్మ తత్త్వమై ప్రకాశింపగ, చంద్రప్రజ్ఞ ఆత్మానుభూతిగ ఆనందము గొలుపును. చంద్రప్రజ్ఞ లేనిదే రసానుభూతి యుండదు. సృష్టి ప్రయోజనము జీవాత్మలకు ఆనందము కలిగించుటయే !

అట్టి చంద్రుడు అనుభూతిని యిచ్చుటకు వివిధ ప్రజ్ఞలకు వాహికగ యున్నాడు. ప్రధానముగ సూర్యకాంతిని గర్భితము గావించి తనద్వారా జీవులకు, ఇంద్రియముల ద్వారా పరిసరముల అనుభూతి నందించుచూ నుండును. దేహానందము, ఇంద్రియానందము యిచట చంద్రుడు అందించు అనుభూతి.

అటుపైన శుక్రునికి ప్రతినిధిగ నిలచి, శుక్రస్పర్శ నందించి అంతరంగానందము నిచ్చుచు యున్నాడు. అంతరంగానందము, అంతరంగ వికాసము కలిగించు చున్నాడు. ఋషులు అట్టి ఆనందమును అనుభవించుచూ నుందురు. మరియు ఇంద్రుని (Neptune) ప్రతినిధిగ ఇంద్రతరంగముల స్పర్శనిచ్చి దివ్యమగు తన్మయ స్థితులను ప్రసాదించు చున్నాడు. జగద్గురువు మైత్రేయుడు, గౌతమబుద్ధుడు అట్టి తన్మయత్వమును తరచు అనుభవింతురు. యింకనూ సోముని ప్రతినిధిగ సోమస్పర్శ నందించి జీవులకు అమృతత్త్వ ప్రాప్తిని కలిగించు చున్నాడు. ఇట్లు జ్ఞాతాజ్ఞాతముగ చంద్రప్రజ్ఞ జీవులకొరకు ఎనలేని సహాయ మందించుచున్నది.

ఇంకొక ముఖ్య విషయమేమన అశ్వినులు శుక్రం - అసితం అగు తెల్లని నల్లని దారములను మంచి పగ్గము మార్గమున నేతపని చేయుచున్నారని రెండవ మంత్రమున వివరింపబడినది. రాత్రి నల్లని దారముల నేత, పగలు తెల్లని దారముల నేత నిర్వర్తించు చున్నట్లుగా తెలుసుకొని యున్నాము. వాని ప్రభావము సూర్యమండలమందలి 12 రాశులపైనను, 5 గ్రహములపైనను చూపును (5 గ్రహములనగా సూర్య, చంద్రులను మినహాయించి మిగిలిన గురుడు, శుక్రుడు, బుధుడు, కుజుడు, శనైశ్చరుడు).

కనుక గ్రహసంచారమున కొన్ని గ్రహములు పగటి యందు, కొన్ని గ్రహములు రాత్రియందు సంచరించు చుండుట వలన వారి స్థానములను బట్టి ఆ గ్రహముల యందలి సూర్య చంద్రాత్మక తత్త్వములు పనిచేయుచుండును. గోచారమును నిత్యము పరిశీలించువారికి ఈ విషయము అవగతమగును. అట్లే 12 రాశులను కూడ కొంతకాలము పగలు, మరికొంత కాలము రాత్రి యందు దర్శింపబడును. కనుక ఆ రాశి భావములయందలి సూర్య చంద్రాత్మక తత్త్వములు భ్రమణమున తగురీతిన భూమికి అందించు చుండును.

అనుభూతి జీవుల కందించుటకు పగలు కన్న రాత్రియే ఎక్కువ అనువుగా నుండును. దివ్య దర్శనములు, సూక్ష్మ దర్శనములు చంద్రకాంతి యందే యుండునుగాని మిట్ట మధ్యాహ్నము యుండుటకు అవకాశము లేదు. విశేష గమనము చంద్రునికి ఏర్పరిచి అశ్వినులు అనంత వైభవమును జీవులకు అమర్చినారు. ఇది ఈ మంత్రమునకు క్లుప్తముగ వివరణము.

**మంత్రము - 8 :**

**యువాం దిశో జన యధో దశాగ్రే**
**సమానం మూర్ధ్నిరథయానం వియంతి ।**
**తాసాం యాత మృషయోఽనుప్రయాంతి**
**దేవా మనుష్యాః క్షితి మాచరంతి ॥**

**టీక :**

అగ్రే = మొదట; దశదిశః = పది దిక్కులను; యువాం = మీరిద్దరు; జనయధః = పుట్టించుచున్నారు; మూర్ధ్ని = శిరస్సుపైన; సమానం = కొలతలతో కూడినట్టి; రథయానం = ఈ సూర్య రథముయొక్క ప్రయాణమును; వియంతి = విశిష్టముగా పొందుచున్నారు; తాసాం = ఆ దిక్కుల యొక్క; యాతం = దారిని; ఋషయః = ఋషులును; దేవాః = దేవతలును; అనుప్రయాంతి = అనుసరించి ప్రయాణము చేయుచున్నారు; మనుష్యాః = మనుష్యులు; క్షితిం = భూమిని; ఆచరంతి = అన్నివైపుల యందును చరించుచున్నారు.

**తాత్పర్యము :**

మీరిద్దరును మొట్టమొదటగా పది దిక్కులను పుట్టించు చున్నారు. నెత్తిపై మధ్యాహ్నమును కల్పించి సరియైన కొలతలతో సూర్యుని రథమున ప్రయాణము చేయుచున్నారు. ఋషులును, దేవతలును ఆ దారి వెంటనే నడచుచున్నారు. మనుష్యులు మాత్రము భూమిపై ఇష్టము వచ్చినట్లు అన్ని దిక్కులలో చరించుచున్నారు.

**వివరణము :**

అశ్వినీ దేవతలు ఈ భూమిని వృత్తాకారముగా తిప్పుతూ ఉంటే మనకు ఏమి జరుగుతుంది అంటే సూర్యుని యొక్క రథం మన (భూమి) చుట్టూ తిరుగుతున్నట్లు గోచరిస్తుంది. సూర్యుడు తూర్పున ఉదయించి, మిట్టమధ్యాహ్నం నడినెత్తిపై చేరి, పశ్చిమమున అస్తమిస్తున్నట్లుగా గోచరిస్తుంది. సూర్యుడు అర్ధరాత్రి మన పాదాల క్రింద ఉన్నట్లు గోచరిస్తుంది. మళ్ళీ మనకు తూర్పున ఉదయించినట్లు కనిపిస్తుంది. ఇది భూభ్రమణం వల్ల మనకు సూర్యుడు కదిలినట్లు కనిపిస్తుంది.

మధ్యాహ్న సమయంలో తూర్పుకి, పడమరకి సూర్యుడు మధ్యగా ఉంటాడు. కొలతలో తూర్పు, పడమర నడినెత్తిగా కనిపిస్తాడు. అలాగే ఊర్ధ్వము, అధస్సు ఏర్పడుతుంది. మనం తూర్పునకు ఎదురుగా నిలబడి చూస్తే మనకు సూర్యుడు ఎదురుగా కనపడతాడు. మన వెనుక పశ్చిమం ఉంటుంది. మన నడినెత్తి పైన అధస్సు ఉంటుంది. కుడి చేతివైపు దక్షిణం ఉంటుంది. ఎడమ చేతివైపు ఉత్తరం ఉంటుంది. అందుకనే మన కుడి చేతిని దక్షిణ హస్తం అని చెప్తారు. ఇది మనకు సులభంగా అర్థమయ్యే విషయం కదా! ఇలా మనం నాలుగు దిక్కులు చూసుకుంటూ ఉంటాము. ఈ నాలుగు బిందువులు కలిపితే మనకు Diamond ఆకారం వస్తుంది కదా! దాని చుట్టూ వృత్తాకారంగా తిరుగుతున్నట్లు



ఉంటుంది. అదే Perfect Symbol. మన భూమికే గాక అన్ని గ్రహ గోళాలకు ఇది ఉంటుంది.

ఈ సూర్యుని మార్గాన్ని అనుసరించడం అనేది గ్రహ గమనం. సూర్యుణ్ణి అనుసరించే అన్ని గ్రహగోళాలు పరిభ్రమిస్తాయి. అంతరిక్షాన్ని మనం గమనిస్తే సూర్యుణ్ణి అనుసరించే అన్ని గ్రహాలు పరివర్తనం చేస్తాయని గ్రహించగలము. వాటి వాటి మార్గాలలోనే (కక్ష్యలు) అవి పరిభ్రమిస్తాయి. సూర్యుడు భూమధ్యరేఖ పైనే తిరుగుతున్నట్లు కనిపిస్తాడు. మన భూగోళానికి భూమధ్యరేఖ, కర్కాటక రేఖ, మకర రేఖలు ఉన్నాయి కదా! ఈ మూడు రేఖలు మనకు గోళంపై కనిపిస్తాయి. మన భూమి పరిభ్రమణం వల్ల సూర్యుడు భూమధ్యరేఖకు కొంతకాలం ఉత్తరంగా, కొంతకాలం దక్షిణంగా కనిపిస్తాడు. ఉత్తరంగా కర్కాటక రేఖకు రావడం, దక్షిణంగా మకర రేఖకు రావడం జరుగుతున్నది. ఇది మనం గమనిస్తాము. ఈ సూర్యగమనం వల్ల కర్కాటక రేఖ, భూమధ్యరేఖ, మకర రేఖ కలిపి ఒక belt గా ఏర్పడినట్లు మనకు తెలుస్తుంది. మీరు గ్లోబు చూసుకుని అర్థంచేసుకోవాలి.

సూర్యుడు మకర రేఖను స్పృశించినప్పుడు 'ఉత్తరాయణము' (Winter Solstice) అంటాము. కర్కాటక రేఖను స్పృశించి నప్పుడు 'దక్షిణాయనము' (Summer Solstice) అంటాము. మనం ఈ సమయాలను Dec 22, June 21 గా గుర్తిస్తాము కదా! కర్కాటక రేఖ, భూమధ్యరేఖ, మకర రేఖ ఈ మధ్య భూభాగంలో మనకి సూర్యుని గమనం ఆరు నెలలు ఉత్తరం వైపు, ఆరు నెలలు దక్షిణం వైపు కదులుతున్నట్లు గోచరిస్తుంది. ఇది మనం ముఖ్యంగా తెలుసుకోవలసిన విషయం. మన భూగోళ పరివర్తనం.

మనకు మూలం సూర్యుడే కదా! మనకు మూలమైన వాడు మన చుట్టూ అలా తిరుగుతున్నట్లు కనిపిస్తాడు. కాని ఆయన తిరగడం లేదు. మనమే తిరుగుతున్నాము. ఎందుకంటే మన భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుంది కదా! ఈ భూగోళం కొంచెం ఏటవాలుగా తిరగడం వల్ల మనకి సూర్యగమనం ఉత్తర, దక్షిణ మార్గాలుగా తిరుగుతున్నట్లు గోచరిస్తుంది. మనకు May నెలలో సూర్యుడు తూర్పున ఉత్తర దిశవైపు కనిపిస్తాడు. September నెలలో సూర్యుడు తూర్పున దక్షిణ దిశవైపు ఉత్తర దిశ వైపుకు మధ్యలో కనిపిస్తాడు. అంటే మనకు ఉత్తర, దక్షిణ దిశలకు మధ్యభాగంలో గమనం ఉంటుంది. అలా Decలో దక్షిణ దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తుంది. అందుకే ఈ కర్కాటక రేఖ, భూమధ్యరేఖ, మకర రేఖల ప్రాంతం ఒక beltగా ఉంటుంది. సూర్యుడు ఈ ప్రాంతంలోనే గమనం చేస్తుంటాడు కాబట్టి సూర్య కాంతి ఈ ప్రాంతంపైనే ఎక్కువగా పడుతుంది. ఉత్తర, దక్షిణ ధ్రువాలకు సూర్యకాంతి ఎక్కువగా పడదు. సూర్యుని గమనం ఉత్తరంగా వెళ్ళినప్పుడు ఆరు నెలలు వారికి సూర్యకాంతి (పగలు) ఉంటుంది. దక్షిణం వైపు వెళ్ళినప్పుడు ఆరు నెలలు చీకటి (రాత్రి) ఉంటుంది. అలాగే దక్షిణ ధ్రువానికీ జరుగుతుంది. కానీ నిరంతరం సూర్యకాంతి పడే ప్రాంతం కర్కాటక రేఖ, మకర రేఖల నడుమ ప్రాంతం. ఈ ప్రాంతమందు సమశీతోష్ణ స్థితి యుంటుంది. ప్రాణశక్తి అధికముగా లభిస్తుంది.

ఈ సమశీతోష్ణ స్థితి ఉండే ప్రాంతంపైనే సూర్యకాంతి బాగా ప్రసరిస్తుంది. అక్కడ ఎక్కువ ప్రాణికోటి ఉంటుంది. పాడిపంటలు, ఫలములు, పుష్పములు ఎక్కువగా పండుతాయి. Denmark,

Sweden లాంటి ఉత్తర ధ్రువాలకు గాని, దక్షిణ ధ్రువ ప్రాంతాలకు గానీ వెడితే అక్కడ పంటలు పండవు. వారు సమశీతోష్ణ స్థితి ప్రాంతాలనుండి ఆహారము తెచ్చుకోవలసిన అగత్యం ఉంది. మన భూగోళంలో ఐరోపా ఖండం అంతా కర్కాటక రేఖ పైభాగంలోనే ఉంది. దక్షిణ భూభాగంలోని Argentina నుండి క్రిందిభాగం మకర రేఖ కన్నా క్రింద ఉంటుంది. ఈ దక్షిణ, ఉత్తర ధ్రువ ప్రాంతాలలో ఏవీ పండవు. చాలా భూభాగం మంచుతో కప్పబడి ఉంటుంది. వృక్ష సంపద, జంతు సంపద తక్కువ. వారికి దోమలు, క్రిమి కీటకాలు కూడా ఉండవు. ఎందుకంటే అవి జీవించడానికి అనువైన వాతావరణం వుండదు. సమస్త ప్రాణికోటి సమశీతోష్ణ స్థితి ప్రాంతం (Tropic) లో ఉంటాయి. అక్కడే సులభంగా జీవించగలవు.

మన నాగరికతలు అన్నీ ఆ ప్రాంతంలోనే ఆచరింపబడి క్రమంగా ఉత్తర, దక్షిణాల వైపుకు వెళ్ళాయి. జీవకోటి అంతా ఈ ప్రాంతంనుండే ఉత్తర, దక్షిణాలకు వెళ్ళింది. ఆహారం కావాలంటే వారికి ఈ సమశీతోష్ణ స్థితి ప్రాంతాలనుండే వెళ్ళాలి. ప్రాణికోటి కూడా అంతంతమాత్రంగానే ఉంటుంది. కాబట్టి సూర్యగమనం ప్రాంతంలోనే ఋషులు కూడా తిరుగుతుంటారు. పై ప్రాంతాలకు తరచుగా వెళ్ళడం జరుగుతుంది. ఎందుకంటే వారు సూర్యుని అనుసరించడంవల్ల. వారు దీనివల్ల ఉత్తమోత్తమమైన లోకాల అనుభూతి పొందుతారు.

సూర్యుని గమనాన్ని అనుసరించి దానికి అనుగుణంగా సాధన చేసుకోనివారు ఈ భూమి మీద నశిస్తూ ఉంటారు అని ఈ శ్లోకం, ప్రధానంగా హెచ్చరిస్తూ వుంది. ఇప్పుడు జ్యేష్ఠ మాసంలో

సూర్య సంచారం ఉన్నది ఈ మాసంలో సూర్య సంచారం వలన మనకు సూర్యుడు ఎలాంటి ప్రయోజనాలు అందిస్తున్నాడో తెలుసుకోవాలి. అలాగే మీరందరూ ఏదో మాసంలో జన్మించి ఉంటారు కదా! ఆ మాస విశేషం తెలుసుకోవాలి. ఈ పన్నెండు మాసాలలో మనం ఏదో ఒక మాసంలో జన్మించాము. ఆ మాసం ప్రజ్ఞ ఏమిటి? అనేది తెలుసుకోవాలి. వృషభ మాసంలో పుట్టాడు అనుకుంటే ఆ మాసం ప్రజ్ఞ ఏమిటి? అనేది తెలుసుకుని జీవించడానికి ప్రయత్నం చేయాలి. అలానే జన్మించిన సమయంలో ఆరూఢ ఏ రాశిలో ఉన్నదో తెలుసుకోవాలి. అంటే ఆ సమయానికి ఏ లగ్నం ఉదయిస్తోందో తెలుసుకోవాలి. అదే నీ కర్తవ్యాన్ని తెలుపగలదు. అదే మన జాతకంలో ఆరూఢ లగ్నం అని చెప్తాము. నీవు ఏ రాశిలో, ఏ లగ్నంలో జన్మించావో దాన్ని బట్టి జాతకంలో నీ కర్తవ్యం నిర్దేశింపబడి ఉంటుంది, దానిని అనుసరించి నీవు నడుచుకోవాలి. ఉదాహరణకు నీవు సింహ లగ్నంలో జన్మిస్తే సింహరాశికి అనుగుణంగా నడుచుకోవాలి. అలాగే జననంలో చంద్రుడు ఏ రాశిలో ఉన్నాడో తెలుసుకోవాలి. అది నీకు ఇదివరకటి అనుభవం ఎలా ఉంది? మనం ఎలా మారాలి? అనేది తెలుపుతుంది. అందుకే **జ్యోతిషం వెలుగులను అనుసరించడానికి మాత్రమే కాని ఇతర విషయాలకు కాదు.** ఏమీ తెలియకుండా అంతా తెలుసునన్న భావనలో మెలిగే మానవులు నశించటం ఖాయం.

నీవు జ్యోతిషాన్ని వెలుగులను అనుసరించడానికి ఉపయోగించుకోవాలి. ఈ జన్మలో మనం వృశ్చికరాశిలో జన్మించాము అనుకుంటే లోపల చాలా గుప్తంగా ఉండాలి. నీకు ఆరూఢ

లగ్నం ధనూరాశిలో ఉంటే ఈ జీవకోటిలో నీవు ఎంతమందికి సహాయకారిగా ఉంటే అంత వైభవంగా ఉంటుంది. చంద్రుడు ఎక్కడో తులారాశిలో ఉంటే జ్ఞానము, ఆసక్తి ఉండవచ్చు లేకపోతే ప్రపంచమునందు ఆసక్తి ఉండవచ్చు. (Passion for Material / Passion for Spiritual Knowledge). చంద్రుడు ఎలా ఉన్నాడు? అని పరిశీలన చేసి అలా మనం నడుచుకోవాలి. చంద్రుడు మన భూతకాలం చెప్పగలడు. మన మనస్సు ఎప్పుడూ వెనక్కు వెళ్ళిపోతూ ఉంటుంది. అంటే మనము వెనుక జరిగినదే బాగుంటుంది అని అనుకుంటాము కదా! అంతకు ముందు జన్మలో మన భావాలను మనకు అందిస్తూ ఉంటుంది. అందుకనే కొంతమందికి కొన్ని కూరగాయలపై ఇష్టం ఉంటుంది. మరి కొంతమందికి ఇష్టం ఉండదు. కనుక ఇప్పుడు ఆ ఇష్టాయిష్టాలే మనకు తారసపడుతూ ఉంటాయి. ఇప్పుడు కూడా ఆ కూరగాయలే తినాలనిపిస్తుంది. ఆ పరిమితి మనకు ఎందుకు ఉండాలి. ప్రస్తుతం దేనిలోకి మార్చుకోవాలో నీ యొక్క జన్మలగ్నం తెలుపగలదు.

మన మనస్సు ఎప్పుడూ పాత విషయాలను సమీకరించి అవే మనకు మంచివి అని అనిపింపచేస్తూ ఉంటుంది. దీనికి కారణము చంద్రుడు కాబట్టి జరిగిన అనుభూతి ఉంటుంది. మరి దానికి పరిమితత్వము ఉంటుంది. కాబట్టి మన మనస్సు కొన్ని ఇష్టాయిష్టాలు ఏర్పరచుకుంటుంది. మన ఆరూఢ లగ్నం ఏ రాశిలో ఉందో ఆ రాశి లక్షణం చూసుకుంటే మన ఇష్టాయిష్టాలలో అయిష్టాలు తెలుసుకుని రెండింటినీ సమాన స్థితిలోకి, తటస్థ స్థితిలోకి తెచ్చే ప్రయత్నం చేస్తుంది. అది నీ జన్మ

లగ్నం తెలుపగలదు. దాన్ని అనుసరిస్తూ, సూర్యుడు ఏ రాశిలో ఉన్నాడో దాన్ని చూసుకుని మసలాలి. ఏది ఏమైనప్పటికీ ఆరూఢ లగ్నం అంటే నీవు జన్మించిన సమయానికి సూర్యుడు ఏ రాశిలో ఉదయిస్తాడో అది.

అర్జునుడి లగ్నం ధనుస్సు. ఆయనకు సూర్యుడు ధనుస్సులో ఉన్నాడు. కాబట్టి అతడు తన తోటి వారందరికీ ఉపకరించేటట్టు జీవించాడు. ఒక్కొక్క రాశికి ఒక్కొక్క స్వభావం ఉంటుంది. మేషరాశి లగ్నం అయితే నీవు చక్కగా, పారదర్శకంగా పరిపాలించి, అందరికీ ఆశ్రయమై ఉంటావు. నీ పైన చాలామంది ఆధారపడి ఉంటారు. వారందరికీ నీవు ఎంత సేవ చేయగలిగితే నీకు అంత జీవన సౌలభ్యం వస్తుంది. అలా పన్నెండు రాసులకు స్వభావాలు ఉంటాయి. ఆ రాశి తత్త్వమును అర్థం చేసుకుని, సూర్యుడు ఏ రాశిలో ఉన్నాడో తెలుసుకుని, దాన్ని అనుసరించి నీ లగ్నం ఏ రాశిలో ఉందో దాన్ని సమన్వయపరచుకుని, నీ మనస్సును అనుసరించక తగు శిక్షణ నిస్తూ మసలుకోవాలి. మనస్సును అనుసరిస్తే మనకు పాత స్వభావాలే ఉండగలవు. మనం ఉగాది పండుగకు కొత్త దుస్తులు ధరించినా ఆలోచనలు పాతవేగా. అది మనస్సు వల్ల. వాడికి కొత్త సంవత్సరము. కానీ కొత్త జీవితము ఉండదు.

ఇలా మనం ఎన్ని జన్మలు ఎత్తినా కొత్త జీవితం రాదు. కాబట్టి మనం అంతకన్నా ఉన్నతమైన భావాలలోకి ప్రవేశించాలి. అలా మనం ప్రవేశించడానికి మనకు ఆదర్శంగా ఋషులు ఉన్నారు. దేవతలు ఉన్నారు. ఈ దేవతలు, ఋషులు అలా

సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటారు. అతని రథం ముందు భాగంలో నడుస్తూ ఉంటారు. సూర్యుని గమనం ముందు అలాంటి జ్ఞాన సముదాయం నడుస్తూ ఉంటుంది.

మనకు సూర్యుడు ఉదయిస్తున్నాడు అంటే అవగాహన సరిగ్గా లేదు. కానీ మన వేదాలు ఆ వైభవాన్ని చాలా అద్భుతంగా వివరించాయి. అది ఎలా ఉంటుందో నేను మీకు "THE SUN" అనే పుస్తకంలో వివరంగా తెలుపడం జరిగింది. అందరూ బాగా చదివి సూర్యుని గమన వైభవం ఎంత మనోహరంగా, గంభీరంగా ఉంటుందో తెలుసుకోగలరు.

ఈ పుస్తకానికి జర్మనీ దేశంలో చాలా ప్రాశస్త్యం వచ్చింది. వారు చదివి ఇంతవరకు ఈ విషయాలు ఎవరూ తెలుపలేదని చెప్పారు. ఈ పుస్తకంలోని విషయాలు చాలా అద్భుతంగా ఉన్నాయి. మేము జీవితాంతం అనుసరిస్తాము అని తెలిపారు. కానీ నేను, నన్ను కాదు అనుసరించవలసినది, సూర్యుణ్ణి అనుసరించాలి అని తెలుపడం జరిగింది. "Eternal Kingdom" అంటాము కదా! మనం సూర్యుని అనుసరిస్తే ఆ సామ్రాజ్యంలో ప్రవేశిస్తాము. ఏ సద్గురువు కాని, మహాత్ముడు కానీ చెప్పినా దాని యొక్క మూలం సూర్యుడే. మనం గాయత్రి చేసినా అందులో సూర్య భగవానుడే కదా! అందుకనే మనం సూర్యుణ్ణి అనుసరించాలి అని చెప్పింది. నేను సూర్యుణ్ణే అనుసరిస్తానని వారికి తెలిపాను.

అంతరిక్షంలోని దేవతలు, ఋషులు సూర్యుణ్ణే అనుసరిస్తారు. మనకు మాత్రం ఎంతసేపూ మరో ఆలోచనలే తప్ప సూర్యుడు మనసులోకి రాడుగా. అలాంటి సూర్యుడు ప్రతినిత్యం

మనకు దర్శనం ఇస్తున్నాడు కదా! ఆ వైభవం సూర్యోదయంలో మనం రోజూ ఆనందించవచ్చు. సూర్యుని రథానికి ముందు 60,000 మంది ఋషులు నడుస్తుంటారు. వారి వెనుక యక్షులు. రకరకాల రంగుల కాంతులతో సూర్యుని గమనం మనకు తెలుపుతారు. వారి వెనుక గంధర్వుల నృత్యము, గానము, కాంతులు కనిపిస్తాయి. తరువాత అప్సరసలు నృత్యం చేస్తూ నడుస్తారు. (ఈ విషయాలన్నీ చూచి ఆనందించాలంటే మనం కోణార్క దేవాలయం సందర్శించాలి. మీలో ఎంతమంది చూశారో తెలియదు. కానీ వేదాలలో వర్ణించిన పద్ధతిలో ఆ సూర్య రథ గమన వైభవం ముందు ఎవరెవరు ఎలా నడుస్తూ ఉంటారో తెలియజేసే విధంగా దేవాలయం గోడలపై చెక్కబడినది. మన దురదృష్టంకొద్దీ దానిని మనం శిథిలం చేసుకున్నాము. వైభవం పోగొట్టుకున్నాము. రథానికి ముందు భాగంలో విశాలమైన మందిరాలు ఉన్నాయి.) వీరి వెనుక నాలుగు గుంపులు కదులుతుంటారు. వీరందరి వెనుక రథం, ముందు అరుణుడు కనిపిస్తాడు. అంటే అనూరుడు సూర్య రథంలో కూర్చుని ఉంటాడని చెప్తారు. అందుకే ఎఱ్ఱని కాంతి వెలువడుతుంటే సూర్యుడు వస్తున్నాడని చెప్పవచ్చు. మనం సూర్యోదయం చూడగలిగితే ఈ వైభవం చూచి చాలా ఆనందించవచ్చు.

సూర్యోదయం చూడడం ఒక అద్భుతం. కన్యాకుమారికో లేక పసిఫిక్ మహా సముద్ర ప్రాంతానికో వెళ్ళగలిగితే గమనించవచ్చు. మనకు సామాన్యంగా మబ్బులు ఎక్కువ కాబట్టి ఆ సమయంలో కూడా మబ్బులు కమ్ముకుని వుంటే ఆ వైభవాన్ని చూడలేము.

అది మన దురదృష్టం. కనిపించి చూడగలిగితే అదృష్టమే. ఆ సూర్యబింబం అలా పైకి వస్తుంది. చూసే ప్రయత్నం చెయ్యాలి. Horizon తెలుగులో దిఙ్మండలము అంటాము. ఆ సూర్యబింబము పైకి రావడం ఎప్పుడో గాని కనిపించదు. నిర్మలమైన ఆకాశం ఉంటేనే మనకు గోచరిస్తుంది. రావటానికి ముందుగా మనకు ఎఱ్ఱని కాంతి (తేజస్సు) వస్తుంది. ఆ ఎఱ్ఱని కాంతే అరుణుడు. సూర్యుడు వచ్చేటప్పుడు మనకు ముందుగా కనిపించే రంగు రక్త వర్ణం. ఆ కాంతి వైభవం మన శరీరంలోని రక్తాన్ని పరిశుభ్రం చేయగలదు. Jesus ను 'Savior' అన్నారు. The True Savior is Sun God. He is the Savior. ఉదయం సూర్యోదయంలో ఆ అరుణ కాంతిని దర్శనం చేసుకోగలిగితే మన రక్తంలోని కల్మషం అంతా హరించుకుపోతుంది. ఆయననే అనూరుడు అంటారు. ఎందుకంటే ఆయన తొడలు నిర్మాణం కాకుండానే తల్లియైన 'వినత' గుడ్డుని పగులగొట్టడంచేత ఊరువులు (తొడలు) లేకుండా జన్మించడం జరిగింది. ఆయననే అరుణుడు, అనూరుడు అంటారు. ఆ కాంతి వచ్చిన తరువాతనే సూర్యబింబం బయటకు వస్తుంది. సూర్యబింబం రాకముందు ఎంత కోలాహలం ఉంటుందో. తెలతెలవారుతున్నప్పుడు ఎన్ని ప్రజ్ఞలు ముందుగా వచ్చి సూర్యోదయం అవుతుందో మనకి తెలియదు.

సూర్యుని రథం ముందు ఊరేగింపుగా ముందు చెప్పిన ఆరు గుంపులు / సమూహాలు, ప్రజ్ఞలు వచ్చిన తరువాతనే సూర్య రథం కనిపిస్తుంది. సూర్యోదయం అయిన తరువాత సూర్య రథాన్ని వెంబడిస్తూ రక్షసుల గుంపు ఉంటుంది. వీళ్ళ గుంపు /

సమూహం ఛాయలో ఉంటుంది. అటుపైన మనకు వైభవోపేతంగా సూర్యుడు ఉదయించి దర్శనం యివ్వడం జరుగుతుంది. అందుకే మనం నిత్యం సూర్య దర్శనం చేసుకోవడం అనేది ఒక అద్భుతమైన ప్రాప్తం. ప్రతినిత్యం దర్శించడమనేది యోగం. సూర్యోదయం తరువాత అది మనకు కలగదు.

ఈ వైభవోపేతమైన దర్శనం మీకు అవగతం కావాలంటే మనం తిరుమలలో జరిగే బ్రహ్మరథోత్సవంలో చూడవచ్చు. ఆ రథం ముందు ఎంతో కోలాహలం ఉంటుంది. ముందుగా తప్పెటలు, తాళాలు, బాజా భజంత్రీలు, వేదపండితుల సమూహం, భజనలు, నృత్యాల గుంపులు, కోలాటాల గుంపులు, ఏనుగులు, గుఱ్ఱాలు, ఛత్ర చామరాలు, దివిటీలు వస్తూ ఉంటాయి. తరువాతనే శ్రీవారి బ్రహ్మరథం వైభవోపేతంగా కదులుతుంది. దాని వెనుక మావటీలు, బోయీలు, రక్షసులు అనుసరిస్తూ ఉంటారు. కానీ మనం వారిని గమనించం. ఇంత వైభవం సూర్యోదయానికి ముందు జరుగుతూ ఉంటే మనం ఎప్పటి నుండి మేల్కొని ఎదురు చూడాలి? ఎంత ఉత్సాహంగా ఉండాలి? మనం ఏమీ పరిశీలించం గదా! భూమిపైన సమశీతోష్ణ స్థితి ప్రాంతానికి ఈ వైభవం లభ్యమవుతుంది. మిగతావాళ్ళకు అరుదు కదా! ఉత్తర, దక్షిణ ధ్రువాలలోని ప్రజలకు, ప్రదేశాలకు ఈ సూర్యోదయం ప్రతిరోజూ రాదు. వారికి ఆరు నెలలు చీకటి, ఆరు నెలలు వెలుతురు. రెండు గంటలు మాత్రం సూర్యుడు ఎఱ్ఱగా కనిపిస్తాడు. మనకి ఈ సౌలభ్యం ఎప్పుడూ ఉంది కదా! ఎందుకంటే సూర్యుడు మన ప్రాంతాలపై ఎప్పుడూ ఉంటాడు. కాబట్టి సూర్యుని విలువ మనకు

తెలియదు. ఉత్తర ఖండంలో సూర్యోదయం కోసం ఎంతో తపన చెందుతూ ఉంటారు. ఉత్తర భూభాగంలో మేఘాలు ఎక్కువగా ఉంటాయి.

నీలమైన ఆకాశం ఎప్పుడూ వాళ్ళకి ఉండదు. Madam Blavatsky మొట్ట మొదటిసారి మన భారతదేశం వచ్చినప్పుడు ఆ నీలాకాశం చూచి తన్మయత్వం చెందిందట. ఆనందం పట్టలేక నేలపై దొర్లిందట. అప్పటికి కూడా ఆనందం చాలక గులాబీల వర్షం కురిపించిందట. ఆమె రష్యా దేశంనుండి వచ్చారు కదా! ఆ దేశంలో ప్రతిరోజూ వారి ఆలోచన ఈ రోజు సూర్యకాంతి ఉంటుందా? లేదా? అనే. ఎందుకంటే అక్కడ ఎప్పుడూ మబ్బులే. మనం జర్మనీ వెళ్ళాము అనుకోండి. అక్కడ ఎప్పుడూ మబ్బులే ఉంటాయి. లేకపోతే వర్షం ఉంటుంది. ఆ మబ్బుల వెనుక సూర్యుని భావించడమే సంతోషం. వెలుగు మాత్రమే చూసుకుని సంతోషపడతారు.

ఉదాహరణకు గురువుగారు ఎల్లప్పుడూ మన ఇంటిలో ఉంటే మనకు శ్రద్ధ సన్నగిల్లుతుందిగా. సాధారణం అనుకుంటాము. అదే అపురూప దర్శనం అయితే చాలా శ్రద్ధా భక్తులు వస్తాయి. అందుచేత ఈ సూర్య రథాన్ని అనుసరిస్తూ ఋషులు, దేవతలు ముందు నడుస్తారు. 'అనుప్రయాంతి'. వీరంతా ఏమి చేస్తుంటారో చెప్పడం కన్నా ఆసక్తి ఉంటే మీరు "THE SUN" అనే పుస్తకాన్ని చదవండి. ప్రతిరోజూ మనం ఉదయం నాలుగు గంటలకు నిద్ర లేచి సూర్యోదయానికి అరగంట ముందు ఆకాశంలో తూర్పు వైపుకు అలా చూస్తూ ఉంటే దాని వెలుగు వైభవం తప్పక మనపై ప్రసరించి,

మనకు వికాసం కలుగుతుంది. అలాగే సూర్యాస్తమయానికి ముందు 90 నిముషాలు ఇలాంటి ప్రభావమే ఉంటుంది. అంటే సూర్యోదయ, సూర్యాస్తమయాలకు 90 నిముషాల ముందు ఇలాంటి వైభవ దర్శనం చేసుకోగలము.

మన పరిస్థితి గమనిస్తే అసలు సూర్యోదయ సమయంలో మనము లేవలేము. సాయంత్రం సమయంలో ఇంట్లో ఉండము. అంటే మనము సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని అనుసరిస్తున్నామా? అనుసరించడం అంటే సాయంత్రం అయ్యేసరికి తిరుగు ప్రయాణానికి తయారుకావాలి. ఉదయం అశ్వినీ దేవతలను స్మరించుకుని బయటి ప్రపంచంలో ప్రవేశించి అనుభూతిని పొంది, సాయంత్రం అయ్యేసరికి సుపర్ణుని పట్టుకుని తిరుగు ప్రయాణానికి వెళ్ళాలిగా. అంటే మనం రోజూ ఎలా ప్రవర్తించాలి అంటే సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని అనుసరించాలి. మనం అలా కాకుండా రాత్రి పదకొండు గంటల వరకు పనిచేసి ఇంటికి వస్తే మనం సూర్యుణ్ణి అనుసరించినట్టు కాదు.

దశ దిశలు సూర్యుణ్ణి అనుసరిస్తాయి. మనం ఇదివరకు దిక్కులు చెప్పుకున్నాం కదా! ఊర్ధ్వము, అధస్సు, తూర్పు, పడమర, ఉత్తరము, దక్షిణము ఆరు దిక్కులు. వీటికి మళ్ళీ నాలుగు మూలలు ఉంటాయి. అవి ఆగ్నేయము, నైఋతి, వాయవ్యము, ఈశాన్యము. ఇవన్నీ కలిసి పది దిక్కులుగా చెప్పబడినాయి. ఈ దశ దిశలు దేనివల్ల ఏర్పడతాయి అంటే ఈ అశ్వినీ దేవతల వల్లనే. వారు గోళాన్ని తిప్పుతూ ఉంటారు కాబట్టి దిక్కులు ఏర్పడతాయి. ఆ విషయమే ఈ శ్లోకంలో చెబుతున్నారు. 'దిశో దశాగ్రే' అని. దశ

దిశలు అంటే పది దిక్కులు. ముందుగా ఏర్పాటు చేసుకున్నారు. అవి కూడా ఒకదానికి ఒకటి సరిసమానంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ మార్గంలోనే సూర్యుని రథచక్రం భూమిమీద ఉన్నవారికి కనిపిస్తుంది. దానినే అనుసరిస్తూ ఋషులు, దేవతలు సంచారం చేస్తున్నారు. ఇంతమంది సూర్య గమనాన్ని అనుసరించడం జరుగుతుంది. కానీ ఈ భూమి మీది మనుష్యులు అనుసరించడం లేదు.

ఇక్కడ ఉపమన్యుడు బావిలో పడ్డాడు కదా! బావిలో చీకటి కదా! ఏమి చూడగలడు? అలా మనం కూడా కూపంలో పడి ఉన్నాము. ఉపమన్యుడు చివరికి చెప్తాడు. కళ్ళు పోయాయి కాబట్టి అంధకారం. నేను మోహంలో పడి ఉన్నాను. ఇలా కూపంలో పడ్డాను. నాకు చేయూతనిచ్చి రక్షించండి అని ప్రార్థిస్తున్నాడు. ఇది మన ప్రస్తుత పరిస్థితే. ఎందుకంటే మనం ఆజ్ఞా చక్రంలో ఉండవలసిన వారం మూలాధారంలో పడి ఉన్నాము. ఆజ్ఞా చక్రాన్ని రాజ సింహాసనం అంటారు. అనాహత చక్రాన్ని సింహాసనం అంటారు. మనం జీవితంలో రాజులుగా బ్రతకాలి అంటే మన ప్రజ్ఞ ఆజ్ఞలోనే ఉండాలి. కనీసం స్వయం సమృద్ధిలో జీవించాలంటే హృదయంలో ఉండాలి. కనీసం సింహరాశి. అన్నిటికన్నా ముఖ్యమైనది మేషరాశి. అలా ఉండాలి. కానీ మనం ఎక్కడ ఉన్నామో తెలుసుకోవాలి. మనం ఎక్కడో క్రింద కన్య, తుల, వృశ్చికరాశులలో పడి ఉన్నాము. అక్కడ విషం కక్కుతూ ఉంటాము. ఎందుకంటే వృశ్చికం విష కీటకం కదా! అసూయ, ద్వేషం, వాటితో బ్రతుకుతున్నాము. చెప్పటానికి అందరినీ

ప్రేమించుము అంటాము. కానీ లోపల అందరినీ ద్వేషించి, అనుమానిస్తూ, అవమానిస్తూ ఉంటాము. దానికి ఈ శ్లోకం ఏమి చాలా గంభీరమైన విషయాన్ని ఆవిష్కరిస్తుంది.

దశ దిశలలో ఎవరు ఉన్నారో గ్రహించండి. ఉత్తరంలో కుబేరుడు, తూర్పులో ఇంద్రుడు, దక్షిణంలో యముడు, పశ్చిమంలో వరుణుడు, ఆగ్నేయంలో అగ్ని, నైఋతిలో నిఋతి, వాయవ్యంలో వాయువు, ఈశాన్యంలో ఈశానుడు అధిపతులుగా ఉన్నారు. రక్షసులు వేరు. రాక్షసులు వేరు. రక్షసులు అంటే పదార్థాన్ని రక్షించేవారు అని అర్థం. ఇలా ఎనిమిది దిశలకు ఎనిమిది మంది దేవతలు ఉన్నారు. ఇక ఊర్ధ్వము నందు ఇంద్రా విష్ణువు, అధస్సునందు అగ్నావిష్ణువు ఉన్నారు. కేంద్రంలో మనమే సూర్యునివలె ఆత్మలో ఉంటాము. దక్షిణంలో దత్తాత్రేయుడు ఉంటాడు. అన్ని దిశలలోనూ అందరు దేవతలూ ఉన్నారు. వీరందరూ ఈ సూర్యుణ్ణి అనుసరించి సూర్య గమనంతో సంచరిస్తూ ఉంటారు.

ఇలాగే దశ దిశలలోనూ దేవతలను ఏర్పరచి సూర్యుణ్ణి అనుసరించి యిది నిర్వర్తిస్తున్నారు అశ్వినీ దేవతలు. అందరూ అలా సూర్యుణ్ణి అనుసరించి ప్రయాణిస్తుంటే ఈ మనుష్యులు మాత్రం అనుసరించుట లేదు. ఎందుకంటే మనము మనువు పుత్రులము. మనకి మనస్సు ప్రధానం. మిగతావారు అందరూ బుద్ధిలో ఉండి ధర్మాన్ని అనుసరిస్తూ గమనం చేస్తున్నారు. సప్త ఋషులలో అత్రి మహర్షికి ఆయన ధర్మం, భృగువునకు ఆయన ధర్మం, అంగీరసునకు, వశిష్ఠునకు, పులహునకు, పౌలస్త్యునకు,

క్రతు మహర్షికి– ఇలా అందరికీ వారి వారి ధర్మాలు ఉండి ఆచరిస్తూ, సూర్యుని అనుసరించి గమనం చేస్తున్నారు. అలాగే గ్రహాలన్నీ వాటి వాటి ధర్మాలను అనుసరించి గమనం చేస్తున్నాయి. అలాగే ప్రజాపతులు, రుద్రులు, సనక సనందనాదులు, మనువులు, వాగ్దేవతలు అందరూ వారి వారి ధర్మాలను వారు పాటిస్తూ పరిపాలిస్తున్నారు. ఎందుచేతనంటే వారు ఈ వెలుగును అనుసరించి నడుస్తారు.

మనకు మనస్సు యిచ్చి, స్వేచ్ఛ నిచ్చారు. జీవించవలసిన ధర్మాలు చెప్పి, మీకు స్వేచ్ఛ ఇస్తున్నాము అని తెలిపారు. అందుచేత మనం ఈ మనస్సును అనుసరించి పాలించడంలో ఈ మనస్సు బుద్ధిని అనుసరించి నడుచుకోవడం మానేసి, ఇంద్రియాలు, శరీరము వాటి సౌఖ్యమును అనుసరించి నడిపిస్తుంది. గుఱ్ఱం చెప్పినట్లు రౌతు నడుస్తుంటే ఎలా? మన రథానికి (శరీరానికి) ఐదు గుఱ్ఱాలండి. ఆ గుఱ్ఱాలు రథసారథి చెప్పినట్లు నడవాలి. అలా కాక వాటి ఇష్టం వచ్చినట్లు అవి నడుస్తుంటే గమ్యం చేరడం ఎలా? గుఱ్ఱం వెంట మనం నడిస్తే అది పచ్చగడ్డి గల పొలం కనిపిస్తే అక్కడికి వెడుతుంది. కానీ మనం పయనించవలసిన స్థానానికి వెళ్ళదు కదా! అందుకనే గుఱ్ఱాల కళ్ళకు గంతలు కడతారు. మార్గము మాత్రమే కనిపించే విధంగా కడతారు. అలాగే మనం మన మనస్సుకు కళ్ళెం వేసుకుని ధర్మ మార్గంలో నడిపించాలి. లేకపోతే మనం ఇంద్రియాల నియంత్రణలోకే వెళ్ళి మోహ పడతాము. అలా నీవు నడవవలసిన గమ్యం, దారి మరచిపోయి, దారి కనిపించక గాడాంధకారంలోకి (బావిలోకి) వెళ్తావు.

ఉదాహరణకు మనం పాశ్చాత్య దేశాలలో హైవేలో ఒక Exit లోకి వెళ్ళవలసిన వాళ్ళం మరో Exit లోకి వెడితే దారి తప్పుతాం కదా! మళ్ళీ మన దారిలోకి వెళ్ళేందుకు చాలా కష్టపడాలి. అలా మనం కొన్నాళ్ళకు బావిలో పడిపోవలసి వస్తుంది. అది అంధకారం. మనం మన దారి ఎప్పుడో వదిలేశాము. ఇంద్రియాల వెంట పడినాము. మనం కంటికి నచ్చింది, నోటికి నచ్చింది, వినేందుకు నచ్చింది– ఇలా వాటి వ్యామోహంలో పడిపోవడం కన్నా, జ్ఞానాన్ని అనుసరించి మనం కూడా ఈ ఋషులు, దేవతల వలె సూర్యుణ్ణి అనుసరించి, ధర్మాన్ని పాటించి నడవగలిగితే వెలుగులను చూడగలము కదా! అంతేకాదు స్వయం ప్రకాశకులము కాగలము. అప్పుడు ఈ భూమి మీద పై దివ్య లోకాల్లోని అనుభూతి పొందవచ్చు. అలా కాక మనస్సును వినియోగించుకోవడం చేతకాక, ఆ మనస్సు ఇంద్రియాలతో అనుసంధానం చెంది, వశపడిపోయి, ఇంద్రియ నియంత్రణలోకి వెళ్ళి, ఈ శరీర సౌఖ్యంకోసం జీవించి మన జీవితం ముగిస్తాము. ఇదే మన విషయం.

రథికునికి గుఱ్ఱాలు, రథము తన ఆధీనంలో ఉండి, తాను చెప్పినట్లుగా నడుచుకోవాలి. ఈ మనుష్యులు భూమి మీద తిరగడంవల్ల వారు ఇలా క్షితి (క్షతులు) అయిపోతున్నారు. భూమికి కూడా క్షతం (నాశనం) ఉన్నది. మనకి క్షతం ఉన్నది. ఈ క్షితి మనస్సు వల్లే జరుగుతున్నది. పోయినప్పుడు కూడా మనస్సే పోతుంది. మళ్ళీ జన్మలో ఏడు సంవత్సరములకు మనం మనస్సుకు బానిసలమైపోతుంటాము. మనం జన్మ ఎత్తినప్పుడు

బాల్యంలో ఈ పూర్వజన్మ బీజాలు అన్నీ ఉంటాయి. విత్తనం నాటితే మొలకెత్తుంది కదా! మన పూర్వజన్మలోని సంస్కారాలన్నీ మన మనస్సులో అలానే ఉంటాయి. బాల్యంలో ముద్దుగా ఉంటారు కదా! పెరిగే కొద్దీ ఒక్కొక్క వికారం బయటపడుతూ ఉంటుంది. ఏడు సంవత్సరాల వయస్సుకు వెనుకటి గుణాలన్నీ వ్యక్తమవడం ప్రారంభిస్తాయి. అవి అలా వ్యక్తమవుతుంటే మనకు పిల్లలు అద్భుతంగా కనిపిస్తారు. నెమ్మదిగా అలా కాదేమో అనిపిస్తుంది. తుదకు కనీసం మనుషులుగానైనా ఉంటే బాగుండేదేమో అనిపిస్తుంది. వారు రాక్షసులుగా కూడ తయారుకావచ్చు. మనం ఐదు సంవత్సరాల వరకు గారాబం చేస్తాము. తరువాత పాఠశాలలో వేస్తే ఉదయం నిద్ర లేవడు కదా! మనం నిద్ర లేవలేక బాల్యంలో వాళ్ళని కూడ బలవంతంగా పడుకునేట్టు చేస్తాము. సహజంగా పిల్లలు బాల్యంలో మూడు సంవత్సరాల వరకు సూర్యోదయానికి ముందే నిద్ర లేస్తారు. మన సౌకర్యం కోసం మనం వారిని బలవంతంగా నిద్రపుచ్చడం జరుగుతుంది. గమనించవచ్చు. అదే అలవాటుగా వారు ఐదు సంవత్సరముల నుండీ సూర్యోదయానికి ముందు ఎలా నిద్ర లేవగలరు. తల్లిదండ్రులు ఎలా ప్రవర్తిస్తే పిల్లలు అలాగే ప్రవర్తిస్తారు కదా! నెమ్మదిగా వారు మన మాట వినరు. దీనివల్ల వానిలో ఉన్న సంస్కారాలకు, పరివర్తనకు మనం మద్దతు తెలిపినట్లు అవుతుంది. సంస్కారం జరగదు.

సంస్కారాలు అన్నీ వయస్సు వచ్చేకొద్దీ వెలుపలికి వస్తాయి. కొంతమంది తిండికి, కొంతమంది నిద్రకు, కొంతమంది తిరుగుళ్ళకు అలవాటు పడుతుంటారు. మన సంస్కారాలతో పాటు

వారి గత సంస్కారాలు కూడా వస్తాయి. సహజంగా తాత, తండ్రి, తల్లుల నుండి కొన్ని వస్తాయి. దీనికి తోడు వాడికి సహజంగా వున్నవి కూడ వస్తాయి. చివరికి వాడి సంస్కారాలే వాణ్ణి నడిపించి దారి తప్పిస్తాయి. అందుచేత వారికి దిక్కులు అక్కరలేక పెరగడం జరుగుతుంది. క్రమంగా దిక్కులేని వారవుతారు. బాధపడకండి. సత్యమిదే. మనలో ఎంతమంది దిక్కులను, దిక్కుల దేవతలను, ఋషులను గుర్తిస్తున్నారు? Spirituality, ఆధ్యాత్మికత అని అరుస్తూ వుంటాము. సూర్యుని గమనాన్ని అనుసరించనివారు ఆత్మను అనుసరించలేరు.

ఉదాహరణకు మనం కూర్చునేటప్పుడు ఎటు తిరిగి కూర్చుంటున్నామో, మన కుర్చీ ఏ దిశకు తిరిగి ఉన్నదో చూసుకోము. నీవు అప్రయత్నంగా కూర్చుంటే మనం అప్రయత్నంగా ఏ దిశకు తిరిగి కూర్చున్నామో తెలుసుకోగలమా? దాన్నిబట్టి నీ పరిస్థితి నీవు తెలుసుకోగలవు. ఒక మండపంలో నాలుగు ప్రక్కలా కుర్చీలు వేస్తే ఎటు తిరిగి కూర్చుంటున్నావు అనేది నీ యొక్క యోగ్యతను తెలుపుతుంది. ఏ దిశకు అభిముఖంగా కూర్చున్నావో ఆ దిశ నిన్ను పాలిస్తుంది అని తెలుసుకోవాలి.

మనం ఏ దిశకు అభిముఖంగా కూర్చుంటే ఆ దిశ మనల్ని పాలిస్తుంది. ఇది గమనించడం చాలా ముఖ్యం. అది కూడా మనం గుర్తించలేని పరిస్థితిలో ఉంటే ఎలా? అన్ని దిక్కులు దివ్యమైనవే అయినా నీవు కూర్చున్న దిక్కు నీకు మార్గదర్శకత్వము వహిస్తుంది.

దిక్కుల అధిష్ఠాన దేవతలు నిన్ను నడిపిస్తారు. నైఋతి దిక్కుగా కూర్చుంటే మనకు పదార్థంపై ఎక్కువ ఆసక్తి ఉంటుంది.

ఉత్తరం, తూర్పు, ఈశాన్యం, ఆగ్నేయం ఇవి మనకు ముఖ్యమైన దిశలు. ఇది మరల వాస్తుశాస్త్రం కాదు. అన్ని దిశలు మనకు తెలియాలి. పైకి కూడా మనం చూసుకోవాలి. ఆకాశాన్ని ఎప్పుడైనా చూడడం జరిగిందా? మనం ఎప్పుడూ మట్టి దిశకే కదా చూడడం. అందుకే మన పూర్వీకులు అదృష్టవంతులు. ఆరుబయట పడుకుని ఆకాశం చూసేవారు. మనకు అన్నీ బాధలు, భయాలే. ఏ దిశలో ఏమి జరుగుతోందో గమనించాలి. నీకు పది దిక్కుల నుండీ జ్ఞానం అందించబడుతుంది. నీవు మధ్య బిందువులో కూర్చుని ఉంటావు. పదకొండవ వాడిగా ఉంటావు. అందుకే రుద్ర మంత్రం పది దిక్కుల నుండి కాపాడమని *'ఓం నమో భగవతే రుద్రాయ'* అంటాము. ఆ మంత్రం పది అక్షరాల కలయిక కదా! శివలింగం చుట్టూ పది దిక్కులనుండీ కాంతి వచ్చి లింగం ప్రభావితమై మనలనది ప్రభావితం చేస్తుంది. అందుకే లఘున్యాసంలో అన్ని దిక్కుల మంత్రాలు చెప్పబడతాయి. అన్నీ మనకు వస్తాయి. కానీ అంతరార్థంపై చొరవ తక్కువ. *'ఓం నమో భగవతే రుద్రాయ'* అంటే నీవే శివలింగం అయి, నీ చుట్టూ దశ దిశలు ఏర్పడి వాటి ప్రభావం నీకు కలగాలి. ఋషులు మనకు ఇలా యిచ్చారు. మనకు ఏమీ తెలియదు నటన తప్ప. ఏమీ తెలియనిది తెలుసుకోవడమే జ్ఞానం. అదే ప్రధానం. తెలుసుకునే కొద్దీ మనకు ఏమీ తెలియదు అని తెలుస్తుంది. ఇదంతా మనకి దశ దిశల ఏర్పాటు గురించి చెప్పడం కోసమే.

సంధ్యావందనంలో కూడ మనకి దిగ్దేవతా నమస్కారం అందించారు. కాని సంధ్యావందనమనే క్రతువునే మనం

విస్మరించాము. ఆశ్చర్యము! అమితాశ్చర్యము! మానవుని స్వేచ్ఛ అతని పతనానికి కారణమై నిలచినది. వలసినది ముక్తి. పొందినది బంధనము.

అలాగే నిత్యాగ్ని కార్యంలోకూడ దశ దిక్కుల దేవతలను ఆహ్వానించి, ఆహుతులివ్వడం జరుగుతుంది. నిత్యము దశ దిక్కులను, నవ గ్రహములను, ద్వాదశ రాశులను, సప్త ఋషులను, గోత్ర ఋషులను సూర్యునితోపాటు ఆరాధించుట వేద సంప్రదాయము. అటుపైన దేవతలు. వీరందరూ అజ్ఞాతంగా మనకు సహకారము నందిస్తూ వుంటారు. దిశా నిర్దేశము చేస్తారు, పరిరక్షిస్తారు. మన కార్యాలను సులభం చేస్తారు. మనుష్యులు ఈ పని చేయకపోవటం వారి అజ్ఞానమునకు తార్కాణము.

వాళ్ళు మన కోసం, ఈ సృష్టిలోని జీవుల కోసం– వారిని ఉద్ధరించేందుకు తాపత్రయపడుతుంటారు. ఇది తెలిసి ఋషులు, దేవతలూ దానిని అనుసరించారు. మనం మాత్రం అనుసరించక అంధకారంలో పడ్డాము. అదే ఇక్కడ చెబుతున్న విషయం. మనం మన అహంకారంవల్ల చాలా గొప్పవారమని అనుకుని ఏమీ తెలియని స్థితిలో ఉన్నాము. ఎంత తక్కువ తెలిస్తే అంత అహంకారం పెరుగుతుంది. ఎంత ఎక్కువ తెలిస్తే అంత వారు ఉండరు. *'ఓం నమః'* అంటే అర్థం అదే! మన ప్రార్థన దేనితో ప్రారంభిస్తాము *'ఓం నమః'* అని కదా! అంటే 'నేను లేను' అని తెలుసుకోవాలి. 'వాడే నీవుగా' ఉన్నావు. అది నీవు ముందు గుర్తుంచుకోవాలి. మన గుండెలో కూడా అదే చెప్తుంటుంది కదా! ఆ సత్యం గానం చేస్తుంటుంది *'సోహం, సోహం'* అని. గుండె మీద చెవి పెట్టి వింటే

నేను ఇక్కడ ఉన్నాను అని గోడు వింటావు. అతడే నేనుగా ఉన్నాను అనే ప్రతిధ్వని. అందుకనే శ్రీ ఆది శంకరాచార్యులవారు *'ఓం నమః'* అని అన్ని స్తోత్రాల్లోనూ యిచ్చారు.

అందుకనే మనం *'ఓం నమః, శ్రీ గురుదేవాయ, పరమ పురుషాయ'* అని చెప్పడం. గురువే ఆయనగా ఉంటాడు అని. అలా లేదు అనుకుంటే వాడు తన గుడ్డి దారిలో నడిచి వీళ్ళను కూడా అలా నడిపిస్తాడు అని. *"కాననివాని నూఁతగొని కాననివాఁడు విశిష్ట వస్తువుల్ గాననిభంగిఁ"* అనే భాగవత పద్యం ఉంది కదా! అలా అహంకారుల వెంట నడిచినప్పుడు వారు ఏ బురదలోనో పడిపోతే వారితోపాటు మనం కూడా పడినట్లు. కాబట్టి మనం సూర్యుని వెంటబడి నడిచి వికాసం చెందాలి. ఎందుకంటే ఋషులు అందించిన మార్గమే మనకు శరణ్యం. అది ఋజుమార్గం. ఎందుకంటే వారు సమస్తము తెలుసుకుని ఆ మార్గాన్ని అనుసరించి నడుస్తున్నారు కాబట్టి. ఆ ఋషుల మార్గమే మనకు గురుపరంపర. వారిలాగా ప్రసంగించడానికి ప్రయత్నించక, వారు ఉపదేశించిన మార్గంలో నడిచి జ్ఞాన వికాసం పొందడం కోసమే ఈ ప్రయత్నం. గురువు యొక్క జీవితం 'యజ్ఞార్థమే'. ఇతరుల కోసమే వారి జీవితం. సౌకర్యాల కోసం కాదు.

దేహము, మనస్సు చూపించేది ధనము, సౌకర్యం మాత్రమే. బుద్ధి జీవుడి వికాసం కోసం దారి చూపిస్తుంది. అందరికీ పనికివచ్చేదే మనం చేయడంవల్ల అది పనిచేస్తుంది. ఈ సత్యం ఋషులు తాము ఆచరించి చూపించారు. మనం Master E.K.గారి వెంటపడ్డాము అంటే ఎందుకు పడ్డాము? ఆయన అలా

జీవించి మనకు మార్గదర్శకులయ్యారు. అలాగే ఇంకొక గురువు శ్రీ సత్యసాయి బాబాగారు యాభై సంవత్సరముల పాటు అద్భుతమైన జీవనం చూపించారు. తన కోసం కాక మనందరి కోసం చేసి చూపించారు. వారు ఏమీ తినరు. ఏ సౌకర్యమూ ఆశించలేదు కదా! దేవతలు కూడా మన కోసమే చేస్తారు. గాలి కూడా అందరి కోసమే కదా! నీరు కూడ నీరు కోసం పారడం లేదు కదా! ఏ దేవతలూ వారి కోసం జీవించడం లేదు. ఎందుకో ఈ విపరీత బుద్ధి మానవులకే ఏర్పడింది. అందుకే వారు నశిస్తున్నారు. అందుచేత ఈ శ్లోకంలో చిట్టచివరకు ఈ మనుష్యులు ఇలా నాశనం చెందుతున్నారు అని, వీళ్ళకు ఎన్నిసార్లు దేహము, మనస్సు ఇచ్చినా వాళ్ళు స్వధర్మంవైపు చూడకుండా స్వార్థంవైపే చూస్తున్నారని తెలుపుతుంది. అందుకే *"మనుష్యాః క్షితి మాచరంతి"*– పెద్దలు, అంటే ఋషులు, సద్గురువులు, దేవతలు ఏమి ఆచరిస్తూ వున్నారో గమనించి, మనముకూడ ఆ మార్గంలో నడిస్తే వెలుగుదారిలో నడిచే ఆస్కారం ఏర్పడుతుంది. అలా అనుసరించడానికే అవతారాలు. ఇందుకే ఋషులు, యోగీశ్వరులు పరంపరగా వస్తూనే ఉన్నారు. "A Man is ultimately judged by what He did, but not by what He said / preached".

అందుకే ఎంతమందికి మనవల్ల హితం జరిగితే అంత మనం ఋషి మార్గంలో నడిచినట్టు, జీవించినట్టు. అదే మనకు శ్రీకృష్ణుడు భగవద్గీతలో *"యజ్ఞార్థం కురు కర్మాణి"* అని ఉపదేశించాడు. అది చేస్తుంటే సంపద అనుకోకుండా చేరుతుంది. దానిని కూడా మనం దానం చేయాలి. దానం, తపస్సు ఈ రెండూ చేసినవాడికి తపస్సు

తప్పక ఫలమిస్తుంది. అన్నీ పంచేవాడికి తప్ప సమీకరించేవాడికి తపస్సు ఫలించదు. అవరోధమే. అది సమస్యలకు కారణమే.

ఆస్తిపాస్తులు కూడా కొంతవరకే సుఖాన్ని ఇవ్వగలవు. పంచేసుకోవాలి. ఋషులకు సమీకరించుకోవడం తెలియదు. మనం యజ్ఞార్థం జీవిస్తూ, సంపద పంచుతుంటే మన తపస్సుకి అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. కాబట్టి జీవితంలో ఎక్కువ భాగం జ్ఞానం కోసం, వికాసం కోసం ఉపయోగించాలి. తిరుగుళ్ళకు మనం అలవాటు పడకూడదు. నీవు తపస్సును అలవాటు చేసుకోవాలి. 60వ సంవత్సరం నుండీ మనం ఇలాంటి జీవితం మొదలుపెట్టాలి. సగం జీవితం ఈ జ్ఞానానికి ఉపయోగించాలి. కాలం నీకోసం ఆగదు కదా! “Next Life better luck” అనుకోకూడదు. అందుకే దిశా నిర్దేశం ఉండాలి.

దశ దిశలు ఇలా ఏర్పాటుచేసి ఋషులు, దేవతలు సూర్య పథాన్ని అనుసరిస్తుంటే, మానవులు దాన్ని అనుసరించక ఇలా అంధకారంలో పడిపోతున్నారు అని ఈ శ్లోక సారాంశము.

**మంత్రము - 9 :**

**యువాం వర్ణాన్ వికురుధో విశ్వరూపాన్**
**తేఽధిక్షిపంతే భువనాని విశ్వా ।**
**తే భానవో ఽప్యనుసృతాశ్చరంతి**
**దేవా మనుష్యాః క్షితి మాచరంతి ॥**

**టీక :**

వర్ణాన్ = వర్ణములను; విశ్వరూపాన్ = ఈ సమస్త సృష్టికి రూపములుగా; యువాం = మీ రిద్దరును; వికురుధః = విశేషముగా కల్పించుచున్నారు; తే = అవి; విశ్వా భువనాని = సమస్త లోకములను; అధిక్షిపంతే = అధిష్ఠించి వెలువరించుచున్నవి; తే = వానిని; భానవః = కిరణములు; అపి = మరియు; దేవాః = దేవతలును; అమసృతాః = అనుసరించుచున్నవారై; చరంతి = తిరుగుచున్నారు; మనుష్యాః = మనుష్యులు; క్షితిం = ఈ భూమియందు; ఆచరంతి = అన్ని దిక్కులలో తిరుగుచున్నారు.

**తాత్పర్యము :**

ఓ అశ్వినులారా ! మీ రిద్దరును వర్ణములను సృష్టించి వాని వికారములుగా సృష్టి రూపములను కల్పించుచున్నారు. ఆ వర్ణములే ఈ సమస్త సృష్టిని అధిష్ఠించి వెలువరించు చున్నవి. ఆ వర్ణములనే అనుసరించుచు కిరణములును, దేవతలును చరించుచున్నారు. మనుష్యులు మాత్రము తమ ఇష్టము వచ్చినట్లు నానా దిక్కులలో తిరుగుచున్నారు.

**వివరణము :**

'యువాన్' అంటే మీరిద్దరు అని. అంటే అశ్వినీ దేవతలయిన నాసత్యదస్రులు. 'వర్ణాన్' అంటే వర్ణములు, రంగులు, అక్షరములు. 'విశ్వరూపాన్' అంటే ఈ సృష్టి రూపముగా. 'వికురుధః' అంటే విశేషముగా కల్పించుచున్నారు.

వర్ణములు పలికిస్తుండాలి. విశేషముగా వీరు వర్ణములు పలికిస్తుంటారు. వర్ణములు అంటే అక్షరములు, ధ్వనులు, శబ్దములు, రంగులు అని. శబ్దములు, రంగులు (Sounds & Colours) ఈ రెండూ అశ్వినీ దేవతలే. వీరి నుండి ఇవి పుట్టుకొస్తాయి. ఈ విశ్వమంతా వారి యొక్క శ్వాస ప్రక్రియ ద్వారా పుట్టుకొస్తుంది. అది విశ్వమంతా వ్యాప్తి చెంది ఉంటుంది. వీరు దానిని అధిష్ఠించి ఉన్నారు. వారు శబ్దములతోను, వర్ణములతోను ఈ విశ్వాన్ని పరిపాలిస్తున్నారు.

మనకి ప్రధానంగా ప్రణవము ప్రాణముగా, ప్రాణము స్పందనగా దిగి వస్తుంది. ఆ ప్రాణ స్పందన దేహములో శబ్దాన్ని కలిగిస్తుంది అంటే 'ఓంకారం' అశ్వినీ దేవతలే. 'సోహం' అనే శబ్దంగా మనయందు హృదయంలో అవతరింపజేస్తారు. అలాగే సృష్టిలో కూడా ఉచ్ఛ్వాస, నిశ్వాసల కారణంగా ఒకే నాదం (ప్రణవము) శబ్దంగా తయారవుతుంది. ఉచ్ఛ్వాస, నిశ్వాసలు రెండుగా తయారవుతున్నాయి. దానిని మనం మన హృదయంలో గుర్తించవచ్చు. నిజానికి ఓంకారం మన సహస్రారం నుండి క్రమంగా ఆజ్ఞాచక్రం చేరి, అక్కడి నుండి హృదయం చేరి లోపల

ప్రాణంగా మారుతుంది. అంటే ప్రణవమే ప్రాణంగా మార్పు చెందుతుంది. దీనికి కారణము ఆ ఉచ్ఛ్వాస నిశ్వాసలే. దానినే మనం సోహంగా హృదయమందు పలుకుతాము. పలుకకపోయినా, వింటే వినపడుతుంది. అది అనాహత శబ్దము.

మన హృదయం చేరితే పశ్యంతీ వాక్కుగా సోహం పుడుతుంది. అక్కడి నుండి మనస్సు చేరేసరికి భావంగా మారుతుంది. అది మరల కంఠం చేరి రేఫంగా మారి ధ్వనిగా వెలువడుతుంది. ఇదే మన శబ్ద ప్రక్రియ. అందుచేత మనకి సామవేదం నుండి శబ్దం పుట్టిందని చెప్తారు. ముందు సామవేదం తరువాత ఋగ్వేదం అంటారు. ప్రణవము ఉచ్చరింపబడిన వెంటనే ఇది ఉచ్చారణకు, అనాహత చక్రానికి సంబంధించినది గాన సామవేదం. ఋగ్వేదం నుండే పుట్టిందని కూడా చెప్తారు. ప్రణవం నుండే ఆది శబ్దం పుట్టుకు వచ్చింది. అక్కడినుండే కంఠ శబ్దం పుట్టిందని చెప్పడం జరిగింది. మనం మామూలుగా కంఠ శబ్దం వినాలంటే అది నిశ్వాసగానే ఉంటుంది. ఈ నిశ్వాస వినాలి అంటే ఉచ్ఛ్వాస కావాలి కదా! కాబట్టి కంఠ శబ్దానికి ఉచ్ఛ్వాస నిశ్వాసలే కారణం.

ఉచ్ఛ్వాస నిశ్వాసల మూలంగా స్పందనము, ఆ స్పందన మూలంగా హంస శబ్దము వస్తాయి. ఇది అంతా ఒకే పరతత్వం నుండి దిగి వచ్చి , రెండుగా 'హ'కారం వల్ల ప్రకృతి, 'స 'కారం వల్ల పురుషుడు దిగివచ్చి సృష్టి చేస్తుంటారని చెప్తారు. అందుకని ఒకే శబ్దం రెండుగా వచ్చేందుకు కారణం అశ్వినీ  దేవతలే. ప్రణవము సృష్టి యందు అనునిత్యము జరిగే ధ్వని. ప్రణవోచ్చారణము వలన

ప్రాణ స్పందన. ప్రాణ స్పందన వలన శ్వాస, శ్వాస వలన భావన, భాష. ఇలా అవతరణము జరుగుతూ వుంటుంది.

సృష్టియందు ప్రణవోచ్చారణ ఋగ్వేదము. ప్రాణము, స్పందన, శ్వాస సామవేదము. భావన, క్రియ యజుర్వేదము. వాక్కు అధర్వణవేదము. ఇలా అనుసంధానము గావించుకోవచ్చు. కనుక సృష్టియందున్న ధ్వని ప్రణవము ప్రప్రథమ వర్ణము. ఆ వర్ణమును అశ్వినులు విస్తారమగు ధ్వనులుగా ఏర్పరుచు చున్నారు. ధ్వనుల వలన వెలుగులు, వెలుగుల వలన రూపములు ఏర్పడుతూ సృష్టి నిర్మాణము ఛందోబద్ధముగా జరుగుచుండును.

ఒక నాదం రెండు ధ్వనులుగా రావటానికి కూడా కారణం అశ్వినీ దేవతలే. ఈ శబ్దాలు ఎప్పుడైతే బాగా విస్తృతి చెందుతాయో అప్పుడు అవి కొంత అనుకూలమైనటువంటి నిరుక్తిగా మార్పు చెందుతాయి. 'స'కారమునకు రంగు నీలము. 'హ'కారమునకు వెలుగు బంగారు కాంతి. అందుకని మనం ఈ శబ్దాలు చేస్తుంటే అందులో నుండి కాంతి పుంజాలు పుట్టుకొస్తుంటాయి. ఆకాశంలో శబ్దం గుణంగా ఉంటుంది. ఈ వర్ణములన్నీ అక్కడ సాధ్య స్థితిలో ఉంటాయి. అశ్వినీ దేవతలు వాటిని ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా, ఉత్తరాయణ, దక్షిణాయనములుగా ఈ భూగోళాన్ని తిప్పుతున్నారు. అలా సంవర్తనంలో ఈ 'హంస' శబ్దం పుట్టి, అందులోంచి మిగతా శబ్దాలు ఉద్భవించాయి. ఓంకారము నుండి అన్ని శబ్దాలూ పుట్టుకొస్తాయి అని ద్రష్టలైన ఋషీశ్వరులు మనకి తెలిపారు. ఆ శబ్దం కంఠానికి చేరేసరికి మనకి రేఫముగా, వైఖరీ

వాక్కుగా వెలువడుతుంది. అందుకని ఈ రేఫమునే మన ఋషులు 'ఋషభము' అని తెలిపారు.

అందుచేత కంఠమునందు రేఫమై వ్యక్తమౌతూ ఉంటుంది. ఈ శబ్దం పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరిగా మారి వ్యక్తమయితే, దానికి అనుగుణంగా వెలుగులు కూడా వ్యక్తమవుతాయి. అందుచేత ఈ శబ్దం ఆకాశానికి ప్రధానమైన గుణము. వ్యక్తమైన క్షణం మనకు వెలుగులుగా గోచరిస్తాయి. ఇలా ఉద్భవించిన వెలుగులు దేవతల రూపాలు ధరించి అనేకానేక విధాలుగా ఈ సృష్టిని చేస్తాయని చెబుతారు. దీనికి బాగా వివరణ కావాలి అనిపిస్తే మనకి Master E.K. గారు ''పురాణపురుషుడు'' అనే పుస్తకంలో దేవతలు, ఋషులు వర్ణములను ఉచ్చారణ చేస్తుంటే ఏవిధంగా పుట్టుకొచ్చాయో విపులంగా తెలియపరిచారు. అది మీరు ఒకసారి చదివితే ఈ సృష్టిలోని శబ్దాలు ఎలా పుట్టాయి అనేది బాగా బోధపడగలదు. వాటిని అనుసరించే వెలుగులు వస్తాయని తెలుస్తుంది.

ఈ సృష్టి ఏర్పడుతుంటే గాలిలో నుండి వచ్చే శబ్దములు, నదులలో నుండి వచ్చే శబ్దములు, వీటి అన్నిటి నుండి వేద వాఙ్మయము వచ్చినదని చెప్పడం జరిగింది. ఈ శబ్దములన్నిటికీ ఆకాశమే మూలము. ఆకాశమునందు ఈ అశ్వినీ దేవతలు ఒక కేంద్రం ఏర్పరచుకుని దాని చుట్టూ 3,600 కోణములు ఏర్పరచి, కోణముల ద్వారా, శ్వాస ద్వారా దాన్ని నిర్వర్తిస్తున్నప్పుడు ఆకాశంలో శబ్ద తరంగాలు ఏర్పడతాయి. ఆ ఉద్భవించిన శబ్దము నుండి వెలుగులు వెలువడతాయి. ఆ వెలుగులను అనుసరించి

కిరణములు వెలువడతాయి. ఆ కిరణముల ద్వారా దేవతలు అవతరిస్తుంటారు. ఇదే అవతరణ.

ఈ శ్లోకంలోని దీన్ని గురించి Master E.K. గారు క్లుప్తంగా వివరణ ఇవ్వడం జరిగింది. ఆవిర్భవించిన శబ్దములనుండి వెలువడిన వెలుగులు మన శబ్ద తరంగాలని తెలుసుకోవాలి. అందుచేత మనం కూడా వెలువడుతున్న శబ్దములను అవగాహన చేసుకుని, దానికి అనుగుణంగా ఉచ్చారణ చేస్తూ ఉంటే మన భాషణము నుండి కూడా వెలుగులు ఉద్భవిస్తాయి. అలా కాకుండా మనం భాషణం చేసినట్లయితే మన భాషణము నుండి వెలుగులు కాకుండా చీకట్లు ఉద్భవించగలవు. అందుకే కొంతమంది భాషణ చేస్తే వికారంగా ఉండి ఆపేస్తే చాలు అనిపిస్తుంది.

మహాత్ములు బోధనలు చేస్తున్నప్పుడు వారి నుండి వెలువడే కంఠ శబ్దములతో మనకి సాధన స్థితిలో ప్రచోదనము కలుగుతుంది. ఆ వెలుగులే మనలోని దేవతలను ప్రచోదనము చేయగలవు. అందుకే మనం వింటూ ఉంటే చైతన్య వికాసం కలుగుతుంటుంది.

అందుకే మన కంఠ శబ్దాలకు చాలా ప్రాముఖ్యం ఉంది. ఋషులు ఈ శబ్దాలను స్వరయుక్తంగా, రాగబద్ధంగా పలుకుతుంటారు. అందుకే వారికి దేవతలు అలా అంది వస్తుంటారు. ఋషులు దేవతలను అనుసరించి పలుకుతుంటారు. మనుష్యులు మాత్రం అలా చేయరు. మనకి ఈ భాషణం సరిగ్గా లేక అలాంటి దైవ ప్రచోదనం కలుగదు. ఆవు 'అంబా' అని అరుస్తుంటే అది అర్థంచేసుకునే శక్తి మనకి ఉండాలి. శ్వాస ఆధారంగా దానికి

ఏమి కావలెనో ఆ రకంగా శబ్దం బయటికి వస్తుంది. అందుకే ఆవుల అరుపులు గోపాలురికే తెలుస్తాయి. పసిబిడ్డ ఏడుపు తల్లికే తెలుస్తుంది కదా! అలాగే సృష్టిలో జరిగే ధ్వని తరంగాలలో మనకు వివేచనం కలగాలి అంటే మనం ధ్వని అంతరాళం గుర్తించి శ్రద్ధగా పలకగలగాలి.

'అ'కారం మొత్తం వ్యాప్తిచెందిన పరతత్వంగా చెప్తారు. అందుకే శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణుడు అక్షరాలలో 'అ'కారం నేనని చెప్తాడు. అలాగే 'ఉ'కారం వ్యాప్తి చెందడానికి సంబంధించినది. అటుపైన 'మ'కారం అవ్యక్తం నుండి వ్యక్తంలోకి వచ్చే శబ్దంగా వస్తుంది. అలాగే 'ద'కారం ఇతరులకు పదార్థ జ్ఞానపరమైన విషయాలు అందించుటకు పనికివస్తుంది. అలా మనకు సహస్రారం నుండి మూలాధారం వరకు అనేకమైన అక్షరములు ఉన్నవి. వాటి మాల (అక్షరమాల)కూడా ఉన్నది. మనకు మూలాధారంలోని నాలుగు దళములలో శబ్దము, ఒక బీజాక్షరం ఉన్నాయి. స్వాధిష్ఠానంలోని ఆరు దళములలో 6 అక్షరములు, మధ్యలో ఒక బీజాక్షరం ఉన్నాయి. మణిపూరకంలోని పది దళములలో 10 అక్షరములు, మధ్యలో ఒక బీజాక్షరం ఉన్నాయి. అనాహతంలోని పన్నెండు దళములలో 12 అక్షరములు, మధ్యలో ఒక బీజాక్షరం ఉన్నాయి. అలాగే కంఠమునందు పదహారు దళములలో 16 అక్షరములు, మధ్యలో ఒక బీజాక్షరం ఉన్నాయి. ఇవన్నీ కలిపితే 4+6+10+12+16=48. వీటికి మూలం ఓంకారమే. మొత్తం 49 అక్షరములు, శబ్దములు కలవు.

ఈ 49 అక్షరములను అనుసరించి మనకు భాషణం

ఏర్పడుతుంది. అచ్చులు 'అ' నుండి 'ఔ' వరకు కంఠంతో పలకవచ్చు. హల్లులు పలకాలంటే మన ముఖం కావాలి. స్వరపేటిక, పైపెదవి, క్రింది పెదవి, దంతములు అవసరము. ఉదాహరణకు 'త' అని పలకాలంటే మన నోటిలోని అంగిడి భాగంతో పలకాలి. కొన్ని శబ్దములు మన దంతములతో పలకాలి. 'ప' అనే అక్షరాన్ని పెదవులతో పలుకుతాము. అక్షరములు క, చ, ట, త, ప లుగా అవతరిస్తుంటాయి. ఈ క, చ, ట, త, ప లతోనే హల్లులు తయారవుతాయి. అవి కూడా 5 కలిసి ఒక గుంపుగా వస్తాయి. 5×5=25. అంతములో మనకి య, ర, ల, వ లు ఉన్నాయి కదా! శ, ష, స, హ ఇవి 8. బీజాక్షరాలు యం, రం, లం, భం, సం, శం, హం. అచ్చులు 16. హల్లులు 25. 8+16+25=49. 7×7=49.

అందుకని మన సంస్కృత భాష ఈ సృష్టిని అనుసరించి వచ్చిన శబ్దములతో కూడి ఉంటుంది. ఆ భాష అలా ఏర్పాటు చేయబడినది. అందుకనే ఆ భాషలో శక్తి అలా పుట్టుకొస్తుంది. అవ్యక్తం నుండి వ్యక్తంలోకి వచ్చేందుకు కావలసినది అంతా ఆ భాషలోనే ఇమిడి ఉన్నది. అందుకనే సంస్కృతం దేవభాష, దేవనాగరి లిపి అని పిలువబడింది. ఎందుకంటే ఆ శబ్దాలను అనుసరించే దేవతలు అవతరిస్తుంటారు. అందుకే మన మంత్రములు అంత పవిత్రం. అన్నిటియందు దేవతా ప్రజ్ఞలు అవతరిస్తుంటాయి. అందుకని వాటిని స్వరయుక్తంగా ఉచ్చరించి ఈ ప్రజ్ఞలను అవతరింపజేసుకోవాలి. మనలోని స్పందనలు, మనలోని భావాలను అమరిక చేస్తాయి. అందుకనే పదే పదే

చెప్పడం. ఈ శ్లోకాలు, స్తోత్రాలు పఠించేటప్పుడు ఆ శబ్దాలను వింటూ మనలోని వెలుగులను అనుభూతి చెందవచ్చు. అందువల్ల మనకు లోపల దర్శనాలు కాగలవు. ఇదే Sound & Light Process.

చక్కగా స్వరయుక్తంగా, భావయుక్తంగా ఉచ్చరించ వలసిన ఆవశ్యకత ఉంది. ఉచ్చరించడానికి ధ్వని ప్రధానమైనటువంటిది. ఈ రెండూ జరిగితే ఆకాశం మనకు విశుద్ధి చక్రంలో ఉంది కాన (ముందు తెలిపాను కదా! అనాహతంలో వాయువు, మణిపూరకంలో జలం, స్వాధిష్ఠానంలో అగ్ని, మూలాధారంలో పృథ్వి / భూమి) మనము ఉచ్చారణ చేస్తున్నప్పుడు శబ్దం విశుద్ధి నుండి ఉద్భవించిన వెలుగులు క్రమంగా నీ పంచకోశాలను పరిశుద్ధం గావిస్తాయి. పైన ఉన్న ఆజ్ఞ జీవుని యొక్క స్వస్థానం. అక్కడ మనం ఏమీ పవిత్రీకరణ చేయవలసిన పని లేదు. పవిత్రీకరణ అంతా క్రింది కేంద్రాలకే. అందుచేత ఈ శబ్దాలను సరిగ్గా ఉచ్చరించాలి. ఈ విషయాలను ఋషులు తాము ఉచ్చరించి, మనకు ఉపదేశం చేయడం జరిగింది. Appropriate utterance of Sound. అది కేవలం సంస్కృత భాషలోనే తప్ప మరే భాషలోనూ ఈ విధానం కానీ, ప్రజ్ఞ కానీ లేవు. గాయత్రీ ఛందస్సు మనకి ఎనిమిది లోకాలలోని ప్రజ్ఞలను అందించడానికి ఇవ్వడం జరిగింది. అలాగే పదహారు అక్షరాల మంత్రం ఛందస్సు. అలాగే విష్ణు సహస్రనామ స్తోత్రం కూడా తయారుచేసి మనకు ఇచ్చారు. దానివల్ల పదహారు కళలుగా పరతత్వం ఆవరిస్తుంది. పదకొండు అక్షరముల మంత్రం ఒక ఛందస్సు ఉంటుంది. దాన్ని

మనం సరిగ్గా ఉచ్చరిస్తే రుద్రుడు అవతరించగలడు. పంచాక్షరి అంటే ఐదు అక్షరముల మంత్రం. ఈ ఛందస్సు సరిగ్గా ఉచ్చరిస్తే మన పంచకోశములలో శుద్ధి జరుగుతుంది.

ఇలా వాటి విధానం తెలిసి, దానికి అనుగుణంగా, శ్రద్ధగా, స్వరయుక్తంగా ఉచ్చారణ చేస్తే, మనం మంచి కాంతి పుంజాలను పుట్టించిన వాళ్ళం అవుతాం. ఎందుకంటే వాటి ధర్మాలను అవి చక్కగా నిర్వర్తించగలవు. ఒక ధ్వని మనకు తెలిస్తే, దానిని అనుసరిస్తున్న వెలుగులను దర్శించవచ్చు. వెలుగు అవతరణ చూడవచ్చు. ఎందుచేతనంటే దేవతలు ఆవిధంగా పనిచేస్తుంటారు. వారు స్వేచ్ఛగా పనిచేయడం ఉండదు. ధర్మాన్ని అనుసరించి పనిచేయడమే ఉంటుంది. ఈ మధ్యాహ్నం ఏదో పుస్తకం చదువుతుంటే శ్రీమతి కృష్ణకుమారిగారు ఒక మాట అడిగారు. ''ఈ దేవతలు ఎవరు ఆరాధన చేసినా వారికి వరాలు యిచ్చేస్తుంటారు. వారు సురులైనా, అసురులైనా, మనుష్యులైనా యిచ్చేస్తారు కదా! అలా ఎందుకు యివ్వడం?'' అని. అలా ఎందుకు యిస్తారు అంటే అది వారి ధర్మం.

మంచివాడు ఒక మామిడి మొక్క నాటితే చెట్టు పెరిగి ఫలాలు ఇస్తుంది కదా! అలాగే మంచివాడు కానివాడు నాటినా విధివిధానంగా అది పెరిగి ఫలాలను ఇస్తుంది. అందుకే దేవతలు మనం విధివిధానాలను అనుసరిస్తే అనుగ్రహిస్తారు, కరుణిస్తారు. ఎవరు పూజించారు అనేది కాదు, విధివిధానాలు ఆచరించారా? లేదా? అనేది ముఖ్యం. అందుకు ఆ అవతరించవలసిన అగత్యం

దేవతలకు ఉంది. అందుకనే మనం ఉచ్చారణను సరిగ్గా చేస్తే వారు కరుణిస్తారు, అనుగ్రహిస్తారు, ప్రతిస్పందిస్తారు.

*“సుశబ్దంబుల్ శోభిల్లన్ బల్కుము నాదువాక్కునను సంప్రీతిన్ జగన్మోహినీ ఫుల్లాబ్జాక్షి సరస్వతీ భగవతీ పూర్ణేందు బింబాననా”* అని కదా పద్యం. మనలోని సుశబ్దములు మనలోనే పరివర్తనను కలిగిస్తాయి. ఈ చక్కని ధ్వనులవల్ల పరిసరాలలోనూ పరివర్తన కలుగుతుంది. శ్రద్ధగా వినేవారికి కూడా మంచి పరివర్తన కలుగుతుంది. అందుకనే శబ్దాలవల్ల కాంతులు పుడతాయి. మనం మామూలుగా వర్షాకాలంలో ఉఱుములు వింటూ ఉంటాము కదా! ముందుగా మెఱపు వస్తుంది, తరువాత శబ్దం వస్తుంది. ఎందుకంటే కాంతికిరణాలు శబ్ద తరంగాల కంటే వేగంగా పయనించడం వల్ల. ఎంత కాంతివంతమైన మెఱపు కలిగితే దాని వెంట అంత పరిపుష్టమైన ఉఱుము వస్తుందని తెలుస్తుంది. కాబట్టి శబ్దంవల్ల పుట్టిన వెలుగు మొదట వస్తుంది. అందుచేత వెలుగు ముందుగా చూచి, శబ్దం తరువాత వింటాము.

మనం ఉచ్చారణలో ముందు శబ్దం తరువాతనే కదా వెలుగులు. కాబట్టి దాని ధర్మాన్ని అనుసరించి మంచి ఉచ్చారణ చేసి, వెలుగులను పంచాలి. పరిసరాలు పరివర్తనకు సహకరించాలి. మన సంభాషణలో చక్కని భావములను ఆవిష్కరించాలంటే మన ఉచ్చారణ చక్కగా ఉండాలి. అప్పుడే ఉచ్చారణ చేసినవారికి, వినేవారికి వికాసం కలుగుతుంది. ఉచ్చరించేటప్పుడు మన భావం చక్కగా ఉండాలి. లేకపోతే ఆ ఉచ్చారణలు మన భావాలను అతలాకుతలం చేయగలవు. మనం వికారంగా అరిచేవారిని

చూస్తే మనకు కూడ వికారాలు కలుగుతాయి కదా! ఎనిమిది రకాల వాద్యాలను వికారంగా వాయిస్తే ఆ శబ్దాలవల్ల మనకు అదే విధమైన వికారం కలుగుతుంది. కాబట్టి శబ్ద తరంగాలు శుద్ధంగా, శ్రావ్యంగా, స్వరయుక్తంగా ఉండి వెలుగులు విరజిమ్మాలి. అందుకనే మన వాగ్గేయకారులు, సంగీత విద్వాంసులు సృష్టిని అనుసరించి కీర్తనలు చేసి, శ్రావ్యంగా గానం చేశారు.

ఆ రాగాలు అన్నీ ఉదయం నుండి సాయంకాలం వరకు ఏఏ సమయాలలో, ఏఏ జాములలో ఎలా పాడుకోవాలో దానికి అనుగుణంగా గానంచేసి తరించారు. అందుకే అన్ని గ్రహములు ఎలా పొందికతో తమ విధిని నిర్వర్తిస్తున్నాయో తెలుసుకుని, ఊర్ధ్వలోకాల అనుభూతిని, చైతన్యాన్ని మన వాగ్గేయకారులు మనకు అందించడం జరిగింది. దీనినే "Symphony of Planets" అని అన్నారు.

సూర్యునికి అటు కొన్ని, ఇటు కొన్ని గ్రహాలు మనకు కనిపిస్తాయి. దానివల్ల మనకు సప్త విధములైన ధ్వనులు ఏర్పాటయి ఉన్నాయి. వాటి సమన్వయం, పరివర్తన, మధ్య అంతరంతో వలయాకారంగా పరిభ్రమిస్తుంటాయి. ఒక గ్రహ వలయానికి, ఇంకొక గ్రహ వలయానికి మధ్య సరియైన అంతరం ఉంది. వాటి వలయాలు సూర్యుని నుండి 3.5 అటు, 3.5 ఇటు అంతరంలో ఉంటాయి. అందుకే వాటి పరిభ్రమణం సమన్వయంతో జరుగుతుంది. మనం ప్రపంచపటం, గ్రహ గోళం చూస్తే మనకు బోధపడగలదు. ఈ పరిభ్రమణంతోనే చక్కని సంగీతాన్ని అందిస్తుంటాయి. అందరు దేవతలకు, అన్ని గ్రహాలకు శబ్ద

తరంగాలు కలిగించేవారు ఈ అశ్వినీ దేవతలే. వీణయందుకూడ ప్రధానమగు తంతువునకు అటు మూడు, ఇటు మూడు తంతువుల నేర్పరిచి సప్త తంతు వాయిద్యముగ ఏర్పరిచారు. అలా వేణువు కూడ సప్త రంధ్రములు కలిగి వుంటుంది.

ఇంతకు ముందు అన్ని గ్రహములకు 3,600 కోణములు ఉన్నాయని తెలుసుకోవడం జరిగింది. దానివల్లనే మనకు సప్తస్వరాలు స, రి, గ, మ, ప, ద, ని అనే శబ్దాలు ఉద్భవించాయి. ఈ ఏడు ధ్వనుల సంగీతం కలిగిన చోటులోనే అశ్వినీ దేవతలు ఉంటారు. వాటిని గ్రహించి మనకు అందించినవారు నారద, తుంబురులు. వారే ఈ సంగీత జ్ఞానానికి గురువులు. కానీ అన్ని విద్యలకు నటరాజయిన శివుడే రాజ గురువు. ఏ విద్యకైనా సృష్టిలో ఆది గురువు శివుడే. ఆయన నుండే అన్ని విద్యలు, యోగము, సంగీతము, నాట్యము వెలువడ్డాయి. ఇవన్నీ మీకు నా శిష్యుడైన రావణుడు చెప్తాడని శివుడు ఏర్పాటుచేయడం జరిగింది. అంటే రావణబ్రహ్మ అలాంటి సంగీత విద్వాంసుడు. తరువాత మనకు ప్రధానమైన గురువులు ఈ నారద, తుంబురులు. ఇది ఒక ప్రధానమైన గురుపరంపర.

మనలో జరిగే ధ్వనుల అనుసంధానానికి సంబంధించిన ప్రజ్ఞ గల వారికి గంధర్వలోకం నుండి ఈ గానాలు స్ఫృతులుగా దిగి వస్తాయి. మన పరిసర వాతావరణం నుండే అందివస్తాయి. ఈ రాగాలు రకరకాలుగా ఉంటాయి. ఉషోదయం, సూర్యోదయం, అలాగే సాయం సమయం, ప్రతి జాముకు ఒక రకమైన రాగాలు ఉన్నాయి. వీటన్నిటిని పొంది సాధన చేయటానికి అనుగుణంగా

సంగీతం ఏర్పాటుచేయడం జరిగింది. అందుకనే మన భారతీయ సంగీతం మనకు తన్మయత్వం యివ్వడమే కాకుండా సంస్కారం కూడా ఇవ్వగలదు. సంగీతంవల్ల  సంస్కరించబడి దైవ దర్శనాలు చేసుకున్న ఎందరో మహానుభావులు ఉన్నారు. ఇతర సంగీత సంప్రదాయాలలో ఈ అనుభూతి పొందినవారు తక్కువ. ఎందుకు యిది చెప్పడం అంటే సమ్యక్ జీవితం యిలా అశ్వినీ దేవతలు ఏర్పాటుచేస్తారు.

సంగీతాన్ని అనుసరించి శబ్దములు, దానిని అనుసరించి వర్ణములు వస్తాయి. వర్ణములు అంటే అక్షరములు అని అర్థం. అక్షరములు అంటే క్షరము కానివి. అవి శాశ్వతముగా చోటులో ఉండేవి. వీటిని అశ్వినులే పట్టుకొచ్చి మనకు యివ్వడం జరిగింది. అలా వచ్చినవాటిని గ్రహించి ఋషులు మనకు శబ్ద ఉచ్చారణ అందించారు. అందుకనే మనం వాటిని గ్రహించి, సరిగ్గా ఉచ్చారణ చేస్తే ప్రజ్ఞా వికాసం కలుగుతుంది. అందుకే మనం రోజూ ప్రార్థనలో "May the sound I utter, reveal the light in me" చెప్పుకుంటాము కదా! దానిని మనం ఉచ్చారణ ఛందోబద్ధంగా, శ్రావ్యంగా, రాగయుక్తంగా చేయాలి.

అందుకే వక్తలు కొంతమంది మాట్లాడితే వినసొంపుగాను, కొంతమంది మాట్లాడితే వికారంగానూ ఉంటుంది. ఎందుకంటే అందులో అక్షరముల పొందిక, భావ సంపద, సంస్కారము, వారి ఉపాసన వెలువడుతుంది. అందువల్ల ఈ సృష్టి మొత్తం శబ్దము, వెలుగుల ఆధారంగా, ఆ వెలుగులలో ఆయా దేవతలు దిగి వచ్చి స్వరములుగా నిర్మాణం చేస్తున్నారు. దానినే అనుసరిస్తూ ఋషులు

ఉచ్చారణ చేస్తున్నారు. మానవులకు మాత్రమే కదా వాక్కు. ఈ ఋషులు కూడా మానవులే కదా! వారు వృద్ధి చెంది శాశ్వతత్వాన్ని పొందినవారు. మనం మనకు ఋషులు అందించిన ఉచ్చారణలను గ్రహించి వికాసం కలిగించుకోవాలి.

అందుకనే ఇక్కడ చిట్టచివరి పాదంలో ''*మనుష్యాః క్షితి మాచరంతి*'' అని చెప్పడం జరిగింది. అంటే మనుష్యులు మాత్రం ఈ వాక్కు, శబ్దాలలో ఉండే ప్రభావం తెలియక అపశ్రుతులు పలికి, బయట చీకట్లు పెంచుకుంటూ ఇలా నశిస్తున్నారు అని తెలపడం. ఈ ఏడు శబ్దాలు ఏడు గ్రహాలనుండి వస్తున్నాయి. అందుకనే సహస్రారమునందు బృహస్పతి, ఆయన శబ్దం 'యం.' లలితా సహస్ర నామాలలో ''యాకినీ'' శబ్దం పలుకుతాము కదా! 'యం' యాకినీ శబ్దం. అలాగే

| | | | |
|---|---|---|---|
| ఆజ్ఞాచక్రంలో | 'హాకిని' | 'హం' | అనే శబ్దం |
| విశుద్ధిచక్రంలో | 'సాకిని' | 'సం' | అనే శబ్దం |
| అనాహతంలో | 'కాకిని' | 'కం' | అనే శబ్దం |
| మణిపూరకంలో | 'రాకిని' | 'రం' | అనే శబ్దం |
| స్వాధిష్ఠానంలో | 'లాకిని' | 'లం' | అనే శబ్దం |
| మూలాధారంలో | 'ఢాకిని' | 'ఢం' | అనే శబ్దం |

ఇలా మన చక్రాలలో ఏడు శబ్దములు కలవు. తరంగాలు కలవు. వీటన్నిటినీ బీజాక్షరాలుగా చెప్తారు. వీటితో పాటు ప్రజ్ఞా కేంద్రంలో ఉన్న అన్ని అక్షరాలూ తీసుకుంటే మొత్తం సంస్కృత

భాష వస్తుంది. ఒక్కొక్క శబ్దంవల్ల ఒక్కొక్కరకమైన కాంతి పుట్టి, దాని ధర్మాన్ని అది నిర్వర్తిస్తుంది. ఈవిధంగా అవగాహన చేసుకున్నవారు శబ్దములయందు శ్రద్ధాభక్తులు కలిగి, ఉచ్చరించే విధానం తెలుసుకుని, మంత్ర పఠనం చేసి వికాసం పొందుతారు. అలా మనకి కొన్ని అక్షరముల గుంపులు బీజాక్షరములుగా వచ్చినప్పుడు శబ్దముల పొందిక మంత్రములుగా, మరి కొన్ని అక్షరముల గుంపులు ఒక ఛందస్సుగా, గాయత్రీ ఛందస్సుగా, మరి కొన్నిటిని స్తోత్రములుగా యిచ్చి– ఇలా మనకు ఎన్నో విధాలుగా ఆయా దేవతల అవతరణమునకు, దైవానుభూతి కలుగుటకు అశ్వినీ దేవతలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా క్రమమైన పద్ధతిని అనుసరించి దేవతలు తిరుగుతున్నారు. కాబట్టి మనం ఆవిధంగానే శబ్దం ఉచ్చారణ చేస్తే ఆ దేవతలతో అనుసంధానం ఏర్పడుతుంది. అలా మనం వెలుగులతో అనుసంధానం చెంది తరించాలి.

ఈ విషయమై పరమగురువు జ్వాల్‌కూల్ మహర్షి బోధనల పుస్తకాలు చదివితే మనకు ఈ శబ్దములలోని వెలుగులను ఎలా దర్శించవచ్చు అనే విషయాన్ని బాగా వివరించారు. భవిష్యత్తులో విజ్ఞానం అంతా ఈ శబ్దాలు, వెలుగుల గురించే ఉంటుంది. దానికి అనుగుణంగానే రూపాలు కూడా ఏర్పడతాయి. మనుష్యులు, జంతువులు, కీటకములు, పక్షుల రూపాలు ఈ వెలుగుల వల్లే ఏర్పడతాయి. ఈ రూపములలో అందమైనవి, వికారమైనవి కూడా ఉంటాయి. అవి ఎలా ఏర్పడతాయి అంటే శబ్దాల ఉచ్చారణ సరిగ్గా, సమన్వయంతో ఉంటే అందమైన రూపాలు, లేకపోతే వికారమైన రూపాలు ఏర్పడతాయి.

కొన్ని దేవతామూర్తులు అందంగా, పొందికగా ఉంటాయి. శ్రీరాముడు, శ్రీకృష్ణుల రూపములు చూస్తే ఎంతో అందంగాను, గంభీరంగాను కనిపిస్తారు. వారి భాషణము కూడ అత్యంత ఆకర్షణీయంగా వుంటుంది. పలువరుస, కంఠ శ్రావ్యత, పలికే తీరుబట్టి వారియందలి వెలుగు, ధ్వని అవగతమవుతాయి. ఇది సత్యం. *"ముఖాత్ ఇంద్రస్య, అగ్నిశ్చ"* అని పురుష సూక్తం సూచిస్తోంది.

ఆ మధ్యన జర్మనీ దేశంలో ఏడెనిమిది సంవత్సరాల క్రితం అన్నిరకాల సంగీత సంప్రదాయాలకు చెందిన నిష్ణాతులను ప్రపంచం నలుమూలల నుండి పిలిపించి, వారిచేత సంగీత కార్యక్రమం జరిపించడం జరిగింది. అలా ఇరవై నిమిషాలు సాగినప్పుడు ఒక పూలతోటలో ఇతర సంప్రదాయాలకు చెందిన సంగీత వాయిద్యాలను ఆలపిస్తే పూలన్నీ వాడిపోయినాయట. అదే మన భారతదేశ శాస్త్రీయ సంగీతం వినిపిస్తే అవే పూల మొక్కలు తిరిగి లేచి యథాస్థానంలో నిలబడి, ఎవరైతే సంగీతం వినిపిస్తున్నారో వారివైపు తిరిగాయని చెప్పారు. ఇది ఆ దేశంలో రికార్డు చేయబడిన సత్యం. అందువల్ల మన సంప్రదాయ సంగీతానికి ఇంత విలువ ఉందని ధృవపడింది. ఎందుచేతనంటే సృష్టి నిర్మాణాన్ని అనుసరించి శబ్దముల పొందికను ఆవిధంగా ఏర్పాటు చేయబడడం మన సంప్రదాయ సంగీతంలోని విశిష్టత.

మనకి మన సంప్రదాయమును గురించిన విలువలు తెలియవు. ఇతర సంప్రదాయాలను గొప్పగా భావించి, మనది విస్మరించాము. మన విద్యలు విస్మరించి, వారి విద్యలు

నేర్చుకోవటం మన దురదృష్టం. అందువల్ల భాషణం ఒక పెద్ద బాధ్యత. అందుకే *"సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్"* అనేది. మనం సత్యము ప్రియముగా ఉంటేనే పలకాలి. అది తెలియక పలికితే ఎదుటివారిని బాధపెట్టినవారం అవుతాము. దానివల్ల మనకు సూక్ష్మలోకాల్లో ప్రతిస్పందన (ప్రత్యంగిరా) ఉంటుంది. అది నిన్ను బాధపెట్టడం ఖాయం. అందుకే నీలోని భావం గాని, నీ భాషణం గాని నీ వరకు వచ్చి నీకు సామరస్యత నేర్పుతుంది. అలా ఏర్పాటుచేస్తుంది. సమరసంతో అనుభూతిని కలిగిస్తుంది. విమర్శలు, వికార భాషణాలు, వ్యంగ్య భాషణాలు చేస్తే, అవన్నీ మరల ప్రతిస్పందన జరిగి నీవద్దకే రాగలవు. మనకు బాధలు ఎందుకు కలుగుతున్నాయో తెలియదు. మన మాటవల్ల కూడా కావచ్చు. అందుకనే మనస్సు బాగో లేదు అని చెబుతుంటారు.

శ్రీ మహాభారతంలో యుధిష్ఠిరుడు సింహాసనం అధిష్ఠించే సమయంలో నడిచి వెళ్తుంటే, కొంతమంది పండితులు "ఇతను వస్తే కలియుగం రాదు. ఇతను చాలా ధర్మపరుడు. శ్రీరామునిలా తన ధర్మం తాను నిర్వర్తించగల సమర్థుడు. కనుక ద్వాపరయుగం నుండి త్రేతాయుగానికి వెళ్ళవలసి వస్తుంది తప్ప కలియుగం రాదు" అని భావించి వికార భాషణములు చేస్తారు. అవి చాలా విమర్శనాత్మకమైన భాషణలు. అవి విని యుధిష్ఠిరుడు తల తిరిగి కుప్పకూలిపోతాడు. అది గమనించిన శ్రీకృష్ణుడు మరో సద్బ్రాహ్మణ బృందాన్ని ప్రేరేపించి సద్భాషణ చేయిస్తాడు. అప్పుడు ధర్మరాజు వికాసం చెంది, లేచి సింహాసనం వరకు నడిచి వెళ్ళడం జరుగుతుంది. భాషణలోని తరంగాల ప్రభావంతో రంగులు

కూడా ఉద్భవిస్తాయి. అలాంటి కాంతులు, రంగులు, శబ్దములతో అశ్వినీ దేవతలు ఈ సృష్టి అంతా ఏర్పాటు చేశారు. మనం కూడా దాని వైభవం పొందాలంటే ఈ శబ్దాలను చక్కగా ఉచ్చరించాలి. ఈ శక్తి కేవలం మానవులకే ఉంది. దాని వినియోగం ప్రధానం. అందుకనే ఋషులు చాలా మౌనంగా ఉంటారు. అవసరమైతే తప్ప సంభాషణ చెయ్యరు. మనం వేరేగా ఉంటాము. మనం మన మాటలతోనే చీకట్లు పెంచుకుపోతుంటే మనకు నశింపు తప్పదు. (దీనికి సంబంధించిన విషయాలు 'SOUND' అనే పుస్తకంలో వివరంగా వ్రాయడం జరిగింది. దానిలో శబ్దాలు, వాటి విలువలు, దానికి నియమములు, మంత్రములు వాటి విలువలు, మన భాషణము, దాని ప్రాముఖ్యత వంటి అన్ని విషయాలు విపులంగా వివరించబడ్డాయి.)

మనం మహర్షి ఆశ్రమం చూస్తే అక్కడ ఎక్కువగా ఎవరూ మాట్లాడరు. మహర్షి పైథాగరస్ ఆశ్రమంలో ప్రవేశిస్తే, ప్రారంభంలో మూడు సంవత్సరాల పాటు మనం మౌనం వహించాలి. అదే వారి ప్రథమ శిక్షణ. మాట్లాడే విధానానికి అలవాటు పడటానికి సుమారు 36 నెలలు పడుతుంది. తరువాతనే ఎలా మాట్లాడాలో తెలుస్తుంది. మనం భూమిని శుభ్రపరచిన తరువాతనే ముగ్గులు వేసినట్లు అందరూ ఆవిధంగా ముందు మౌనం ప్రదర్శించాలి. వాళ్ళనే మునులు అని పిలుస్తారు. మననంచేత వాళ్ళు మౌనంగా ఉన్నారు అని అర్థం. వారు అవసరమైతేనే మాట్లాడతారు. మనం దానికి వ్యతిరేకం కదా! మనకి బాగా మాట్లాడడం అలవాటయింది. దానివల్ల చీకట్లు వస్తుంటాయి. ఆ చీకట్లు పోవటానికి స్తోత్రాలు

చేస్తుంటాము. 'ఓంకారము' చేస్తుంటాము. అలా చేసి తెచ్చుకున్న కాంతిని మళ్ళీ పిచ్చివి మాట్లాడి పోగొట్టుకుంటాము. మన ప్రవర్తన అంతా కుక్కతోకకు బద్దకట్టినట్టుగా ఉంటుంది. వంకర మాత్రం పోదు కదా! మనం ఇలాగే చీకట్లు ఎక్కువ చేసుకుంటూ జీవిస్తుంటాము. మనం మంచి మార్గం నుంచి త్రోవ తప్పి చెడిపోతున్నాము. "We are desisting away from the Path". అందుకనే దేవతలు, ఋషులు ఏర్పాటుచేసిన మార్గాలను అనుసరించక, వైవిధ్యం చెందడంచేత ఈవిధంగా చీకటిలో పడిపోతున్నాము అని మంత్రాల సారాంశం.

ఎన్నిసార్లు విన్నా మనం మళ్ళీ మామూలుగానే మారి పోతుంటాము. మన భాషణం మార్చుకోము. ఇలా మనం పరివర్తన చెందితే బాగుపడతాము అంటే అలా చెయ్యకపోవడమే మన దురదృష్టం. ఇదంతా సులభంగా అర్థమయ్యేదే. అదృష్టం కొద్దీ ఈ మంత్రంలో జ్యోతిష విషయాలు లేవు. మొన్న నాలుగవ మంత్రంలో జ్యోతిషం వచ్చింది. అందరికీ జ్యోతిషం పరిచయం ఉండదు. ఈరోజు జ్యోతిషం లేకుండా మనందరికీ తెలిసిన భాషణం విషయమై మంత్రం వచ్చింది. అది మనం సాధారణంగా వాడుకునే ప్రజ్ఞ కదా! అది అగ్ని తత్త్వం. ముఖంనుండి వస్తుంది. *''ముఖాత్ ఇంద్రశ్చ అగ్నిశ్చ''* అని అంటుంటాము కదా! అందుకని మాట్లాడుతుంటే చక్కని వెలుగు రావచ్చు.

చికాగో నగర సమావేశ ప్రారంభంలో శ్రీ వివేకానంద స్వామి ఉపన్యసించేందుకు పావుగంట సమయం మాత్రమే ఇవ్వడం జరిగింది. ఆయన మూడు గంటల సేపు అనర్గళంగా

మాట్లాడినా ఎవరూ ఆపలేదు కదా! ఎందుకని అంటే ఆయన భాషణలోని వెలుగుల ప్రభావం, ఆ పద విన్యాసం. అందరు సభికులూ నాగుల మాదిరి ఊగుతూ కూర్చుండిపోయారు. అందరూ అలా ఉచ్చారణ చేయలేరు కదా! ఉచ్చారణలో ఆకర్షణ ఎప్పుడు వస్తుందంటే నీకంటూ 'నాదోపాసన' ఉంటేనే వస్తుంది. సినిమాలో శంకరశాస్త్రి "నాదోపాసన చేసినవాడను నేనైతే" అని పాడిన పాట ఉంది కదా! ఆయన సంగీతానికి సభికులందరూ అలా కూర్చుని ఉండిపోయారు కదా! అందుకనే కొంతమంది మాట్లాడితే తన్మయత్వం కలుగుతుంది. అప్పుడు మనకు సమయం తెలియదు. మనయందు ఈ నాదోపాసన ప్రణవంగా ఉంది. అందుకనే నాదోపాసనే ప్రణవోపాసన. మనం ప్రణవమునందు 'ఓంకారం' వెలుగును దర్శించడం అవసరం. దానికి హృదయం కావాలి. 'హంస' శబ్దం మనం అలా పట్టుకోవాలి. అలా వేళ్ళాడుతూ, వదలకుండా సాధన చేసి తరించాలి. మనం దీనికి వ్యతిరేకంగా బయటి విషయాలను గబ్బిలంలా పట్టుకుంటాము. లోపల పట్టుకోవాలి. ఈ 'సోహం' అనే శబ్దం ఓంకారాన్ని చేరుస్తుంది. అదే నాద బ్రహ్మము. ఆ నాదంతో నీవు కూడినట్లయితే దాని ప్రభావం వల్ల నీ వాక్కుకు బలం చేకూరుతుంది. వాక్శుద్ధి వస్తుంది. ఇలా జరిగితేనే నీవు ఉద్ధరింపబడతావు.

అందుకని నాదము / ప్రణవము బాగా ఉపాసన చేస్తే మన వాక్కునకు బలం చేకూరుతుంది. అప్పుడు మనం రచించినా, ప్రవచించినా దానికి బలం ఉంటుంది. మహాత్ములు వచించిన విషయాలు శాశ్వతంగా ఉంటాయి. శ్రీ మహాభారతము,

శ్రీమద్భాగవతము, శ్రీమద్రామాయణము, శ్రీమద్భగవద్గీత గ్రంథములు ఈ భూమి ఉన్నంతకాలం ఉంటాయి. అలాగే పోతనామాత్యుని పద్యాలు. ఆయన సరస్వతిని ప్రార్థించే విధానం ఎలా ఉంటుందో గమనించండి. *''సుశబ్దంబుల్ శోభిల్లన్ బల్కుము నాదువాక్కునను సంప్రీతిన్ జగన్మోహినీ పుల్లాబ్జాక్షి సరస్వతీ భగవతీ పూర్ణేందు బింబాననా''* అని. ఎందుకంటే మనం మాటలచేత మోహనత్వం కలిగించవచ్చు. హృదయం వికాసం చెందుతుంది. ఇంకొక పద్యంలో *''నిన్ను ఎప్పుడు దర్శించగలను తల్లీ!''* అని సంబోధిస్తాడు.

మనం లోపల సరస్వతీ దేవిని చూడటం అనేది ఉంది. ఆ వ్యవస్థలో మనం బాగా స్తోత్రాలు గాని, కీర్తనలు గాని పాడుతుంటే లోపల నాదం రకరకాలుగా నర్తిస్తుంది. దానికి అనుగుణమైన వెలుగుల నర్తనం మనం గ్రహించవచ్చు. నర్తిస్తున్న నాదాన్ని, దాని కాంతిని మనం అనుభవిస్తుంటే ఆ ధ్వని జలపాతంలా వెలుగై మనలోకి దిగి వస్తుంది. అప్పుడే మనకు తన్మయత్వం కలుగుతుంది. అప్పుడు మనం దానిలో లీనమై ఉంటాము. ఇంత అద్భుతమైన విషయాలు మనయందు సాధ్య స్థితిలో ఉన్నాయి. వాటిని మనం సిద్ధింపచేసుకోవాలి.

"They exist as Potential. We have to enable their Manifestation" అనేది ఈ ఉపదేశ సారం.

**మంత్రము - 10 :**

> **తౌ నాసత్యా వశ్వినౌ మహేమ**
> **స్ర జం చయా బిబృథః పుష్కరస్య ।**
> **తౌ నాసత్యా వమృతా వృథా వృతే**
> **దేవాస్తత్ప్రపదేన సూతే ॥**

**టీక :**

చ = మరియు; పుష్కరస్య = తమ్మిపూల యొక్క, కలువపూల; స్రజం = దండను; యౌ = ఏ ఇద్దరు; బిభ్రతః = భరించియున్నారో; తౌ = ఆ ఇద్దరును; నాసత్యౌ = నాసత్యు లనబడు వారిని; అశ్వినౌ = అశ్వినీ దేవతలను; మహేమ = మహిమాను వర్ణనము చేయుచున్నాను; అమృత+ఆవృధ+ఆవృతే = అమృతముచే వర్థిల్లుచు అమృతముచే ఆవరింపబడిన వారగు; నాసత్యౌ = నాసత్యులు; తత్ = వారు కారణముగా; తేదేవాః = ఆ దేవతలందరును; ప్రపదేన = వెనుక కాళ్ళతో; సూతే = ప్రసవించుచున్నారు.

**తాత్పర్యము :**

నాసత్యు లనబడు అశ్వినుల మహిమను స్తుతించుచున్నాను. వారు అమృతమును కల్పించి దానియందు వర్థిల్లుచు దాని పొరలచే ఆవరింపబడి తిరుగుచున్నారు. కలువలు, తమ్మిపూలు గల దండను ధరించి యున్నారు. వారు తమ వెనుక కాళ్ళతో దేవతలకు ప్రసూతిని కల్పించుచున్నారు.

**వివరణము :**

నాసత్యులుగా అంటే ఉండీ లేనట్లుగా, వ్యక్తావ్యక్తములుగా ఉండే అశ్వినీ దేవతలను ఇలా వర్ణన చేస్తున్నాను. వారి మహిమలను వర్ణిస్తున్నాను. అశ్వినులైన మిమ్ములను మరియు మీ మహిమలను వర్ణన చేస్తున్నాను. తెల్ల కలువలు మరియు నీలం కలువలు కలిగినటువంటి పూలదండలు మీరు ధరించి యున్నారు. ఆ దండ అత్యంత ఆకర్షణీయముగా నున్నది. ఒక తెల్లని కలువ, ఒక నల్లని కలువ, మరల తెల్లని కలువ– ఇట్లు దండను కూర్చినారు. రెండు రకముల కలువలు సమాన పుష్టిని కలిగియున్నవి. తెల్ల కలువలు అంటే సూర్యకాంతి, నీలం కలువలు అంటే చంద్రకాంతి కలిగినవి. అలాంటి పూలదండలు ధరించి యున్నారు. ఈ రెండు రకముల కలువలతో పోషణమును పుష్టిని కలిగించుచున్నారు.

తెల్ల కలువలు అంటే సూర్య కిరణములు. నీలం కలువలు అంటే చంద్ర కిరణములు. ఈ రెండు కిరణములే మనకు సృష్టిని కలిగించేవి. ఇలాంటి పూలదండలు అశ్వినీ దేవతలు విశేషముగా ధరించి ఉన్నారు. పుష్కరము అంటే పుష్కరిణి వంటి నీటి కుంటలు. అందులోనే ఈ తెల్ల కలువలు, నీలి కలువలు ఉంటాయి. అంటే ఈ సృష్టి అంతా తెల్ల కలువలతోను, నీలి కలువలతోను అంటే సూర్యకాంతితోను, చంద్రకాంతితోను నింపబడినది. దాన్ని వారు ధరించి, అందు వారుండి, అన్ని పరిసరములకు అమృత కిరణములు ప్రసరింపజేస్తున్నారు.

సూర్య చంద్రాత్మకములైన కిరణములు సమముగా ఎవరియందు వర్తింపబడి ఉన్నాయో వారియందు అమృతత్వ స్థితి

ఉండగలదు. సూర్యచంద్రాత్మకమగు కాంతి ఎవరియందు పుష్టిగా నుండి సమవర్తనమై యుండునో వారియందు అమృతత్త్వము ఏర్పడును. మనయందు కూడ సూర్యప్రజ్ఞ, చంద్రప్రజ్ఞ పుష్టిగా నుండవలెను. అంతేకాదు సమానముగ నుండవలెను. అట్లున్నచో అమృత తుల్యులమై యుందుము. యోగీశ్వరులందరూ అలానే వుంటారు. వారు ఎంత ప్రేమమూర్తులో అంత పరాక్రమవంతులుగా వుంటారు. యోగీశ్వరులైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అత్యంత ఆకర్షణీయులు. ఋషులు, మునులు వారికి ఆకర్షితులు. వారు స్త్రీలకు, పురుషులకు కూడ ఆకర్షణీయులు. *''చూచువారలకు చూడ ముచ్చటట''* అని వారిని పొగడుతుంటాము. జగద్గురువు మైత్రేయులు, గౌతమబుద్ధుడు అట్టి యోగులు. వీరు పరిపుష్టులే కాక పరిపుష్టమును నిత్యము కలిగించు చుందురు. కొందరు పురుషులకు ఆకర్షణీయముగా గోచరించు స్త్రీలు వుంటారు. కొందరు స్త్రీలకు ఆకర్షణీయమగు పురుషులు వుండవచ్చును. కాని స్త్రీ పురుషులందరికిని ఆకర్షణీయముగా నుండువారే పుష్కర జనులు. ఇట్టివారికి అధిదేవతలు అశ్వినులు. వీరి ఆరాధనము అహర్నిశలయందు సమవర్తనము కలవారు తప్పక ఉద్ధారణము చెందగలరు.

అలాంటి అమృతత్వ స్థితిలో వారు పరిపూర్ణంగా ఉంటూ దానిని వర్థిల్లజేస్తుంటారు. వారు ఈవిధముగా వర్థిల్లజేస్తుంటే, దానినుండి వెలువడుతున్న దేవతలు వెనుక కాళ్ళతో ప్రవర్తిస్తున్నారు అని అర్థం. 'ప్రపదములు' అంటే వెనుక కాళ్ళు. పాదముల మడమలు, కాలి పిక్కలు, తొడ వెనుక భాగములు ఇవన్నీ

కూడా ప్రజోత్పత్తికి సహకరించే ఇంద్రియములు. సృష్టి ఉత్పత్తికి సహాయపడే సాధనములు. *"పశ్చాత్ భూమి మధోపురః"* అని సూక్తం కదా! అంటే మన శరీరంలో వెనుకభాగం నుండి కామము, దానిని నిర్వర్తించు అంగములు, వాటికి కావలసిన శక్తి అంతా కూడా మనకు వెనుకభాగంలో ఏర్పాటుచేసి, దానికి బలమివ్వటానికి పిరుదులు, తొడలు, పిక్కలు, మడమలు యివ్వబడ్డాయి. బలాన్ని బట్టి ఇంద్రియములలో జీవుని సంతాన ఉత్పత్తి ఉంటుంది. అలాగే మోకాళ్ల క్రింది పిక్కలు ఎంత బలిష్ఠంగా ఉంటే వారియందు అంత బలమైన కామశక్తి ఉద్భవించి సంతానోత్పత్తికి దోహదపడుతుంది. అలాగే కాలి వెనుక మడమ భాగం, పాదాల క్రింద వెనుకభాగం ఈ సృష్టికి దోహదపడే అంగములు. ఇవి అన్నీ చంద్రాత్మకమైన ప్రజ్ఞల ద్వారా సృష్టి అయినవి. ఇవి బలహీనంగా ఉంటే ఆ ప్రదేశాలలో మనకు అనారోగ్యం, నొప్పులు వస్తాయి.

సూర్యాత్మకమైన ప్రజ్ఞ అంతా మన శరీరం ముందు భాగంలో ఉంటుంది. ముందు భాగం అంటే తూర్పు. ఉత్తర, ఈశాన్య దిశలు అని అంటూ ఉంటాము. మన శరీరంలో ఉత్తరం అంటే శిరస్సు పైభాగం. తూర్పు అంటే ముఖము. మనస్సు హృదయంలో ఉంటుంది. వెనుకభాగంలో మన జననేంద్రియములు ఉంటాయి. వెనుకభాగం నుండి అశ్వినీ దేవతలు తమ కిరణములను ప్రసరింపజేస్తారు. ఎలా అంటే సూర్యకాంతి ముందునుండి వస్తే, చీకటి వెనుకనుండి వస్తుంది కదా! అంటే ముందు కాంతి ప్రసరిస్తుంటే వెనుక చీకటి ఉంటుంది. అందుకనే మనం ముందు శ్లోకంలో సూర్యుని రథం వెనుకభాగంలో రక్షసులు వస్తుంటారని

తెలుసుకున్నాము. కనుక చంద్రకాంతి, సూర్యకాంతిని అనుసరిస్తూ వెనుకగా వస్తుంటుంది. అందుచేత ఈ దేవతలు సూర్యుని యొక్క వెనుకభాగం నుండి పిండోత్పత్తి, గర్భధారణ, అంకురారోహణ / మొలకెత్తుట వంటి కార్యక్రమాలు నిర్వర్తిస్తుంటారు. కాబట్టి ఉత్పత్తి కార్యక్రమాలు వెనుకభాగం నుండే నిర్వర్తింపబడతాయని తెలుసుకోవాలి. ఈ పిండ ఉత్పత్తి రాత్రివేళలోనే జరుగుతుంది. ''ప్రపదేన'' అంటే కాలి వెనుక భాగము.

కాబట్టి రాత్రి గడియలు రాగానే మానవులకు, జీవులకు కామోద్రేకం కలుగుతుంది. అందుకనే పగలు ఈ కార్యక్రమాలు నిషిద్ధం అని పెద్దలు తెలిపారు. కాబట్టి ఎప్పుడు పడితే అప్పుడు లైంగిక చర్యలు జరుపరాదు అని పెద్దలు తెలిపారు. ఎందుకంటే రాత్రిపూట రక్షసులు ఉంటారు. పగలు దేవతలు ఉంటారు. అందుకే మనకి సృష్టి కార్యక్రమం అంతా రాత్రి పూటనే. అంటే నిశీథిలోనే. అందుకనే సాయంకాలం అయిన తరువాత ఒక జాము సమయం దాటేవరకు కామప్రక్రియ నిషిద్ధమని పెద్దల శాసనం. పగలు ఇది పూర్తిగా నిషిద్ధం. తద్విరుద్ధంగా ప్రవర్తించడంవల్ల మనకు ఉన్న ప్రాణశక్తి, ప్రజ్ఞాశక్తి హరింపబడతాయి. అదే కారణాన్ని ఈ శ్లోకంలో తెలియజేయడం వేద వాఙ్మయంలోని విశేషం. అవగాహన చేసుకోవాలి. మనకి ముందు భాగం, వెనుకభాగం అని రెండు రకాలుగా చెప్తారు. ముందు భాగం అంటే తూర్పు, ఉత్తర, ఈశాన్య, ఆగ్నేయములు. ఆగ్నేయము అంటే మన భుజముల ప్రదేశము. దక్షిణము కూడా మన ముందు భాగములోకే వస్తుంది. నైఋతి, పశ్చిమములు వెనుక భాగములు.

*''పశ్చాద్భూమి మధోపురః''* అనే మంత్ర భాగం ఉంది. అందుకే వాస్తు శాస్త్రజ్ఞులు ఆ ప్రదేశాలలో బరువు పెట్టమంటారు. అది పదార్థపరమైనది. పదార్థపరమైనవి అన్నీ పశ్చిమంగానూ, నైఋతిగానూ ఉంటాయి. మిగతా భాగాలు అన్నీ సూక్ష్మమైన భాగాల్లో / లోకాల్లో ఉంటాయి. అందుచేత భౌతిక లోకంలో ఉత్పత్తి జరగాలంటే మనకు పశ్చిమము, నైఋతి చెప్తారు. కాబట్టి సూర్యుడు పయనిస్తుంటే రథానికి వెనుకవైపు నడుస్తూ, అనుసరిస్తుంటారు. అందుకే రాత్రి సమయమునందు దేవతలు ఈ సృష్టి కార్యక్రమాలు నిర్వర్తిస్తుంటారు. మనము ప్రసూతి గృహము అంటూ ఉంటాము కదా! ఉత్పత్తి కార్యక్రమాలన్నీ ఆ ప్రదేశంలోనే జరుగుతుంటాయి. ఈ విధంగానే మనం దీనిని అవగాహన చేసుకోవాలి.

పగలు దేనికి, రాత్రి దేనికి పనికివస్తాయో తెలుసుకోవాలి. ఈ ప్రజోత్పత్తి కార్యక్రమమే కాకుండా జీవులకు మరల దేహాలు ఏర్పాటుచేసే కర్తవ్యం మనపై ఉంటుంది. ఈ కర్తవ్యం నిర్వహణ వరకే మన పని. సంతానం కలిగిందా లేదా అనేది కాదు. కర్తవ్య నిర్వహణ చేయాలి. దాని కోసమే *''కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన''* అనే శ్లోకం చెప్పబడింది. ఎవరికి సంతానం కలగాలి అనేది ప్రకృతి నిర్ణయిస్తుంది. దాన్ని అంగీకరించి సంతానంకోసం ప్రయత్నించడంలో తప్పులేదు. ప్రయత్నం మన బాధ్యత. చేసినా కలగకపోతే దైవేచ్ఛ అని అనుకోవాలి. అదే ప్రజ్ఞను దివ్య లోకాల్లోని అనుభూతికోసం వినియోగించుకోవచ్చు. ఎందుకంటే ఊర్ధ్వలోకాల్లో మనకు చంద్రకాంతి, శుక్రకాంతి, ఇంద్రకాంతి,

సోమకాంతిగాను అనుభూతి నిస్తాయి. సోముడు, ఇంద్రుడు, శుక్రుడు, చంద్రుడు వీరు అందరూ మనకు రాత్రిపూట దివ్యమైన అనుభూతిని ఇచ్చే ప్రజ్ఞలుగా చెబుతారు. పగటి వేళ సూర్యుడు, బుధుడు, కుజుడు, శనైశ్చరుడు వీరంతా సూర్యకాంతిలో తేజరిల్లుతుంటారు. సోముడు అంటే స + ఉమ. ఉమతో కూడిన ఈశ్వరుడని అర్థం. ఇంద్రకాంతితో మనం తన్మయ స్థితి పొందవచ్చు. ఈ ఇంద్రకాంతి మనకు భ్రూమధ్యమున ఉంటుంది. ప్రజ్ఞ అక్కడికి చేరితే చక్కని అనుభూతి వస్తుంది. అలాగే మన ప్రజ్ఞ హృదయం చేరితే శుక్రుడి అనుభూతి పొందవచ్చు. ఇలా అనుభూతిని యిచ్చే గ్రహముల ప్రభావం మనకు రాత్రి సమయంలో చంద్ర కిరణములనుండి ఎక్కువగా కలుగుతుంది. చంద్రుడి అనుభూతి మనం బాహ్య అంతరములుగా పొందవచ్చు. అందుకే రాత్రియందు నీలిమ, ముత్యమువంటి కాంతు లుంటాయి. అందుచేతనే ఈ భాగం సృష్టికి ముఖ్య భాగంగా ఏర్పాటుచేశారు.

పశ్చిమం, నైఋతి దిక్కులు సృష్టి నిర్మాణానికి అనుకూలిస్తాయి. మిగతా దిక్కులు సూర్యకాంతి అనుభూతిని ఇస్తాయి. అంటే ఆత్మానుభూతి నిస్తాయి. అందుచేత ఈ శ్లోకంలో మనకు కలువపూలు, తమ్మిపూలు వరుసగా చంద్రకాంతి, సూర్యకాంతి కిరణములుగా పోల్చి చెప్పడం జరిగింది.

ఉదయం చాలా ప్రకాశంగా ఉండేవారు కొంతమంది ఉంటారు. మందంగా ఉండేవాళ్లు ఎక్కువగా ఉంటారు. ఉదయం చాలా ప్రకాశంగా ఉండేవారు సాయంత్రం కూడా ప్రకాశంగానే ఉంటారు. వారిలో ఇంద్ర ప్రకాశం ఎక్కువగా ఉంటేనే సాయంత్రం

ప్రకాశంగా ఉండగలరు. మీరు గమనిస్తే పాశ్చాత్యులు సాయంత్రం ఎక్కువ ప్రకాశంగా ఉంటారు. వారు ఉదయం అంత ప్రకాశంగా ఉండరు. అలాగే కొన్ని పుష్పాలు ఉదయం వికసిస్తాయి. కొన్ని పూలు సాయంత్రం వికసిస్తాయి. మల్లెపూల సువాసన సాయంత్రమే బాగుంటుంది. దానికి అనుగుణంగానే మనం వాడుకోవాలి. ఉదయం వికసించేవి ఉదయం వాడుకోవాలి. ఏవి ఎప్పుడు పరిమళిస్తాయో వాటిని అప్పుడే వాడుకోవాలి. అది ప్రకృతి ధర్మం. ఈ రెండు పరిమళాలలోను అమృతత్వం ఉంది.

అశ్వినులు అమృతమును ధరించి, దాన్నే మనకు ప్రసరింపజేస్తుంటారు. చంద్రకాంతికి హెచ్చుతగ్గులు ఉండగలవు. కాని మరణం ఉండదు. అమృతత్వం సూర్య, చంద్ర కిరణముల ద్వారానే మనకు ప్రసరణ జరుగుతుంది. పురాణాలలో చంద్రునికి దక్ష ప్రజాపతి (మామ) ''క్షీణించి మరణించు'' అని శాపం యివ్వడం జరిగింది. కానీ క్షీణించి మరణించడానికి వీలు లేకుండా చంద్రుడిని పరమశివుడు ధరించి చంద్రశేఖరుడుగా పిలవబడ్డాడు. అందుకే చంద్రుడు క్షీణించి మరల వృద్ధి (శుక్ల, కృష్ణ పక్షములుగా) పొందుతుంటాడు. అందుకే మనకు ముందు శ్లోకాల్లో ''వృత్తభూయో'' అని వస్తుంది. 'వృత్తభూయః' అంటే వృత్తాకారంగా తరుగుతూ, పెరుగుతూ, తరుగుతూ ఉంటాడు. కానీ మరణించడు.

అలాగే మన మనస్సు పొంగుతూ మరణంలోనే అదృశ్యమై తదుపరి జన్మతో వస్తుంది. అందుకని అశ్వినీ దేవతలు నిర్వర్తించే కార్యక్రమంలో ఏదీ మృతిచెందేది లేదు. పదార్థము మృతిచెందదు.

పదార్థము ప్రజ్ఞలోకి వెళ్ళి మళ్ళీ వ్యక్తమవుతుంది. ఎందుకంటే మనకు రాత్రి వెళ్ళి పగలు వస్తుంది కదా! అందుకని ఈ సృష్టిలో దేనికీ మరణం లేదు. శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణుడు ''ఉన్నది ఎప్పుడూ ఉన్నది. ఎక్కడికీ పోదు. కానీ కొంతకాలం వ్యక్తంగాను, కొంతకాలం అవ్యక్తంగాను ఉంటుంది'' అని చెప్పాడు. అందుకని ఈ నిర్మాణం వ్యక్తా వ్యక్తములుగా ఉంటుంది. అలా ఉంటుంది ఈ సృష్టి నిర్మాణం.

అందుచేత అశ్వినీ దేవతలు రాత్రి, పగలు ప్రజ్ఞలుగా ఏర్పాటుచేసి, పగలు భావయుక్త లోకాల్లోను, రాత్రి అంతర్లోకాల్లోని అనుభూతిని పొందే విధంగా ఏర్పాటు చేయబడింది. రాత్రి కిరణములలో ప్రకృతి పరంగాను, పగటి కిరణములలో ప్రజ్ఞా పరంగాను బ్రహ్మదేవుడు నిర్మాణం చేయడం జరిగింది. ఎలా అంటే ఒకరిని ఒకరు చూసుకుని నిర్మాణం చేసుకుంటుంటాము కదా! అలానే నాలాగే మీరూ సృష్టి చేయండని ప్రజాపతులను ఏర్పాటుచేయడం జరిగింది. బ్రహ్మదేవుడు అలా పదిమంది ప్రజాపతులను ఏర్పాటుచేశాడు.

ఈ ప్రజాపతులు, వారి సంతతికి ఇదే కార్యక్రమం చేయాలని నిర్ణయించడం జరిగింది. అదే పరంపరగా ఈ సృష్టి కార్యక్రమం సాగుతోంది. అందుకే *''ప్రాజాపత్యం ప్రాజాపత్యం''* అనే మంత్రం ఉంది. అదే వ్యవస్థగా ఏర్పడింది. ఇది తైత్తిరీయ ఉపనిషత్తులోని మంత్రం. సూక్తం అంటే చక్కగా చెప్పబడిన వాక్యం అని, చక్కగా ఉచ్చరింపబడినదని అర్థం. అందుకే మన తల్లిదండ్రులు చేసిన కార్యక్రమములే మనమూ చేస్తున్నాము

కదా! లేదా మన గురువులు చేస్తున్న కార్యక్రమములే మనమూ చేస్తుంటాము. అలా వృద్ధి చెందుతూ ఉంటాము. అలా ముందు వారిని చూచి వారి తరువాతి వారు నిర్వర్తిస్తుంటారు. ఈ వృద్ధి చెందించే కార్యక్రమంలో భాగంగా జీవులకు శరీరాలు ఏర్పరచే బాధ్యతలు కూడా ఇవ్వడం జరిగింది. వృక్షముల నుండి వృక్షములు ఎలా పుట్టుకు వస్తాయో అలాగే పక్షులకు, జంతువులకు, అన్ని ప్రాణులకు ఈ కార్యక్రమం జరుగుతుంది. మానవుల మాదిరిగానే దేవతలు కూడ ఈ కార్యక్రమం రాత్రిపూట నిర్వర్తిస్తుంటారు. అంటే మనలోని దేవతా ప్రజ్ఞలు అని అర్థం. కాబట్టి ఈ కార్యక్రమానికి సహకారం రాత్రివేళలే. కనుక పాదముల వెనుక భాగము, పిక్కలు, మొల వెనుక భాగము అని చెప్పబడుతుంది. దాని వల్లే మనకు నిద్ర వస్తుంది. నిద్ర రాకపోతే మర్నాడు మనకి పుష్టి రాదు. అందుకని కామమునకు, నిద్రకు, ప్రజోత్పత్తికి, తుదకు దివ్యమైన అనుభూతులకు మన వెనక నుండి అంటే సూర్యుని వెనక నుండి వచ్చే కాంతి కిరణములే కారణము అని ఈ శ్లోకము యొక్క ప్రధానమైన అర్థము ఇక్కడ ఇవ్వబడినది. అందుచేత మనం పగలు ఏ పనులు నిర్వర్తించాలి? రాత్రి ఏ పనులు నిర్వర్తించాలి? అనేది సృష్టిలో వివరింపబడింది. ఈ సంపూర్ణ కార్యక్రమాన్ని సదా అశ్వినీ దేవతలు నిర్వర్తిస్తున్నారు అని ఈ శ్లోక సారాంశం.

మన శరీరంలో ఇలాంటి అమరిక ఉంది అనేది మనం గుర్తించాలి. *''ఇంద్రగోపపరిక్షిప్త స్మరతూణాభ జంఘికా''* అని మనం శ్రీ లలితా సహస్ర నామాలలో చెప్తాము కదా! మరియు *''జానుద్వయ విరాజితా''* అని కూడా కొలుస్తాము. ఇక్కడే ఇంద్రుడు

కామానికి అధిపతియై వ్యామోహము కలిగించుచున్నాడు. అందుకనే కామ సృష్టి మన పిక్కలలో ఉంటుంది. మనం మన సంస్కృతిని విసర్జించడం వల్ల మనకు ఏదీ సరిగ్గా బోధపడదు. అందువల్ల వికాసం కోల్పోతున్నాము. అవకాశం జారవిడుచుకొనుచున్నాము. సామాన్యంగా మన శరీరంలో దశ దిక్కులు ఉన్నాయి. కాబట్టి ఇందులో పశ్చిమ, నైఋతి మనకి దేహదారుఢ్యం ఇచ్చే భాగాలు. అందుకని మన హృదయ వితానం వెనుకభాగంలో ఉంటుంది.

ఇలా మన దేహాన్ని కూడా విభజించి అర్థంచేసుకోవాలి. శిరస్సు దేవతలకు, దివ్య లోకాలకు సంబంధించినదని తెలిపారు. *"శీర్ష్ణోద్యౌ"* అంటే విద్యుత్కాంతి . అంతా వెలుగులతో నిండి ఉంటుంది. కంఠం నుండి ఉదరవితానం వరకు ఇది ఉంటుంది. దీనినే ఉరస్సు అని కూడా అంటారు. దాని పైనది శిరస్సు. దానియందు రకరకములైన దివ్యప్రజ్ఞలు ఉంటాయి. అది అంతా శక్తిమయంగా ఉంటుంది. అదే మనకి ప్రాణశక్తిగా పనిచేస్తుంది. దానిపై వాయువు పనిచేస్తుంది. నిటలంలో సూర్య ప్రజాపతికి నమస్కరిస్తాము కదా! ఉదరంలో అగ్ని, అనాహతంలో వాయువు, అలాగే సప్తర్షులలో ఒకరైన వశిష్ఠ మహర్షి మన శిరస్సుపై ప్రజాపతిగా ఉండి నడిపిస్తాడు.

అందుచేత మనకు ఉదరంలోని వెనుకభాగంలో జననేంద్రియములైన మూత్రపిండములు గాని, వీర్యం ఉద్భవించే స్థానం గాని, కామము ఉద్భవించే స్థానం గాని మనకు స్వాధిష్ఠానం, మణిపూరకం, మూలాధార చక్రాలలో నిర్వహింపబడుతుంటాయి. అందుకనే మానవ శరీరంలో వెనుకభాగం చాలా ప్రాముఖ్యం

వహించినది. అలా జీవుడు సార్థక్యం పొందుతుంటే, సాధారణంగా ఆ భాగాలే త్వరగా శిథిలమైపోతుంటాయి. ప్రారంభంలో నడవడమే కష్టమవుతుంది. తరువాత కాళ్ళు కాబట్టి అధో భాగం. దానికి ఇవ్వవలసిన ప్రాముఖ్యం తగ్గిపోతుంటుంది.

మన నిద్రకు కూడా చాలా ప్రాముఖ్యం ఉంది. బాగా నిద్రపోనివాడికి అనారోగ్య పరిస్థితులు ఉంటాయి. మనం సుమారు ఆరు నుండి ఎనిమిది గంటలు నిద్రపోవాలని చెప్పబడింది. చిన్న వయసులో ఎనిమిది గంటలు, పెద్దవారికి ఆరు గంటలు నిద్ర చాలా అవసరం. అలా సరిగ్గా నిద్రపోనివారికి ఈ చంద్రాత్మకమైన ప్రజ్ఞలు పుష్టికరంగా ఉండవు. అందుకనే పరమగురువు జ్వాల్ కూల్ మహర్షి ఏమి బోధించారంటే మనం రోజూ రాత్రి 10:30 గంటలకు నిద్రకు ఉపక్రమించి, ప్రాతః కాలము 5 గంటలకు మేలుకోవాలి. అందుకే మనం బాగా నిద్రపోతే ఈ చంద్రకాంతి యొక్క ప్రభావం బాగా పనిచేయగలదు. కాబట్టి దానివల్ల ఈ పిండోత్పత్తి కార్యక్రమాలకు కావలసిన పుష్టి మనకు ఏర్పడగలదు. చాలామందికి సంతానం కలుగకపోవడానికి ప్రబల కారణం ఈ నిద్ర లేమి అని చెప్పవచ్చు. ఫలితంగా వారికి ఈ పుష్టి ఏర్పడదు. అందుకే వైద్యులు ప్రథమంగా నిద్ర గురించి మనల్ని అడుగుతుంటారు.

పూర్వము వ్యాధి నిర్ధారణకు వైద్యులు ముందుగా నిద్ర, ఆహార నియమాల గురించి విచారించేవారు. తరువాత మన జీర్ణప్రక్రియ గురించి తెలుసుకునేవారు. ఈ రెండూ రాత్రిపూట ముఖ్యంగా జరిగే కార్యక్రమాలు కదా! అలాగే మనకు కామమునకు, సంతానోత్పత్తికి

కావలసిన శక్తి, వీర్య వృద్ధి సరిగ్గా నిద్రపోయేవారికి ఉంటాయి. రాత్రి సరిగ్గా నిద్ర లేకనే ఉదయం సూర్యోదయానికి నిద్ర లేవరు. సహజంగా సూర్యోదయానికి నిద్ర లేవటం అనేది పరిపూర్ణమైన ఆరోగ్య లక్షణం. బాగా వేద సంప్రదాయంలో ఉన్నవారు ఉదయం మూడు గంటలకే నిద్ర లేచేవారు. యతీశ్వరులు, ఋషులు రోజుకు ఒక జాము మాత్రమే నిద్రపోతారు. మూడు గంటలకు నిద్ర లేచి తమ అనుష్ఠానాలను చేస్తుంటారు.

ఉదాహరణకు మాకు యూనివర్శిటిలో ఒక లెక్కల ప్రొఫెసర్ ఉండేవారు. ఆయన పేరు వేంకట అవధాని. ఆయన చాలా తేజోవంతులు. ఆయన లెక్కలలో భౌగోళిక ప్రావీణ్యత కలవారు. తేజస్వి. ఆయన రోజూ రాత్రి తొమ్మిది గంటలకు నిద్రకు ఉపక్రమించి, ఉదయం మూడు గంటలకు నిద్ర లేచేవారు. తరువాత దేవతార్చన, రుద్రాభిషేకం చేసేవారు. ఆయన చాలా కాంతివంతముగా ఉండేవారు. మిగతా విషయాలు అంతగా పట్టించుకునేవారు కాదు. తమ పాఠాలు, ఆచార నియమాలు తమవి. రాత్రి తొమ్మిది గంటలకు పడుకోవాలంటే భోజనం 7:30 గంటలకు చేయాలి కదా! ఎందుకంటే భోజనం చేసిన తరువాత రెండు గంటల వరకు పడుకోకూడదు.

కాబట్టి మనకు నిద్ర సరిగ్గా ఉంటే అనారోగ్యం ఉండదు. ఆహారం మితమై ఉంటే జీర్ణ ప్రక్రియకు అంతరాయం కలగదు. అందుకనే బరువైన పొట్టకు నిద్ర రాదు. కాబట్టి మనం పడుకునే సమయానికి కడుపు తేలికగా ఉండాలి. మనం పగలు పనిచేసే శ్రమకు రాత్రి నిద్ర వస్తుంది. కానీ మనకు దినచర్య సరిగ్గా లేదు.

అలాంటి వారికి ఈ ఆత్మ సాధనా కార్యక్రమాలు సహకరించవు. 'Software Engineers' అందరూ నిశాచరులే అనవచ్చు. ఎందుకంటే వారు రాత్రి పనిచేస్తారు. పగలు నిద్రపోతారు. ఇది సృష్టికి విరుద్ధం. సృష్టిచక్రం ప్రకారం మనం నడుచుకోవాలి. దానిని ఋషులు అనుసరిస్తుంటారు. మనం సృష్టిచక్రం ప్రకారమే అనుసరించటానికి ప్రయత్నించాలి. కానీ మన దైనందిన కార్యక్రమాలు రాత్రి పన్నెండు గంటల వరకు జరుగుతుంటాయి. అందువల్ల మనపై దాని ప్రభావం తగ్గుతుంది. అందువల్ల మనం ఉదయం నిద్ర లేవటం ఆలస్యమవుతుంది. అందుకే మనం సాయంత్రం కార్యక్రమాలు త్వరగా పూర్తి చేసుకుని, ఆహార స్వీకరణ చేసి, సరైన సమయానికి నిద్రకు ఉపక్రమించాలి.

మనం ఏ గురువుగారి ఆశ్రమంలోనైనా ఉంటే రాత్రి 7:30 గంటలకు కార్యక్రమాల్ని ముగిస్తారు. ఈ ఆచారాలన్నీ సక్రమంగా పాటించటం జరుగుతుంటుంది. మనకు రావలసిన దైవానుభూతులు పొందగలము. అందుకనే మనకు ఈ సరళి దెబ్బతింటే జీవితం సరిగ్గా సాగదు. కాబట్టి మన కార్యక్రమ సరళిని సక్రమం చేసుకోవాలి. అప్పుడు మనకు వృద్ధి బాగుంటుంది.

కొన్ని సంప్రదాయాలలో రాత్రిపూట బాగా ఆలస్యంగాను, విస్తృతంగాను భోజనం చేసే పద్ధతి ఉంది. ఉదాహరణకు ఇటలీ, స్పెయిన్ దేశస్థులు చాలా ఆలస్యంగాను, విస్తృతంగాను రాత్రి భోజనం చేస్తారు. అందువల్ల వారు ఉదయం ముందుగా లేవరు. అందుకే వారి ధీశక్తి చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల వారి కార్యక్రమాలలో నైపుణ్యత చాలా తక్కువగా ఉంటుంది.

అలాగే మనం స్విట్జర్లాండ్, జర్మనీ దేశస్థులను పరిశీలిస్తే రాత్రి 7:30 గంటలకు భోజనం చేసి అందరూ 9 గంటలకు నిద్రకు ఉపక్రమిస్తారు. స్విట్జర్లాండ్ దేశంలో సాయంత్రం 6:30 గంటలకు భోజనం చేసి, 9:00 గంటలకు నిద్రపోయి, వేకువజామునే లేవడం వారి ఆచారం.

ఉదయంనుండే కార్యక్రమాలు మొదలుపెట్టి చేసుకుంటారు. అందుకనే స్విట్జర్లాండ్, జర్మనీ మరియు ఉత్తర ఐరోపా దేశాల వస్తువులకు ఉండే ప్రాశస్త్యం, దక్షిణ ఐరోపా దేశాల వాటికి లేదు. ఉత్తర ఐరోపా దేశస్థులు చాలా సమర్థులు. దక్షిణ ఐరోపా దేశస్థులకు అంత సమర్థత ఉండదు. మనదంతా ఆలస్య భోజనం, ఆలస్య నిద్ర మరియు ఆలస్యంగా నిద్ర లేవడం. అంతా ఆలస్యమే కదా! దక్షిణ ఐరోపా దేశస్థుల మాదిరి అన్నమాట. ఉత్తర ఐరోపా దేశాలలో అన్నీ సకాలంలో జరుగుతాయి. అందుకే జర్మనీ వస్తువులకు ఉండే నైపుణ్యం, ప్రాశస్త్యం వేటికీ ఉండదు. వాళ్ళ మేధస్సు కూడా అలానే ఉంటుంది. ఎందుకంటే వాళ్ళు పాటించే పద్ధతులు అలాంటివి మరి. ఈ మంచి లక్షణాలవల్ల జర్మనీ దేశస్థుల ఆరోగ్యాలు త్వరగా పాడైపోవు. అందుకనే “Germans are Germans” అని పేరు తెచ్చుకున్నారు. దానికి వారి క్రమ పద్ధతులు అలా ఉండడమే కారణము. వారు వారి కార్యక్రమాలను ఉదయం నాలుగు గంటల నుండే ప్రారంభిస్తారు. మనకు ఒక సరళి గాని, సమన్వయము గానీ లేకనే ఈ విపత్కర పరిస్థితులు. సమన్వయము, క్రమ సరళి చాలా అవసరం. సృష్టిచక్రం ఎలా నిర్వర్తింపబడుతోందో దాని ప్రకారమే మన జీవన సరళిని సమన్వయం చేసుకుని, అనుసరించి

నడుచుకోవాలి. అలా కాకపోతే ప్రక్కదారి పట్టగలము. అందుకనే మనకు అన్నిరకాల అనారోగ్యాలూ వస్తాయి. మనకు 30వ ఏటినుండే అనారోగ్యం వస్తుంది కదా! ఇదంతా మనకు క్రమశిక్షణ లేకనే. అంటే ప్రకృతిని అనుసరించకపోవటం వలననే!

మనం చేయవలసినవి చేయవలెనని చెప్పుటకే ఈ వ్యాఖ్యానం చేయటం. అందుకే మనం మన సృష్టి సరళిని అనుసరించి అనుసంధానం చేసుకుని మన జీవన సరళిని సరిచేసుకోవాలి. అప్పుడే మన మేధస్సు వికసించి, అన్ని దేవతా ప్రజ్ఞలూ మనకి సహకరిస్తాయి. ముఖ్యంగా మన వ్యక్తిత్వం బాగా మార్పుచెందాలి. అలాంటి జీవితాన్ని, జీవన విధానాన్ని అలవరచుకోవాలి. లేకపోతే త్వరితంగా నశించగలము.

మనం ఎవరైనా వెనుకనుండి మాట్లాడితే, వారిని ముందుకు వచ్చి మాట్లాడమని చెప్తాం కదా! ఎందుకంటే మనకు ముందు సూర్యప్రజ్ఞ, వెనుక చంద్రప్రజ్ఞ పనిచేస్తుంటాయి. వెనుక పదార్థ ప్రజ్ఞ అనుకోవాలి. అందుకే మనం వెనుకనుండి మాట్లాడకూడదు. అక్షతలు గాని, పూలదండలు గాని, ఆశీర్వచనాలు గాని వెనుకనుండి చెయ్యం కదా! అలా చెయ్యరాదు కూడా. కాబట్టి ముందు నుండి ఏమి చెయ్యాలి? వెనుకనుండి ఎలాంటి పనులు చెయ్యాలి? అని తెలుసుకుని నడుచుకోవాలి. తెలిసి ప్రవర్తించాలి. అందుచేతనే "Our actions should not to be in the shade" అంటే మన చేతలు క్రీనీడలో చేయరాదు.

మనము క్రీనీడలోంచి పుట్టుకొస్తాము. అందుకే మనం

చీకటిలో జన్మిస్తాము. కాబట్టి వెలుగులో జన్మించడానికి ప్రయత్నించాలి. మానవులే కాకుండా మిగతా జీవులు కూడా సృష్టి కార్యక్రమాన్ని రాత్రి నిర్వర్తించుకుంటాయి. పగలు నిర్వర్తించవు. మానవులే అలా నిర్వర్తించుకుంటారు. దీనికి మనకు పురాణాలలో కశ్యప ప్రజాపతి – దితి కథ ఉందిగా. దితి కశ్యప ప్రజాపతిని బలవంతం చేసి సంతానం కంటుంది కదా! కశ్యప ప్రజాపతి ఇది నిషిద్ధ సమయమని, లోకకంటకులు జన్మిస్తారని చెప్తాడు కదా! అందుకు ప్రతిఫలం హిరణ్యాక్ష, హిరణ్యకశిపుల జననం. మనం నిద్రలోనే తల్లి గర్భంనుండి వెలుపలికి వస్తాము. వెలుపలికి వచ్చిన తరువాతనే కళ్ళు తెరవడం. డాక్టర్లు కొట్టి లేపుతారు కదా! కాబట్టి అశ్వినీ దేవతలు కామ ప్రక్రియకు, గర్భ ధారణకు, సంతానోత్పత్తికి కారణం. దానికోసం వారు మనలో కామము, వ్యామోహము కల్పించి, జీవులను గర్భస్తులను చేసి, గర్భంలో కూడా మనం జన్మించే వరకు నిద్రింపజేసి, ఆ స్థితిలోనే జన్మింపజేస్తారు. నిద్ర స్థితి అంటే అజ్ఞానంలో ఉండడమే కదా! అందుకే ''*అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా*'' అనే శ్లోకం శ్రీ దక్షిణామూర్తి స్తోత్రంలో ఉంది కదా!

సరియైన సమయంలో సంధ్యావందనం చేయకుండా ప్రాయశ్చిత్త మంత్రాలు వల్లిస్తే ప్రయోజనం ఉండదు. ఈ సృష్టి ఎలా ఏర్పాటుచేశారు? మనం ఎలా ప్రవర్తించాలి? అనేది ఈ శ్లోక సారాంశం. కాబట్టి మన ప్రవర్తనను మార్చుకోవడానికి ప్రయత్నిస్తే మంచిది కదా! మార్చుకోకపోతే మనం మన జీవితంలో పొందవలసినవి పొందలేము. అందుకనే ఈ మెలకువ, నిద్ర.

అవి సృష్టి ననుసరించి ఉండాలి. కనుక చీకటి పడిన తరువాత ఒక జాము వరకు మెలకువగా ఉండవచ్చు. మూడు గంటలు ఒక జాము. అంటే రాత్రి తొమ్మిది గంటల వరకు మేలుకుని తరువాత నిద్రకు ఉపక్రమించాలి. సంతానోత్పత్తి కావలసిన వారు దానికి అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలి. సక్రమమైన దినచర్య చాలా ముఖ్యం. అది వెనుకభాగం అనేది మనం అర్థంచేసుకోవాలి. మన శరీరంలో కటి ప్రదేశంనుండి క్రిందిభాగం, వెనుకభాగం రాత్రికి సంబంధించినవి. అందుకనే మనం చివరివరకు ఆరోగ్యాన్ని సరిగ్గా కాపాడుకోవాలి. లేకుంటే అనారోగ్యం మన పాదాలనుండి ప్రారంభమై, శిరస్సు వరకు ప్రాకి, అన్ని జబ్బులకు కారణమై మనం క్షీణిస్తాము. శిలగా మారిపోగలము. ఇదే అన్ని రోగాలకు మూలం అవగలదు.

కేవలం మన ప్రవర్తన ద్వారానే స్వస్థత పొందవచ్చు అని తెలిపారు. అందుకే మన దినచర్యలో ఆహారము, నిద్ర, పనిచేయడాలు సరిచేసుకోవడం ద్వారా ఈ ఫలాన్ని పొందవచ్చు. కాబట్టి ఈ దేవతలు (అశ్వినులు) మన వెనుకభాగం నుండి తమ కాంతులను ప్రసరింపజేసి, సృష్టి కార్యక్రమాలకు సహకరిస్తారు. వెనక పాదాలు అంటే దెయ్యాలు అని కాదు. కాబట్టి మనం చీలమండలను బాగా కాపాడుకోవాలి. పాదరక్షలు మన కాలి మడమలను సరిగ్గా కాపాడతాయి.

మడమల నుండే మనకు అన్ని బలహీనతలూ ప్రారంభమవుతాయి. అందువల్ల మనం రాత్రి, పగలు యొక్క ప్రాముఖ్యం, సృష్టి కార్యక్రమానికి నిర్దేశించిన ప్రవర్తన గ్రహించి,

తదనుగుణంగా నడుచుకుని అశ్వినీ దేవతల అనుగ్రహానికి పాత్రులం కావాలి. ఇదే ఈ అశ్వినీ దేవతా స్తోత్రాలలోని పదవ శ్లోక సారాంశం.

తెల్లని కలువలు, నల్లని కలువలు ఎలా వికసిస్తాయో తెలుసా! రాత్రి ప్రసరించే చంద్రాత్మక కిరణాలను ఆస్వాదించి ఉషోదయానికి తెల్ల కలువ వికసిస్తుంది. పగలు ప్రసరించే సూర్యాత్మక కిరణాలను ఆస్వాదించి సాయంత్రానికి నల్ల కలువలు వికసిస్తాయి. అందుకనే ఆరాధనలో ఉదయం తెల్ల కలువలు, సాయంత్రం నీలం కలువలు వాడతారు. తమ్మిపూలు, మల్లెపువ్వులు కూడ సాయంత్రం వికసిస్తాయి. అందుకే ప్రదోష పూజలో వీటి వాడకం వుంటుంది.

మన జీవితములు కూడ తెలుపు, నలుపు కలువలు ధరించిన అశ్వినులవలె ప్రకాశించాలి. ఉషోదయము నుండి ప్రదోషం వరకు బాహ్య జీవనము, ప్రదోషం నుండి ఉషోదయం వరకు అంతరంగ జీవనముగా సాగాలి. అలా సాగితే సూర్యచంద్రాత్మక తత్త్వము, సమవర్తనము సాధ్యపడుతుంది. యోగవిద్య ఫలిస్తుంది. పగలు బుద్ధి, మనస్సు, ఇంద్రియములతో, శరీరముతో పనిచేయాలి. రాత్రి మనస్సు శ్వాసపై చేర్చి స్పందనము చేర్చాలి. ఇంద్రియములు, శరీరము వలసినంత విశ్రాంతి పొందాలి. రాత్రి అంతరంగమందు, పగలు బహిరంగమందు శ్రమించాలి. అంతరంగమున బుద్ధి ఆధారముగా అంతఃకరణముల నేర్పరుచుకొని అంతరంగ జీవనానికి తెర తీయాలి. పగలు బహిరంగమున బహిఃకరణములు –

అంటే మనస్సు, ఇంద్రియములు, శరీరమును వినియోగించి బహిరంగ జీవనము నిర్వర్తించాలి.

అలా నిర్వర్తించుకొను వారియందు తెల్ల కలువలు, నల్ల కలువలు వికసించి అమృతత్త్వము సిద్ధిస్తుంది. దానిని తాము అనుభవిస్తూ, నలుగురికీ పంచడం సిద్ధి. నిత్య జీవనము ఒక యోగజీవనముగా తీర్చిదిద్దుకుంటే బావిలో పడిపోయిన వాడిలాగ గ్రుడ్డితనములో జీవించ నవసరము లేదు. ఎంత యోగులైనా సంతానము పొంది, ప్రజాపత్య ధర్మాన్ని సిద్ధింప చేసుకోవాలనేది కూడ ఈ శ్లోకములో తెలుపబడినది. ఈ ప్రయత్నమందున్న వారిని అశ్వినులు అనుగ్రహిస్తారు.

**మంత్రము - 11 :**

**ముఖేన గర్భం లభేతాం యువానౌ**
**గతా సురే తత్ ప్రపదేన సూతే ।**
**సద్యోజాతో మాతర మత్తి గర్భః**
**తా వశ్వినౌ ముంచథో జీవసేగాః ॥**

**టీక :**

ముఖేన = నోటిచేత; గర్భం = గర్భమును; లభేతాం = లభింపజేయుచు; యువానౌ = మీ జంట; ఏతత్ = ఈ సృష్టిని; గతాసుః = చనిపోయినట్టిదై; ప్రపదేన = కాలిమడమచేత; సూతే = ప్రసవించుచున్నది; సద్యోజాతః = అప్పుడే పుట్టినట్టి; గర్భః = గర్భము; మాతరం = తల్లిని; అత్తి = తినును; తౌ+అశ్వినౌ = ఆ అశ్వినులు; జీవసే = నా జీవనముకొరకు; గాః = గోవులను; ముంచథః = విమోచనము చేయుచున్నారు.

**తాత్పర్యము :**

మీరిరువురు నోటితో గర్భధారణము కల్పించి సృష్టిని పుట్టించు చున్నారు. ఈ సృష్టి చనిపోయి మడమతో ప్రసవించు చున్నది. అప్పుడే పుట్టిన గర్భము తల్లిని తినుచున్నది. ఇట్టి కల్పనలు చేయుచున్న మీరు నా జీవనము కొరకు గోవులకు విమోచనము కల్పింతురు గాక !

**వివరణము :**

అశ్వినులు నోటిచేత గర్భమును ధరింపజేయు చున్నారు. మనలో ఆ కార్యక్రమము (గర్భధారణము) లభింపజేసే ప్రక్రియను అశ్వినీ దేవతలు జరుపుచున్నారు. నోటి చేత గర్భమును ధరింపజేయడం అంటే మనము ముఖము ద్వారానే ఆహారము స్వీకరిస్తాము. ముఖం ద్వారా తీసుకున్న ఆహారము మన జీర్ణకోశం చేరి, అక్కడ పచనం జరిగితే, అందులో నుండి దేహ పుష్టికి కావలసిన సప్త ధాతువులు పుట్టుకొస్తాయి. ఈ సప్త ధాతువులు పుట్టడానికి మనం తీసుకునే ఆహారం, ప్రాణవాయువు, నీరు ఈ మూడూ కలిసి మనకు లోపల పుష్టినిచ్చి, సప్త ధాతువులను ఏర్పాటుచేయడం జరుగుతుంది.

ఈ సప్త ధాతువులలో శుక్రము అత్యంత సూక్ష్మము మరియు కాంతివంతమైనది. అదే ముఖ్యమైన ధాతువు. అన్నిటి కన్నా బలమైనది, దృఢమైనది. గర్భధారణమునకు శుక్రము మూలము. స్థూలమైనది అస్థి. అస్థి అంటే ఎముక. ఎముక కన్నా కొంత తక్కువ బలమైనది, మృదువైనది మాంసం. అటుపైన రసము, రక్తము, మజ్జ, చర్మము ఏర్పడతాయి. ఈ ఆహారము వల్లనే స్త్రీలకు శోణితము కూడా ఏర్పడుతుంది.

అందుకే మనిషికి ఆహార పుష్టి ఉండాలి. ఆహార పుష్టి లేకపోతే శరీరం పోషింపబడదు. అందుకే మనం పుష్టికరమైన ఆహారం తీసుకోవాలి. మన దేహ పోషణకు ఉపయోగపడే ఆహారమే తీసుకోవాలి. అందుకోసమే మనం ప్రయత్నించాలి

తప్ప వికారాలయిన ఆహారాలు తినడం, ఉపవాసాలు, ఆహారం మానేయడం చేయకూడదు. మరీ ఎక్కువగా తినడం, మరీ తక్కువగా తినడం, సరైన దృక్పథంతో సరైన సమయానికి భుజించకపోవడం, రుచిగా లేదని తినడం మానేయడం వంటివి చేస్తుంటాము. మన ఆహారము కేవలం దేహ పోషణకే అనుకుంటాము. దేహ పోషణ అంటే మనలోని సప్త ధాతువుల పోషణే. ఆహార నియమాలు, దానియందున్న పుష్టిని బట్టి, దానిలోని ప్రజ్ఞను బట్టి అందులో నుండే సప్త ధాతువులు ఉద్భవించగలవు. అందుకని మనం తినే పదార్థములలో మన శరీరంలోని ధాతువులకు బలం కలిగించే పదార్థాలు తీసుకుంటున్నామా లేదా చూసుకోవాలి. మనకు ప్రస్తుతం పాలు, పెరుగు, మజ్జిగ ఇవే మన ఎముకల ఎదుగుదలకు ఉపకరిస్తాయి. "Calcium" సరఫరా చేస్తాయి. అలాగే మాంసకృత్తులు బాగా తీసుకోవాలి. Carbo-hydrates, Proteins ఇవన్నీ మనలోని సప్త ధాతువుల వృద్ధికి బాగా సహకరిస్తాయి. అందుకే మన పూర్వీకులు భోజనంలో అన్ని పదార్థాలూ వడ్డించేవారు. ప్రత్యేకించి నేయి ధాతుపుష్టి బాగా కలిగిస్తుంది.

సొరకాయ, పొట్లకాయ, బీరకాయ వంటి కొన్ని కూరగాయలలో నీరు ఎక్కువగా ఉండి ఆహారం జీర్ణమై, సరిగా పచనమవడానికి సహకరిస్తాయి. వీటివల్ల మనలో రసోత్పాదన సరిగా జరుగగలదు. అలానే మన ఆహారంలోని నూనె పదార్థాలు కూడా మనలోని ఎముకల మజ్జ (Bone Marrow) వృద్ధికి తోడ్పడతాయి. ఇది తినకండి, అది తినకండి అని నిషిద్ధం

చేయకూడదు. అన్ని పదార్థాలూ మన శరీర పుష్టికే. నూనె బాగా వాడితే మంచి Cholesterol తయారవుతుంది. ఎముకలు బాగా వృద్ధి చెందాలంటే మనకు నూనె కూడా కావాలి. అలాగే శుక్రము బాగా వృద్ధిచెందాలంటే నెయ్యి అవసరము. నెయ్యి లేకుండా భోజనం లేదు కదా! అందులో శుక్రమును వృద్ధి చేసే ధాతువులు ఉన్నాయి. అందుకనే మనం ఆయుర్వేద మార్గంలో భోజనం చేయాలి. ఆయుర్వేదంలో మనం తీసుకునే ఆహారంలో కూరగాయలు, పప్పు దినుసులు, నూనె, నెయ్యి, గోధుమలు, బియ్యం ఎంత తీసుకోవాలో, ఎలా తీసుకోవాలో, పాలు, మజ్జిగ, పెరుగు ఎలా తీసుకోవాలో వివరంగా తెలియజేశారు. దానినే సిద్ధాన్నంగా పేర్కొన్నారు. ఆహారం నేతితోనే వండాలని కూడా చెప్పడం జరిగింది.

అలాగే పసుపు అన్నం తినమని చెప్తారు. పసుపు, జీలకఱ్ఱ, అల్లము, మెంతులు, ఆవాలు ఇవన్నీ మన జీర్ణ ప్రక్రియకు బాగా సహకరిస్తాయి. ఓషధులు అంటే బియ్యము, గోధుమలు, అటుపైన కందిపప్పు, పెసరపప్పు, మినపపప్పు వంటి పప్పు దినుసులు తింటే ఏమవుతుంది? అనేది మనము తెలుసుకోవాలి. ఏది ఎక్కువ బలాన్నిస్తుందో తెలుసుకుని తీసుకోవాలి. అన్ని పప్పు దినుసులలో మినపపప్పు చాలా బలమైనది. అందుకే మనము మినప గారెలు అంటాము. అలాగే పెసరపప్పు మంచి బలవర్ధకమైన ఆహారం. కూరలు ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలి. ఇలా మంచి ఆహారం తీసుకుంటే మన శరీరంలో సప్త ధాతువులు వృద్ధి చెందగలవు. అలా కాకపోతే మనం వైద్యులను సంప్రదించవలసి

వస్తుంది. అనారోగ్య పరిస్థితులు ఏర్పడతాయి. ఎందుచేతనంటే సనాతన సంప్రదాయంలో ఆహారమునకు సమగ్రమైన విధానాలు యివ్వబడ్డాయి. ఆహార విహారాల విషయంలో భారతీయ సంప్రదాయానికి ఉన్న ప్రత్యేక జ్ఞానము మరే ఇతర సంప్రదాయంలోనూ లేదు. అందుకే మన పూర్వీకులు మనం ఏమి తింటే శరీరంలో ఏ ధాతువు చక్కగా నిర్మాణం చేయబడుతుందో తెలిపారు.

అందుకని ఋషులు పురాణాలలో మన భోజనంలో షడ్రుచులు అంటే ఉప్పు, పులుపు, కారము, తీపి, చేదు, వగరు తప్పకుండా ఉండాలని చెప్పారు. వీటిలో ఏదీ ఎక్కువగా తినకూడదు. అలాగని తక్కువగానూ తినకూడదు. ముఖ్యంగా చేదు, వగరు తప్పక తినాలి కానీ మనం అవి తినము. వాటిని అపురూపంగా తింటాము. అందుకని ధాతు నిర్మాణం సక్రమంగా జరగాలంటే అన్ని రుచులూ తినగలగాలి. వగరు అంటే వెలగపండు, వక్క. ఈ కాలంలో చాలా అరుదుగా కనిపిస్తుంది. అలాగే తాంబూలము (వక్క, ఆకు, సున్నము) తింటే మన నోటిలోని లాలాజలాన్నంతటినీ పీల్చేస్తుంది. తాంబూలం చేసే మేలు మనకు ఏదీ చేయదు. వక్క, ఆకు, సున్నము మన శరీరంలోని రక్తాన్ని బాగా శుద్ధి చేయగల గుణాన్ని కలిగి ఉన్నాయి. అది అంతా రౌద్రమే. అందుకనే ఆంజనేయ స్వామికి ఆకుపూజ చేసి, తరువాత ఆ తమలపాకులు మరుసటి రోజు అందరూ తినే వాడుక మనకు ఉంది కదా!

తీపి అంటే సహజమైన తీపి తీసుకోవాలి. పంచదార

కాదు. పంచదార తినటం వల్లనే మనకు ఈ ఇబ్బందులు రావటం జరుగుతోంది. పంచదారలో ఎక్కువగా జంతువుల ఎముకల పొడి చేరి ఉంటుంది. ఇది చాలామందికి తెలియదు. అందుకని పంచదారను మాంసాహారమని చెప్పవచ్చు. మన పూర్వీకులు తీపి అంటే చెఱకు రసంతో బెల్లం చేసి యిచ్చేవారు. అందుకనే మనకు ఆహారం గురించి అనుకున్నంతగా కాక చాలా తక్కువగా తెలుసు. అందుకనే మన పెద్దలు తాంబూలము భోజనం తరువాత తప్పక వేసుకునేవారు. అది రక్తశుద్ధి చేయగలదు. మన జీర్ణశక్తిని పెంచగలదు. అందుకనే మనం ఈ షడ్రుచులతో భోజనం చేయాలి.

మనం తీసుకునే భోజనానికి కూడా సక్రమమైన పద్ధతులు కొన్ని యిచ్చారు. ముందుగా తీపితో భోజనం ప్రారంభించాలి. మనం దీనికి విరుద్ధంగా చేస్తాము. అన్నీ తలక్రిందులుగా చేస్తాము. విష్ణుపురాణంలో ప్రధానంగా ఆహార స్వీకరణ గురించి తెలిపారు. నీకు ఆకలిగా ఉన్నప్పుడే ఆహార స్వీకరణ జరగాలి. అంతకు ముందు తిన్న ఆహారం పచనమై ఉండాలి. అప్పుడు నీకు బాగా ఆకలి వేస్తుంది. నాలుగు గంటల వ్యవధిలో మనం తీసుకున్న ఆహారం సరిగ్గా పచనం అవుతుంది. ఈ లోపు మరల ఆహారం తీసుకునేందుకు నీకు ఉత్సాహం కలగదు. దీనికి కనీసం 4 గంటల సమయం అవసరం.

దేహంలో కొన్ని జీర్ణశక్తికి కావలసిన ఆమ్లములు ఉద్భవిస్తాయి. దీర్ఘకాలము పాటు మనము ఆహారం తీసుకోకపోయినచో శరీరంలో ఈ ఆమ్లములు వుంటాయి. వీటిని సమత్వులం చేయటానికి తీపితో భోజనము ప్రారంభించాలి. మనం

తీపి తప్పక తీసుకోవాలి. అన్నీ సమతుల్యంగా చేసుకోవాలి. తీపి పదార్థములు కూడా ద్రవముగా ఉండాలి. అందుకే ప్రారంభంలో పరమాన్నం తినాలి. దీనితో దొంగ ఆకలి తొలగించవచ్చు. అలాగే భోజనానికి ఒక గంట ముందుగా మంచినీళ్ళు త్రాగితే మనలోని అస్వాభావికమైన ఆకలి (False appetite) హరించబడుతుంది. అందుకనే మన పెద్దలు అన్నం తినే ముందు నీళ్ళు త్రాగాలి అని చెప్తారు.

ఇలా తీపి పదార్థాలతోను, నీటితోను, రసాలతోను భోజనం ప్రారంభించి, తరువాత మనం తీసుకునే ఘనపదార్థాలు తినాలి. మళ్ళీ ద్రవ పదార్థాలతోనే భోజనం ముగించాలి. అందుకే మజ్జిగతో మనం భోజనం ముగించడం. ఇవే మనకు మన పురాణాలలో యిచ్చిన ఆహార సూత్రాలు. ఇలా మనం ఆహారాన్ని సమతుల్యంగా, పుష్టికరంగా, పద్ధతిగా స్వీకరిస్తే మన శరీరంలోని సప్త ధాతువులు సక్రమంగా వృద్ధి చెందటం జరుగుతుంది. ఈ పద్ధతులు గతి తప్పుతున్నాయని ఈ ఉపదేశం ఇవ్వబడింది.

ఈ ఆహారం మనం ముఖంనుండి తీసుకుంటున్నాము. మనం తీసుకునే ఆహారం వల్ల మన శరీరంలో సప్త ధాతువులు వృద్ధి చెంది, పుష్టికి కావలసిన శుక్ర, శోణితాలు ఏర్పడటానికి అవకాశం కలుగుతుంది. ఈ రెండు ప్రక్రియల వల్లే మానవులకు సంతానోత్పత్తి జరుగుతుంది అని ఈ శ్లోకం మొదటి పాఠం. ఇది గతి తప్పినా, శుక్ర ధాతువులు తగ్గినా పురుషునివలన సంతానం కలగదు. మనం ప్రస్తుతం శాస్త్ర విరుద్ధంగానే నడుచుకుంటున్నాము. నీ ముఖమునందు తీసుకున్న ఆహారమునుండే గర్భ ధారణకు

అవకాశం కలుగుతుంది. ఎప్పుడో అజీర్ణము కలిగిన సందర్భంలో దాని నివారణకు లంకణం, జలపానము చేయాలి. శీతల పానీయాలు నిరంతరం సేవించకూడదు. Junk Food తీసుకోకుండా మన జీర్ణకోశాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. సమయము, సందర్భము ఉంది కాబట్టి పై శ్లోకానికి గర్భధారణ, పిండోత్పత్తి కోసం ఈ విషయంలో ఇంత విపులంగా ఆహార నియమాలు చెప్పడం జరిగింది.

రాత్రి ఆహార స్వీకరణ తక్కువగా ఉండాలి. స్వీకరించిన రెండు గంటల తరువాత నిద్రకు ఉపక్రమించాలి. ఈ విషయాలు విపులంగా ఆయుర్వేదంలోనే చెప్పబడినవి. మన జీర్ణాశయం పనిచేయుటకు మనం సరిగా సహకరించాలి. జీర్ణ వ్యవస్థ నోరు, జీర్ణాశయము, చిన్న పేగులు, పెద్దపేగులు అనే నాలుగు స్థానాలలో పనిచేస్తుంది. కాబట్టి దానికి అనుగుణంగానే ఆహారం స్వీకరించాలి. తిన్నది సరిగా పచనం అయిన తరువాతనే మళ్ళీ ఆహారం స్వీకరించాలి. అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన *''అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః''* అనే శ్లోకం అందరికీ విదితమే. కానీ దాని ఆచరణ లేదు కదా! ఆచరించడానికి ఎంతో శ్రద్ధ, భక్తి అవసరం. ఈ నియమితమైన ఆహార స్వీకరణయే మనకు శక్తి సామర్థ్యాలు కలగడానికి, గర్భ ధారణకు, సృష్టికి దోహదం చేయగలదు. దానికి ప్రారంభం నోటి నుండేగా. ఆ నోరు మన ముఖంలోనేగా ఉంది. అంతేకాదు. సంతాన ప్రాప్తికి నిర్వహించే కామచేష్టలు కూడ చుంబనముతోనే

ప్రారంభమవుతాయి. అనురాగముతో, చుంబన ప్రక్రియతో గర్భధారణ కార్యక్రమం ప్రారంభం అవుతుంది.

ఆహారం నోటినుండేగా జీర్ణాశయం చేరేది. దీనికి శ్వాసకోశము బాగుండాలి. అప్పుడే శ్వాస ప్రక్రియ, జీర్ణ ప్రక్రియ రెండూ బాగుంటాయి. ఇవి రెండూ ఒకదానికొకటి ఆధారం. ప్రాణ కోశాన్ని (ఉచ్ఛ్వాస నిశ్వాసలు) నిర్వర్తించేవారు అశ్వినీ దేవతలు. అన్నమయ కోశం కూడ వారే నిర్వర్తిస్తున్నారు. వారే మన ముఖంతో తీసుకున్న ఆహారాన్ని శరీరంలో శుక్రంగా తయారుచేస్తారు. శుక్ర శోణితముల ఆధారంగానే ఈ సృష్టి ప్రక్రియలో గర్భధారణ, పిండోత్పత్తికి కావలసిన విధానాన్ని ఈ విధంగా ఏర్పాటు చేశారు. అలాగే జీవుడికి అన్ని కోశములు, ఆవరణలు ఏర్పాటు చేయడం జరిగింది.

జీవుడు తల్లి గర్భంలో పడి, తల్లినే ఆహారంగా తింటూ ఉంటాడు. అదే ధాతువులుగాను, శుక్రంగాను, రక్తంగాను, కండరములు, ఎముకలు, చర్మంగాను పరివర్తన చెందుతుంది. ఈ పరివర్తనలో ఆహారం చనిపోయి శుక్ర ధాతువుగా రూపాంతరం చెంది, గర్భ ధారణకు సహకరిస్తుంది. అది మనకు కాలి మడమలయందు, తొడలయందు, పిక్కలయందు బలముగా మనం అందించేటువంటి జీవుడి బలం ఉంటుంది.

అందుకనే పూర్వము వివాహ సంబంధాలలో ఒకరినొకరు చూసుకోవడము కంటే కాలి పిక్కలు, మడమలు, తొడలు ఎంత బలిష్ఠంగా ఉన్నాయో చూసేవారు. ఇలా ఎందుకు చూసేవారంటే

మంచి సంతతి కలుగుతుందని చూసేవారు. దేవతలందరూ వాహనాలలో తిరుగుతారు. నడిచి వెళ్ళరు. మన పూర్వీకులు నడిచే ప్రయాణాలు చేసేవారు. తల్లి తినే ఆహారం నుండి ఆమె సప్త ధాతువులు తీసుకుంటూ గర్భస్త శిశువు పెరుగుతుంది. తన అంగ ఉత్పత్తికి తల్లి యొక్క సప్త ధాతువులే కారణము. కాబట్టి శిశువు జన్మించినప్పుడు దానిలో తల్లి యొక్క కణాలే ఎక్కువగా ఉంటాయి. ఎనిమిది జీవకణములలో ఏడు తల్లికి చెందినవే ఉంటాయి అని వైద్యులు చెప్తారు. అందుకనే తల్లి మంచి పౌష్టికమైన ఆహారం తీసుకోవాలి. గర్భ ధారణ జరిగినప్పటి నుండి నియమాలు పాటించాలి.

మనం ఆహారం తీసుకున్నప్పుడు అది నశించి (జీర్ణమై) సప్త ధాతువులుగా మారి శిశువుకు అందించబడుతుంది. అంటే పిండం తల్లిని తిన్నట్లే కదా! క్రింది లోకాలకు శక్తి రావాలంటే పైలోకాలనుండే రావాలి. ఆకాశం వాయువుగా, వాయువు అగ్నిగా, అగ్ని జలముగా, జలము పృథ్విగా, పైలోకాలు క్రింది లోకాలుగా మారతాయి. క్రింది లోకాలను మరల కాలం రూపములో దేవతలు తినేస్తుంటారు. అన్ని లోకాలు అన్నం వల్ల ఏర్పడతాయని సూత్రానికి అర్థం. మళ్ళీ అన్నం వల్లనే అన్ని లోకాలూ లయమవుతాయి. ఇలా పుట్టుకొచ్చినవి ఒకదానికొకటి ఆహారంగా ఏర్పాటుచేశారు. మనం కూడా అలా దేవతల రూపంలో తినివేయబడతాము. అందుకే 70 సంవత్సరాలు రాగానే చిక్కి శల్యమయి, కండరాలు సమసిపోయి, అంగ సౌష్టవం కరిగిపోయి, సర్వరోగాలూ విజృంభించి తినివేయడం జరుగుతుంది. అందుకని అన్నమే అన్నిటికీ

మూలం, లయం కూడా. మనం లలితా సహస్ర నామాలలో "మహాగ్రాసా", "మహాశనా" అని కొలుస్తాము. మహాశనా అనగా విశేషముగా తినడం అని అర్థం. శుద్ధ చైతన్యంలోనికి లయ మవుతుంది. తుదకు శివుని (పురుషుని) లోకి లయ మవుతుంది. సృష్టిలో కొన్ని జీవులు వాటి సంతతినే ఆహారంగా గ్రహిస్తాయి. అలాగే ఈ సృష్టి ఏర్పాటుచేసిన ప్రకృతి తానే నాశనం చేస్తుంది. అశవం చేస్తూ వుంటుంది. ఇలా సృష్టిలో జరుగుతోందని చెప్పాల్సి వచ్చింది. అది ఇందులో లేనిదిగా ఆవిషయం ఇక్కడ అప్రస్తుతం. సద్యోజాతుడు అంటే అప్పటికప్పుడు పుట్టినవాడు. మాతృ గర్భంలో తల్లినే ఆహారంగా తిని, బయటకు వస్తాడు. ఇలా ఏ recognition లేకపోయినా ఈ సృష్టి కార్యక్రమం అశ్వినులు చేస్తున్నారు. మనమైతే కొంతపనికైనా గుర్తింపు ఆశిస్తాము కదా! గుర్తింపు కోసమే మన తాపత్రయం. మనకు ప్రశంసలు ముఖ్యం. ఈ సృష్టి నిర్మాణ కార్యక్రమమంతా ఏ గుర్తింపూ కోరకుండా జరిపిస్తున్నారు కదా!

అందుకనే మనకు 'కేనోపనిషత్తు'లో ఈ విషయం వివరించారు. కన్ను, ముక్కు, చెవి, నోరు, చర్మము వేటికవి గొప్ప అనుకుని, అన్ని అవయవాలు పని మానేస్తాయి. ఇది గ్రహించిన శ్వాస ప్రక్రియ తిరోగమనం చెందడం ప్రారంభిస్తే, క్రమంగా అన్ని అవయవాలూ బలహీనపడి, క్రమంగా మరణ స్థితికి చేరుకుని, అన్ని అవయవములకు శ్వాస ప్రక్రియే ఆధారం అని గ్రహిస్తాయి. అందుకే శ్వాస ప్రక్రియే ముఖ్యము అని 'కేనోపనిషత్తు'లో చెప్పబడింది. ఆ శ్వాస ప్రక్రియ అశ్వినులదే!

అశ్వినీ దేవతలు సృష్టి నిర్మాణంలో పనిచేస్తూ, అన్ని మండలములలోను, వర్తనములలోను, భూగోళ వర్తనములలోను, భూమిపై అన్ని కార్యక్రమములలోను, చివరికి మనం తీసుకునే ఆహారం, దానిని పచనం చేయడం మరియు ధాతు పుష్టికి, దానివల్ల సంతాన ప్రక్రియకు దోహదం చేస్తున్నారని తెలపడమే ఈ శ్లోకం పరమార్థం. అందుచేత ఈ అశ్వినీ దేవతల స్తోత్రం బాగా చదువుకుని, వారి అనుగ్రహం పొంది, వారిని ప్రసన్నం చేసుకోవాలి. వారు అనుగ్రహిస్తే మనకు చక్కని పరిపుష్టి ఉండగలదు. ఏ లోటూ ఉండదు. ఈ విషయమే మనకు పదకొండవ శ్లోకంలో వివరించడం జరిగింది.

*మరొక విషయము :* గర్భస్థుడైన జీవుడు ప్రసూతి వరకు రక్షింపబడడానికి గర్భంలో పొరలు ఏర్పడతాయి. ఈ పొరలు నిర్జీవములు. నిర్జీవమైన పొరలు జీవుని పరిరక్షించడం నిజమైన వింత. గ్రుడ్డు నిర్జీవం. అందు వృద్ధి చెందు పక్షి జీవం! జీవము నిర్జీవముతో పరిరక్షింపబడగా, ప్రసూతి సమయంలో నిర్జీవమైన పొరలను ఛేదించుకొని జీవి బయటకు వస్తుంది. ఇది అన్ని జాతులయందు సత్యము. మానవుడు, పశువు, పక్షి యిలాగే పుడుతున్నాయి. ఇందు జీవ–నిర్జీవ స్థితులు అశ్వినులే!

*చివరి విషయము :* ''నా జీవనము కొరకు మీరు గోవులను విమోచనము చేయుచున్నారు.'' అని తెలుపబడినది. గోవులు కూడ మానవులవలె, ఇతర జీవులవలె నిర్జీవ పొరలనుండి ప్రసవింపబడి మానవుల పోషణమునకు ప్రధానముగా వినియోగ పడుచున్నవి. పుష్టికరమగు గోవులు ఒక జంటగా ఒక కుటుంబమును

పోషించగలవు. అడవులలో తిని, నీరు త్రాగి మానవులకు పాలను అందించు గోవుల ప్రాముఖ్యత అనిర్వచనీయము. వాని పోషణము ద్వారా మానవుడు వృద్ధి చెందుచున్నాడు. గో పోషణ, గో సంరక్షణ సంస్కారవంతమగు మానవునకు కర్తవ్యమై యున్నది. దీనిని గూర్చి మన పురాణములలో అనేకానేక పుణ్య గాథలు వున్నాయి.

**మంత్రము - 12 :**

**స్తోతుం న శక్నోమి గుణైర్భవంతౌ**
**చక్షుర్విహీనః పథి సంప్రమోహః ।**
**దుర్గేఽహమస్మిన్ పతితోఽస్మికూపే**
**యువాం శరణ్యౌ శరణం ప్రపద్యే ॥**

**టీక :**

భవంతౌ = తామిద్దరను; గుణైః = గుణములచేత; స్తోతుం = స్తుతించుటకు; న శక్నోమి = శక్తిమంతుడను కాను; చక్షుర్విహీనః = కన్నులు లేనివాడను; పథి = మార్గమునందు; సంప్రమోహః = పూర్తిగా పొరబడినవాడను; దుర్గే = గమింపరానిదైన (దాటరానిది); అస్మిన్‌కూపే = ఈ బావియందు; పతితః = పడినవాడనై; శరణ్యౌ = శరణు పొందదగినవారైన; యువాం = మీ ఇద్దరను; శరణం ప్రపద్యే = శరణు పొందుచున్నాను.

**తాత్పర్యము :**

మీ మహిమాను గుణములను స్తుతించుట కేవిధముగను సమర్థుడను గాను. కన్నులు పోయినవాడను. దారి తప్పి ఈ బావిలో పడియున్నాను. పై కెక్కి రాలేని వాడను. శరణు కోరదగిన మీ ఇద్దరను శరణంటిని.

**వివరణము :**

అశ్వినీ దేవతల స్తోత్రంలో చిట్టచివరిది, పన్నెండవది అయిన మంత్రాన్ని ఈ రోజు మనం వివరించుకుని ఈ యజ్ఞంలో నిర్వర్తింపబడేటువంటి ప్రవచన కార్యక్రమాన్ని ఈ ఉదయం కార్యక్రమంతో పరిపూర్ణం గావించుకుందాం. పన్నెండు ప్రవచనములుగా సాగినటువంటి ఈ అశ్వినీ మంత్ర వివరణ మీకందరికీ సర్వ శుభములు కలిగించాలనే ఉద్దేశ్యంతో గురుపరంపర యొక్క ఆశీర్వాద ఫలంగా ఈ వివరణ చేసుకుంటూ ఉండటం జరుగుతున్నది.

మొదటి వాక్యంలోనే అశ్వినులను గూర్చినటువంటి గుణములను స్తోత్రం చేయుట నావల్ల కాదు అని ఉపమన్యుడు తెలుపుతున్నాడు. ఈ అశ్వినీ దేవతలు మొత్తం సృష్టికే ఆధారమైన విశ్వేదేవతలు. వారి ఆధారంగా ఒక సృష్టి నిర్మాణం జరగటం అంటే పరమాణువు నుండి బ్రహ్మాండం వరకు సమస్త సృష్టికి వారు రెండు విధములైనటువంటి, పరస్పర విరుద్ధంగా గోచరించే ప్రజ్ఞలుగా ఏర్పడి ఈ సృష్టి నిర్మాణం చేస్తుంటారు. అణువు నుండి బ్రహ్మాండం వరకు ఏమి ఏర్పడవలెనన్నా, ఏ స్థితియందు ఉండవలెనన్నా, ఏది తిరోధానం చెందవలెనన్నా వీరిరువురు దేవతల ప్రజ్ఞలే ప్రధాన కారణము. వీరిద్దరిని పరతత్వము యొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా చెప్తారు.

భగవంతుని నిశ్వాసమే ఈ సృష్టిగా ఏర్పడుతుంది. మరల భగవంతుని ఉచ్ఛ్వాసతో ఈ సృష్టి లయమవుతుంది. అందుకే భగవంతుని ఒక శ్వాస ఒక సృష్టిగా చెప్తారు. శ్వాసయే మనకు

ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా ఉంటుంది. మనం ప్రతినిత్యం గాలిని పీల్చుకుంటున్నప్పుడు మన చుట్టూ వ్యాప్తి చెందిన భగవంతుని నిశ్వాసయను ప్రజ్ఞయే మనలోనికి ప్రవేశిస్తూ వుంటుంది. మనలోని తత్త్వములు మొత్తం వ్యాప్తిచెందిన తత్త్వముతో అనుసంధానము చెందడానికి మన నిశ్వాస వినియోగిస్తాము. యోగ సాధనలో ఇది ప్రధానంగా భావిస్తారు. అంటే మనం లోపలకు తీసుకున్నప్పుడు దైవాన్ని మనలోకి ఆవాహన చేసుకుంటాము. ఇలా నిత్యం జరుగుతున్నట్టుగా భావించడం అనేది యోగంలో మనకి చెప్తారు. ''సోహమస్మి'' అతడే నేనుగా ఉన్నాను అని. అతడు నాలోనికి, అతనిలోనికి నేను. ఇలా నిత్యం అనుసంధానం చెందేవాడే యోగి అనబడతాడు.

యోగి తనయందు ప్రజ్ఞ – పదార్థములను సమతూకంతో నిర్మాణం చేసుకుంటాడు. అలా తదనుగుణంగా అనుభూతిని పొందుతూ సమస్త లోకములయందు, అన్నిటియందు ఉన్నటువంటి ప్రజ్ఞను, పదార్థ వికాసమును అనుభూతి చెందుతుండవచ్చు. అనుభూతి యొక్క ఆనందాన్ని పొందవచ్చు. అందుకని ఒకదానికొకటి విరుద్ధంగా గోచరిస్తున్నప్పటికీ కూడా ఒకదానికొకటి ప్రతికూలంగా పనిచేస్తుంటాయి. అందుకే "The opposites are complementary to each other" అని చెప్పడం. రెండూ పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. కానీ అవి ఒకదానికొకటి తోడ్పడుతుంటాయి. ప్రతికూలతలో అనుకూలత వున్నది. అనుకూలతలో ప్రతికూలత వున్నది.

ఉచ్ఛ్వాస నిశ్వాసకు, నిశ్వాస ఉచ్ఛ్వాసకు తోడ్పడు

తుంటుంది. అలాగే ప్రజ్ఞ పదార్థానికి, పదార్థం ప్రజ్ఞకు తోడ్పడు తుంటుంది. అలా వైభవాన్ని ఆవిష్కరిస్తుంటాయి. ఈ రెండూ పనిచేయటం వలన మనకు మొత్తం సృష్టి అంతా కూడా వైభవోపేతమైన రసానుభూతిని కలిగించే పద్ధతులలో ఏర్పాటు చేయబడుతుంది. ఇదే మొత్తం సృష్టి విధానం. భార్యాభర్తలకు కూడా అలాగే ఉంటుంది. మనలో కుడి ఎడమలుగా ఉన్నవి కూడా అలాగే ఉంటాయి. అలాగే ఊర్ధ్వము, అధస్సుగా ఉన్న మన శరీర భాగాలు కూడా అలాగే ఉంటాయి.

ఉత్తర దక్షిణములు, తూర్పు పడమరలు, ఈశాన్య నైఋతులు, ఆగ్నేయ వాయవ్యములు ఇలా కనిపించేవన్నీ ఒకటే రెండుగా ఏర్పడి వైభవాన్నిస్తుంటాయి. ఉదాహరణకు ఈ హాలులో అటు ఒక స్తంభం, ఇటు ఒక స్తంభం ఉండి దీనికి పైకప్పు కలిపి ఉంటుంది. ఇది ఈ రెండు స్తంభాల తోడ్పాటు కదా! అందుకే రెండు స్తంభాలు కలిసి దీనిని పటిష్ఠంగా నిలబెడుతున్నాయి. అదే వైభవం.

ఇది విష్ణు సూక్తాలలోని మొదటి సూక్తంలోనే చెప్పడం జరిగింది. ఓ విష్ణుదేవా! నీవు అద్భుతంగా వెలుగు లోకాల్ని, పదార్థ లోకాల్ని ఒకదానికొకటి ప్రతిముఖముగా ఈ సృష్టి నిర్మాణం చేశావు. ఎంత అద్భుతమైన సృష్టి చేశావు అని ఆ తత్త్వాన్ని మనం ఆరాధన చేస్తుంటాము. మనకి మామూలుగా వైరుధ్యం ఉన్న ప్రజ్ఞ దర్శనమిస్తే, దానిని మన యొక్క ప్రతిబింబంగా భావించి, దాన్ని కూడా అవగాహన చేసుకుని జీవించడం అనేది జ్ఞానంగా యిస్తుంటారు. అందుచేత వీరు పరస్పర విరుద్ధంగా గోచరిస్తారు

తప్ప, వీరిద్దరూ ఒకరికొకరు సహకరించుకుంటూ ఉంటారు. ఇలా సహకరించుకుని సృష్టిలోని అన్ని కార్యక్రమాలను నిర్వర్తిస్తుంటారు. అందుకని వారిని గూర్చి అవగాహన చేసుకోవడం, వారిని గూర్చి ప్రశంసించుకోవడం ఈ రెండూ మనం ఎంతగా చేసుకుంటే అంతగా మనలోని పరస్పర విరుద్ధమైన భావాలు అన్నీ సమన్వయం చెంది మనకు వికాసం కలుగుతుంది. అయ్యవారికి అమ్మవారు ప్రతిముఖముగా ఆశీనురాలై సృష్టి నిర్మాణము చేస్తున్నదని ఋషులు ప్రశంసించారు. వివాహ క్రతువునందు కూడ వరునకు ప్రతిముఖముగా వధువును కూర్చుండబెట్టి లగ్న ప్రక్రియను నిర్వర్తిస్తారు. వరుడు పశ్చిమ ముఖముగా చూస్తూవుంటే, వధువు తూర్పు ముఖముగా చూస్తూ వుంటుంది. ''*కామేశ్వర ముఖాలోక కల్పిత శ్రీగణేశ్వరా*'' అని అమ్మను కీర్తిస్తాము.

ఈ సృష్టిలో ఒక్కొక్క జీవుడికి ఒక్కొక్క రకమైన ఆశయాలు ఉంటాయి. కానీ తన స్వభావాలు వాటికి విరుద్ధంగా కనిపించేటట్టు ఉంటాయి. అనగా జీవుడు ఒకటి కోరితే, స్వభావం ఒకటి కోరుతుంది. జీవుడు ఒకలా ఉండాలనుకుంటే, తన స్వభావం మరోలా ఉంటాను అంటుంది. ఎలా అంటే మనం ఒక దినచర్య ఏర్పాటు చేసుకున్నాము అనుకుంటే జరిగేది మరోలా ఉంటుంది. మన పెద్దలు మనకు ఉదయం నిద్ర లేవాలి అని చెప్తే మనకు మెలకువ రాదు కదా! విన్నప్పుడు బాగానే ఉంటుంది. కాని మన స్వభావం మరో రకంగా ఉండి, మనల్ని దాన్ని పాటింపనీయదు.

అలాగే మన ఆహార విహారాల విషయంలో కాని, మన భాషణ విషయంలో కాని అనుకున్న విధంగా కాక, మన స్వభావం

మరోలా మార్చేస్తుంటుంది. జీవుని ఆకాంక్షకు, స్వభావానికి తేడా ఉంటుంది. ఇది ఎలా అంటే మనం పెంచుకున్న గుఱ్ఱం మన మాట వినకపోవడం వంటిది. అలా మన శరీరం మన మాట వినని పరిస్థితులలోకి వస్తుంటుంది. మనస్సు, బుద్ధి అంతే కదా! పెద్దల బోధనలవల్ల గాని, సద్గ్రంథ పఠనంవల్ల గాని, పెద్దల ఆచరణ చూసి గాని మనం ఎంత మంచి బుద్ధి పొందినా, ఆచరణలోకి వచ్చేసరికి కొంత వైరుధ్యం, ప్రత్యర్థిత్వం కలుగుతుంది. అంటే మన ఆచరణ మన ఆలోచనలకు కొంత వైరుధ్యంగా ఉంటుంది. కాబట్టి మన స్వభావాన్ని ప్రేమతో, స్నేహంతో మచ్చిక చేసుకుని, మనకు తోడ్పడే విధంగా మార్చుకోవాలి. అదే నిజమైన సాధన.

ఎందుకంటే ఏ స్వభావం మనకు యిబ్బంది కలిగిస్తోందో, ఆ స్వభావమే మనకు సమస్తమైన అనుభూతిని కూడ ఇవ్వగలదు. స్వభావం సరిగా లేకపోతే అనుభూతి సరిగ్గా పొందలేము. జీవుడికి దైవీ స్వభావం కలిగితే, అది ఏడులోకాల అనుభూతిని యివ్వగలదు. కాబట్టి స్వభావం సరిగా లేకపోతే ఏ అనుభూతిని పొందటానికి వీలుపడదు. మనకు వాహనం లేకపోతే మనం ఊరిలో ఏ పనీ చేయలేము కదా! అందువల్ల స్వభావం జీవుడికి వాహనం. విష్ణుమూర్తికి గరుడవాహనం ఏడు లోకాల్లోనూ ఎలా విహరించగలదో అలాగే శివునికి నంది వాహనంగా ఉన్నాడు. అలాగే పద్మము బ్రహ్మదేవునికి వాహనం. అది ఏడు లోకాల్లోనూ విహరించగలదు. అందుకనే మనకి శరీరంలోనే ఏడు లోకాలు (కుండలిని) చెప్పారు. అవి పద్మాలే కదా! మూలాధారం నుండి

సహస్రారం వరకు వ్యాపించి ఉన్నాయి. కాబట్టి ఇవి మనకు ఏడు పద్మ వాహనములు అని చెప్పవచ్చు.

ఈ ఏడు వాహనములు (పద్మాలు) ఒక్కొక్కటి ఒక్కో విధంగా సక్రమమైన పద్ధతిలో మన స్వభావంపై పనిచేస్తుంటాయి. కాబట్టి మనకు వాహనం మన స్వభావమే. దాన్ని మనం చక్కగా సరైన క్రమంలో ఉపయోగించుకోవాలి. మన స్వభావం మనకు మిత్రుడిలా పనిచేస్తే, మనం కూడా ఋషితుల్యులుగా మారవచ్చు. కాబట్టి దాన్ని దమించడంవల్ల ఉపయోగం ఉండదు. దమిస్తే అవకాశం వచ్చినప్పుడు అది తిరగబడే పరిస్థితులు రాగలవు. ఉదాహరణకు చెప్పు క్రింద తేలు ఉందని భావిస్తే, చెప్పు క్రింద ఉన్నంత వరకు అది కిందికి ఉంటుంది. ఒకసారి చెప్పు తీశామంటే అది మనను కాటు వేయగలదు. కాబట్టి మన స్వభావాన్ని కూడా మిత్రత్వంతో సాధించుకోవచ్చు. దమించడం వల్ల, అధికారంతో అణచి వేయడంవల్ల సాధించగలిగింది ఏదీ లేదు. ఇదే జ్ఞానం. అందుచేత అజ్ఞానాన్ని మనలోని విజ్ఞానంతో ఓపికగా ప్రేమతో స్నేహపూర్వకంగా మచ్చిక చేసుకుని మన దారికి తెచ్చుకోవాలి.

భార్యాభర్తల అనుబంధం కూడా యిలాంటిదే. పరస్పర విరుద్ధ భావాలు గల స్త్రీ పురుషులకు వివాహం చేస్తే, ఒకరినొకరు అర్థంచేసుకుని సంసారం చేయడంలోనే 30 సంవత్సరాలు గడుస్తాయి కదా! వారు నలభై సంవత్సరాల సంసారంలో స్నేహితులుగా అవుతారు. ప్రారంభంలో యౌవనం, వారి స్వభావాలు ఉంటాయి. నలభై ఏళ్ళకి స్నేహితులుగా మారగలరు. అప్పటినుంచి ఒకరినొకరు విడిచి ఉండలేరు. ఎందుకంటే వారి

మధ్య జరిగిన నిరంతర స్వభావ మార్పు వల్ల. రెండు రాళ్ళు ఒక సంచిలో వేసి కదిలిస్తే, ఆ రాపిడికి వాటి కోణాకృతులు నెమ్మదిగా పోయి, సున్నితంగా కాగలవు. మనం పూజలో పెట్టుకునే సాలగ్రామాలు కూడా నదిలో రాపిడి వల్ల కొంతకాలానికి వాటి కోణాలు అరిగిపోయి, సున్నితంగా తయారయి, వాటికి ఇంక నీటి అవసరం లేనట్లుగా మార్పు చెందుతాయి. వాటిపై నీరు నిలవదుగా. అలాగే పరస్పర విరుద్ధంగా గోచరించే విషయాలు క్రమంగా పరివర్తన చెంది ఒకరికొకరు తోడ్పడుతూ పరిణతి చెందుతారు. మనకు ఎండాకాలం బాగా వేడిగా ఉంటే వాన వస్తుంది కదా! ఇది మనకు బాగా అనుభవం. వేసవి తరువాతనే కదా వర్షాకాలం. వేసవి ఎంత ఉద్ధృతముగా వుంటే అంత ఎక్కువ వర్షం పడుతుంది. ''ఎండ వద్దు, వాన కావాలి'' అనుకుంటే కుదరదు. ''శ్రమ వద్దు, ఫలితము కావాలి'' అనుకున్నా కుదరదు.

గ్రీష్మఋతువు తరువాతనే కదా వర్షఋతువు. అలా అన్నీ ఈ సృష్టిలో ఏర్పాటు చేయబడ్డాయి. అన్ని ఋతువులూ ఒకదానికొకటి పరస్పర విరుద్ధంగా గోచరిస్తాయి. నిజంగా ఆరు ఋతువులలో ఉండేవి మూడే. ఆ మూడూ రెండే. రెండు ఒకటిగా. అందుచేత జ్ఞానం మనకు ఇచ్చేది ఏదంటే అజ్ఞానాన్ని అంగీకరించి, దానియందు జ్ఞానాన్ని ఏర్పాటు చేసుకోవడమే. అలా చేసి మనం పరిపూర్ణత సంపాదించుకోవాలి. దేనినీ తీసెయ్యడానికి లేదు. ఎంత తీసెయ్యాలి అనుకుంటే అంత అపరిపూర్ణంగా మనం నిలుస్తాము. అందుకనే *'ప్రవక్ష్యంతితే అజ్ఞానం'* అని చెప్తారు. ఏది అజ్ఞానమో తెలిస్తే, ఇక మిగిలేది జ్ఞానమే కదా! అలా పెద్దలు మనకి రెండింటినీ

నీవు సమన్వయం చేసుకుని, ఆ రెండింటికీ అతీతమైన పరిపూర్ణ స్థితిలో ఉండాలని చెప్పారు దానినే ఈ రోజులలో “Spiritual Synthesis” పరివర్తన అంటారు. Synthesis implies all inclusiveness.

*‘అనిరాకరణమస్తు’* అంటాము కదా! అన్నీ ఉండటానికి సృష్టి ఏర్పాటు చేస్తారు. ఇందులో కొన్ని ఉండకూడదంటే ఎలా? అందుకని అన్నిటినీ అంగీకరించే స్థితిలోకి వెళ్ళిపోయి, దేనినైనా అంగీకరించాలి అంటే మనకు హృదయ వైశాల్యం ఎక్కువగా పెరగాలి. మూర్ఖులను, అజ్ఞానులను కూడా కలుపుకుని వెళ్ళాలి. ఇందుకు మనకు మంచి ఉదాహరణ వశిష్ఠ మహర్షి. ఆయన తన వందమంది కుమారులను చంపిన వానిని కూడా క్షమించాడు. అలా తాను ఆచరించి చూపించాడు. అలాగే మనం కూడా అందరినీ కలుపుకోవడానికి ప్రయత్నించాలి. ఎవరైనా విడిగా ఉంటాము అంటే వారు ఇంకా నేర్చుకోవలసినవి ఉన్నాయని అర్థం. మన వరకు కలుపుకోవాలని ప్రయత్నం చేస్తే, మన హృదయ వైశాల్యం పెరిగి, మనం వికాసం చెందుతాము. మనం కూడా వారిలా నడిస్తే అది జ్ఞానం అనిపించుకోదు. కలుపుకోవాలని చెప్పడం సులభం. పాటించడం మహాకష్టం. దానికి చాలా విశాల హృదయం కావాలి. తనను దూషించే శిశుపాలుడిని కూడ తనలోనికి యిముడ్చుకున్నాడు శ్రీకృష్ణుడు!

మారిపోయే స్వభావం ఎంతవరకు ఉంటుంది? గట్టి కూరలు కూడ బాగా ఉడికిస్తే మెత్తబడతాయి. అందుకనే భారతంలో కుంతీదేవి నేను ఇంకా మెత్తబడాలి శ్రీకృష్ణా! అని కష్టాలనే

కోరుకుంటుంది. కాబట్టి కష్టాలలో మెత్తబడినట్లు సుఖాలలో మెత్తబడము కదా! సుఖాలకు బాగా గట్టిబడిపోయి, కష్టాలలో లోపల బాగా కుమిలి, తుదకు మెత్తబడటం జరుగుతుంది. అందుకని దేవుడు తన భక్తులకు ఎక్కువ కష్టాలే కలిగిస్తుంటాడు. ఎందుకంటే వారిని ఆదుకోవడానికి తాను నిర్ణయించడం వల్లనే. శ్రీకృష్ణుడు వెన్నముద్దను ఇష్టంగా ఆరగిస్తాడు. వెన్నముద్ద అంతగా మెత్తబడటానికి ఎంత మథనం అవసరమో మనకి విదితమే కదా! లేకుంటే వెన్న రాదుగా.

పాలలో కొంతకాలం నిలువ ఉండే పదార్థం వెన్నయే. వెన్న తయారుచేయాలంటే ఎంతో మథనం అవసరం. అందుకే పాలకంటే వెన్నకి ఆయుర్దాయం ఎక్కువ. వెన్నను కరిగించి, మరగబెడితే నెయ్యి వస్తుంది. వెన్నకన్నా నెయ్యికి ఆయుర్దాయం ఎక్కువ. అలాగే నిన్ను చిరంజీవిగా, శాశ్వతునిగా, అమృతమూర్తిగా తయారుచేయాలంటే అది నీ స్వభావాన్ని నీవు బాగా ఉద్ధరించుకుంటేనే సాధ్యం. అలా నీలో పరివర్తన జరుగుతుంటే నీలోని కోపం, చిరాకు వంటివి వెళ్ళిపోతాయి. "Let pain bring due reward of Light & Love" అని జ్వాలాకూలుడనే మహర్షి పలికారు.

మనకు కష్టం వస్తే ముందు మనకు జ్ఞానాన్నిచ్చే గురువుపైనే కోపిస్తాము కదా! ఎందుకంటే మనది 'One way traffic'. కానీ గురుపరంపర, అన్నిటినీ కలుపుకుని వెళ్తుంటాయి. అదే దైవత్వం. అందుకని ఇలా పరస్పర విరుద్ధంగా గోచరించినప్పటికీ రెండూ కలిసి మనల్ని ఉద్ధరించేవే. అందుకనే శ్రీమద్భగవద్గీత ఆరవ అధ్యాయంలో "నీ స్వభావమే నీకు శత్రువు గాను, మిత్రుడు

గాను కనిపించవచ్చు. నీ స్వభావం నిన్ను ఉద్ధరించవచ్చు లేదా పతనము గావించవచ్చు'' అని చెప్పాడు. అత్మకు ఆత్మయే శత్రువు, మిత్రుడు కూడా. ఆత్మవల్లనే ఆత్మ ఉద్ధరింపబడుతుంది, పతనము కూడా చెందుతుంది. "You are your conflict. There is no other conflict". కొన్ని సన్నివేశాలలో కొంతమంది సులభంగా కలత చెందుతారు. కొంతమంది చెందరు. అలాంటి పద్యాలు భారతంలో ఉన్నాయి. *''తాటంగట్టిరి, నీట ద్రోసిరి, విషాన్నం పెట్టిరి (భీమునిపై)''* ఇవన్నీ చేసినా యుధిష్ఠిరునకు కోపం రాలేదు. ఆ మహనీయుడు వారు ఎన్ని చేసినా తెలియక చేశారులే అనుకుంటాడు. భీమార్జునులకు కోపం వస్తుంది కానీ ధర్మరాజుకు రాదు. ఎంత ఓర్పుతో సహిస్తాడో అని శ్రీకృష్ణునకే ఆశ్చర్యం వేస్తుంది. అందుకనే కురుసభలో హెచ్చరిస్తాడు కూడా. అలాంటి ధర్మరాజుకు కోపం వస్తే పరిణామం ఎలా ఉంటుందో ఊహించుకోండని వివరిస్తాడు. జాగ్రత్త పడవలసిందని తెలుపుతాడు.

*అలుగుటయే యెరుంగని మహామహితాత్ము డజాతశత్రువే*
*యలిగిననాడు సాగరము లన్నియు నేకము గాకపోవు క*
*ర్ణులు పదివేవురైన నని నొత్తురు చత్తురు రాజ రాజ నా*
*పలుకులు విశ్వసింపుము విపన్నుల లోకులగావు మెల్లరన్.*

ధర్మరాజుకు ఓర్పు, సహనం, కలుపుగోలుతనం ఎక్కువ. అదే జ్ఞానం. అది మెండుగా ధర్మరాజులోను ఉంది. అదే శ్రీరామునిలోనూ ఉంది. మనకి Inclusive ఏదీ? అంతా Exclusive నే. We want to be as Exclusive as

possible and become narrow minded. But the Wisdom says be as Inclusive as possible, so that you become broad minded and become so broad in your awareness. Have no more circumference. అది అనేమి చక్రం. అందుకే సత్యానికి పరిధులు లేవు. సత్యము ఉన్నచోట అన్నీ అందులో ఇమడ్చబడతాయి. దానికి అంతులేదు. అది అప్రమేయమైనది. Centre every ware but circumference no ware. అందుకే అశ్వినుల చక్రం ''అనేమి, అజరం, అమృతం'' అని స్తోత్రము తెలుపుతోంది. పరస్పర విరుద్ధముగా గోచరించే వారిరువురు ఒకరికొకరు మిత్రులు. ఇది అవగాహన కావాలి. కంసుడు బలరామకృష్ణులను మధురకు తోడ్కొని రమ్మని అక్రూరుని ఆదేశిస్తాడు. అపకారం చేయటానికే తోడ్కొని రమ్మన్నాడని అక్రూరునికి తెలుసు. కాని తనకు ఈ విధముగా బలరామకృష్ణుల దర్శనము కలుగుతోందని అక్రూరుడు ఆనందముగా వ్రజమునకు బయలుదేరుతాడు. *''కంసునిబోలు సఖుండు కల్గునే''* – అని అక్రూరుడు కంసుని ప్రశంసించుకుంటాడు మనసులో. అక్రూరుడు జ్ఞాని.

మన మాట విననివాడు, మనకు వ్యతిరేకంగా పనిచేసేవాడు– అలాంటి వారిని మనం మానసికంగా కలుపుకుని, ఓర్పుతో మౌనంగా భరించడమనేదే సత్యం. దాని వల్లే మన పురోభివృద్ధి ఉంటుంది. ఇందులో ఏ సందేహం లేదు. అందుకనే *''అనిరాకరణమస్తు''* అని పదే పదే తలవడం. ఇలా అందరూ పురోగమించి, పరివర్తన చెందడానికి అశ్వినీ దేవతలు

సహకరిస్తారు. ఎందుకని? మనకి సృష్టిలో అన్నీ అలాగే ఉంటాయి. ఏది చూచినా మనకి వ్యతిరేకంగానే కనిపిస్తుంది. వ్యతిరేకతను అంగీకరించడానికే శిరస్సు. అందుకనే శని ఒకసారి మన రాశిలో సమాగమము, సమసప్తక దృష్టి, కేంద్ర దృష్టులలో ఉంటుంటాడు. (Conjunction, Opposition, Square.) ఏడున్నర సంవత్సరాలలో లాగా మన జన్మమంతా ఇలాగే నడుస్తుంటుంది. ఆయన మనకి నేర్పడానికే వస్తాడు. What you are unable to accept, learn to slowly accept. What can not be cured has to be endured. అందుకే తాను ఒకటి తలిస్తే దైవం మరో రకంగా తలుస్తుందని చెప్పారు. ఈ వాక్యం మనకు సర్వవిదితమేగా. ఈ వాక్యాన్ని మనకు రెండవ తరగతిలోనే కాపీ రాయించారు కదా! అంతా కలిపి రాయాలి అని బోధించేవారు. ఎందుకంటే మన జీవితాలు అన్నీ అంతే. మనం తలచేది, దైవం తలచేది ఒకటిగా ఉండాలి. మనం ద్వేషిస్తున్నా, మన లోపలి వాడికి ద్వేషం లేదు.

గొప్ప భక్తులు కూడా ఇలా అందరికీ సద్బుద్ధి ప్రసాదించమని కోరారు. ప్రహ్లాదుడు తన తండ్రికి సద్బుద్ధి ప్రసాదించమని కోరాడు. అలా అని జ్ఞానులు, యోగీశ్వరులు పరమాత్మ వల్లనే జ్ఞానం వస్తుందని తెలిపారు. తుదకైనా జ్ఞానం తెచ్చుకుంటారని ఆశించారు. మీరు శిరిడీ సాయి చరిత్రలో ఒక విషయం గ్రహించాలి. ఒక భక్తుడు బుట్టతో సాయికి పళ్ళు తేవడం, బుట్ట తెరవగానే రెండు బల్లులు వెలుపలికి వచ్చి, చెరో గోడపైన చేరి పోట్లాడుకోవడం అందరూ చూస్తారు. సాయి కూడా చూసి ''వాళ్ళు

పూర్వజన్మలో భార్యాభర్తలు. ఆ జన్మలో పోరు ఈ జన్మలోనూ యిలా కొనసాగిస్తున్నారు. వారే నేర్చుకుంటారు లెండి. మన పని మనం చేసుకొందాము'' అని చెప్పారు. అలాగే మనకి మన స్వభావ లక్షణాలు ఉంటాయి. అది చెప్పాలనిపించి ఇది చెప్పడం జరిగింది.

అశ్వినీ దేవతల స్తోత్రం మనం చెయ్యలేము అని చెప్పడానికి ఇంత ఉపాఖ్యానం చెప్పవలసి వచ్చింది. కాబట్టి Ability to accept that which is not acceptable, enables us to grow, otherwise ఎల్లప్పుడూ ఇలానే ఉండాలి అనుకుంటే కుదరదు కదా! మనకు అన్ని సౌకర్యాలు ఉండాలి. లేకుంటే విలవిల లాడిపోతాము. కొంతమందికి వర్షం చిరాకు. అలాంటి వాళ్ళు ఇంగ్లాండులో ఉంటే అక్కడ ఎప్పుడూ వర్షమే. అక్కడివారు ఎప్పుడూ గొడుగు పట్టుకుని తిరుగుతుంటారు. అలా నీవు నేర్చుకుంటే పోలా. అలా మనకు ప్రకృతి నేర్పుతుంది. అందుకనే ability to accept అనేటువంటిది slowly eliminate appearent opponents. ఇలా నేర్పుతుంటారు అశ్వినీ దేవతలు. కాబట్టి నాకు ఇది వద్దు, అది వద్దు, అదే కావాలి అనే మనస్సు కూడదని శ్రీకృష్ణుడు చెప్తాడు. అన్ని పరిస్థితులలోను నీవు సామరస్యంగా ఉండాలి. *''న ద్వేష్టి న కాంక్షతి''* అని బోధన.

తినే పదార్థంలో ఉప్పు ఎక్కువగా ఉందనిపిస్తే వికారాలు, కోపాలు ప్రదర్శించకుండా దానిని ప్రక్కన పెట్టి వేరేది ఆరగించడమే సామరస్యము. ప్రక్కవారికి ఇబ్బంది కలిగించే రీతిగా మనం మసలుకోకూడదు. కొంతమంది వేడిగాను, మరి కొంతమంది చల్లగాను తింటారు. కాబట్టి మనం వికారాలు చేయకుండా వేడి

చల్లారిన తరువాత తినవచ్చు. అదే సామరస్యం. మొత్తం మన జీవితమంతా నేర్చుకోవడానికే. అలా సామరస్యం నేర్పుతుంటారు అశ్వినీ దేవతలు. కాబట్టి ఈ సృష్టిలో seemingly opposing currents తయారుచేశారు. But they are not really opposing. దీనికి ఇంకొక ఉదాహరణ చెప్పుకుందాము.

సోక్రటీసు అనే మహానుభావుడు గ్రీకు దేశంలో అద్భుతమైన జ్ఞానాన్ని అందరికీ అందించేవాడు. ఆయన వరండాలో కూర్చుని అందరికీ పాఠాలు చెప్పేవాడు. అతను, అతని భార్య చాలా సంపద కలిగి ఉండేవారు. ఇంటి క్రింది భాగం పాఠాలకు ఉపయోగించుకుని, పైభాగంలో తాము కాపురం ఉండేవారు. ఉదయం ఈయన పాఠాలు చెప్పడం మొదలుపెట్టగానే భార్య ఇంటిలో చాలా చప్పుడు చేస్తుండేది. వంటింటిలో కొంత చప్పుడు అయితేనే మనం ఎంతో కలత చెందుతాము. మన వద్ద ఎవరైనా దగ్గుతుంటే అదోలా చూస్తాము. మనకు చాలా అసహనాలు ఉంటాయి. కానీ ఆ మహాత్ముడు అంత చప్పుడు అయినా సరే పాఠాలు చెప్పుకుపోయేవాడు. ఒక ప్రక్క చప్పుళ్ళు, మరొక ప్రక్క పాఠాలు. ఇలా సాగేది. చప్పుళ్ళకు పిల్లలు అటు చూసేవారు. కానీ సోక్రటీసు మీరు పాఠాలకు వచ్చారా? శబ్దాలు వినడానికి వచ్చారా? అని హెచ్చరించేవాడు.

మీరు శబ్దాలు వినదలిస్తే మన Athens నగరానికి వెళ్ళండి. మహా నగరాలలో శబ్దాలు చాలా ఉంటాయి. మన బెంగళూరులో మెజిస్టిక్ కు వెడితే శబ్దాలు ఎలా ఉంటాయో మనకు విదితమే. మనం పాఠాలు వినటానికి వచ్చాం కాని

శబ్దాలు వినటానికి కాదు కదా! కాబట్టి పాఠాలపై మనసు నిలిపితే, శబ్దాలు కొంతసేపటికి వినిపించవు. ఇలా పాఠాలు పెరిగేకొద్దీ ఇంట్లో శబ్దాలు కూడా పెరగసాగాయి. చివరి రోజుకు శబ్దాలే కాకుండా పాత్రలన్నీ అలా క్రిందకు వచ్చి పడసాగాయి. ఇంకా ఆవిడ అరుపులు కూడా వినిపించేవి. స్నాతకోత్సవం రోజు వేడినీళ్ళు కూడా పిల్లలమీద పోసింది. అయినా పిల్లలందరూ ఉత్తీర్ణత చెందారు. ఆ రోజు వారందరినీ సమావేశపర్చి ఆ ఇంటావిడ పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం వడ్డించింది. అప్పుడు సోక్రటీసు విద్యార్థులతో ''మా ఆవిడను మీరు గయ్యాళి అనుకున్నారు కదా! కాదు. ఆమె మీకు చదువులో చాలా సహనం నేర్పింది. మీకు ఏకాగ్రత కలగడానికే అలా చేసింది. అలా అని నేనూ మా ఆవిడ ఒకళ్ళకొకళ్ళం శత్రువులం కాము. మీకు కూడా ఆమె మాతృ సమానురాలు'' అని బోధించాడు. అలాగే మన జీవితంలో మనకు ప్రకృతి అనుకూలంగానూ, ప్రతికూలంగానూ పరిస్థితులను ఏర్పాటుచేస్తుంది. దానికి కారణం మన వద్దనే ఉంటుంది. అందుచేత ప్రతికూలమైన విషయాన్ని అనుకూలంగా చేసుకోవడమే సాధన. అందుకు ముందుగా ఓర్పు, సహనం, శ్రద్ధ యిచ్చి ప్రకృతి మనకు సహకరిస్తుంది.

ఈ విషయం శ్రీ శిరిడీ సాయిబాబా వారి చరిత్రలో వారు మనకు ''శ్రద్ధ, సబూరి'' అని చెప్పిన ఈ రెండు మాటలూ మందిరంలో రెండు వైపులా దర్శనమిస్తాయి కదా! ఈ రెండూ ఉంటే మిగతావి సహజంగా వాటంతటవే వస్తాయి. అందుచేత ఈవిధంగా మనకి ప్రకృతి ఎంతో సహకరిస్తుంది. ఇలా ఎన్నో

ఉన్నాయి. ఈ మార్గంలో మనం సహజంగా మోహానికి గురికావడం జరుగుతుంది. మనమంతా మోహంలో ఉన్నవాళ్ళమే. అలాగే సత్యహరిశ్చంద్రుడు ...

*"మాయామేయ జగంబె నిత్యమని సంభావించి మోహంబునన్నా*
*యిల్లాలని నా కుమారుడని ప్రాణంబుండునందాక*
*ఎంతో యల్లాడిన యీ శరీర మిపుడిందున్ గట్టెలన్ గాలుచో*
*ఆ యిల్లాలును రాదు పుత్రుడును తోడైరాడు తప్పింపగన్."*

నా ఇల్లాలు, నా కుమారుడు అని తాను పద్యాలు చెప్పడం, అప్పుడు మనం చప్పట్లు కొట్టడం జరుగుతుంది. కానీ దాని నిగూడార్థం తెలుసుకోలేము. అలాగే *"అచ్చపుఁ జీకటింబడి గృహవ్రతులై"* అనే పద్యం కూడా.

మనకు ఇంటికి చాకిరీ చేయడంలోనే నలభై, యాభై సంవత్సరములు గడుస్తాయి. అప్పటికి మన ఇంద్రియాలన్నీ సడలిపోతాయి. కంటికి ఇంపైనవి, రుచికరమైనవి, ఇంద్రియాలకు కావలసినవన్నీ ప్రోగు చేసుకుని ఈ జీవితం గడపడం జరుగుతుంది. జీవుడు పుట్టి, చచ్చి, పుట్టి, చచ్చి... ఇదంతా ప్రకృతి నేర్పేదే కదా! మనను మోహం అన్నివిధాలా లోబరచుకోగలదు. ఉదాహరణకు గత మూడు రోజులుగా మనకి కడుపు బాగా లేదు అనుకోండి. రేపటి నుండి గురుపూజా కార్యక్రమాలు మొదలుపెడతాము కదా! కానీ ఇవాళ మనవాళ్లు మన కోసమని రుచిగా మిరపకాయ బజ్జీలు వేసిస్తే ఆ మోహానికి లోబడి తిన్నామనుకోండి. అప్పుడు అంతకుముందు చేసుకున్న సమన్వయం లోపించి మనకు కడుపు

చెడితే గురుపూజా కార్యక్రమాలు ఎలా? ఇదంతా మన మోహం వల్లనే కదా! దీనిని బట్టి దేనిపట్ల అంత మోహం పనికిరాదని ప్రకృతి మనకు నేర్పినట్టే కదా! భార్యా పిల్లలు, ఆప్తులయందు మోహము, శరీరమునందు మోహము, అంగ సంస్కరణలయందు మోహము– ఇలా అన్నిటియందూ మనకు మోహమే. కాబట్టి అన్నిటియందూ శ్రద్ధగా ఉండటం అవసరం. శ్రద్ధ ఎక్కువైనా, తక్కువైనా దానికి పర్యవసానాలు ఉంటాయి.

అందుకే ఈ శ్లోకంలో నేను మోహమువల్ల పర్యవసానానికి గురయ్యాను. ఎంతసేపూ ఆవులను అడవికి తీసుకుని వెళ్ళి, ఎప్పుడు ఏమి తిందామా అన్న ఆలోచనే తప్ప, వేరేదీ లేకనే ఇలా బావిలో పడడం జరిగింది. మనకూ అంతే. మోహాల వెంటబడి ఇలా దిగజారి పడిపోయాము. తిండి మనకు ఒక సమస్య అయింది. దానివల్లే మనకు ఎక్కువ సమస్యలు. భాగవతం ఆరవ స్కంధములో ఒక పద్యం ఉంది. ఎప్పుడో 1975 సంవత్సరంలో చదివిన పద్యం. సారాంశం ఏమిటంటే నీ రోగాలు అన్నిటికీ నీ నోరే కారణము. నీకున్న సమస్యలు, రుగ్మతలకు కూడ నీ నోరే కారణము. ఇందులో ఏమీ సందేహం లేదు. అది ఒకటి అదుపులో పెట్టుకుంటే నీకు రుగ్మతలే ఉండవు. నీవు మరే ప్రయత్నాలూ చేయనక్కరలేదు. అందువల్ల నీవు నీ నోటిని అదుపులో పెట్టుకోవాలి. మనం తక్కినవి ఎన్ని చేసినా మనకు సమస్యలు తీరవు. ఎందుకని? ఆ ఒక్క ఇంద్రియం సమస్య అయితే మిగతా నాలుగు ఇంద్రియములు సమస్యలలోకి వెళ్తాయి. ఇదంతా మోహం వల్లనే కదా!

సృష్టి చూచి అనుభవించడం. అందులో తగు మాత్రంగా

నీకు ఏది అవసరమో అది గ్రహించి నడచుకుంటే మంచిది. అలా కాక ఏది పడితే అది గ్రహించినా అది మనకు సమస్యగా తయారుకాగలదు. అందుకే ఉపనిషత్తులో మన గురువులు తేనెటీగ కథ చెబుతారు. పువ్వులు అందంగాను, రకరకాల రంగులతోను, పరిమళాలతోను ఉంటాయి. కాని తేనెటీగ వాటితో ఏమీ సంబంధం పెట్టుకోకుండా తనకు కావలసిన మకరందం మాత్రం గ్రహిస్తుంది. మిగతా విషయాలైన అందంతో గాని, రంగుతో గాని, పరిమళంతో గాని తనకు పని లేదు. మకరందం సేకరించే వరకే తన కార్యక్రమం. అది పువ్వు మీద కూడా పూర్తిగా వాలదు. అందుకే పువ్వు కూడా తేనెటీగకి మకరందం అందించడంలో ఉత్సాహం చూపిస్తుంది. ఎందుకంటే అది పువ్వును disturb చెయ్యదు. మనం ఎవరింటికైనా వెడితే ఎలా ప్రవర్తిస్తాము. వారు మనం ఎప్పుడు వెళ్ళిపోతామా అనుకునే వరకు disturb చేస్తాము. అలా కాక మనం ఇంకా ఉండి ఉంటే బాగుండేది అనిపించుకోవాలి. అలా మన స్వభావం మార్చుకోవాలి. సృష్టిలో మన ప్రవర్తన అలానే ఉంటుంది. మనకు అక్కరలేనివి తాకుతూ ఉంటాం. అక్కరలేనివి వింటూ ఉంటాం. అక్కరలేనివి చూస్తూ ఉంటాం. అలానే అక్కరలేనివి తింటూ ఉంటాం. 'ప్రమోహం' అంటే మోహంలో ఉన్నతమైన స్థితి. అలానే మన ఉపమన్యుడు ఆవులను మేపుకొని రారా అంటే ఆవులను తోలుకు వెళ్ళి, సాయంత్రానికి వాటిని వారికి అప్పచెప్పి వచ్చి, ఆశ్రమంలో భోజనం చేయవచ్చుగా. అలా కాకుండా ఆవులు మన ఇంటికి వస్తే మనం పాలు పిండేసుకోవటం ఎలా ఉంటుంది? అవి మనవి కావు కదా! మొదటిరోజు ఆవుపాలు

పిండుకుని త్రాగాడు. రెండవ రోజు పాల నురగ త్రాగాడు. అలా వేరేవారి సంపద మనం అనుభవిస్తే ఎలా?

మూడవ రోజు ఆకులు తినటం ప్రారంభించాడు. ఆ ప్రయత్నంలో జిల్లేడు ఆకులు తెంపటం, వాటి పాలు కళ్ళలో పడటం జరిగింది. తనకు కళ్ళు పోయినాయి అని తెలుసుకోవటం కూడా జ్ఞానమే కదా! మనకు అది కూడ ఉండదు. కళ్ళు ఎందుకు పోయాయి? మోహపడటం వల్ల పోయాయి. మనకి చాక్షుష మన్వంతరంలో మూడవ కన్ను ఉండేదట. కాబట్టి వారు అన్నీ చూడగలిగేవారు. ఈ సృష్టిలో ఎన్ని రంగులు , ఎన్ని శబ్దములు, ఎన్ని అందమైనవి ఉన్నాయి? అవి ఎంత అద్భుతంగా వ్యాప్తి చెంది ఉన్నాయి. ఇలా అన్నీ చూడగలిగిన కన్ను మూసుకుపోయింది. దానికి ప్రబలమైన కారణం మనకు ఉన్న కోరికలే. అందుకే నాకు మోహం కలిగింది, అందువల్లే నాకు కళ్ళు పోయాయి. సంప్రమోహం వల్ల నా కళ్ళు పోయాయి అని తెలుసుకున్నాడు ఉపమన్యుడు.

*''సంసారజీమూత సంఘంబు విచ్చునే విష్ణుసేవామృత...''* అని ప్రతి విషయంలోనూ మనకు ఉపదేశాలు ఇవ్వడం జరిగింది. కూపస్తుడు అంటే మూలాధారంలో పడి ఉండేవాడు అని మన శాస్త్రం చెప్తుంది. మోహంచేత అలా పడిపోయి ఉన్నాను. అందువల్ల కళ్ళు పోయాయి. మోహం వల్లనే కళ్ళు, చెవులు తమ లక్షణాలను పోగొట్టుకుంటాయి. అది కారణంగా నేను ఈ బావిలో పడిపోవడం జరిగింది. నేనుగా బయటకు రాలేనంతగా పడిపోయాను. ఎవరు అంటే మనమే. ఉపమన్యుడు అంటే

మనమే, మానవులం. గాఢాంధకారంలో పడిపోయాము. మోహం వల్ల, జ్ఞానం నశించినందువల్ల కళ్ళు పోయాయి. అంటే వెలుగు కోల్పోయి చీకటిలో పడిపోయాను. అంతకు ముందు కూడా ఇంతమాత్రం తెలియకుండా ఉన్నాము అనుకుంటే ఇలా జరిగింది. దీనివల్ల మిమ్మల్ని (అశ్వినీ దేవతలను) శరణు వేడుతున్నాను. నాకు నేను సమర్పణ చేసుకుంటున్నాను. నాకు నేనుగా రావడానికి అశక్తుడను. కాబట్టి నాకు చేయూతనిచ్చి రక్షించండి అని కోరాడు. గురువుగారు అందుకు ఈ ఉపాయం ఇచ్చి, అశ్వినీ దేవతల స్తోత్రం చేసుకుంటే బయటకు రాగలవని తెలిపారు. గురువుగారు మామూలుగా ఏ పరికరం ఏర్పాటు చెయ్యలేదు. ఎందుకంటే శిష్యునికి జ్ఞానం వచ్చి, సంప్రమోహం వదిలించుకుని రావాలని. గురువులకు తమ శిష్యులు ఉద్ధరింపబడాలని తాపత్రయం. జ్ఞానంతోనే మనం ఈ అంధకార కూపంనుంచి బయటకు రావాలి.

ఈ స్తోత్రం Master E.K.గారు 1982వ సంవత్సరంలోనే మనకి అందించారు. అంటే దాదాపు 36 సంవత్సరాలు గడిచాయి. రాహుకేతువుల చక్రభ్రమణం రెండుమార్లు అయినప్పటికీ మనం అలానే ఉన్నాము. ఇందుకు మోహమే కదా కారణం! మనలోని మోహం పోవడానికే ఈ స్తోత్రం ఇవ్వబడింది. కాబట్టి పఠించి, పాటించడం జరిగితే, మనకు మోహం పోయి, జ్ఞాన నేత్రం రాగలదు. కళ్ళు వచ్చి వెలుగును చూడగలము. జ్ఞానం వస్తే, అజ్ఞానం నశించి, ఊర్ధ్వ ముఖంగా అలా వెలుగులతో నీవు నీ స్వభావం నుండి బయటపడగలవు.

కాబట్టి వాడు మూలాధారంలో పడిపోవడం జరిగింది.

అక్కడి నుండి వాడు వాడుగా బయటకు రావాలంటే ఏం చెయ్యాలి? మన వద్ద నిరంతరం ఉన్న అశ్వినీ దేవతలను ఆశ్రయించాలి. తప్పదు. అందుకే మొదటి శ్లోకంలోనే *"గిరావాశంసామి తపసా"* అన్నారు. అంటే మిమ్మల్ని వాక్కులతో ప్రశంసించి, తపస్సు చేస్తాను. వాక్కులతో రోజూ స్తోత్రం చేస్తాను. తపస్సు అంటే మన ఉచ్ఛ్వాస, నిశ్వాసలను పట్టుకోవడం. అదే మనకి మార్గం. ఈ కూపం నుండి బయటపడాలంటే ఉచ్ఛ్వాస, నిశ్వాసలే (శరణాగతి) మార్గం. ఈ విషయం సుమారు వందసార్లు చెప్పటం జరిగింది. కానీ మనం ఆచరించటం లేదు. ఎందుకంటే మనకు ఇతర విషయాలపైనే మోహం. అందుకనే దీనిని మీరు సాధన చేసుకుంటే ఉద్ధరింపబడతారు. కానీ మనం చేసుకోవడం లేదు. ప్రతినిత్యం నీలోని ఉచ్ఛ్వాస, నిశ్వాసలను (అశ్వినీ దేవతలను) ఆశ్రయిస్తే, నీకు తెలియకుండానే బావి (మూలాధారం) లో నుండి బయటకు రాగలవు. కనీసం హృదయంలోకి (సగము) రాగలవు. అదే తపస్సు. ప్రాణాయామ యజ్ఞం. అందువల్ల మిమ్మల్ని (అశ్వినీ దేవతలను) శరణు వేడుతున్నాను. నాకు నేను సమర్పణ చేసుకుంటున్నాను. నాకు నేనుగా బయటకు వచ్చేందుకు అశక్తుడను. నాకు మీరు చేయూతనిచ్చి రక్షించవలసినది. ప్రార్థనతో గురువుగారు ఈ ఉపాయం ఇవ్వడం జరిగింది. కేవలం దీనివల్లనే నీవు వెలుపలికి రాగలవు అని ఉపదేశం చేశారు.

అందువల్ల మనం ఈ ప్రాణాయామ యజ్ఞం సాధన చేసి, ఎప్పుడూ దానితోనే ముడిపడి ఉన్నట్లయితే క్రమంగా నీ ప్రజ్ఞ ఊర్ధ్వ ముఖం పడుతుంది. అలా నీ ప్రజ్ఞ ఊర్ధ్వ ముఖంగా నీ ఆజ్ఞలోకి

వస్తే నీవు ఈ కూపంనుండి బయటకు రాగలవు అని ఉపదేశం అందుకున్న ఉపమన్యుడు తనంతట తానుగా బావిలో నుండి బయటకు వస్తాడు. ఇదే గురువు ఉపదేశ మహిమ. గురువు ఉపదేశం తారకమంత్రంగా ఉపమన్యుడు ఆచరించి విముక్తుడు అవుతాడు.

ఏ గురువైనా ఇలా చేసుకోండి బాగుపడతారు అని మాత్రమే చెప్తారు. దాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించడం మన కర్తవ్యం. మన యోగంలో ఏ ఆసనాలూ వేయమని లేదు. సరిగా కూర్చో చాలు అన్నారు. నడుస్తూ చేయమనలేదు. నిశ్చలంగా పదిహేను నిమిషాలు అలా కూర్చో అని చెప్పారు. Master C.V.V.గారు మీరు అలా కూర్చుంటే నేనే అన్నీ నీలో నిర్వహిస్తాను అని చెప్పారు కదా! అలా కుదురుగా కూర్చోవటమే మనకు చేత కాదు. ఏమి చేయమన్నా చేయరు. కారణాలు మాత్రం వల్లిస్తారు.

సాయంత్రం ప్రేయరు ఎందుకు మానేస్తారు? అంటే ఎన్నో కారణాలు వస్తాయి. 'Lame excuses'. నీవు చేయలేకపోయావు అనేది సత్యం. అలా అనడం చాలా తేలిక. ఇందువల్ల చేయలేకపోయాను. అందువల్ల చేయలేకపోయాను అనేది గురువుగారికి అనవసరం. నీవు చేయలేదనేది సత్యం. అయితే నీవు సాయంత్రం భోజనం మానేశావా? లేదుగా. ఎంత పనిలో ఉన్నా భోజనం కావాలిగా. ఏ పరిస్థితులలోనైనా, ప్రయాణంలోనైనా సమయానికి తినేస్తాము. దానికి పరిసరములతో సంబంధం లేదు. అలా ప్రార్థనపై మక్కువ ఎందుకు లేదు? ఇది కూడా అలాగే చేసుకోవచ్చుగా. ఎక్కడ, ఎప్పుడు చేసుకుంటే వద్దంటారు. ఇదంతా

మనం మోహంలో పడి ఉండటంవల్ల జరుగుతున్నది. ఇదే సత్యం. పచ్చి నిజం. 'Bitter Truth'. కానీ గురువుగారు నా సాన్నిధ్యం (Presence) ఇస్తాను, నీవు తపస్సు చేసుకో అని చెప్తారు. అలా అని ముందుగా మాట ఇవ్వటం జరిగింది. ఈ మాట ప్రథమ శ్లోకంలోనే ఉపమన్యువుకు ఉపదేశించడం జరిగింది. అందుకనే ఆయన దాన్ని పాటించి బావిలోంచి పైకి రావటం జరిగింది. అంటే తన మూలాధారం నుండి ఆజ్ఞకు రావటమే. మనని మనం ఉద్ధరించుకోవటమే. అలా రావడానికి అశ్వినీ దేవతలు మనలో ఉచ్ఛ్వాస, నిశ్వాసలుగా ఉన్నారు. దాన్ని మనం భక్తి శ్రద్ధల చేత ఆచరిస్తుంటే వారు మనకు గోచరిస్తారు.

ఎవరైనా మహాత్ముడో, సద్గురువో విషయం తెలిపినప్పుడు దాన్ని మనం శ్రద్ధతో ఆచరిస్తే, మనకు ఉపదేశించినది గోచరిస్తుంది. ఆచరించకపోతే ఎలా గోచరిస్తుంది? మన 'Torch light' కొంతవరకే వెలుగు ప్రసరిస్తుంది. రెండు అడుగులు వేసి అక్కడికి చేరుకుంటే ముందుకు కనిపిస్తుంది. అలా మనం పురోగమించాలి. మొత్తం దారంతా కనపడనక్కర్లేదు. అంచెలంచెలుగా ముందుకు సాగాలి. ఉదాహరణకు మనం ఒక అరణ్యంలో ప్రవేశించాం అనుకుంటే ముందుకు ఎలా వెళ్తాము? చిన్న Torch పట్టుకుని ఆ వెలుగులో కొంతదూరం వెళ్ళి, అక్కడి నుండి మరికొంత దూరం వెలుగులో వెళ్లగలిగితే గమ్యం సులభంగా చేరుకుంటాము. అలా కాకుండా దారంతా కనపడలేదని ప్రారంభంలోనే ఆగిపోతే, నీవు ఎప్పటికీ గమ్యం చేరలేవు కదా! అందుకే ప్రయత్నం చేయాలి. నీ

ప్రజ్ఞ అంతే కాబట్టి ఉన్నచోటే ఉండవలసి వస్తుంది. పురోగమనం ఉండదు.

అయితే మనం దైనందిన ప్రార్థనలో సాధన చేస్తే మనలోని ప్రజ్ఞ మనకు దిశా నిర్దేశం చేయగలదు. నీకు అన్నీ గోచరిస్తాయి. అలా మనం క్రమక్రమంగా పురోగతి చెందాలి. శిశువుకు బాల్యంలో చిన్న స్పూనుతో ఆహారం పెడతాము. క్రమక్రమంగా ఎక్కువ పెట్టే ప్రయత్నం చేస్తాము. అంతా ఒకేసారి తినిపించేందుకు కాదుగా. ఒకవేళ బలవంతాన తినిపిస్తే కక్కుతారు కూడా. అలా ఎవరికి వారు తినాలి. తినేందుకు ఆకలి ఉండాలి. అలా మంచి విషయాల మీద ఆసక్తి ఉండాలి. అప్పుడు మనకు ప్రకృతి సహకరిస్తుంది.

ఇలా చాలా ఉపన్యాసాలు విన్నాము. వినేందుకు బాగానే ఉంటుంది. కానీ ఈ జన్మకు విని, పై జన్మకు ఆచరిస్తాము అని చెప్పడం ఎంత హాస్యాస్పదం? ప్రస్తుతానికి మనం అన్నీ వింటాము. వినటానికి ఉన్న ఆసక్తి ఆచరించటానికి కూడా ఉంటే ఎంత వైభవంగా ఉంటుంది. ఇలా మనం పురోగమనం చెందవచ్చు. ఇలా అన్నీ మనకు గోచరించాలి అంటే అలా ఆచరించాలి. మనం ఆచరించే కొద్దీ గోచరిస్తుంది. ముఖ్యంగా మీరు శ్వాసను నమ్ముకుంటే గోచరింపజేస్తారు. దాన్ని నీవు హృదయం వరకు తీసుకువెళ్ళగలిగితే కొంచెం వెలుగు నీలో ప్రవేశిస్తుంది. మరీ లోతులో పడినవారికి సగం పైకి వచ్చినా బాగుంటుంది కదా, అప్పుడు ఇంకొకటి గోచరిస్తుంది. అది మరీ పైకి చేరడానికి పనికివస్తుంది. తుదకు బావి పైకి అంటే పూర్తి వెలుగులోకి వస్తే అది అనంతం అని తెలుస్తుంది.

అందుకే అనంతమైన ఆకాశం బావిలో ఇంతై కనిపిస్తుంది. క్రమంగా పైకి వెళ్ళేకొద్దీ విశాలమై అనంతంగా కనిపిస్తుంది. అందులో కలిసిపోయే వరకు మనం పురోగమించవచ్చు. అలా అశ్వినీ దేవతల కార్యక్రమం జరుగుతుంది. అందుకని May Call కు ఎనిమిది రోజుల ముందే నేను యిక్కడకు (బెంగళూరు) రావటం జరిగింది. వచ్చినప్పటినుండి ఎందుకిలా ఎనిమిది రోజులు ముందుగా రావటం అనిపించేది. కానీ Master E.K. గారి సంకల్పం ఇలా అని మనకు గోచరించింది. వచ్చిన రోజు ప్రారంభంలో ఒక వారం రోజులు వృథాగా కాలం గడిపేయక మంచి మాటలు చెప్పుకుందాము అనుకుంటే ఈ పుస్తకం గుర్తుకు రావడం, ఎప్పుడో Master E.K. గారు 1982లో ఈ పుస్తకం రాయగానే క్రిందికి వచ్చి, ఇప్పుడు ఈ పుస్తకం వచ్చింది, చదవండి అని చెప్పారు. నాకు కొన్నాళ్లపాటు దీన్ని గురించి చెప్పారు. ఇన్ని రోజులకు మళ్ళీ దీని గురించి చెప్పమని మనకు వారి ఆజ్ఞ అయింది. ఎన్నెన్నో చెప్పుకోవడం జరిగింది. 1984వ సంవత్సరం నుండీ చెప్పింది చెప్పిన చోట చెప్పకుండా అలా చెప్పుకొస్తున్నాను. ఈవేళ చూస్తే సరిగ్గా ముప్పది నాలుగు సంవత్సరాలైంది. కానీ ఈ అశ్వినీ దేవతల స్తోత్రం ఎప్పుడూ ఎక్కడా చెప్పలేదు.

చెప్పటానికి ఇంతకాలం ముందు ఏమీ చెప్పకుండా అలా suspense లో పెట్టి, ఇలా ప్రార్థన చేస్తుంటే ఇది స్ఫురణకు రావడం జరిగింది. అందువల్ల ఇలా చెప్పుకోవడం పన్నెండు classes గా, పధ్నాలుగు ప్రార్థనలతో, ఏ ప్రార్థన సామాన్యంగా పెట్టుకోకుండా బాగా చేసుకుని తరించాము. ఇది లేకుండా మామూలు ప్రార్థనలు

అయి ఉంటే ఇంతమంది ఓపికగా, శ్రద్ధగా వినేవారు కాదు కదా! ఈ కార్యక్రమంలో పద్నాలుగు ప్రార్థనలు, పన్నెండు స్తోత్రములకు వ్యాఖ్యానం, ఒక భాగవతం క్లాసు సక్రమంగా జరిపించారు. మన గురువులు మనకు ఇలా ఏర్పాటుచేశారు. ఇంక ముందు May Call కార్యక్రమాలు ఉన్నాయి కదా! ఇది ఇలా జరుపు అని పైనుండి సంకల్పం. ఇదంతా చూస్తుంటే అంతా 'concurrent' జరిగిపోతోంది. ముందు మనకు ఏమీ తెలియదు, జీవితమంతా సస్పెన్స్ గా జరిగిపోతుంది. ఇందులో మీరందరూ పాల్గొన్నారు. చాలా విషయాలు మనకి తెలిసి వచ్చాయి.

మనలోని ఉచ్ఛ్వాస, నిశ్వాసల స్పందనలోనే అశ్వినీ దేవతలు ఉన్నారని,

పగలు ఎలా వాడుకోవాలి? రాత్రి ఎలా నడచుకోవాలి? మన ప్రవర్తన ఎలా ఉండాలి? స్వభావాన్ని ఎలా సమన్వయం చేసుకోవాలి? మన జీవితాన్ని ఉదయం ఎలా తెరవాలి? రాత్రి ఎలా మూయాలి?

ఇలా అన్ని విషయాలూ తెలుసుకోవటం జరిగింది. ఉదయం అశ్వినులలో మేల్కొని, రాత్రి సుపర్ణునితో వెడితే మంచి అనుభూతిని చెందుతాము. ఇది అంతా అనుభూతి కాదు. కొంతైనా అనుభూతి చెందటానికి ఇంతగా తెలియపరచుకున్నాము.

అందుచేత మీరు ఓపికతో, శ్రద్ధగా ఈ స్తోత్రాన్ని బాగా పఠనం చేసి, శ్వాసయందు మనస్సు లగ్నం చేసుకుని, వీలైనంతవరకు లోపల పైలోకాల్లోకి వెళ్ళేందుకు ప్రయత్నం

చేయాలి. అలా సాధన చేసుకుంటే, మనకు మోహము నుండి విముక్తి కలిగి, అది మనల్ని బంధించలేని స్థితికి చేరవచ్చు. జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు ఉంటాయి. జీవితమనేది కప్పల తక్కెడ లాంటిది. విచిత్రమేమిటంటే ఒక కప్ప ఎగిరితే, మరో కప్ప కూడా ఎగురుతుంది, దాంతో తూకం కాదు కదా కనీసం కప్పలను నియంత్రించలేము. సమస్యలు జీవులకు ఏదో రకంగా మథనం కలిగిస్తూనే ఉంటాయి. ఎలా అంటే సముద్రంలో అలలు నిలిచిన తరువాత స్నానం చేయడం వంటిదే ఇది కూడా. సంవత్సరం వినిన తరువాత ప్రార్థన చేస్తాము అంటే మనం ఇలానే ఉంటాము తప్ప పురోగతి ఉండదు.

Master E.K.గారు ఇంకొక అద్భుతమైన వాక్యం రాశారు. అది నాకు చాలా నచ్చింది. వెంటనే వెళ్ళి ఈ వాక్యం చాలా అద్భుతం అని చెప్పాను. మాస్టరుగారు చిరునవ్వు నవ్వారు. ‘‘జీవితంలో అన్ని సమస్యలకు మరణమే పరిష్కారం’’ అని ఆ వాక్యం. వెంటనే ఆశ్చర్యపడి మాస్టరుగారికి చేతులెత్తి నమస్కరించాను. జీవునికి ఇవి అన్నీ అలానే ఉన్నాయి. ఈ సాధన ఇలా చేస్తుంటే సమస్యలు అంటని స్థితికి మనం చేరుకుంటాము. సమస్యలు ఉంటాయి అని తెలిస్తే బాధ లేదుగా. దోమలు ఉన్నాయి అని తెలిస్తే ఆ ప్రదేశాలకు సరంజామాతోనే వెళ్తాం కదా! కానీ దోమతెర కట్టుకుంటే మనం దోమలకు “captive’ గా దోమతెరలోనే దొరకగలము. లోపల మనం దోమలతోనే ఉంటాము. సమస్యలు ఉంటాయి అని మనకు ముందే తెలిస్తే అంత ఇబ్బంది ఉండదు. ఉంటాయిలే అనిపిస్తుంది. సమస్యలు అలానే ఉంటాయి కప్పల తక్కెడలా. అందుకని

సమస్యలు వస్తూనే ఉంటాయి. ఎవరికో ఒక సమస్య ఉంటే, ఇంకో సమస్య వచ్చిందట. ఏమి చేయాలని Mail చేశారు. ఈ జన్మ అంతా సమస్యలతోనే ఉంటుంది కదా!

అందుకని మనం సమస్యలనుండి మనస్సును ప్రక్కన పెట్టి, మిగతా జరిగేవాటితో అనుసంధానం చెయ్యాలి. దీనితో linkup పెరిగితే delink పెరగటానికి అవకాశం ఉంటుంది. ఎలా అంటే మన దూరదర్శన్ లో Network News వస్తే, ఆ సమయానికి అన్నీ delink అయ్యే విధంగా అన్నమాట. ఎందుకంటే ఆ సమయంలో దానికి ప్రాముఖ్యం. అందుకనే మనం ఈ శ్వాసతో బాగా link అయితే, వేరే విషయాలపై delink జరిగి మనకు సామరస్యం పెరుగుతుంది. తరువాత అన్ని సమస్యలూ ఎదుర్కోవచ్చు. అలా చేసుకొనగలిగితేనే ఇందులో నుండి నీకుగా నీవు బయటపడగలవు.

అందుకే మనకు ఉపమన్యుడు మంచి model. అలా ఆయన గురువు ఉపదేశంతో బయటపడగలిగాడు. కానీ నేనే అలా బయటకు వచ్చానని అనుకోలేదు. దానికి గురువు ధౌమ్య మహర్షియే కారణమని తెలుసుకున్నాడు. గురువు మార్గాన్ని అనుసరించి, ఆచరించి బయటపడ్డానని తెలుసుకున్నాడు. బావిలో పడినవాడికి ఈ మంత్రం ఉపదేశం చేయకపోతే ఎలా బయటకు రాగలడు. కళ్ళు వచ్చి, జ్ఞాన సముపార్జనతోనే కదా బయటకు వచ్చింది.

మరొక ముఖ్య విషయము. ప్రార్థన స్తోత్ర రూపములో

గావించి, ఉపమన్యువు తపస్సు శ్రద్ధగా నిర్వర్తించాడు. అశ్వినులు ప్రసన్నులై దర్శనమిచ్చారు. కన్నులు చూడగలిగాయి! దివ్యమైన అశ్వినులను దర్శించి ఉపమన్యువు ధన్యుడైనాడు. అశ్వినులు అతనికి స్వస్థత కూర్చారు. కూపం నుండి బయల్వరిచారు. అటుపైన అతడు భుజించటానికి ఖాది (ఉత్తరేణి) పుల్లల నిచ్చారు. ఉపమన్యుడు శ్రద్ధతో స్వీకరించాడేగాని తినలేదు! సరాసరి గురువుగారి వద్దకు వెళ్ళి ఆ ఉత్తరేణి పుల్లలనిచ్చి, జరిగినది వివరించాడు. ధౌమ్య మహర్షి హర్షించి ఆ పుల్లలను తినమంటే తినడం జరిగింది. అంటే ఏ మోహమువల్ల అజ్ఞానంలో తాను పడిపోయాడో ఆ అజ్ఞానం తొలగిపోయింది. అందుకే ఉపమన్యుడు మహాత్ముడైనాడు. అలా ఈ కథ మనం చెప్పుకోవడం జరిగింది. మరొకసారి మీకందరికీ కృతజ్ఞతలు. ఎందుకంటే శ్రద్ధగా వినేవాళ్ళు కొందరైనా ఉండాలి. వినేవాళ్ళు లేకపోతే చెప్పే వాళ్ళకు ఉత్సాహం ఉండదు.

ఈ ఉపాఖ్యానం నాతో చెప్పించిన 'వాణి'కి కృతజ్ఞతలు. మాస్టర్ ఇ.కె.గారికి సదా కృతజ్ఞుడను. వారికే ఈ భాషణము సమర్పితము. మీరు, నేను చేసుకోవలసిది శ్వాస మీద ధ్యాసయే. తీరిక సమయాలలో దానిపైనే ఎక్కువ ధ్యాస ఉండాలి. ఉంటే ఏదో ఒకరోజు వ్యామోహాలు వెళ్ళిపోయి జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం కలిగితే ఈ అజ్ఞాన కూపంనుండి బయటపడగలము.

*స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం*
*న్యాయ్యేణ మార్గేణ మహీం మహీశాః ।*
*గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం*
*లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ॥*
*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*

# ధనిష్ఠ ప్రచురణలు

## మాస్టర్ పార్వతీకుమార్‌గారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | అమనస్కుడు | 30-00 |
| 2. | అన్వేషకుడు | 100-00 |
| 3. | అసంగుడు | 25-00 |
| 4. | అంబరీషుడు | 80-00 |
| 5. | హెచ్.పి.బి. ఆత్మసాధనా సూత్రములు | 50-00 |
| 6. | భారతీయ సంప్రదాయము | 20-00 |
| 7. | గోవు-ప్రాముఖ్యత | 20-00 |
| 8. | హిమాలయ గురుపరంపర | 30-00 |
| 9. | దేవాపి మహర్షి బోధలు-1 | 60-00 |
| 10. | దేవాపి మహర్షి బోధలు-2 | 100-00 |
| 11. | మైత్రేయ మహర్షి బోధలు-1 | 60-00 |
| 12. | మైత్రేయ మహర్షి బోధలు-2 | 100-00 |
| 13. | మరువు మహర్షి బోధలు-1 | 60-00 |
| 14. | మరువు మహర్షి బోధలు-2 | 100-00 |
| 15. | ధనకాముని కథ | 25-00 |
| 16. | గాయత్రీ మంత్ర అవగాహన | 10-00 |
| 17. | జ్యోతిర్లింగ యాత్ర | 20-00 |
| 18. | కథాదీపిక | 40-00 |
| 19. | గీతోపనిషత్-జ్ఞాన యోగము | 25-00 |
| 20. | గీతోపనిషత్-ధ్యాన యోగము | 40-00 |
| 21. | గీతోపనిషత్-కర్మ యోగము | 20-00 |
| 22. | గీతోపనిషత్-సాంఖ్య యోగము | 25-00 |
| 23. | గీతోపనిషత్-కర్మసన్న్యాస యోగము | 20-00 |
| 24. | గీతోపనిషత్-విజ్ఞాన యోగము | 50-00 |

| | | |
|---|---|---|
| 25. | గీతోపనిషత్–అక్షర పరబ్రహ్మ యోగము | 50–00 |
| 26. | గీతోపనిషత్–రాజవిద్య రాజగుహ్య యోగము | 80–00 |
| 27. | మన మాస్టరుగారు | 60–00 |
| 28. | మాస్టరు యోగము – సాధనా సూత్రములు | 80–00 |
| 29. | మాస్టర్ సి.వి.వి. (జన్మదిన సందేశము) | 30–00 |
| 30. | మాస్టర్ సి.వి.వి. నూతన యోగము | 20–00 |
| 31. | మాస్టర్ సి.వి.వి. యోగము | 40–00 |
| 32. | మాస్టర్ సి.వి.వి. యోగము (కర్మరాహిత్యము) | 20–00 |
| 33. | ఓం | 100–00 |
| 34. | ప్రాణాయామము | 20–00 |
| 35. | సంఘనీతి | 120–00 |
| 36. | షోడశోపచార పూజ – అవగాహన | 10–00 |
| 37. | శ్రీదత్తాత్రేయ | 40–00 |
| 38. | శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు | 100–00 |
| 39. | శ్రీగురుపాదుకాస్తవము | 50–00 |
| 40. | శ్రీ శాస్త్రిగారు | 40–00 |
| 41. | శ్రీకృష్ణనామామృతం | 60–00 |
| 42. | శ్రీలలిత (10 భాగములు) | 750–00 |
| 43. | సాయి సూక్తులు | 80–00 |
| 44. | ధర్మవిగ్రహుడు – శ్రీరాముడు | 35–00 |
| 45. | రుక్మిణీ కళ్యాణము | 100–00 |
| 46. | మరణరహస్యం–1 (మార్కండేయుడు) | 80–00 |
| 47. | మరణరహస్యం–2 (సతీసావిత్రీదేవి) | 100–00 |
| 48. | మరణరహస్యం–3 (నచికేత విద్య) | 100–00 |

---

ప్రతులకు : **ధనిష్ఠ పబ్లికేషన్స్**, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్,
విశాఖపట్నం - 530 002. ఫోన్ : 0891-2701531, 2509154.
website : www.dhanistha.org. info@dhanistha.org.



మనలోని ఉచ్ఛ్వాస, నిశ్వాసల స్పందనలలోనే అశ్వినీ దేవతలు ఉన్నారు. శ్రద్ధగా ఈ స్తోత్రాన్ని బాగా పఠనం చేసి, శ్వాసయందు మనస్సు లగ్నం చేసుకుని, వీలైనంతవరకు లోపల పైలోకాల్లోకి వెళ్ళేందుకు ప్రయత్నం చేయాలి. అలా సాధన చేసుకుంటే, మనకు మోహము నుండి విముక్తి కలిగి, అది మనల్ని బంధించలేని స్థితికి చేరవచ్చు.

* * *

పగలు ఎలా వాడుకోవాలి? రాత్రి ఎలా నడచుకోవాలి? మన ప్రవర్తన ఎలా ఉండాలి? స్వభావాన్ని ఎలా సమన్వయం చేసుకోవాలి? మన జీవితాన్ని ఉదయం ఎలా తెరవాలి? రాత్రి ఎలా మూయాలి? అనే విషయములను గూర్చి ఈ గ్రంథములో విపులంగా వివరించబడినది.

ధనిష్ఠ

ISBN 978-81-89467-97-5

9 788189 467975